

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 14

గురువారం 6-4-2023


SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'కింగ్స్' మరో పంజా...
ఐపీఎల్‌లో వరుసగా రెండో విజయం సాధించిన పంజాబ్ కింగ్స్ -12లో



నాలుగోరోజూ బుల్ జోరు
సెన్సెక్స్ 582 పాయింట్లు ప్లస్. 17,550 స్థాయిపై ముగిసిన నిఫ్టీ -13లో



విపక్షాలకు సుప్రీంలో చుక్కెదురు
దర్యాప్తు సంస్థలను కేంద్రం దుర్వినియోగం చేస్తోందంటూ ప్రతిపక్ష పార్టీలు వేసిన పిటిషన్ విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది.
వివరాలు 6లో ▸



మీడియావన్‌పై నిషేధం ఎత్తివేత
మలయాళం వార్తా చానెల్ మీడియా వన్‌పై కేంద్రం విధించిన నిషేధాన్ని రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది.
వివరాలు 6లో ▸




బొమ్మైకి నా మద్దతు: సుదీప్
కర్ణాటక సీఎం, బీజేపీ నేత బసవరాజ బొమ్మైకి తన మద్దతు ప్రకటిస్తున్నట్లు కన్నడ నటుడు కిచ్చ సుదీప్ ప్రకటించారు.
వివరాలు 6లో ▸



దగాకోరు యాప్
చైనా యాప్ 'పిండువొడువో' 75 కోట్ల మంది యూజర్ల సమాచారాన్ని తస్కరించినట్లు బయటపడటం సంచలనం సృష్టించింది.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

'పద్మ' అవార్డు స్వీకరించిన చినజీయర్, కీరవాణి



గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశంలోని పలు రంగాలకు చెందిన ప్రముఖులకు కేంద్రం పద్మ అవార్డులు ప్రకటించింది. బుధవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో చినజీయర్ స్వామి, కీరవాణి తదితరులు అవార్డులు స్వీకరించారు.

- ఫొటోలు 6లో ▶

14లోగా సర్కారు స్పందిస్తుందా?



వీఆర్‌ఏగా పనిచేస్తున్న 23వేల మంది రెవెన్యూ సిబ్బంది కష్టాలు ఎప్పటికి తీరుతాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది. సమ్మె పూర్తయి ఆరునెలలు అవుతున్నా నేటికీ తమ డిమాండ్లు హామీలుగానే మిగిలిపోయాయని వీఆర్‌ఏలు వాపోతున్నారు.

- వివరాలు 14లో ▶

'ఐడియాస్ ఫర్ ఇండియా' సదస్సుకు కేటీఆర్



లండన్‌లో జరగనున్న 'ఐడియాస్ ఫర్ ఇండియా' సదస్సులో పాల్గొనాల్సిందిగా రాష్ట్ర మంత్రి కేటీఆర్‌కు ఈపీజీ నుంచి ఆహ్వానం అందింది. తెలంగాణ ప్రభుత్వం సాధిస్తున్న ఆర్థిక పురోగతిని తెలుసుకునేందుకు కేటీఆర్‌ను ఆహ్వానిస్తున్నట్లు ఆహ్వాన లేఖలో ఈపీజీ పేర్కొంది.

- వివరాలు 14లో ▶

బండికి రిమాండ్

పదో తరగతి హిందీ పేపర్ లీక్, కాపీ కుట్ర కేసులో విధించిన హనుమకొండ కోర్టు

- భారీ భద్రత మధ్య సంజయ్ కరీంనగర్ జైలుకు తరలింపు
- మంగళవారం రాత్రి సంజయ్‌ను అరెస్టు చేసిన పోలీసులు
- బుధవారం మధ్యాహ్నం వరకు అటూ ఇటూ తరలింపు
- నాటకీయ పరిణామాల మధ్య కోర్టులో హాజరు..
- 19 వరకు రిమాండ్.. మరో ముగ్గురు నిందితులు ఖమ్మం జైలుకు..
- లీక్ కేసులో ఏ1గా సంజయ్.. మొత్తం 10 మందిపై ఆరోపణలు
- నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు

కరీంనగర్ జైలుకు తరలిస్తున్న సందర్భంగా హనుమకొండలో సంజయ్ అభివాదం



నిందితులపై పెట్టిన సెక్షన్లు ఇవీ..

- బండి సంజయ్, ఇతర నిందితులపై కమలాపూర్ పోలీసులు 4ఏ, 6 రెడ్‌విత్ 8 ఆఫ్ తెలంగాణ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్ట్–1997; సెక్షన్ 66డి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ)యాక్ట్‌లతోపాటు ఐపీసీ సెక్షన్లు 120బీ, 420, 447, 505 కింద కేసు నమోదు చేశారు.
- ఇందులో ప్రధాన నిందితుడి (ఏ1)గా బండి సంజయ్‌ను, ఏ2గా ప్రశాంత్, ఏ3గా మహేశ్, ఏ4గా మైనర్ బాలుడు, ఏ5గా మోతం శివగణేశ్, ఏ6గా పోగు సుభాష్, ఏ7గా పోగు శశాంక్, ఏ8గా దూలం శ్రీకాంత్, ఏ9గా పెరుమాండ్ల శ్రామిక్, ఏ10గా పోతబోయిన వర్షిత్ పేర్లను చేర్చారు.
- మొత్తం పది మందిపై కేసు నమోదు చేయగా.. మొదట నలుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్టు పోలీసులు వెల్లడించారు.

సాక్షిప్రతినిధి, వరంగల్: పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం లీక్, కాపీ కుట్ర కేసులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, మరో ముగ్గురికి హనుమకొండ మొదటి సెషన్స్ కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఇందులో బండి సంజయ్‌ను కరీంనగర్ జైలుకు, మిగతా ముగ్గురిని ఖమ్మం జైలుకు తరలించాలని ఆదేశించింది. ఈ మేరకు పోలీసులు వారిని జైళ్లకు తరలించారు.

అటూ ఇటూ తిప్పి కోర్టుకు.. : మంగళవారం కమలాపూర్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం బయటికి వచ్చిన కేసులో పోలీసులు బండి సంజయ్‌తోపాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఆయనను అర్ధరాత్రి తర్వాత యాదాద్రి జిల్లా బొమ్మలరామారం పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు.. బుధవారం ఉదయం అక్కడి నుంచి బయలుదేరి జనగామ జిల్లా పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో హనుమకొండలోని నాలుగో మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఇన్‌చార్జి జడ్జి రాపోలు అనిత ఎదుట హాజరుపర్చారు. తన అరెస్టు సందర్భంగా పోలీసులు దురుసుగా వ్యవహరించారని, తనకు గాయాలు అయ్యాయని జడ్జికి సంజయ్ విన్నవించారు. దానిపై స్పందించిన న్యాయమూర్తి.. కాజీపేట ఏసీపీ శ్రీనివాస్, కమలాపూర్ సీఐ సంజీవ్‌లను పిలిపించుకుని విచారించారు. తర్వాత బండి సంజయ్, ఇతర

మిగతా 2వ పేజీలో ▶

టెన్త్ పేపర్ లీక్ పెద్ద గేమ్‌ప్లాన్!

వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడి
విద్యార్థులు, తల్లిదండ్రుల్లో భయాందోళన రేకెత్తించే కుట్ర
దీనిలో బండి సంజయ్ కీలకం.. రిమాండ్ రిపోర్టులో పోలీసులు

- వివరాలు 3లో ▶

ప్రగతి భవన్ డైరెక్షన్.. కల్వకుంట్ల రాజ్యాంగం



ప్రగతి భవన్ డైరెక్షన్‌లో కల్వకుంట్ల రాజ్యాంగం ప్రకారం బీజేపీ అధ్యక్షుడు సంజయ్‌ను అక్రమంగా కేసులో ఇరికించారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. -3లో ▶

బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్త పోరాటం

పార్టీ ముఖ్యుల సమావేశంలో తరుణ్‌ఛుగ్ -3లో ▶

బొమ్మలరామారం టు కరీంనగర్ జైలు

- బండి అరెస్టు, కోర్టులో హాజరులో నాటకీయ పరిణామాలు
- మంగళవారం అర్ధరాత్రి తర్వాత 2.30 గంటలకు బొమ్మలరామారం పోలీస్‌స్టేషన్‌కు తరలింపు
- బుధవారం ఉదయం 10.30 వరకు అక్కడే నిర్బంధం
- అక్కడి నుంచి ప్రత్యామ్నాయ మార్గాల్లో వరంగల్‌కు..
- పలుచోట్ల బీజేపీ శ్రేణుల ఆందోళనలు.. అరెస్టులు, ఉద్రిక్తత

2లో

మోదీ దృష్టికి బండి అరెస్టు

ప్రధానిని కలసి పరిణామాలను వివరించిన జేపీ నడ్డా, అమిత్‌షా

- భగ్గుమన్న బీజేపీ అధిష్టానం.. అత్యవసర భేటీ
- సంజయ్‌కు అండగా కేంద్ర మంత్రులను రాష్ట్రానికి పంపాలని నిర్ణయం
- బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై బలంగా కొట్లాడాలని పార్టీ శ్రేణులకు సూచనలు
- బండి అరెస్ట్‌పై లోక్‌సభ స్పీకర్‌కు బీజేపీ ఎంపీల ప్రివిలేజ్ నోటీసు



సాక్షి, న్యూఢిల్లీ: పదో తరగతి ప్రశ్నపత్రం లీక్ కేసులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టు అంశం దేశ రాజధాని హస్తినను తాకింది. సంజయ్ అరెస్టుపై బీజేపీ అగ్రనేతలు, కేంద్ర మంత్రులు భగ్గుమన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీతోపాటు పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఇతర నేతలు అత్యవసర సమావేశాలు నిర్వహించి తదుపరి కార్యాచరణపై చర్చించారు. సంజయ్‌కు బాసటగా నిలిచేందుకు కేంద్ర మంత్రులను రాష్ట్రానికి పంపాలని, న్యాయ పోరాటానికి బాసటగా నిలవాలని నిర్ణయించారు. ఇదే సమయంలో రాజకీయ పోరాటంలో భాగంగా ఆందోళనలు, నిరసనలు కొనసాగించాలని రాష్ట్ర నేతలకు సూచించినట్టు తెలిసింది.

పరిణామాలను మోదీకి వివరించిన నడ్డా, షా..

బండి సంజయ్ అరెస్ట్, తదనంతర పరిస్థితులను జేపీ నడ్డాకు బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌ఛుగ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వివరించారు. ఏ కేసులో అరెస్ట్ చేస్తున్నారో చెప్పకుండానే సంజయ్‌ను అదుపులోకి తీసుకున్నారని వివరించారు. దీనిపై స్పందించిన నడ్డా.. పార్టీ నేత, న్యాయవాది అయిన రామచందర్‌రావు, కొందరు నేతలతో

మిగతా 3వ పేజీలో ▶

పిచ్చోడి చేతిలో పార్టీ

ప్రజాస్వామ్యానికే ప్రమాదం: కేటీఆర్

లీకేజీకి సంజయే కారణం

ఆయన పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలి: మంత్రి హరీశ్‌రావు

పీడీ యాక్ట్ పెట్టాలి

పదో తరగతి ప్రశ్న పత్రాల లీకేజీ ఘటనలో సంజయ్‌పై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని బీఆర్‌ఎస్ డిమాండ్ చేసింది.

లీకేజీ సూత్రధారి బండి

'తెలంగాణ'లో చిచ్చుపెట్టేందుకే కుట్ర.. ధ్వజమెత్తిన రాష్ట్ర మంత్రులు

- వివరాలు 2లో ▶

బీజేపీ దూకుడుకు చెక్ పెట్టేలా..

బీఆర్‌ఎస్ వ్యూహం

- ఎన్నికలు సమీపిస్తుండటంతో బీజేపీ మరింత ఉక్కిరిబిక్కిరి చేస్తుందని అంచనా
- కేవలం ప్రతి విమర్శలు, ప్రత్యారోపణలతో ఎదుర్కోలేమనే భావన.. బీజేపీని ఆత్మరక్షణలోకి నెట్టే అంశాలకు ప్రాధాన్యమివ్వాలని నిర్ణయం
- స్లీపర్ సెల్స్‌పై నిఘా వేయనున్న అధికార పార్టీ.. ఎదురుదాడి బాధ్యతలు మంత్రులకు అప్పగింత

2లో





నకిలీ కాల్ సెంటర్‌తో ఖాతాలు ఖాళీ

- ఆస్ట్రేలియా, కెనడా వాసులే లక్ష్యంగా సైబర్ నేరాలు
- పేట్‌బషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన నిందితులు
- ఆన్‌లైన్‌లో లింక్‌లు పంపించి బ్యాంకు అకౌంట్లు ఖాళీ
- 13 మందిని అరెస్టు చేసిన పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లు, ఇతర పరికరాలు

సాక్షి, హైదరాబాద్: ఆస్ట్రేలియా, కెనడా దేశవాసులను లక్ష్యంగా చేసుకొని సైబర్ మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా ఆటకట్టించారు సైబరాబాద్ పోలీసులు. పేట్‌బషీరాబాద్‌లో నకిలీ కాల్ సెంటర్ ఏర్పాటు చేసి, నేరాలు చేస్తున్న 13 మంది నిందితులను అరెస్ట్‌చేశారు. ఈమేరకు మేడ్చల్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్‌ఓటీ) డీసీపీ ఎంఏ రషీద్, అదనపు డీసీపీ శోభన్ కుమార్‌లతో కలిసి మేడ్చల్ జోన్ డీసీపీ సందీప్ బుధవారం మీడియాకు వెల్లడించారు.

లండన్‌లో పెడితే దొరికిపోతామని...

హనుమకొండలోని కిషన్‌పురకు చెందిన బైరిక్ ప్రమోద్ రెడ్డి లండన్‌లో ఏ1 ఎక్స్‌ప్రెస్ సూపర్ మార్కెట్ నిర్వహించేవాడు. వ్యాపారం పెద్దగా సాగకపోవటం, అప్పులు మీద పడటంతో

మిగతా 5వ పేజీలో ▶

డాలర్ డౌన్ ఫాల్!

గ్లోబల్ కరెన్సీగా అమెరికన్ డాలర్‌కు ఉన్న పట్టు క్రమంగా సడలి పోతోంది. డాలర్‌కు వ్యతిరేకంగా సొంత కరెన్సీలను బలోపేతం చేసుకోవాలనుకుంటున్న దేశాల సంఖ్య పెరిగిపోయింది. ఈ దేశాల జాబితాలో ఇప్పుడు భారత్ కూడా చేరింది. ప్రస్తుతం దాదాపు అన్ని దేశాల విదేశీ మారకద్రవ్య నిల్వల్లో అమెరికన్ డాలర్లే 60 శాతానికి పైగా ఉన్నాయి.

- వివరాలు 14లో



పెన్షన్.. టెన్షన్

హయ్యర్ పెన్షన్ దరఖాస్తులకు సాంకేతిక చిక్కులు

ఈపీఎఫ్‌ఓ వెబ్‌సైట్‌లో దరఖాస్తు సమర్పించినా కలగని మోక్షం

- ఆ ఫైలు కంపెనీ యూజర్ ఐడీకి బదిలీ కాని వైనం
- సమర్పించిన దరఖాస్తులన్నీ నేరుగా కేంద్ర సర్వర్‌లో నిక్షిప్తం
- దీంతో వాటికి ఎంప్లాయర్ నుంచి అనుమతి లేని అవకాశం
- ఈ అంశంపై చేతులెత్తేస్తున్న ఆర్‌పీఎఫ్‌సీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: అధిక పెన్షన్(హయ్యర్ పెన్షన్) పథకం దరఖాస్తులకు సాంకేతిక చిక్కులు వీడడం లేదు. ఎంప్లాయి ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్‌ఓ) షరతులకు అనుగుణంగా అన్నిరకాల వివరాలను తీసుకుని ఆన్‌లైన్‌లో అధిక పెన్షన్ దరఖాస్తు సమర్పించినప్పటికీ మెజార్టీ అర్జీదారులకు సంబంధిత దరఖాస్తు స్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఆన్‌లైన్‌లో అన్ని వివరాలతో సమర్పించిన దరఖాస్తు ఎవరికి చేరిందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. దీంతో అర్జీదారులు అటు కంపెనీ యాజమాన్యం వద్దకు, ఇటు రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్(ఆర్‌పీఎఫ్‌సీ) కార్యాలయాల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. అయినాసరే ఈ సమస్యకు యాజమాన్యం వద్ద, ఆర్‌పీఎఫ్‌సీ వద్ద సమాధానం దొరకడం లేదని అంటున్నారు.

నాలుగు స్థాయిల్లో ఫైలు...

భవిష్యనిధి చందాదారుల్లో అధిక పెన్షన్‌కు అర్హత ఉన్న వారంతా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. పూర్తి వివరాలతో ఆన్‌లైన్ దరఖాస్తును పూరించి సరైన ఆధారాలను జతచేసి సబ్మిట్ చేయాలి. సబ్మిట్ చేసిన దరఖాస్తు వెంటనే కంపెనీ

మిగతా 2వ పేజీలో ▶



వావ్!.. పరోక్షంగా అల్లర్లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారుగా..!

• సలేశ్వరానికి పోటెత్తిన భక్తులు



తెలంగాణ అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

సాక్షి, నాగర్‌కర్నూల్: తెలంగాణ అమరనాథ్ యాత్రగా పేరుగాంచిన నల్లమలలోని సలేశ్వరం లింగమయ్య క్షేత్రంలో ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈసారి మూడు రోజులపాటు ఉత్సవాల నిర్వహణకు అటవీశాఖ అధికారులు అనుమతులు ఇవ్వగా.. మొదటిరోజు లింగమయ్య దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఎత్తయిన కొండలు, లోయల మధ్య ఉన్న లింగమయ్య స్వామిని చూసేందుకు 'వస్తున్నాం.. లింగమయ్యా'అంటూ భక్తుల నినాదాలతో నల్లమల ప్రాంతం మార్మోగుతోంది. వేల సంఖ్యలో వాహనాలు అటవీ మార్గంలో బారులు తీరాయి. గురువారం చైత్రశుద్ధ పౌర్ణమి కావడంతో భారీ సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారు. లింగమయ్య దర్శనానికి హైదరాబాద్–శ్రీశైలం రహదారిపై ఉన్న ఫర్హాబాద్ చెక్‌పోస్టు నుంచి సుమారు 20 కిలోమీటర్ల అటవీ మార్గంలోనే ప్రయాణించాల్సి ఉంటుంది. దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న రాంపూర్‌పెంట నుంచి మరో 6 కిలోమీటర్ల మేర కాలినడకన స్వామివారిని చేరుకోవలసి ఉంటుంది. ఎత్తయిన కొండలు, లోయలు, సెలయేళ్లు, రాళ్లను దాటుకొని ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఈసారి లింగమయ్య ఉత్సవాల సందర్భంగా ఈనెల 5 నుంచి 7 వరకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే భక్తులు అటవీ ప్రాంతంలోకి వెళ్లేందుకు అటవీశాఖ అనుమతినిచ్చింది.

'మార్గదర్శి' కేసులో ఏ-2 శైలజ విచారణ నేడు

హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో విచారించనున్న సీఐడీ



సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాల కేసులో ఏ-2గా ఉన్న ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చెరుకూరి శైలజ కిరణ్‌ను సీఐడీ అధికారులు గురువారం విచారించనున్నారు. కేంద్ర చిట్‌ఫండ్ చట్టం–1982కు విరుద్ధంగా చందాదారుల సొమ్మును మ్యూచువల్‌ఫండ్స్, షేర్ మార్కెట్లో పెట్టుబడిగా పెట్టడం, రిజర్వ్ బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిపాజిట్ల సేకరణపై సీఐడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ కేసులో ఏ-3గా ఉన్న కొందరు మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి మేనేజర్లను సీఐడీ విభాగం అరెస్ట్ చేసింది. కాగా ఈ కేసులో ప్రధాన నిందితుడు, ఏ–1గా ఉన్న చెరుకూరి రామోజీరావును సీఐడీ అధికారులు సోమవారం విచారించారు. నిధుల మళ్లింపు వాస్తవమేనని ఆయన అంగీకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. పైగా అది తమ సంస్థ ఇష్టమని.. అసలు విచారించడానికి సీఐడీకి ఏం అధికారం ఉందన్న రీతిలో రామోజీరావు ప్రవర్తించడం అందర్నీ విస్మయపరచింది. కానీ సీఐడీ అధికారులు నిబంధనల మేరకు ఆయనను విచారించి కీలక విషయాలు రాబట్టారు. ఏ–1గా ఉన్న

మిగతా 10వ పేజీలో ▶

టీఎస్‌పీఎస్సీ కేసులో సంజయ్ విచారణ!

సిట్ అధికారుల నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: టెన్త్ హిందీ ప్రశ్నపత్రం లీకేజ్ కేసులో అరెస్టు అయిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను టీఎస్‌పీఎస్సీ పరీక్షల పేపర్ల లీకేజ్ కేసులో విచారించాలని ఈ కేసు దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులు నిర్ణయించారు. వరంగల్ పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన అంశాలను హైదరాబాద్ అధికారులు పరిగణనలోకి తీసుకుంటున్నారు. టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్ల లీకేజీకి సంబంధించి సంజయ్‌కు మరోసారి ప్రత్యేకంగా నోటీసులు జారీ చేయాలా? లేక వరంగల్ పోలీసులు పోలీసులు కస్టడీకి తీసుకున్నప్పుడు వెళ్లి విచారించాలా? ఆయనపై ఈ కేసులోనూ పీటీ వారెంట్ తీసుకోవాలా?..ఎలా ముందుకెళ్లాలి అనే అంశంపై న్యాయనిపుణుల సలహాలు తీసుకుంటున్నారు. టెన్త్ హిందీ పేపర్ లీక్ వెనుక పక్కా పథకం, భారీ కుట్ర ఉందని, బండి సంజయ్ ప్రమేయంపై ఆధారాలు లభించాయని వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రకటించారు. ఆయన ఫోన్ మాయం చేశారని, అది దొరికితే మరిన్ని కీలకాంశాలు వెలుగులోకి వస్తాయని స్పష్టం చేశారు. సిట్ కస్టడీలో ఉన్న టీఎస్‌పీఎస్సీ కేసు నిందితులు తిరుపతయ్య, ప్రశాంత్, రాజేంద్రకుమార్‌లను అధికారులు రెండో రోజు బుధవారం కూడా ఏడు గంటల పాటు ప్రశ్నించారు. గురువారంతో ఈ ముగ్గురి కస్టడీ గడువు ముగియనుంది.

బండి అరెస్టు అక్రమం

హైకోర్టులో బీజేపీ హెబియస్ కార్పస్ పిటిషన్

సాక్షి, హైదరాబాద్: బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని, చట్టప్రకారం నిబంధనలు పాటించలేదంటూ బీజేపీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు హెబియస్ కార్పస్ పిటిషన్‌ను హౌస్‌మోషన్ రూపంలో దాఖలు చేసింది. పిటిషన్‌ను న్యాయమూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ వద్ద మెన్షన్ చేశారు. పిటిషన్‌ను నంబర్ చేయాల్సిందిగా రిజిస్ట్రీని ఆదేశించారు.

ఇక క్లోజ్డ్ వాహనాల్లోనే పరీక్ష పత్రాల తరలింపు

సాక్షి, హైదరాబాద్: టెన్త్ పరీక్ష పత్రాల తరలింపులో తీవ్ర తప్పిదానికి కారణమైన తపాలాశాఖ దిద్దుబాటు మొదలుపెట్టింది. ఇకపై ఏ పరీక్ష పత్రాలనైనా గమ్యం చేర్చడంలో నిర్లక్ష్యానికి తావులేకుండా ఉన్నతాధికారులు ప్రత్యేక ఆదేశాలు జారీచేశారు. ఈనెల 3న ఉట్నూరు సబ్ పోస్టాఫీసు పరిధిలో పరీక్ష పత్రాలను సిబ్బంది ఆటోలో తరలించే క్రమంలో ఓ బండిల్ గల్లంతైన విషయం తెలిసిందే. దీంతో సంబంధిత సిబ్బందిపై శాఖాపరపమైన చ ర్యలు తీసుకున్న ఉన్నతాధికారులు.. ఇకపై చుట్టూ క్లోజ్డ్‌గా ఉన్న వాహనాల్లోనే పరీక్ష పత్రాలను తరలించాలని ఆదేశించారు. అలాగే, పత్రాల బండిళ్లను తరలించే వాహనంలో కచ్చితంగా ఎస్కార్టుగా సిబ్బంది ఉండాల్సిందేనని ఆదేశించారు. సంబంధిత తపాలా కార్యాలయం పోస్ట్‌మాస్టర్‌తో పా టు సిబ్బంది విధిగా ఆ వాహనంలో గమ్యం వరకు వెళ్లి అప్పగించాలన్నారు. తపాలా సర్కిల్, రీజియన్, డివిజినల్ స్థాయిల్లో కంట్రోల్ రూమ్స్‌ను ప్రారంభించాలని నిర్ణయించారు. వాటిలోని సిబ్బంది పరీక్ష పత్రాల తరలింపును పర్యవేక్షించాలని సూచించారు.

పెన్షన్.. టెన్షన్

▶ మొదటి పేజీ తరువాయి

యూజర్ ఐడీ ఖాతాకు చేరుతుంది. అలా చేరిన దరఖాస్తును యాజమాన్యం పరిశీలించి అర్హతలను నిర్ధారించుకున్న తర్వాత ఆమోదిస్తుంది. ఇలా ఉద్యోగి, కంపెనీ ఉమ్మడి ఆప్షన్ తర్వాత ఆ దరఖాస్తు సంబంధిత రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ లాగిన్‌కు చేరుతుంది. అక్కడ మరోమారు పరిశీలించిన అధికారులు ఈ దరఖాస్తును ఆమోదించిన తర్వాత సెంట్రల్ సర్వర్‌కు ఫార్వర్డ్ చేస్తారు. ఇలా నాలుగు దశల్లో దరఖాస్తు ముందుకు కదులుతుంది. అయితే ఈపీఎఫ్ఓ వెబ్‌సైట్‌లో నెల కొన్న సాంకేతిక సమస్యలతో దరఖాస్తు దశ పూర్తిగా మారింది. ఆ దరఖాస్తు నేరుగా సెంట్రల్ సర్వర్‌కు చేరుతోంది. దీంతో కంపెనీ యాజమాన్యం, ఆర్‌పీఎఫ్‌సీ పరిధిలోకి రాకపోవడంతో వాటి పరిశీలన సందిగ్ధంలో పడుతోంది.

గడువు దాటితే అనర్హతే...


పీఎఫ్ చందాదారులు, పెన్షనర్లకు అధికపెన్షన్ అవకాశం ఇదే చివరిసారి. వచ్చే నెల 3వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఉమ్మడి ఆప్షన్ ఇవ్వడం తప్పనిసరి. ఆ తర్వాత ఉమ్మడి ఆప్షన్ ఇవ్వడానికి అవకాశం ఉండదు. భవిష్యత్తులో ఇక ఇలాంటి వెసులుబాటు ఉండదని ఇప్పటికే ఈపీఎఫ్ఓ తేల్చిచెప్పింది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా ఇప్పటికే 1.62లక్షల మంది అధిక పెన్షన్‌కు దరఖాస్తులు సమర్పించారు. మరో నెలరోజుల పాటు గడువు ఉండడంతో ఈ దరఖాస్తుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. అయితే ఈ దరఖాస్తులు సమర్పించిన వారిని ఇప్పుడు సాంకేతిక సమస్య తీవ్ర గందరగోళానికి గురిచేస్తోంది. ఇప్పటికే సమర్పించిన దరఖాస్తులు నేరుగా సెంట్రల్ సర్వర్‌కు చేరడంతో అవి తిరిగి యాజమాన్యం, ఆర్‌పీఎఫ్‌సీకి చేరేదెలా అనే సందేహం నెలకొంది. మరోవైపు వచ్చే నెల 3వ తేదీలోగా ఉమ్మడి ఆప్షన్ పూర్తవుతుందా? లేదా? అనే ఆందోళన నెలకొంది.

నిఘా కన్ను.. ఉంటేనే దన్ను!

సీసీటీవీ కెమెరాలు కోరుకునే వారే ఎక్కువ

స్టేటస్ ఆఫ్ పోలీసింగ్ ఇన్ ఇండియా 2023 నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: సీసీటీవీ కెమెరాలు..ఏ మూల ఏం జరిగినా పట్టిచూపే నిఘానేత్రాలు. అందుకే భద్రత దృష్ట్యా సీసీటీవీ కెమెరాలకు ఆదరణ పెరుగుతోంది. నేర నియంత్రణతో పాటు, నేరాల పరిశోధనలోనూ ఇవే పోలీసులకు అస్త్రాలుగా మారుతున్నాయి. దుకాణాలు, హోటల్స్, ఇతర వ్యాపార ప్రాంతాల్లోనూ యజమానులు ఉద్యోగుల పనితీరును గమనించేందుకు, వినియోగదారుల్లో ఎవరైనా తేడాగా ఉంటే అలాంటి వారిపై నిఘా పెట్టేందుకు సైతం వీటిని వాడుతున్నారు. అలాంటి సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై ప్రజల్లో ఎలాంటి అవగాహన ఉంది? సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై పలు వర్గాల్లో ఎలాంటి అభిప్రాయాలున్నాయన్న వివరాలను బీపీఆర్‌ఎండీ (బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్) ఇటీవల స్టేటస్ ఆఫ్ పోలీసింగ్ ఇన్ ఇండియా 2023 పేరిట నివేదికను విడుదల చేసింది. బీదల బస్తీల మొదలు సంపన్న వర్గాల నివాస ప్రాంతాల వరకు అన్ని ప్రాంతాల వారు సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు జై కొట్టారు.



బీజేపీ దూకుడుకు చెక్ పెట్టేలా..

వ్యూహం రచిస్తున్న బీఆర్ఎస్

- ఎన్నికలు సమీపిస్తుండటంతో బీజేపీ మరింత ఉక్కిరిబిక్కిరి చేస్తుందని అంచనా
- కేవలం ప్రతివిమర్శలు, ప్రత్యారోపణలతో ఎదుర్కోలేమనే భావన.. బీజేపీని ఆత్మరక్షణలోకి నెట్టే అంశాలకు ప్రాధాన్యమివ్వాలని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వాన్ని, అధికార పార్టీని అన్నివిధాలా ఇరుకున పెట్టేందుకు ప్రయతిస్తున్న భారతీయ జనతా పార్టీని దీటుగా ఎదుర్కొనేలా వ్యూహానికి పదును పెట్టాలని భారత్ రాష్ట్ర సమితి నిర్ణయించింది. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ, ఎమ్మెల్సీ కవితపై ఈడీ విచారణ, సుఖేశ్ చంద్రశేఖర్ ఆరోపణలు, జర్నలిస్టు రాజ్‌దీప్ వ్యాఖ్యల నేపథ్యంలో.. ఆత్మరక్షణ ధోరణిలో కాకుండా ప్రతి విషయంలోనూ ఎదురుదాడి చేయాలని నిర్ణయించింది. మరికొన్ని నెలల్లో రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జాతీయ నాయకత్వం కనుసన్నల్లో రాష్ట్ర బీజేపీ రాజకీయంగా మరింత ఉక్కిరిబిక్కిరి చేసే అవకాశముందని బీఆర్ఎస్ అంచనాకు వచ్చింది. అసెంబ్లీ ఎన్నికలు సమీపించే కొద్దీ 'పశ్చిమ బెంగాల్ ఎన్నికల తరహా పరిస్థితిని సృష్టించేందుకు ప్రయత్నించవచ్చనే అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సంప్రదాయ పద్ధతిలో కేవలం ప్రతి విమర్శలు, ప్రత్యారోపణలతో, సాధారణ కార్యక్రమాలతో అడ్డుకట్ట వేయలేమని పార్టీ భావిస్తోంది. బీజేపీని ఆత్మరక్షణలోకి నెట్టే అంశాలకు పెద్దపీట వేయడం ద్వారా ఆ పార్టీ దూకుడుకు అడ్డుకట్ట వేయడంతో పాటు ప్రతిదాడి చేసేందుకు బీఆర్ఎస్ సన్నద్ధమవుతోంది. ఆత్మీయ సమ్మేళనాల పేరిట ఇప్పటికే క్షేత్ర స్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధం చేసే పనిలో బీఆర్ఎస్ తలమునకలై ఉంది. తాజాగా ఈ సమావేశాలనే వేదికగా చేసుకుని..



రాబోయే రోజుల్లో బీజేపీ ఎలాంటి వ్యూహాలు, ఎత్తుగడలకు పాల్పడే అవకాశముందనే అంశంపై శ్రేణులకు విడమరిచి చెప్పాల్సిందిగా పార్టీ ముఖ్య నేతలను ఆదేశించింది.

'స్లీపర్ సెల్స్'పై నిఘా

బీజేపీతో పాటు ఆ పార్టీ అనుబంధ సంఘాలు కూడా ప్రభుత్వ వ్యతిరేకతను కూడగట్టడం, కేంద్ర నాయకత్వం వ్యూహాలను అమలు చేయడంలో భాగంగా క్షేత్రస్థాయిలో క్రియాశీలంగా పనిచేస్తున్న వైనంపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు అందినట్లు తెలిసింది. భావోద్వేగాలు రెచ్చగొట్టడం, శాంతి భద్రతల సమస్య సృష్టించడం లాంటి ఘటనలు రాబోయే రోజుల్లో మరింత పెరుగుతాయని నిఘా వర్గాలు నివేదించినట్లు సమాచారం. మరోవైపు సుమారు ఏడాది కాలంగా బీజేపీ అనుబంధ సంఘాలకు చెందిన ఇతర రాష్ట్రాల నేతలు, కేడర్.. తెలంగాణలో 'స్లీపర్ సెల్స్'లా పనిచేస్తున్నట్లు బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. 2020 చివరలో జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కొన్ని ఎంపిక చేసిన డివిజన్లలో ఈ స్లీపర్ సెల్స్ పనిచేశాయని బీఆర్ఎస్‌లో అనుమానాలు వ్యక్తమయ్యాయి. బీఆర్ఎస్ బలాలు, బలహీనతలను సూక్ష్మస్థాయిలో పోస్టుమార్టం చేస్తున్న ఈ స్లీపర్ సెల్స్ వాటిని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ఎప్పటికప్పుడు వ్యూహాలను రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ స్లీపర్ సెల్స్ నుంచి అందుతున్న ఆదేశాల మేరకే పేపర్ లీకేజీ వంటి కుట్రల్లో ఆ పార్టీ కేడర్ పాలుపంచుకుంటోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్లీపర్ సెల్స్‌పై నిఘా పెట్టాలని, బీజేపీ కుట్రలు, వ్యూహాలు సమర్థంగా తిప్పికొట్టాలని అధికార పార్టీ నిర్ణయించింది.

మంత్రులకే నాయకత్వం

బీజేపీ నేతల వ్యూహాలు, కుట్రలను తిప్పికొట్టేలా ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోవడంతో పాటు, ఆ పార్టీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వంపై ఎదురుదాడి బాధ్యతను మంత్రులకు అప్పగించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. బీజేపీపై విమర్శలు, ఎదురుదాడి విషయంలో కేవలం మీడియా సమావేశాలకే పరిమితం కాకుండా క్షేత్ర స్థాయిలో ప్రత్యక్ష కార్యాచరణలో భాగం కావాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు కీలక నేతలందరినీ పార్టీ ఆదేశించింది. ఈ నేపథ్యంలో ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ ప్రధాన నిందితుడుగా ఉండటాన్ని ఆసరాగా తీసుకుని మంత్రులందరూ ఏకకాలంలో మీడియా ద్వారా ఎదురుదాడి చేశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ చేపట్టిన బండి దిష్టిబొమ్మ దహనం, నిరసన కార్యక్రమంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి స్వయంగా పాల్గొన్నారు.

పిచ్చోడి చేతిలో పార్టీ

- ప్రజాస్వామ్యానికే ప్రమాదం: కేటీఆర్
- విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో బీజేపీ చెలగాటమని విమర్శ
- ప్రియమైన ప్రధాని మోదీ కాదు.. పిరమైన ప్రధాని అని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: స్వార్థ రాజకీయాల కోసం అమాయకులైన విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో బీజేపీ నాయకులు చెలగాటమాడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పిచ్చోని చేతిలో పార్టీ ఉండటం ప్రజాస్వామ్యానికే ప్రమాదం అంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను ఉద్దేశించి ట్విట్టర్‌లో కేటీఆర్ వ్యాఖ్యానించారు. 'పిచ్చోని చేతిలో రాయి ఉంటే వచ్చే పోయేటోళ్లకే ప్రమాదం. కానీ అదే పిచ్చోని చేతిలో ఒక పార్టీ ఉంటే ప్రజాస్వామ్యానికే ప్రమాదం. తమ స్వార్థ రాజకీయాల కోసం ప్రశ్నపత్రాలు లీకు చేసి అమాయకులైన విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో బీజేపీ నాయకులు చెలగాటమాడుతున్నారు' అని కేటీఆర్ ట్వీట్ చేశారు. 'ఉప్పు పిరం, పప్పు పిరం.. పెట్రోల్, డీజిల్ పిరం.. గ్యాస్‌పై వేసిన దోశ పిరం..అన్నీ పిరం.. పిరం.. జనమంతా గరం.. గరం.. అందుకే అంటున్న ప్రియమైన ప్రధాని కాదు.. పిరమైన ప్రధాని మోదీ'అని కేటీఆర్ మరో ట్వీట్‌లో పేర్కొన్నారు.

లీకేజీకి బండి సంజయే కారణం

ఆయన పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలి: మంత్రి హరీశ్‌రావు

మెదక్ జోన్: పదోతరగతి ప్రశ్నపత్రాల లీకేజీకి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కారణమని, అరెస్టయిన ప్రశాంత్‌కు బీజేపీ నేతలతో సంబంధాలు ఉన్నాయని మంత్రి హరీశ్‌రావు అన్నారు. బీజేపీ నేతలతో ప్రశాంత్ దిగిన ఫొటోలను హరీశ్‌రావు మీడియాకు చూపించారు. బుధవారం మెదక్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఆత్మీయ సమ్మేళనాల ఇన్‌చార్జ్ ఎగ్గె మల్లేశంతో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు. మంగళవారం మధ్యాహ్నం పేపర్ లీకేజీపై ధర్నా చేసిన బీజేపీ నేతలు.. సాయంత్రం నిందితులను విడుదల చేయాలంటూ మళ్లీ ధర్నా చేయటంతో బండి సంజయ్ కుట్ర బట్టబయలైందన్నారు. బండి సంజయ్‌పై అనర్హత వేటు వేయాలని లోక్‌సభ స్పీకర్‌ను కోరతామని హరీశ్‌రావు తెలిపారు. తాండూరు, వరంగల్‌లో లీకేజీకి పాల్పడ్డ టీచర్, ప్రశాంత్.. ఇద్దరూ బీజేపీకి చెందిన వారేనన్నారు. వాట్సప్‌లో ప్రశ్నపత్రం పంపితే తప్పేంటని ఎమ్మెల్యే రఘునందర్‌రావు అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు.



బీజేపీ నేత లక్ష్మణ్‌తో నిందితుడు దిగిన ఫొటోను చూపుతున్న మంత్రి హరీశ్‌రావు

బండిపై పీడీ యాక్ట్ పెట్టాలి

బీఆర్ఎస్ నేతల డిమాండ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలతో పాటు పదో తరగతి ప్రశ్న పత్రాల లీకేజీ ఘటనలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుట్రదారుడు అని, ఆయనపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. బండి సంజయ్‌ని ఎంపీగా అనర్హుడిగా ప్రకటిస్తూ లోక్‌సభ స్పీకర్ ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరింది. రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌లు బాల్క సుమన్, గొంగిడి సునీత, పీయూసీ చైర్మన్ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్ బుధవారం బీఆర్ఎస్ శాసనసభా పక్షం కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. బండి సంజయ్ ఈ నెల మూడో తేదీ సాయంత్రమే ప్రశ్నపత్రాలు లీక్ చేయాలని మరో నిందితుడు ప్రశాంత్‌కు ఫోన్ చేశారని, ఆయన ఆదేశాలతోనే బీజేపీ కార్యకర్తలు ప్రశ్నపత్రం లీక్ చేశారని పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. వికారాబాద్‌లోనూ బీజేపీ అనుబంధ సంఘానికి చెందిన ఉపాధ్యాయులే టెన్త్ ప్రశ్నపత్రం బయటకు వచ్చేలా చేశారని, బీజేపీ అనుబంధ సంఘాలన్నీ పేపర్ లీకేజీ కుట్రలో భాగస్వామిగా ఉన్నాయని పేర్కొన్నారు.

నిందితులకు జాతీయ నేతలతో సంబంధాలు: సుమన్

టెన్త్ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో నిందితులకు జాతీయ నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఆరోపించారు. సంజయ్ పాత్రధారిగా రాష్ట్రంలో అలజడి సృష్టించడానికి బీజేపీ కీలక నేతలు రాష్ట్ర పర్యటనకు వస్తున్నారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటన నేపథ్యంలో ప్రశ్న పత్రాలు లీక్ చేసి రాష్ట్ర ప్రభుత్వాన్ని బదనాం చేసే కుట్రలకు బీజేపీ పాల్పడుతోందన్నారు. కేసీఆర్‌ను ఎదుర్కొనే దమ్ము లేని బీజేపీ నేతలు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. బీజేపీ నేతల తీరుపై పోలీసులు పూర్తి స్థాయి విచారణ కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. సంజయ్‌పై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి స్మృతీ ఇరాని, ఎంపీలు బండి సంజయ్, అర్వింద్ తదితరులు నకిలీ సర్టిఫికెట్ నేతలని పీయూసీ చైర్మన్ జీవన్‌రెడ్డి విమర్శించారు.

లీకేజీ సూత్రధారి బండి

'తెలంగాణ'లో చిచ్చు పెట్టేందుకే కుట్ర.. ధ్వజమెత్తిన రాష్ట్ర మంత్రులు

సాక్షి, హైదరాబాద్/సాక్షి, నెట్‌వర్క్: పదవ తరగతి ప్రశ్నపత్రాల లీకేజ్ వెనుక బీజేపీ నేతల కుట్రకోణం దాగి ఉందని రాష్ట్ర మంత్రులు ధ్వజమెత్తారు. ప్రభుత్వాన్ని అభాసుపాలు చేసేందుకే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ ఈ పనికి దిగజారి సూత్రధారిగా వ్యవహరించారని వారంతా మండిపడ్డారు. ఈ ఉదంతంపై మంత్రుల స్పందన వారి మాటల్లోనే..

''ప్రశ్నపత్రాల లీకేజీల వెనుక కుట్ర కోణం ఉంది. బాధ్యులను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. కేంద్రంలోని బీజేపీ పెద్దల సూచనలతోనే ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు, అల్లర్లు సృష్టించేందుకు ఈ పని చేశారు.

– సబితారెడ్డి, విద్యాశాఖ మంత్రి

''బండి సంజయ్ టెన్త్ పేపరు లీకేజీ సూత్రధారి. దీనికి అన్ని ఆధారాలున్నాయి. లక్షల మంది పిల్లల భవిష్యత్తుపై కనీస బాధ్యత లేకుండా బండి సంజయ్ వ్యవహరించారు. ఆయన అరెస్టుపై బీజేపీ నాయకులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తే భౌతికదాడులు తప్పవు''

– వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి

''వివిధ ప్రభుత్వ శాఖల్లో దాగిన బీజేపీ స్లీపర్‌సెల్స్‌ను గుర్తించి బయటికి లాగుతాం. తెలంగాణలో చిచ్చు పెట్టేందుకు బీజేపీ పన్నిన కుట్రలను ఛేదిస్తాం. తనకు వచ్చిన ప్రశ్నాపత్రంపై పోలీసులకు చెప్పాల్సిన బాధ్యత సంజయ్‌కి లేదా?''

– గంగుల కమలాకర్, పౌరసరఫరాల శాఖ మంత్రి

''నిరుద్యోగులు, విద్యార్థులను రెచ్చగొట్టి, రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు బీజేపీ నాయకులు కుట్ర పన్నారు. అడ్డంగా దొరికిపోయిన బండి సంజయ్.. దొంగే 'దొంగ.. దొంగ'అన్నట్లు మాట్లాడుతున్నారు. బీజేపీ జాతీయ నాయకత్వం సంజయ్‌ను అధ్యక్ష పదవి నుంచి తొలగించి, పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి''

– గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి

''రాష్ట్రంలో విద్యావ్యవస్థ ప్రతిష్టను దెబ్బతీసే కుట్రలో భాగంగానే లీకేజీ కుట్ర జరిగింది. ఇందుకు బీజేపీ మూల్యం చెల్లించుకోక తప్పదు. బండి ఆటలు సాగనివ్వబోం. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది''

– కొప్పుల ఈశ్వర్, ఎస్సీ అభివృద్ధి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి

''టీఎస్‌పీఎస్సీ, పదో తరగతి పేపర్ లీకేజీ వెనక బీజేపీ నాయకుల కుట్ర ఉంది. తెలంగాణ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలని చూస్తున్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ చేసిన నిందితుడు కూడా బీజేపీ కార్యకర్తే''

– శ్రీనివాస్‌గౌడ్, ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి

''ప్రశ్నపత్రాల లీకేజీ బీజేపీ పనే. పథకం ప్రకారమే ప్రశ్నపత్రం లీకేజీ జరిగింది. బండి నిజాయితీపరుడైతే పోలీసులకు ఫోన్ ఎందుకు ఇవ్వలేదు?. సంజయ్ ఫోన్ సంభాషణ బయటపడితే, లీకేజీలో బీజేపీ జాతీయ నాయకత్వం, కేంద్ర ప్రభుత్వ ప్రమేయం బట్టబయలవుతుంది''

– ఎర్రబెల్లి దయాకర్‌రావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి

''అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి కోసం బీజేపీ నేతలు ప్రశ్నపత్రాల లీకేజీ వంటి కుట్రలకు పాల్పడుతున్నారు. బండి సంజయ్ పార్లమెంటు సభ్యత్వాన్ని లోక్‌సభ స్పీకర్ తక్షణమే రద్దు చేయాలి. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల చర్యలతో రాష్ట్రం భ్రష్టు పడుతోంది.''

– పువ్వాడ అజయ్‌కుమార్, రవాణా శాఖ మంత్రి

బొమ్మలరామారం టు కరీంనగర్ జైలు!

- బండి సంజయ్ అరెస్టు, కోర్టుకు హాజరులో నాటకీయ పరిణామాలు
- అర్ధరాత్రి తర్వాత 2.30 గంటలకు బొమ్మలరామారం పోలీస్‌స్టేషన్‌కు తరలింపు
- బుధవారం ఉదయం 10.30 వరకు అక్కడే నిర్బంధం
- ప్రత్యామ్నాయ మార్గాల్లో వరంగల్‌కు.. బీజేపీ ఆందోళనలు.. అరెస్టులు



బొమ్మల రామారం పోలీస్ స్టేషన్‌లో సంజయ్

సాక్షి, యాదాద్రి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టు, కోర్టులో హాజరు, చివరికి జైలుకు తరలించే క్రమంలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. మంగళవారం రాత్రి సంజయ్‌ను కరీంనగర్‌లో అదుపులోకి తీసుకున్న పోలీసులు.. అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బుధవారం ఉదయం 10.30 గంటల వరకు అక్కడే ఉంచి అనంతరం హనుమకొండ కోర్టుకు తరలించారు.

బీజేపీ శ్రేణుల ఆందోళనలతో..

సంజయ్‌ను తరలించిన విషయం తెలిసిన యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్, ఇతర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు రాత్రి నుంచే బొమ్మలరామారానికి చేరుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు కొంత దూరంలోనే బారికేడ్లు పెట్టి..ఆర్టీసీ బస్సులు మినహా మరే వాహనం ఆ దారిలో వెళ్లకుండా కట్టడి చేశారు. ఇక పలువురు బీజేపీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు కూడా అక్కడికి చేరుకుని ఆందోళనకు దిగారు. బండి సంజయ్‌ను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. పోలీస్‌స్టేషన్ వైపు చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఈ క్రమంలో ఎమ్మెల్యేలు, నేతలు, కార్యకర్తలను అరెస్ట్ చేసి రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లోని పలు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఇక సంజయ్‌ను కలవడానికి వెళ్లిన భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌ను తెల్లవారుజామున 3 గంటల నుంచి బుధవారం ఉదయం 10.30 గంటల వరకు బొమ్మలరామారం పోలీస్‌స్టేషన్ నుంచి బయటికి రానీయలేదు.

అద్దాలకు పేపర్లు పెట్టి.. తికమక పెట్టి..

పోలీసులు సంజయ్‌ను బొమ్మలరామారం పీఎస్ నుంచి చాకచక్యంగా వరంగల్‌కు తరలించారు. నాలుగు వాహనాల కాన్వాయ్‌లో ఒకదానిలో బండి సంజయ్‌ను ఎక్కించారు. అన్ని కార్ల అద్దాలకు న్యూస్ పేపర్లు అడ్డుగా పెట్టారు. సంజయ్‌ను భువనగిరి కోర్టులో హాజరుపర్చనున్నట్టు పోలీసులు తొలుత లీక్ ఇచ్చారు. ఈ క్రమంలో మేడ్చల్, సిద్దిపేట, యాదాద్రి జిల్లాల సరిహద్దులో ఉన్న బొమ్మలరామారం పోలీస్‌స్టేషన్ నుంచి హైదరాబాద్ వైపు వాహనాలను మళ్లించారు. మీడియా, బీజేపీ కేడర్ అటువైపు వెళ్లే ప్రయత్నం చేయగానే కార్లను వెనక్కి మళ్లించి భువనగిరి వైపు తిప్పారు. దీనితో భువనగిరి, నల్లగొండ, రామన్నపేట, ఆలేరు కోర్టుల్లో ఎక్కడో ఓ చోట హాజరుపర్చే అవకాశం ఉందని ప్రచారం జరిగింది.

ఆందోళనలను తప్పించుకుని..

సంజయ్ అరెస్టు నేపథ్యంలో ఓ వైపు బీజేపీ శ్రేణులు, వారికి ప్రతిగా బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనలకు దిగడంతో పోలీసులు ప్రత్యామ్నాయ మార్గంలో సంజయ్‌ను తీసుకెళ్లారు. బొమ్మలరామారం పోలీస్‌స్టేషన్ నుంచి జనగామ, పాలకుర్తి, జఫర్‌ఘడ్, రఘునాథపల్లి మీదుగా మధ్యాహ్నం 2.30 మడికొండ పోలీస్ ట్రెనింగ్ సెంటర్‌కు తరలించారు. కొంతసేపటి తర్వాత అక్కడి నుంచి కాజీపేట మీదుగా హనుమకొండ మొదటి సెషన్స్ కోర్టుకు బయలుదేరారు. కాజీపేట సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు సంజయ్‌ను తరలిస్తున్న కాన్వాయ్‌పై చెప్పులు విసిరారు. మొత్తం సుమారు 13 పోలీసు వాహనాల కాన్వాయ్ సాయంత్రం 4.13 గంటలకు కోర్టు ఆవరణకు చేరుకుంది. ఆయనతోపాటు మిగతా నిందితుల రిమాండ్ ప్రక్రియ ముగిసేసరికి రాత్రి తొమ్మిది గంటలైంది.

8 గంటలు పోలీస్ స్టేషన్‌లోనే..

పండ్లు, అల్పాహారం తీసుకోవడానికి బండి నిరాకరణ

బొమ్మలరామారం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను ముందుగా అనుకున్నమేరకే బొమ్మలరామారం ఠాణాకు తీసుకువెళ్లినట్టు సమాచారం. మంగళవారం రాత్రి 12 గంటల సమయానికల్లా ఇక్కడి పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నట్టు తెలిసింది. ఇక బొమ్మలరామారం పీఎస్‌కు వచ్చినప్పటి నుంచి ఉదయం అక్కడి నుంచి బయటికి తరలించేదాకా.. అంటే దాదాపు ఎనిమిది గంటల పాటు బండి సంజయ్ కంటిపై కునుకులేకుండా పోలీస్‌స్టేషన్‌లోని కుర్చీలోనే కూర్చుని ఉన్నట్టు సమాచారం. మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ తెల్లవారుజామున 4 గంటల సమయంలో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంజయ్‌కు తోడుగా ఉన్నారు. బుధవారం ఉదయం సంజయ్ పోలీస్‌స్టేషన్ క్వార్టర్స్‌లోనే స్నానం చేసి దుస్తులు మార్చుకున్నారు. ఒక కప్పు పాలు మినహా ఎలాంటి ఆహారమూ తీసుకోలేదని తెలిసింది. పోలీసులు ఇడ్లీ, వడ వంటి అల్పాహారం తీసుకు వచ్చినా తినలేదని.. ఆపిల్స్, అరటిపండ్లను అందజేసినా తిరస్కరించారని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి.

బండికి రిమాండ్!

▶ మొదటి పేజీ తరువాయి

నిందితులను రిమాండ్ చేయాలంటూ పోలీసులు ఇచ్చిన రిపోర్టుపై న్యాయమూర్తి విచారణ చేపట్టారు.

నిందితుల అభ్యంతరాలను తిరస్కరించి..

విచారణ సందర్భంగా బండి సంజయ్‌పై కేసు నమోదు, అరెస్టు తీరుపై ఆయన తరఫు న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సీఆర్‌పీసీ 41ఏ ప్రకారం నిందితులకు నోటీసులు ఇచ్చాకే అరెస్టు చేయాలని.. ఈ కేసులో అలా చేయలేదని, రిమాండ్‌ను తిరస్కరించాలని పిటిషన్ వేశారు. వాదనలు విన్న జడ్జి.. నిందితుల అభ్యర్థనను తిరస్కరించి, పోలీసుల రిమాండ్ రిపోర్టును అంగీకరించారు. బండి సంజయ్‌తోపాటు బూర ప్రశాంత్ (మాజీ జర్నలిస్టు), గుండెబోయిన మహేశ్ (కేఎంసీలో ల్యాబ్ అసిస్టెంట్), మౌటం శివగణేశ్ (డ్రైవర్)లకు 14 రోజులు రిమాండ్ విధించారు.

సంజయ్‌కు హాని ఉందనడంతో..

అయితే బండి సంజయ్‌కు ప్రాణహాని ఉందని, ఆహారంలో విష ప్రయోగం చేసి చంపే అవకాశం ఉందని న్యాయవాదులు కోర్టులో ఆందోళన వ్యక్తం చేశారు. దీనితో సంజయ్‌కు ఇచ్చే ఆహారాన్ని పరీక్షించిన మీదటే అందజేయాలని జడ్జి ఆదేశించారు. ఇక వరంగల్ కోర్టు పరిధిలోని నిందితులను రిమాండ్ నిమిత్తం ఖమ్మం జైలుకు తరలిస్తారు. కానీ సంజయ్ తరఫు న్యాయవాదులు ఆయనను కరీంనగర్ జైలుకు తరలించాలని కోరగా న్యాయమూర్తి అంగీకరించారు. ఈ మేరకు బండి సంజయ్‌ను భారీ బందోబస్తు మధ్య కరీంనగర్ జైలుకు తీసుకెళ్లారు. మిగతా నిందితులను ఖమ్మం జైలుకు తరలించారు.

కరీంనగర్‌లో హైఅలర్ట్

కరీంనగర్ క్రైం: పోలీసులు బండి సంజయ్‌ను బుధవారం రాత్రి 10 గంటలకు కరీంనగర్ జైలుకు తీసుకువచ్చారు. ఈ క్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కరీంనగర్ పట్టణంలో హైఅలర్ట్ ప్రకటించారు. మానేరు బ్రిడ్జి నుంచి బస్టాండ్ వరకు, జైలు వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సంజయ్ కుటుంబ సభ్యులు జైలు వద్దకు చేరుకుని ఆయనను కలిసేందుకు ప్రయత్నించినా ఒకే చెప్పలేదు. బీజేపీ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది బాస సత్యనారాయణను మాత్రమే జైలు వద్దకు అనుమతించారు.

సంజయ్ రిమాండ్‌పై నేడు హైకోర్టుకు..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపించడాన్ని సవాల్ చేస్తూ బీజేపీ లీగల్ సెల్ గురువారం హైకోర్టులో లంచ్ మోషన్ దాఖలు చేయనుంది. మరోవైపు అదే సమయంలో వరంగల్ కోర్టులో సంజయ్‌కు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేయనున్నట్టు పార్టీవర్గాలు తెలిపాయి.

దౌర్జన్యంగా లాక్కెళ్లారు: సంజయ్ భార్య



పోలీసులు తన భర్తను దౌర్జన్యంగా లాక్కెళ్లారని బండి సంజయ్ సతీమణి అపర్ణ ఆరోపించారు. మంగళవారం అర్ధరాత్రి తమ ఇంటికి వచ్చిన పోలీసులు.. సంజయ్ భోజనం చేసిన తర్వాత గుండెకు సంబంధించిన మందులు వేసుకోవాల్సి ఉందని చెప్పినా వినకుండా దౌర్జన్యం చేశారని మండిపడ్డారు. వారెంట్ చూపించాలని అడిగితే ఎలాంటి సమాధానం ఇవ్వలేదని చెప్పారు. పోలీసుల తీరు బాధాకరమన్నారు.



హనుమకొండ అదాలత్ సెంటర్ వద్ద బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

క్లుప్తంగా...

లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



సాక్షి, హైదరాబాద్: పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీ వెనుక రాజకీయ కుట్ర ఉందన్న వార్తలపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లీకేజీ వ్యవహారంలో బీజేపీపై వస్తున్న ఆరోపణల దృష్ట్యా.. ఆ పార్టీ అందుకు బాధ్యత వహించాలన్నారు. పరీక్ష మొదలైన కొద్దిసేపటికి వాట్సాప్ గ్రూపుల్లో ప్రశ్నపత్రం ప్రత్యక్షం అవడంపై దర్యాప్తు అనంతరమే పోలీసులు ప్రశాంత్‌ను అదుపులో తీసుకున్నారన్నారు. ఆ క్రమంలోనే బండి సంజయ్‌తో సంబంధాలు బయటపడ్డాయన్నారు. . పేపర్ లీకేజీపై ప్రత్యక్ష ఆందోళన చేస్తున్న బండి సంజయ్ ఈ వ్యవహారంలో తనకు సంబంధం లేదని నిరూపించుకోవాలన్నారు. తమ రాజకీయ ప్రయోజనాలకోసం లక్షలాది విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్‌తో చెలగాటమాడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని కూనంనేని డిమాండ్ చేశారు.

మైనారిటీలకు తీవ్ర అన్యాయం



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పాలనలో మైనారిటీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మైనారిటీ కన్వీనర్ల ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందులో ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. రంజాన్ మాసం వస్తే, ఇఫ్తార్ దావత్, వస్త్రాలు పంచి ముస్లింలను మోసం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని వక్ఫ్ బోర్డు భూములను లీజుకిస్తూ వచ్చిన ఆదాయాన్ని ముస్లింల అభివృద్ధికి ఎందుకు ఉపయోగించడం లేదని నిలదీశారు. కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ, బీఎస్పీ ఏడు రాష్ట్రాల ఇన్‌చార్జి, నేషనల్ కో–ఆర్డినేటర్ రాంజీ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆ సబ్జెక్టు వరకు పాస్ చేసేద్దామా?

మిస్సయిన సమాధాన పత్రాల విషయంలో అధికారుల యోచన

సాక్షి, హైదరాబాద్: ఉట్నూర్ కేంద్రంలో సోమవారం మాయమైన పదో తరగతి విద్యార్థుల సమాధాన పత్రాలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆ సబ్జెక్టు వరకూ వారిని పాస్ చేయడమే సరైన నిర్ణయంగా భావిస్తున్నట్టు తెలుస్తోంది. తొలిరోజు టెన్త్ పరీక్ష సందర్భంగా ఉట్నూర్ కేంద్రంగా ప్రైవేటు విద్యార్థులు (సప్లిమెంటరీ) 9 మంది పరీక్ష రాశారు. ఆ పేపర్లను ముందే నిర్ణయించిన ప్రకారం వాల్యూయేషన్ కేంద్రానికి తరలించాల్సి ఉంది. వీటిని దగ్గర్లోని పోస్టాఫీసుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో ఎక్కడో పడిపోయాయి. దీన్ని గుర్తించిన విద్యాశాఖాధికారులు ఈ వ్యవహారంపై విచారణ చేపట్టారు. జవాబు పత్రాలు మాయమైన ఘటనకు విద్యార్థులను బాధ్యులను చేయడం సరికాదని భావించి, ఆ సబ్జెక్టు వరకు పాస్ చేయడం మంచిదనే నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది.

అల్లర్లు జరగకుండా ముందస్తుగా అదుపులోకి

సంజయ్‌పై కరీంనగర్ పోలీసుల ఎఫ్ఐఆర్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: టెన్త్ పేపర్ లీకేజీల విషయంలో రాష్ట్రంలో ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టకుండా ఉండేందుకు, అమాయక విద్యార్థులను రెచ్చగొట్టకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగానే తాము బండి సంజయ్‌ను అరెస్టు చేశామని కరీంనగర్ పోలీసులు తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి 12.15 గంటలకు సంజయ్‌ను అరెస్టు చేసిన పోలీసులు నాటకీయ పరిణామాల మధ్య బొమ్మల రామారం పోలీసుస్టేషన్‌కు తరలించిన విషయం తెలిసిందే. అయితే ఆయన్ను ఏ కేసు కింద అరెస్టు చేశారు? ఎక్కడికి తరలిస్తున్నా రు? అన్న విషయాలను కనీసం మీడియా కు కూడా చెప్పకుండా బుధవారం మధ్యాహ్నం వరకు పోలీసులు పూర్తి గోప్యంగా ఉంచారు. తర్వాత కరీంనగర్ టూటౌన్‌లో ఎఫ్ఐఆర్ న మోదు చేయడంతో ఈ విషయంలో స్పష్టత వచ్చింది.

ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే కుట్ర..!

పేపర్ లీకేజీ విషయంలో ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలుజేసి, ప్రజల ఎదుట దోషిగా నిలబెట్టాలని సంజయ్ భావించారని, విద్యార్థులను రెచ్చగొట్టి ప్రశాంత వాతావరణాన్ని చెదరగొట్టేలా వ్యవహరించారని టూటౌన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీబాబు ఎఫ్ఐఆర్ (147/2023)లో పేర్కొన్నారు. తమకు వచ్చిన సమాచారం ఆధారంగా సుమోటోగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులతో, తన అనుచరులు, పార్టీ కార్యకర్తలతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేయించేందుకు సంజయ్ పథకం రచించారని ఆరోపించారు. పరీక్షల క్రమానికి విఘాతం కలిగించేందుకు, విద్యార్థుల భవిష్యత్తుకు ఆటంకం కలిగించేందుకు యత్నించారని తెలిపారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ పోలీసుస్టేషన్‌లో పదో తరగతి పరీక్ష పత్రం బయటికి వచ్చిన కేసుతో బండికి సంబంధం ఉందన్న విషయాన్ని ఎఫ్ఐఆర్‌లో ప్రస్తావించారు.

టెన్త్ పేపర్ లీక్ పెద్ద గేమ్‌ప్లాన్

విద్యార్థులు, తల్లిదండ్రుల్లో భయాందోళన రేకెత్తించే కుట్ర

- దీనిలో బండి సంజయ్ కీలకం.. అందుకే ఏ1గా చేర్చి అరెస్టు చేశాం
- దర్యాప్తు సాగుతోంది... కొత్త అంశాలు తేలితే సెక్షన్లు మార్చుతాం
- వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్ వెల్లడి



వాట్సాప్ చాటింగ్‌ను చూపిస్తున్న సీపీ ఏవీ రంగనాథ్

సాక్షిప్రతినిధి, వరంగల్/వరంగల్ లీగల్: హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో హిందీ ప్రశ్నపత్రం లీక్, కాపీ కుట్ర పెద్ద గేమ్‌ప్లాన్ అని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన రేపి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలనే ఉద్దేశంతోనే ఈ కుట్రకు పాల్పడ్డారని తమ విచారణలో తేలిందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో బండి సంజయ్‌ది ప్రధాన పాత్ర అని తేలడంతోనే ప్రథమ నిందితుడిగా చేర్చామన్నారు. దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని, కొత్త అంశాలు బయటికొస్తే సెక్షన్లు మారుతాయని వివరించారు. బుధవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో సీపీ ఏవీ రంగనాథ్ వివరాలను వెల్లడించారు. ఈ కేసులో 10 మందిని నిందితులుగా చేర్చామని.. ఏ1 బండి సంజయ్, ఏ2 బూర ప్రశాంత్, ఏ3 గుండెబోయిన మహేశ్, ఏ5 మౌటం శివగణేశ్‌లను అరెస్టు చేశామని, ఏ4గా ఉన్న బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించామని తెలిపారు. పరీక్షల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్, ఇన్విజిలేటర్లపై విద్యాశాఖ చర్యలు తీసుకుందని చెప్పారు.

సంజయ్ ఆదేశాలతోనే లీక్

ఈ కేసులో నిందితుడైన బూర ప్రశాంత్ జర్నలిస్ట్ కాదని, చాలా మందికి వాట్సాప్‌లో ప్రశ్నపత్రాన్ని పంపించాడని.. బండి సంజయ్ ఆదేశాల మేరకే ప్రశాంత్ కుట్రలో భాగస్వామి అయ్యాడని విచారణలో తేలిందని సీపీ వెల్లడించారు. ''రెండు రోజుల క్రితం సాయంత్రం బండి సంజయ్‌తో ప్రశాంత్ వాట్సాప్ చాటింగ్ చేశాడు. ప్రశాంత్ చాటింగ్‌లో పేర్కొన్న అంశాలనే బండి సంజయ్ ప్రెస్‌మీట్‌లో మాట్లాడాడు. తర్వాతిరోజు బండి సంజయ్‌తో ప్రశాంత్ వాట్సాప్ కాల్ మాట్లాడాడు. దీనికి సంబంధించి 76800 06600 నంబర్‌తో కూడిన ఫోన్ ఇవ్వాలని అడిగినా బండి సంజయ్ ఇవ్వలేదు. ఆ ఫోన్ ఇస్తే మాకు కీలక సమాచారం వస్తుంది'' అని సీపీ వెల్లడించారు. ఇంకా కాల్ డేటా, వాట్సాప్ చాటింగ్‌ల వివరాలు రావాల్సి ఉందని చెప్పారు. ప్రశాంత్‌పై కేవలం మెసేజ్ షేర్ చేసినందుకు మాత్రమే కేసు బుక్ చేయలేదని.. బీజేపీ మానిటరింగ్ చేస్తున్న నమో టీంలో వరంగల్ లోక్‌సభ పరిధిలో ప్రశాంత్ పనిచేస్తున్నాడని తెలిపారు. ప్రశాంత్ ఈ హిందీ పేపర్‌ను ఈటల రాజేందర్, ఆయన పీఏ నరేందర్‌లతోపాటు పలువురు బీజేపీ నేతలకు పంపాడని చెప్పారు.

చట్టప్రకారమే అరెస్టులు

బండి సంజయ్ అరెస్టు చట్టప్రకారమే జరిగిందని, 41 సీఆర్‌పీసీ కింద నోటీసులు ఇవ్వకుండా కూడా అరెస్ట్ చేయొచ్చని, దీనికి తగిన కారణాలున్నాయని సీపీ రంగనాథ్ వివరించారు. సంజయ్ అరెస్టుకు ముందు లోక్‌సభ స్పీకర్‌కు సమాచారం ఇచ్చామని చెప్పారు. తమపై ఎవరి ఒత్తిళ్లు లేవని, వరంగల్‌లో ఎక్కువగా అరెస్ట్ చేసింది బీఆర్ఎస్ వారినేనని పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మను అరెస్టు చేయడంపై జాతీయ మహిళా కమిషన్ అడుగుతున్న ప్రశ్నలకు కూడా చట్టపరిధిలో సమాధానం ఇస్తామన్నారు. ఈ కేసులో నేరం రుజువైతే సంజయ్, ఇతర నిందితులకు మూడేళ్ల నుంచి ఏడేళ్ల వరకు జైలుశిక్షపడే అవకాశం ఉందన్నారు.

రిమాండ్ రిపోర్టు: అరెస్టులకు కారణాలివీ..

హిందీ పేపర్ లీక్ కేసులో మొత్తం 10 మందిని నిందితులుగా పేర్కొన్న పోలీసులు.. బండి సంజయ్ సహా నలుగురి అరెస్టుకు కారణాలను రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. అర్ణేష్‌కుమార్ వర్సెస్ బీహార్ రాష్ట్రం కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించిన నియమాలకు లోబడి.. నోటీసులు ఇవ్వకుండా నేరుగా నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్టు పేర్కొన్నారు. ఆ అంశాలు, కారణాలివీ..

- ఎస్సెస్సీ పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్నప్పుడు పరీక్ష కేంద్రం నుంచి హిందీ ప్రశ్నపత్రాన్ని తీసి, దాని ఫోటోలను వాట్సాప్/సోషల్ మీడియాలో షేర్ చేయడం హేయమైన నేరం. ఇంకా పరీక్షల ప్రక్రియ కొనసాగుతోంది. నిందితులు రిమాండ్ కాకుంటే పరీక్షల నేరాలకు మరింతగా పాల్పడి.. తెలంగాణ విద్యార్థుల భవిష్యత్‌ను నాశనం చేసే అవకాశం ఉంది.
- నిందితులు రిమాండ్‌కు వెళ్లకుంటే.. రాష్ట్రంలోని చిత్తశుద్ధి గల విద్యార్థులు సీరియస్‌గా తీసుకుని, నిందితులపై ప్రతీకారం తీర్చుకోవడానికి ప్రయత్నిస్తే.. అది శాంతిభద్రతల సమస్యకు దారితీయవచ్చు.
- ఈ కేసు దర్యాప్తు ఇంకా పూర్తి కాలేదు. చాలా సాక్ష్యాలను సేకరించాలి. నిందితులు బయట ఉంటే.. సాక్ష్యాలను తారుమారు చేసేందుకు, తదుపరి దర్యాప్తు సరైన విధంగా జరగకుండా ఆటంకం కలిగించేందుకు అవకాశం ఉంది.
- ఇది చాలా తీవ్రమైన కేసు, ముందస్తు ప్రణాళికతో చేసిన నేరపూరిత కుట్ర. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఉద్దేశంతో చేశారు. మరికొందరు నేరస్తులను ఇంకా పట్టుకోవాల్సి ఉంది. లోతైన దర్యాప్తు అవసరం. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని నిందితులను రిమాండ్‌కు పంపాలి.



జనగామ జిల్లా పెంబర్తి వద్ద బండి సంజయ్‌ను తీసుకెళ్తున్న వాహనాన్ని అడ్డుకుంటున్న బీజేపీ శ్రేణులపై లాఠీచార్జ్ చేస్తున్న పోలీసులు

రసకందాయంలో రాజకీయ డ్రామా: మల్లు రవి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రాజకీయ డ్రామా రసకందాయంలో పడిందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి వ్యాఖ్యానించారు. ఆయన బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ నేతలను అరెస్టు చేయ డం ద్వారా బీఆర్ఎస్, పరీక్ష పత్రాల లీక్‌లపై పోరాడుతున్నట్టుగా బీజేపీలు ప్రజల్లో భ్రమ లు కల్పించేందుకు ప్రయతిస్తున్నాయని విమర్శించారు. పరీక్షల నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిన ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నేతలను అరెస్టు చేశారన్నారు.

ప్రగతి భవన్ డైరెక్షన్.. కల్వకుంట్ల రాజ్యాంగం

- బండి సంజయ్‌పై భారీ కుట్ర
- ఆయన్ను మానసికంగా హింసించారు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మర్రి శశిధర్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ప్రగతి భవన్ డైరెక్షన్‌లో కల్వకుంట్ల రాజ్యాంగం ప్రకారం బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌ను అక్రమంగా కేసులో ఇరికించారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడుతున్న టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ వ్యవహారంపై బండి సంజయ్ పోరాటం చేస్తున్నారు కాబట్టే కేసీఆర్ ప్రభుత్వం సంబంధం లేని కేసులో ఏ–1గా పెట్టిందని ఆరోపించారు. బుధవారం రాత్రి బీజేపీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. బండి అరెస్టు పూర్తిగా అప్రజాస్వామిక చర్య అని వ్యాఖ్యానించారు. ఒక జాతీయ పార్టీకి అధ్యక్షుడు, ఎంపీ అనే కనీస మర్యాద లేకుండా పోలీసులు వ్యవహరించారన్నారు. టెర్రరిస్టుల విషయంలో కూడా అలా వ్యవహరించలేదనీ, కల్వకుంట్ల కుటుంబం మెప్పు కోసం పోలీసులు అలా ప్రవర్తిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. సంజయ్‌ని అనేక వాహనాల్లో మార్చడమే కాకుండా, పలు స్టేషన్లు తిప్పి హింసించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సంజయ్ అరెస్ట్ దుర్మార్గం, అర్ధరాత్రి అరెస్ట్ చేసి మానసికంగా హింసించారు. కేసీఆర్ దుర్మార్గ పాలనకు ఇది పరాకాష్ట'అని పేర్కొన్నారు.

సర్కార్ వైఫల్యాలను బీజేపీ ప్రశ్నిస్తోందనే..

కేసీఆర్ పరిపాలనా వైఫల్యాలను ప్రశ్నిస్తోందనే బీజేపీపై బీఆర్ఎస్ కుట్రలు, కుతంత్రాలకు తెగబడుతోందని కిషన్‌రెడ్డి నిందించారు. సంజయ్ ను జైల్లో వేశామని చంకలు గుద్దుకుంటున్నరేమో. ప్రజల కోసం ప్రతీ బీజేపీ కార్యకర్త సైనికుడిలా పని చేస్తాడని అన్నారు. ప్రభుత్వ వైఫల్యం, చేతకానితనం వల్ల టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ అయ్యి లక్షలాది మంది రోడ్డున పడ్డారని, దీని నుంచి ప్రజల దృష్టి మరల్చడం కోసమే కల్వకుంట్ల కుటుంబం సంజయ్‌ను అరెస్టు చేసిందన్నారు. న్యాయపోరాటాల కోసం లక్షలాది మంది బీజేపీ కార్యకర్తలు జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారని, కొత్త జైళ్లు సిద్ధం చేయండని అన్నారు.

అంత టైమ్ మాకు లేదు

'కేసీఆర్‌పై కుట్ర చేసేంత సమయం మాకు లేదు... మా కేంద్ర నేతల వద్ద అసలే లేదు అని కిషన్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ సర్కారు చివరికి విలేకరులను, మీడియా సంస్థలను కూడా వదిలి పెట్టలేదని గుర్తు చేశారు. ''బండి సంజయ్‌కు పదో తరగతి పేపర్ ఉదయం 11.30 కి వచ్చింది.. దాని కంటే ముందే టీవీలలో వార్త వచ్చింది. పేపర్ లీక్ చేసి, మీడియాకు ఇచ్చి...బండి సంజయ్ చేశారని అతకని విధంగా కథ చెబుతున్నారు'అని అన్నారు. 'పేపర్ లీకేజీకి పాల్పడ్డారని చెబుతున్న ప్రశాంత్‌తో స్థానిక ఎమ్మెల్యే కలిసి కేక్ కట్ చేశారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఒకే టేబుల్ మీద కూర్చొని టీ తాగారు. ప్రశాంత్‌కి బీఆర్ఎస్ నేతలతోనే సంబంధాలు ఉన్నాయి'అని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

మోదీ దృష్టికి బండి అరెస్ట్

▶ మొదటి పేజీ తరువాయి

మాట్లాడారు. అనంతరం దాదాపు అరగంట పాటు అమిత్‌షాతో భేటీ అయ్యారు. అరెస్టును న్యాయపరంగా ఎదుర్కోవాల్సిన తీరు, రాజకీయంగా ఎండగట్టేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. తర్వాత నడ్డా, అమిత్‌షా ఇద్దరూ మధ్యాహ్నం పన్నెండు గంటల సమయంలో పార్లమెంట్‌లో ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. కక్షపూరితంగా సంజయ్‌ను అరెస్ట్ చేశారని ప్రధానికి వివరించారు. ఈ సందర్భంగా సంజయ్ అరెస్ట్‌పై తొలుత న్యాయపరంగా కొట్లాడాలని, అవసరమైతే ఢిల్లీ నుంచి ప్రత్యేక న్యాయబృందాన్ని రాష్ట్రానికి పంపాలని నిర్ణయించినట్టు సమాచారం. ఇదే సమయంలో రాజకీయంగా ప్రత్యేక కార్యాచరణ తీసుకోవాలని, నిరసన కార్యక్రమాల్లో పాల్గొనేలా కేంద్ర మంత్రులను రాష్ట్రానికి పంపాలనే భావనకు వచ్చినట్టు సమాచారం. ఈ భేటీ జరిగిన కొంతసేపటికే రాష్ట్ర నేతలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన తరుణ్ ఛుగ్.. గురువారం నుంచి చేపట్టాల్సిన ఆందోళనలపై మార్గనిర్దేశం చేసినట్టు తెలిసింది.

లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదు

బండి సంజయ్ అరెస్టుపై బీజేపీ ఎంపీలు బుధవారం లోక్‌సభ స్పీకర్ ఓం ప్రకాశ్‌బిర్లాను కలసి ఫిర్యాదు చేశారు. ఎంపీ అయిన సంజయ్ హక్కులకు భంగం కలిగించేలా పోలీసులు వ్యవహరిస్తున్నారంటూ రూల్ 223 ప్రకారం బీజేపీ ఎంపీ సోయం బాపురావు ప్రివిలేజ్ నోటీసులు అందించారు. అరెస్టుకు కారణాలు చెప్పలేదని.. గుండె సంబంధ వ్యాధితో బాధపడుతున్న సంజయ్‌ను మందులు కూడా తీసుకోనివ్వలేదని ఆరోపించారు. తర్వాత ఈ అంశంపై పార్లమెంటులోని గాంధీ విగ్రహం వద్ద ఎంపీలు కె.లక్ష్మణ్, జీవీఎల్ నరసింహారావు, సోయం బాపురావు నిరసన తెలిపారు. సంజయ్ అరెస్టును ట్విట్టర్ వేదికగా కేంద్రమంత్రులు పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, అనురాగ్ ఠాకూర్ తదితరులు ఖండించారు. బీజేపీకి పెరుగుతున్న ఆదరణను ఓర్వలేక, అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు కేసీఆర్ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు దిగుతోందని ఆరోపించారు.

మెసేజ్ వస్తే చూడటం తప్పా?

కేసీఆర్ ప్రభుత్వం ఏ వ్యవస్థలనూ గౌరవించడం లేదు. కారణాలు చెప్పకుండా అరెస్టులు చేస్తున్నారు. పరీక్ష పత్రాల లీకేజీ వ్యవహారాల్లో ప్రజలను తప్పుదోవ పట్టించేలా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. మెసేజ్‌లు వస్తే చూడటం కూడా తప్పేనా? సంజయ్ అరెస్టుపై, కేసీఆర్ కుటుంబ అవినీతి పాలనపై బీజేపీ శ్రేణులు అన్ని రకాలుగా పోరాడుతాయి. పాలన తీరును ప్రశ్నించినందుకు జైల్లో వేస్తామంటే.. బీజేపీ నేతలెవరూ భయపడరు.

– తరుణ్ ఛుగ్, బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి

ప్రధాని పర్యటనను పక్కదోవ పట్టించేందుకే..

వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష కూటమికి తనను కన్వీనర్‌ను చేస్తే పార్టీలకు నిధులిస్తానని కేసీఆర్ చెప్పిన విషయాన్ని ప్రముఖ పాత్రికేయుడు రాజ్‌దీప్ సర్దేశాయ్ బయటపెట్టారు. పైగా ఈనెల 8న హైదరాబాద్‌లో ప్రధాని పర్యటన ఉంది. ఈ అంశాలను పక్కదోవ పట్టించేందుకే బండి సంజయ్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారు.

– ధర్మపురి అరవింద్, ఎంపీ

లీకేజీలు, ప్యాకేజీలు బయటకు రావొద్దనే..

బండి సంజయ్‌ను అకారణంగా, అన్యాయంగా అరెస్టు చేశారు. లీకేజీలు, ప్యాకేజీల విషయం బయటికి రాకుండా ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నమిది. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదు.

– కె.లక్ష్మణ్, ఎంపీ

బీఆర్ఎస్‌కు ఇవి చివరి రోజులు

సంజయ్‌ను అక్రమంగా అరెస్ట్ చేయడం ద్వారా దాష్టీకానికి పాల్పడ్డారు. అవినీతి ఆరోపణలతో సతమతమవుతున్న బీఆర్ఎస్ పార్టీ, దాని నాయకత్వం రాజకీయ అస్తిత్వానికి ఇవి చివరి రోజులు.

– బీఎల్ సంతోష్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్త పోరాటం

పార్టీ ముఖ్యుల సమావేశంలో తరుణ్‌ఛుగ్



సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టుపై పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జ్ తరుణ్ ఛుగ్.. రాష్ట్ర నేతలతో వర్చువల్‌గా మాట్లాడారు. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణతోపాటు బీజేపీ కోర్ కమిటీ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్న ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతోందన్నారు. బండి సంజయ్ అరెస్టుకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం రాత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పార్టీ రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షులు, జిల్లా ఇన్‌చార్జులతో రాష్ట్ర నేతలు సమావేశమయ్యారు. బండి సంజయ్ అరెస్టు నిరసిస్తూ, బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా గురువారం అన్ని పోలింగ్ బూత్‌లలో ప్రతిజ్ఞ కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం బీఆర్ఎస్ నియంతృత్వ ధోరణిని, అప్రజాస్వామిక చర్యలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యక్రమాలు చేపడతామని పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

సంజయ్ అరెస్ట్‌కు ప్రగతిభవన్ నుంచే రచన

ప్రభుత్వంపై మండిపడ్డ బీజేపీ నేతలు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌ను అరెస్ట్ చేసి 14 రోజుల రిమాండ్‌కు పంపడంపై ఆ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంజయ్ అరెస్టుకు రచన ప్రగతిభవన్ నుంచే జరిగిందని పార్టీ జాతీయ నాయకురాలు డీకే అరుణ, కోర్‌కమిటీ సభ్యుడు పొంగులేటి సుధాకర రెడ్డి, నేతలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి, ఎన్.రామచంద్రరావు మండిపడ్డారు. వరంగల్ కమిషనర్ రంగనాథ్ చదివిన స్క్రిప్ట్ ప్రగతి భవన్ నుంచి వచ్చిందేనని డీకే అరుణ ఆరోపించారు. అధికారులు కల్వకుంట్ల కుటుంబం చేతిలో కీలుబొమ్మగా మారడం సిగ్గుచేటన్నారు. సంజయ్‌కు ఎలాంటి హాని జరిగినా ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. కల్వకుంట్ల కుటుంబాన్ని తెలంగాణ ప్రజలు త్వరలోనే బొంద పెడతారని అరుణ హెచ్చరించారు. సంజయ్‌ను అరెస్ట్ చేసేటప్పుడు లోక్‌సభ స్పీకర్‌కు తెలియజేయకపోవడం రాజ్యాంగ విరుద్ధమని పొంగులేటి అన్నారు. రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబ రాజ్యాంగం నడుస్తోందని ఎద్దేవా చేశారు. బండి సంజయ్ అరెస్టు అప్రజాస్వామిక చర్యని రామచంద్రరావు అన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం మళ్లీ మళ్లీ ఖూనీ అవుతోందని కొండా విశ్వేశ్వర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఎంపీని అలా అరెస్టు చెయ్యడం అత్యంత హేయమన్నారు.

అక్రమ అరెస్టు: ఈటల



మేడ్చల్ రూరల్: హిందీ పేపర్ లీకేజీ పేరుతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌ను అక్రమంగా అరెస్టు చేశారని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆరోపించారు. అరెస్టు తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. ఓ పక్క పేపర్ లీకేజీ, మరో పక్క మహిళలు చేయకూడని లిక్కర్ వ్యాపారంలో స్కామ్ చేసి తన కూతురు అడ్డంగా దొరికి విచారణ ఎదుర్కొంటుండడంతో వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేసీఆర్ ఈ కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. బుధవారం మేడ్చల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.

మేడ్చల్‌లో ఈటల హౌస్ అరెస్టు

బీజేపీ కార్యాలయానికి వెళ్తున్న ఈటలను మేడ్చల్ పోలీసులు అడ్డుకుని తిరిగి తన నివాసానికి చేర్చి హౌస్ అరెస్ట్ చేశారు.

ఎంపీలకే హక్కులు లేకపోతే ఎలా?

పోలీస్ మాన్యువల్ మారుస్తారా?... డీజీపీ, పోలీసులపై రఘునందన్ ఘాటు వ్యాఖ్యలు



సాక్షి, యాదాద్రి: తెలంగాణలో బిహార్ గూండా అంజనీకుమార్ రాజ్యాంగాన్ని తీసుకురావద్దని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు పోలీసులనుద్దేశించి వ్యాఖ్యానించారు. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం పోలీస్ స్టేషన్‌లో ఉన్న బండి సంజయ్‌ను కలవడానికి బుధవారం ఉదయం వచ్చిన రఘునందన్‌రావును పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ఒక వ్యక్తిని ఏ కేసులో అరెస్ట్ చేశామన్నది చెప్పకుండా అదుపులోకి తీసుకోవడం హెబియస్ కార్పస్ కిందకు వస్తుందన్నారు. ఎంపీలకు కూడా ఇవ్వకుండా నిర్బంధంలో ఉంచడం రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. పోలీ సులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని, పోలీస్ మాన్యువల్ మార్చివేసి ఖాకీ డ్రెస్ తొలగించి పింక్ యూనిఫాం వేసుకోవాలనుకుంటున్నారా అని ప్రశ్నించారు. మఫ్టీ పోలీసులు తన మెడపై చేతులు వేసి నెడుతున్నారని, తన వద్ద పిస్టోల్ ఉందని, తోపులాటలో మిస్‌ఫైర్ అయ్యే అవకాశం ఉందని ఆయన పోలీసులను హెచ్చరించారు. అయనను పోలీసులు అదుపులోకి తీసుకుని షామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రఘునందన్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

ఐపీఎస్‌ల సంఘం తీవ్ర అభ్యంతరం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర డీజీపీని ఉద్దేశించి బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు చేసిన వ్యాఖ్యలను తెలంగాణ ఐపీఎస్‌ల సంఘం తీవ్రంగా ఖండించింది. రఘునందన్‌రావుపై కఠినచర్యలు తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఐపీఎస్‌ల సంఘం సంయుక్త కార్యదర్శి సుమతి బుధవారం ఓ ప్రకటన చేశారు. 'బిహార్ గూండా డీజీపీ అంజనీకుమార్ ఇచ్చే ఆదేశాలు అమలు చేయొద్దు. తెలంగాణలో బిహార్ గూండా రాజ్యాన్ని తీసుకురాకండి'అని రఘునందన్‌రావు వ్యాఖ్యానించడం బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఇలా ఓ ప్రభుత్వ ఉన్నతాధికారి గురించి మాట్లాడడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ఆరోగ్యదాయకం కాదని అన్నారు.

పోలీసు అధికారుల సంఘం ఖండన..

ఎమ్మెల్యే రఘునందన్‌రావు డీజీపీ గురించి అభ్యంతరకర రీతిలో మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలంగాణ పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు వై.గోపిరెడ్డి తెలిపారు. చట్టసభలో సభ్యునిగా ఉంటూ ఇలాంటి భాష వాడటం హేయమని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసులు అరెస్టు నిబంధనలు పాటించకుంటే ప్రశ్నించవచ్చని, కోర్టును ఆశ్రయించవచ్చని.. కానీ అత్యున్నత పదవిలో ఉన్న డీజీపీని దూషించడం సరికాదని పేర్కొన్నారు. పోలీసు వ్యవస్థ అధిపతిని ఉద్దేశించి వ్యక్తిగత, అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినందుకు ఎమ్మెల్యేపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.

బ్రిటానియా ఇండస్ట్రీస్ లిమిటెడ్

BRITANNIA

స్క్రాప్ సేల్స్ టెండర్ ప్రక్రియ రిజిస్ట్రేషన్ కోసం ఆసక్తి చూపేవారికి ఆహ్వాన ప్రకటన

బ్రిటానియా ఇండస్ట్రీస్ లిమిటెడ్ ("BIL") వారు సదరన్ రీజియన్‌లోని వివిధ ప్రదేశాలలో ఉన్న తమ కర్మాగారాలు / డిపోల లోపల కలిగిన, ఎండిన పాలిబ్యాగ్స్, ప్లాస్టిక్ డ్రమ్స్, కారోగేటెడ్ బాక్స్‌లు మరియు ఇతర స్క్రాప్‌ని విక్రయించే ప్రక్రియ కోసం టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

ఆసక్తి గలిగిన వారు దయచేసి క్రింద సూచించిన పత్రాలు / సమాచారాన్ని పంపిన ఎడల, టెండర్ / ఇ–బిడ్ ప్రక్రియలో పాల్గొనడానికి అర్హత గల పార్టీలను BIL ఎంపిక చేసి ఆహ్వానించగలరు.

కావలసిన పత్రాలు

1. ప్రొప్రైటర్‌షిప్ డీడ్ లేదా మెమోరాండం మరియు ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ మరియు సర్టిఫికెట్ ఆఫ్ ఇన్‌కార్పొరేషన్
2. GST నమోదు సర్టిఫికెట్ పత్రం
3. పాన్ కార్డ్
4. క్యాటిల్ ఫీడ్ సర్టిఫికెట్ లేదా క్యాటిల్ ఫార్మింగ్ లైసెన్స్
5. షాప్ మరియు ఎస్టాబ్లిష్‌మెంట్ సర్టిఫికెట్

అదనంగా, క్రింది ఇచ్చిన సమాచారాన్ని ఇక్కడ ఇవ్వబడిన ఫారం రూపంలో అందచేయవలసి ఉంటుంది

క్రమ సంఖ్య	వివరాలు	వివరణ
1.	మీరు రిజిస్టర్డ్ స్క్రాప్ డీలరా?	అవును /కాదు
2.	స్క్రాప్ డీలర్‌గా అనుభవమున్న సంవత్సరాలు	సంవత్సరాలు
3.	స్క్రాప్ కాంట్రాక్టర్‌గా ప్రస్తుతం మీరు పనిచేస్తున్న ప్రముఖ కంపెనీలు **ఆయా కంపెనీలలోని సంప్రదించవలసిన వారి వివరాలు (ప్రతి కంపెనీకి విడిగా)** i. కంపెనీ పేరు ii. కంపెనీ నుంచి సంప్రదించవలసిన మేనేజర్ iii. సంప్రదించవలసిన నంబర్ iv. ఇమెయిల్ ఐడి	
4.	బ్రిటానియాతో స్క్రాప్ డీలర్‌గా అనుభవం ఉన్న సంవత్సరాల సంఖ్య	
5.	కంపెనీ టర్నోవర్ – రూ. లక్షలలో	

పైన సూచించిన పత్రాలను మరియు సమాచారాన్ని ఒక సీల్ చేసిన కవర్‌లో ఉంచి దానిపై 'Expression of Interest in Scrap contract' అని వ్రాసి క్రింది చిరునామాకు 15.04.2023 నాడు లేదా అంతకన్నా ముందుగా చేరే విధంగా పంపండి.

Regional Purchase Manager

Britannia Industries Limited, One IndiaBulls Park, Plot No.4, 5th floor, Tower B, 3rd Main Road, Ambattur Industrial Estate, Chennai - 600058

పైన ఉదహరించిన సమాచారం స్క్రాప్ సేల్ ప్రక్రియలో పాల్గొనడానికి ఆసక్తి చూపడానికి ఆహ్వానం మాత్రమే మరియు ఎప్పుడైనా సరే ఈ పూర్తి టెండర్ /ఇ బిడ్ ప్రక్రియని, తన ఇష్టపూర్వకంగా ఎటువంటి కారణం చూపకుండా నిలిపివేయడానికి/వాయిదా వెయ్యడానికి/రద్దు చెయ్యడానికి మరియు/లేదా వచ్చిన టెండర్ల అన్నింటినీ తిరస్కరించడానికి, BIL పూర్తి హక్కులు కలిగి ఉంది.



అగౌరవంతో, లేదా ఇతరులకు హాని చేయడంతో
ముడిపడిన తృప్తి అది కోరుకునేవాడికి కారాగారమే.
– జరాతుష్ట్ర

సాక్షి
గురువారం, ఏప్రిల్, 6

ఏ దేవుడూ హర్షించడు!

ఉత్సాహంగా జరుపుకోవాల్సిన సందర్భం ఉద్రిక్తతలకు దారి తీస్తే? ఎవరూ హర్షించరు. కానీ, ఇలాంటి పరిణామాలు ఎక్కువవుతున్నాయి. మార్చి 30న శ్రీరామనవమి సందర్భంగా గత వారం రోజుల్లో వివిధ రాష్ట్రాల్లో తలెత్తిన ఘర్షణలే అందుకు సాక్ష్యం. భక్తిశ్రద్ధలతో జరగాల్సిన పండుగ, శాంతియుతంగా సాగాల్సిన శోభాయాత్రలు కొన్నేళ్ళుగా శత్రుత్వానికీ, అరెస్టులకూ, అభాగ్యుల మరణాలకూ దారితీయడం శోచనీయం. ఈసారీ బిహార్, బెంగాల్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, ఢిల్లీల్లో రెండు మతాల ఘర్షణగా నవమి ఉత్సవం మారిపోయింది. అటు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో, ఇటు ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లోనూ హింసాకాండ చెలరేగింది. ప్రధానంగా ప్రతిపక్షాల హయాంలోని పశ్చిమ బెంగాల్, బిహార్‌లలో భారీ విధ్వంసం రేగిన తీరు ఆందోళనకరం. నిరుటిలాగే ఈసారీ రాళ్ళు రువ్వడం, నినాదాలు చేయడం, గృహదహనాలు, లూటీలు! సోకాల్డ్ భక్తుల చేతుల్లో కత్తులు, తుపాకీలు. వెరసి, పవిత్ర రామనవమి, రంజాన్ మాసం కలిసొచ్చే సమయం దేశంలో కొత్త తరహా హింసాత్మక ధోరణికి అనువైన సందర్భంగా మారిపోవడం ఓ విషాదం.

బెంగాల్‌లో హౌరా జిల్లాలో వరుసగా రెండురోజులు, సోమవారం రాత్రి హుగ్లీ దగ్గర రిష్రాలో మరోసారి ఘర్షణలు రేగాయి. ఇంటర్నెట్ సేవలు నిలిపివేసి, నిషేధాజ్ఞలు విధించిన పరిస్థితి. బిహార్‌లో సాసారామ్, నలందా జిల్లాల్లో హింసకు పలువురు గాయపడ్డారు. నలందా వద్ద 110 ఏళ్ళ చరిత్ర కలిగిన మదరసాలో వేలకొద్దీ అరుదైన పుస్తకాలకు నిలయమైన గ్రంథాలయం దుండగుల చేతిలో బూడిదైన ఘటన కదిలించేస్తుంది. రెచ్చగొట్టే ధోరణి వల్ల సామరస్యం దెబ్బతింటుందే తప్ప సమాజానికి మేలు చేకూరదు. ఇప్పుడు జరుగుతున్నదదే. వార్తల్ని గమనిస్తే – మథురలో జామా మసీదు పక్కనే కాషాయ జెండాలు కట్టారు. మరో రాష్ట్రంలో మసీదులో ప్రార్థనల వేళ పెద్దగా నినాదాలు చేస్తూ, లౌడ్ స్పీకర్లు హోరెత్తించారు. బెంగాల్‌లో అనుమతించిన మార్గంలో కాక రెండు వర్గాలూ ఉండే సున్నితమైన ప్రాంతం మీదుగా కత్తులతో ఊరేగింపు జరిపారు. నిరుటి ఉద్రిక్తతల రీత్యా ఢిల్లీలో ఓ పార్కులో నవమి యాత్ర, నమాజు – రెంటినీ పోలీసులు నిషేధించారు. అయినా కొన్ని మతవాద సంస్థలు అక్కడే యాత్ర, పూజ చేయడాన్ని ఏమనాలి? అదే సమయంలో రెండు చేతులూ కలవనిదే చప్పుడు రాదంటూ రెండోవర్గపు తప్పులు చెబుతున్నవారినీ కొట్టిపారేయలేం.

ఈ హింసాకాండ రాజకీయ నిందలకు దారి తీస్తోంది. ఈ ఘర్షణలకు తమ పాలనలోని లోపాలు, ఉదాసీనతలు కారణమని అంగీకరించడానికి మమత, బిహార్ సీఎం నితీశ్ కుమార్ సహజంగానే సిద్ధంగా లేరు. ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చిన గూండాలతో బీజేపీ ఈ ఘర్షణలకు పాల్పడుతోందని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపణ. బెంగాల్ పోలీసులు ఒక వర్గానికే కొమ్ముకాస్తూ, పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని బెంగాల్ బీజేపీ ఛీఫ్ నింద. ఇక, ఆ రాష్ట్ర గవర్నర్ సైతం బాధితప్రాంతాల్లో పర్యటించి గట్టిగానే గళం విప్పారు. ఘర్షణలపై కేంద్ర హోమ్‌శాఖ నివేదిక కోరే పరిస్థితి వచ్చింది. శ్రీరామనవమి ఘర్షణలతో గురువారం నాటి హనుమాన్ జయంతికి అప్రమత్తత అవసరమైంది. ఈసారి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా జాగరూకతతో వ్యవహరించాల్సిందిగా వివిధ రాష్ట్రాలకు హోమ్ శాఖ బుధవారం సలహా ఇవ్వాల్సి వచ్చింది. కలకత్తా హైకోర్ట్ ఆదేశంతో హనుమాన్ జయంతికి బెంగాల్ సర్కార్ 3 జిల్లాల్లో పారా మిలటరీ దళాలను బరిలోకి దింపాల్సొచ్చింది. ఈ ఘటనలన్నీ ధార్మిక ఉత్సవాలు అతి సున్నితంగా మారిన పరిస్థితులకు దర్పణం.

నిజానికి, ఇలాంటివన్నీ నివారించదగ్గ విపరిణామాలు. ధార్మిక ఉత్సవాలు భారత సమాజంలో ఒక అంతర్భాగం. కానీ, వాటిని ఆసరాగా చేసుకొని, వివిధ మతాల మధ్య విషబీజాలను నాటాలనీ, రాజకీయ లబ్ధి పొందాలనీ చూస్తే అంతకన్నా నేరం, ఘోరం ఉండవు. ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ప్రజలు స్వేచ్ఛగా తమ మత విశ్వాసాలను అనుసరించేలా రక్షణ కల్పించాలి. వారి ధార్మిక యాత్రలకు భద్రతనివ్వాలి. అది ఆయా ప్రభుత్వాల, అధికార యంత్రాంగాల బాధ్యత. అదే సమయంలో రెచ్చగొట్టే చర్యలు, నినాదాలు, పుకార్ల ద్వారా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. లక్ష్మణరేఖ దాటిన దోషులపై కఠినంగా వ్యవహరించాలి. ప్రతి ఎన్నికలో అధికారపీఠంపై పార్టీలు మారవచ్చేమో కానీ, మారకుండా ప్రజాసేవలోనే ఉండేది పోలీసు యంత్రాంగం. కాబట్టి, రాగద్వేషాలకు అతీతంగా వ్యవహరించాలి. ఎప్పటికప్పుడు ఏర్పాట్లలో లోపాలను సవరించాలి. విభిన్న వర్గాల మధ్య అపనమ్మకం పెంచే దుశ్చర్యలకు అడ్డుకట్ట వేయాలి.

కలసిమెలసి బతకాల్సిన సమాజంలో విషబీజాలను విత్తితే అది యావత్ దేశానికే నష్టం. రాజకీయ లబ్ధి కోసం అంగలారుస్తున్నవారు అది గ్రహించాలి. మరో ఏడాదిలో లోక్‌సభ ఎన్నికలు ఉన్నందున మతాల మధ్య చిచ్చుపెట్టి, ఓటర్లను వర్గాలుగా చీల్చాలనే ప్రయత్నాలు పెరిగితే ఆశ్చర్యం లేదు. ఇలాంటి నీచ రాజకీయ వ్యూహాల ఉచ్చులో పడకుండా, జనం అప్రమత్తంగా ఉండాలి. రాజకీయ వర్గాలు, చట్టాన్ని అమలు చేసే సంస్థలు రాజ్యాంగ విహితంగా వ్యవహరిస్తూ, మారణకాండకూ, మనుషుల్లో చీలికకూ చెక్ పెట్టాలి. ఒక్కమాటలో – సహనం, శాంతి, క్షమ పాటించిన ఆ రాముడైనా, అల్లా అయినా పొరుగువాడిని ద్వేషించమనలేదు. తమ ధర్మం గొప్పదని చాటుకోవడానికి పరధర్మాన్ని తక్కువ చేయమని ఏ సమాజమూ, ఏ దేవుడూ చెప్పలేదు. అంతర్యామి సైతం హర్షించని ఘర్షణలతో మానవతా ధర్మాన్ని సైతం మర్చిపోతే, ఆ పాపానికి ప్రాయశ్చిత్తం ఏ ధర్మంలోనూ లేదు. పాపఫలం మాత్రం ఇక్కడే, ఇప్పుడే మనమందరం అనుభవించాల్సి వస్తుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** పౌర్ణమి ఉ.9.53 వరకు, తదుపరి బ.పాడ్యమి, **నక్షత్రం:** హస్త ప.12.37 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** రా.8.55 నుండి 10.34 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.01 నుండి 10.49 వరకు తదుపరి ప.2.54 నుండి 3.44 వరకు, **అమృతఘడియలు:** ఉ.6.17 నుండి 7.58 వరకు.

సూర్యోదయం : 5.55
సూర్యాస్తమయం : 6.10
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ. 6.00 నుండి 7.30 వరకు

ఏక వ్యక్తి సైన్యంలా పనిచేశారు!



మల్లెపల్లి లక్ష్మయ్య

చాలామంది అంబేడ్కర్‌ను మేధావిగా, న్యాయకోవిదుడిగా కొనియాడతారు. కానీ దేశభక్తుడిగా అంగీకరించరు. బ్రిటిష్ వాళ్ళకు వ్యతిరేకంగా మాట్లాడితేనే దేశభక్తుడనే భ్రమలో చాలామంది ఉన్నారు. కానీ అందులో ప్రజలు, దేశ సమైక్యత, దేశాభివృద్ధి అనే మాటలు కనపడవు. రాజ్యాంగ సభలో అంబేడ్కర్ వినిపించిన వాణి రాజ్యాంగ రూపకల్పనకే ఒక మార్గాన్ని వేసింది. అనంతరం ఏడుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ రచనా సంఘానికి ఛైర్మన్ అయ్యారు. వివిధ కారణాల వల్ల దాదాపు ఒంటరిగా శ్రమించాల్సి వచ్చింది. ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా ఈ యజ్ఞాన్ని కొనసాగించారు. ఆ నాలుగేళ్లలో రోజుకు 20 గంటలు పనిచేసిన సందర్భాలున్నట్టు ఆయన సహాయకులుగా పని చేసినవాళ్ళు తమ జ్ఞాపకాలలో రాసుకున్నారు.

‘నోటితో పొగిడి, నొసటితో వెక్కిరించడం’ అని ఒక సామెత! బాబాసాహెబ్ అంబేడ్కర్ విషయంలో సరిగ్గా ఇదే జరుగుతోంది. తమ రాజకీయ ప్రయోజనాల కోసం కొన్ని చోట్ల పార్టీలు ఆయన్ని ప్రశంసిస్తున్నాయి. కానీ ఆ పార్టీల నాయకులే నిరాధార ఆరోపణలతో పుస్తకాలు రచిస్తున్నారు. గతంలో జర్నలిస్టు, బీజేపీ నాయకుడు అరుణ్ శౌరి విద్వేషపూరితంగా రాసిన పుస్తక ఉదాహరణ ఉండనే ఉన్నది. ఇటీవల కాంగ్రెస్ నాయకుడు శశిథరూర్ కూడా అంబేడ్కర్‌పై రాసిన పుస్తకంలో కొన్ని అసత్య వ్యాఖ్యలు చేశారు.

చాలామంది అంబేడ్కర్‌ను మేధావిగా, విద్యావేత్తగా, న్యాయకోవిదుడిగా, ఆర్థిక శాస్త్రవేత్తగా కొనియాడతారు. కానీ దేశభక్తుడిగా అంగీకరించరు. ఆనాటి కమ్యూనిస్టులు సైతం ఆయనకు బ్రిటిష్ ఏజెంట్ అన్న ముద్రవేసి దుష్ప్రచారం చేసిన పరిస్థితి ఉంది. కానీ అంబేడ్కర్ అటువంటి మాటలకు ఏనాడూ చలించలేదు. బ్రిటిష్ వాళ్ళకు వ్యతిరేకంగా, లేదంటే విదేశీయులకు వ్యతిరేకంగా మాట్లాడితేనో, పోరాడితేనో దేశభక్తుడనే భ్రమలో చాలామంది ఉన్నారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు అదే పాట. కానీ అందులో ప్రజలు, దేశ సమైక్యత, దేశాభివృద్ధి, మానవాభివృద్ధి అనే మాటలు కనపడవు. వారం రోజుల్లో మనం బాబాసాహెబ్ జయంతి ఉత్సవాలను జరుపుకోబోతున్నాం. ఈ సందర్భంగా చాలామంది దృష్టికి రాని రెండు విషయాలను మీ ముందుంచాలనుకుంటున్నాను.

అందులో మొదటిది, భారత స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ రూపకల్పన కోసం ఏర్పడిన రాజ్యాంగ సభలో అంబేడ్కర్ నిర్వహించిన పాత్ర. రాజ్యాంగ సభ సమావేశాలు 1946 డిసెంబర్ 9న ప్రారంభమయ్యాయి. అయితే డిసెంబరు 13వ తేదీన పండిట్ జవహర్ లాల్ నెహ్రూ తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. 14న శనివారం, 15న ఆదివారం అయినందుకు మళ్ళీ సమావేశాలు డిసెంబరు 16న మొదలయ్యాయి. కేవలం ఒకరోజు తర్వాత అంటే డిసెంబరు 17న జరిగిన సమావేశంలో అంబేడ్కర్‌కు అవకాశం వచ్చింది. ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించిన అంబేడ్కర్ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ఇంత తొందరగా తనకు అవకాశం వస్తుందని భావించలేదని కూడా తెలిపారు.

రాజ్యాంగ సభలో ప్రవేశ పెట్టిన తీర్మానంపై నిర్మొహమాటంగా తన అభిప్రాయాలను తెలియజేస్తూనే, దేశ భవిష్యత్తు గురించి ఆయన అన్న మాటలు అక్కడ కూర్చున్న వందలాది మంది విజ్ఞులను, మేధావులను ఆలోచింపజేశాయంటే అతిశయోక్తి కాదు. ‘‘ఈ రాజ్యాంగ సభ ద్వారా మన గొప్పదేశపు సామాజిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థలను తీర్చిదిద్దుకుంటామనడంలో నాకు ఎటువంటి సందేహం లేదు. మనం ఈ రోజు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా విభజింపబడి ఉన్నామనే విషయం నాకు తెలుసు. మనం వివిధ శిబిరాలకు

కొత్త కోణం



చెందినవాళ్ళం. ఇవి శత్రు శిబిరాలుగా కూడా ఉన్నాయి. నేను కూడా అటువంటి శిబిరానికి చెందిన వాడనని ఒప్పుకొంటున్నాను. ఇన్ని రకాల సమస్యలున్నప్పటికీ ఈ దేశం సమైక్యంగా నిలబడడంలో ప్రపంచంలోని ఏ శక్తులూ మనల్ని అడ్డుకోలేవనే విశ్వాసం నాకున్నది.’’ అంతేకాకుండా, ముస్లిం లీగ్ విషయం, ముస్లింల విషయాన్ని ప్రస్తావిస్తూ...‘‘హిందూ–ముస్లిం సమస్యను సంఘర్షణ లతో, బల ప్రయోగంతో పరిష్కరించుకోలేం. వివేకం ద్వారా, సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలి. బ్రిటిష్ రాజనీతివేత్త బర్క్ చెప్పినట్టుగా, మనం బలవంతంగా ఎవరినీ లొంగదీసుకోలేం, వారిని మనం మనతో కలుపుకోవాలి’’ అంటూ తన ఉపన్యాసాన్ని ముగించారు.

ఇటువంటి దార్శనికతను కలిగిన అంబేడ్కర్‌ను రాజ్యాంగ సభకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసి ఓడించారు. అప్పటి తూర్పు బెంగాల్ నుంచి ఎన్నికైన షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషన్ నాయకులు జోగేంద్రనాథ్ మండల్ రాజీనామా చేసి, అంబేడ్కర్‌ను జైసూర్ కుల్నా నియోజకవర్గం నుంచి రాజ్యాంగ సభకు ఎంపిక చేశారు. అయితే కొద్ది కాలంలోనే తూర్పు బెంగాల్ పాకిస్తాన్‌లోకి వెళ్ళిపోవడంతో అంబేడ్కర్ రాజీనామా చేశారు.

రాజ్యాంగ సభలో అంబేడ్కర్ సభ్యుడిగా ఉండాలనే ప్రతిపాదనను రాజ్యాంగ సభ అధ్యక్షుడు బాబూ రాజేంద్ర ప్రసాద్ కాంగ్రెస్ ముందుంచారు. 1947 జూన్ 30న నాటి బొంబాయి ప్రధాన మంత్రి బి.జి. ఖేర్‌కు ఉత్తరం రాస్తూ, ‘‘డాక్టర్ అంబేడ్కర్ విషయంలో ఎవరికి ఎన్ని అభిప్రాయ బేధాలున్నప్పటికీ ఆయనను తిరిగి రాజ్యాంగ సభలోకి తీసుకోవాలి. గత సమావేశాల్లో డాక్టర్ అంబేడ్కర్ ప్రదర్శించిన వివేకం, మార్గదర్శనం చూసిన తర్వాత ఈ నిర్ణయానికి వస్తున్నాను’’ అంటూ కరాఖండిగా చెప్పారు. ఆ విధంగా మళ్లీ బొంబాయి నుంచి అంబేడ్కర్ రాజ్యాంగ సభలో అడుగుపెట్టారు.

1947 ఆగస్టు 27న రాజ్యాంగ రచనాసభ ఏడుగురు సభ్యులతో రచనాసంఘాన్ని నియమించింది. ఏడుగురిలో అంబేడ్కర్‌ను ఛైర్మన్‌గా ఎంపిక చేశారు. రాజ్యాంగాన్ని పూర్తి చేసి సమర్పించిన రోజున కమిటీ సభ్యులలో ఒకరైన కృష్ణమాచారి మాట్లాడుతూ, ‘‘ఈ కమిటీలో ఏడుగురు సభ్యులున్నప్పటికీ, డాక్టర్ అంబేడ్కర్ మాత్రమే పూర్తికాలం పనిచేసిన ఏకైక వ్యక్తి. ఏడుగురిలో ఒకరు రాజీనామా చేశారు. మరొక సభ్యుడు మరణించారు. వారి స్థానాల్లో ఎవరినీ తీసుకోలేదు. మరొక సభ్యుడు ప్రభుత్వ పనులలో తీరిక లేకుండా ఉన్నారు. ఇంకొక ఇద్దరు సభ్యులు అనారోగ్య కారణాల వల్ల ఢిల్లీకి దూరంగా ఉన్నారు’’ అంటూ అత్యంత స్పష్టంగా రాజ్యాంగ రచన వెనుక అంబేడ్కర్ కృషినీ, నిబద్ధతనీ వెల్లడించిన విషయాన్ని ఎవరైనా కాదనగలరా?

డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ‘‘డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను రాజ్యాంగ రచనా సంఘానికి ఛైర్మన్‌గా ఎన్నుకోవడం ఎంత సరైనదో అందరికన్నా నేను ఎక్కువగా గుర్తించగలిగాను. ఆయన తన ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా ఈ రచనా కార్యాన్ని యజ్ఞంలా కొనసాగించాడు’’ అంటూ ప్రశంసించారు. రాజ్యాంగ రచన సాగించిన ఆ నాలుగేళ్ల కాలంలో అంబేడ్కర్ చాలా దెబ్బ తిన్నారు. దాదాపు రోజుకు 20 గంటలు పనిచేసిన సందర్భాలున్నట్టు ఆయన సహాయకులుగా పని చేసినవాళ్ళు తమ జ్ఞాపకాలలో రాసుకున్నారు. అంటే ఒక వ్యక్తి దేశం కోసం తన ఆరోగ్యాన్ని సైతం పణంగా పెడితే, ఆయన సమాజంలోని కులతత్వ వాదులకు దేశద్రోహిగా, అంటరానివాడిగా కనిపించడం మన భావదారిద్ర్యానికి నిదర్శనం కాదా?

రెండవ విషయం, 1932 తర్వాత అంబేడ్కర్ హిందూ మతంతో తెగతెంపులు చేసుకుంటున్నట్టు ప్రకటించడం. అప్పటి వరకు జరిగిన రాజకీయ, సామాజిక కుట్రలు ఆయనను చలింపజేశాయి. ఎప్పుడైతే, తాను హిందూమతంలో ఇక ఉండలేనని ప్రకటించారో... ముస్లిం, క్రైస్తవ, సిక్కు మత పెద్దలు ఆయన్ని తమ తమ మతాల వైపు తిప్పుకోవడానికి ప్రయత్నాలు చేశారు. మిత్రుల ద్వారా, ప్రత్యక్షంగా కలిసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కానీ అంబేడ్కర్ ఆ మూడు మతాలను వివిధ కారణాల వలన తిరస్కరించారు. చివరకు 1950 తర్వాత బౌద్ధం వైపు వెళుతున్నట్టు ప్రకటించి తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఒకవేళ బాబాసాహెబ్ అంబేడ్కర్ బౌద్ధం కాకుండా ఇంకో మతం పుచ్చుకున్నట్లయితే, పరిణామాలు ఇంకోలా ఉండేవి. తాను, తన జాతి ఎన్నో అవమానాలు, వివక్షలు ఎదుర్కొంటున్నప్పటికీ, ప్రజాస్వామ్యయుతంగా, శాంతిగా తన ఉద్యమాలు కొనసాగించిన వారు అంబేడ్కర్! అలాంటి బాబాసాహెబ్‌ను నిరాధార ఆరోపణలతో, అనవసర విషయాలతో విమర్శల పాలుచేయాలా?

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు । మొబైల్: 81063 22077
(ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మంచోళ్లు



మొత్తంగా చూస్తే దక్షిణ భారతదేశం చాలా మర్యాదైనదీ, దయాస్వభావం కలిగినదీ. మా కుటుంబంలో సగంమంది దక్షిణ భారతీయులే. ఏదో రకంగా అందులో నేను కూడా చిన్న భాగం.
– దీప్‌శిఖా ఘోష్, వైద్యురాలు

ఎన్నో వస్తున్నాయి




కృత్రిమ మేధ (ఏఐ) అనేది పెద్ద కొండ. దాని ఉపకరణాల్లో చాట్ జీపీటీ అనేది కేవలం గోరంత. ఒక్క మార్చి నెలలోనే వెయ్యికి పైగా ‘ఏఐ’ టూల్స్ విడుదలయ్యాయి.
– జైన్ కాన్, కృత్రిమ మేధ విశ్లేషకుడు

నష్టదాయక పోరు



ఇండియాలో చాలామంది విడాకులు అనే యుద్ధాన్ని చేయడంలో జీవితాన్ని కోల్పోతున్నారు. భర్త నుంచి భరణం పొందేందుకు అమ్మాయిలు తమ ఉద్యోగాలను వదులుకోవడాన్నీ, భరణం చెల్లించడాన్ని తప్పించుకోవడానికి మంచి వేతనాలున్న మగవాళ్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేయడాన్నీ చూశాను. తమ తీవ్రమైన అహాలతో ఇరుపక్షాలూ ఎదుటివారిని సర్వనాశనం చేయడానికి ప్రయత్నిస్తాయి.
– దీపికా నారాయణ్ భరద్వాజ్, డాక్యుమెంటరీ మేకర్

రావు, నేర్చుకుంటున్నా!



నేను అస్సామీస్ మీడియం పాఠశాలలో చదువుకున్నాను. హిందీ, ఇంగ్లిష్ నేర్చుకోవడానికి నాకు వచ్చినంతలో సాధ్యమైనంత ప్రయత్నం చేస్తున్నాను. నాకు ఇంగ్లిష్, హిందీ రావని నేను ఒప్పుకోవాలి. దాన్ని ఒప్పుకోవడానికి నాకు ఏ అభ్యంతరమూ లేదు.
– హిమంత బిశ్వ శర్మ, అస్సాం ముఖ్యమంత్రి

వాటికవే వచ్చాయా?



తాజ్ మహల్ (ఆగ్రా), ఎర్ర కోట (ఢిల్లీ), జామా మసీదు, ఫతేపూర్‌సిక్రీ (ఉత్తర ప్రదేశ్), హుమాయూన్ టూంబ్ (ఢిల్లీ), బీబీ కా మక్బరా (ఔరంగాబాద్), ఆగ్రా కోట (ఆగ్రా), పరీ మహల్ (శ్రీనగర్)... ఒకవేళ మొఘలులు వీటిని నిర్మించక పోయివుంటే ఎవరు నిర్మించినట్టు? మోదీనా?
– అశోక్ స్వైన్, ప్రొఫెసర్

దేవుడే కాపాడాలి!



ఇస్లాం మత మూడో అత్యంత పవిత్ర స్థలమైన అల్ అక్సా మసీదులోకి టపాకాయలు ఎవరు తీసుకెళ్లగలరు? ప్రత్యర్థులను రెచ్చగొట్టి మసీదులో తలదాచుకోవడం లేదా ఆడవారు, పిల్లల వెనక దాక్కోవడం హమాస్, ఇస్లామిక్ జిహాదీయుల పని. పాలస్తీనా సోదర సోదరీమణులను ఈ రాబందు యాక్టివిజపు సైతాన్ల నుంచి దేవుడు కాపాడుగాక!
– జాహక్ తన్వీర్, కాలమిస్ట్

చచ్చు ఫిక్షన్



ఇటీవలి నా పర్యటనలో యూఎస్‌లోని చాలా బుక్ స్టోర్స్ దర్శించాను. నాకు పుస్తకాల షాపులంటే ఇష్టం. కానీ ఈమధ్య వచ్చిన ఫిక్షన్ అంతా ఒకే రకం – వాటి ‘బ్లర్బులు’ అన్నీ “ప్రేమ, కోల్పోవడం, గాఢంగా కోరుకోవడం” గురించే. పైగా అన్నీ “బాధాకరం”. ఈ మిశ్రమానికి కొన్ని వలసానుభవం కలుపుతున్నాయి. పూర్తిగా చచ్చిపోయింది. అదృష్టవశాత్తూ నాన్–ఫిక్షన్ మాత్రం వర్ధిల్లుతోంది. వాటిలోని వెరైటీ చూసేవాళ్లకు ఎంతో ఆనందం కలిగిస్తుంది.
– సంజీవ్ సన్యాల్, ఆర్థికవేత్త

ఇన్‌బాక్స్

శోభాయాత్ర లక్ష్యం ఇదీ...

హిందూ ధర్మం భద్రత కోసం, సమస్త హిందూ యువకుల ఐక్యత కోసం భజరంగ్ దళ్ కృషి చేస్తోంది. అందులో భాగంగానే ‘శోభాయాత్ర’లు ప్రతి ఏటా నిర్వహిస్తోంది. కులాలకు అతీతంగా, రాజకీయాలకు సంబంధం లేకుండా ప్రాంతీయ భేదాలను దూరం పెట్టి ఈ యాత్రను నిర్వహిస్తోంది. శక్తికీ, భక్తికీ ప్రతిరూపం హనుమంతుడు. ఆరాధన, సేవా గుణానికి నిలువెత్తు సాక్ష్యం ఆంజనేయ స్వామి. రాములవారిని తన గుండెల్లో బంధించుకున్న అపర భక్తుడు. వానర సైన్యాన్ని కూడగట్టి వారధి నిర్మించిన ఆంజనేయ స్వామి సేవలు ఎంత చెప్పుకున్నా తక్కువే! ఆంజనేయ స్వామి సంకల్పశక్తినీ, భక్తినీ స్మరించుకునేందుకు ఆయన జయంతి రోజు వీర హనుమాన్ విజయయాత్ర పేరిట భజరంగ్ దళ్ శోభాయాత్ర నిర్వహిస్తోంది.

భాగ్యనగర్‌లో నిర్వహించే ఈ యాత్రకు దేశంలోనే కాక ప్రపంచ స్థాయిలో కూడా ప్రత్యేక గుర్తింపు ఉంది. ‘హిందూ జాగరణ – హిందూ సంఘటన’ కోసం ప్రతి సంవత్సరం హనుమాన్ జయంతి కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. గౌలిగూడ హనుమాన్ నుంచి కోఠి, నారాయణగూడ, చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్ రోడ్, ట్యాంక్ బండ్, సికింద్రాబాద్ మీదుగా తాడ్బండ్ హనుమాన్ దేవాలయం వరకు సాగే శోభాయాత్రలో మూడు లక్షల మంది కార్యకర్తలు బైక్‌లతో పాల్గొంటున్నారు. కోఠి ఆంధ్రా బ్యాంక్ చౌరస్తాలో లక్ష మందితో హనుమాన్ చాలీసా పారాయణం చేయడం ఈసారి శోభాయాత్ర ప్రత్యేకం.

తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 9,600 చోట్ల వీర హనుమాన్ విజయ యాత్రలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరిగాయి. ఈనెల 1వ తేదీనే యాత్రలు ప్రారంభమయ్యాయి. కొండగట్టు హనుమాన్ మందిర్ పరిధిలోని జిల్లాల ప్రాంతాల్లో ఏప్రిల్ 6 లోపే కార్యక్రమాలు పూర్తి చేసుకుని కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీ.

– పగుడాకుల బాలస్వామి,
ప్రచార ప్రముఖ్, విశ్వహిందూ పరిషత్, తెలంగాణ రాష్ట్రం

ఇప్పుడు ప్రపంచం చూపు భారత్ వైపే!

సందర్భం



పురిఘళ్ల రఘురామ్

ఒకప్పుడు భారతదేశం ప్రపంచానికే గురువు. మళ్లీ ఆ రోజులు వస్తాయనీ, తీసుకురాగలమనీ రాష్ట్రీయ సంఘ్ పరివార్ బలంగా విశ్వసిస్తోంది. ఇప్పుడు అగ్రరాజ్యంగా అందరూ అంగీకరించే అమెరికా కూడా భారతదేశం వైపు చూస్తున్న పరిస్థితి. ‘భారతదేశానికి ఆ సామర్థ్యం ఉంది. అద్భుతమైన నైతిక స్పష్టతతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతున్నారు. అది మేం చూస్తున్నాం’ అని అమెరికా ఈ మధ్యనే అంగీకరించింది. రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపే దమ్మున్న నాయకుడు ఈ ప్రపంచంలో నరేంద్ర మోదీయే అని అగ్రరాజ్యమే చెబుతోంది. స్వాతంత్ర్యం సాధించిన తర్వాత భారతదేశ విదేశాంగ విధానం ఇంత బలంగా ఇంతకు మునుపెన్నడూ లేదు.

భారతదేశం మళ్లీ విశ్వగురువు అవుతోంది. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు, మన విద్యా విధానం, కుటుంబ బంధాలు... ఇవే మన పెట్టుబడి. దీనిని బలంగా నమ్మి, ఆ దిశగా చర్యలు చేపట్టింది బీజేపీ. పాశ్చాత్య సంస్కృతి కానీ, పాశ్చాత్య విధానాలు కానీ మనకు సరిపడవని ముందునుంచీ చెబుతోంది కూడా బీజేపీయే. దేశంలో ప్రజలపై నమ్మకం ఉంచిన ఏకైక ప్రభుత్వం బీజేపీ ప్రభుత్వం. అందుకే ప్రధాని నరేంద్ర మోదీ అటెస్టేషన్ చేయడానికి గెజిటెడ్ ఆఫీసర్ అవసరం లేదనీ, ఎవరికివాళ్లు సంతకం పెడితే సరిపోతుందనీ ప్రకటించి, ఆ మేరకు చట్టాలను కూడా మార్చారు. గ్యాస్ సబ్సిడీని స్వచ్ఛందంగా వదులుకోండి అని ఆయన పిలుపునిస్తే ఎంతోమంది వదులుకోవడానికి ముందుకొచ్చారు. ఒకప్పుడు రెండు సీట్లకు పరిమితమైన పార్టీ తనంతట తానుగా పూర్తి మెజారిటీతో అధికారం సాధిస్తుందని ఎవరైనా కలలోనైనా ఊహించారా? ఇదంతా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సేవకులు దశాబ్దాలుగా క్షేత్ర స్థాయిలో చేసిన త్యాగాల ఫలితం. మోదీ లాంటి ఎంతో మంది నాయకులను దేశానికి అందించింది, అందిస్తోంది.

హిందూయిజం అంటే ఒక జీవన విధానం. దాన్ని త్రికరణశుద్ధిగా నమ్మి, ఆచరించి, ఆ స్ఫూర్తితోనే భవిష్యత్ తరాలను తయారు చేస్తూ... ఆ క్రమంలోనే ఎంతో మంది నాయకులను బీజేపీకి అందించింది ఆర్‌ఎస్‌ఎస్.



అమెరికా ఇప్పుడు చూస్తున్న నరేంద్ర మోదీలోని ఆ నైతిక స్పష్టతకు మూలం ఆర్‌ఎస్‌ఎస్ క్రమశిక్షణ, కట్టుబాట్లు. చాలా సంవత్సరాల పాటు దేశాన్ని అధోగతి పాలు చేసిన కాంగ్రెస్ పార్టీ పనిలో పనిగా ఆర్‌ఎస్‌ఎస్ మీద కూడా దుష్ప్రచారం చేసింది. చాలామంది హిందువులు కూడా ఈ దుష్ప్రచారాన్నే నమ్మారు. ఇక ముస్లింల సంగతి అయితే సరేసరి. ముస్లింలపై తమదే గుత్తాధిపత్యం అన్న రీతిలో కాంగ్రెస్ పార్టీ పరిపాలన ఉండేది.

కానీ, ఆ పార్టీ చెబుతున్నది వాస్తవం కాదు అని నరేంద్ర మోదీ 9 ఏళ్ల పాలనలో ముస్లింలు అర్థం చేసుకున్నారు. కాబట్టే, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో ముస్లింలు పెద్ద ఎత్తున బీజేపీని ఆదరించారు. ఇక్కడ ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ చొరవను కూడా ప్రశంసించాలి. ఎందుకంటే ఆర్‌ఎస్‌ఎస్ ఐడియాలజీని తీవ్రంగా వ్యతిరేకించే కాంగ్రెస్ నుంచి ప్రణబ్ ముఖర్జీని నాగ్‌పూర్ ఆహ్వానించి, ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించేలా చేశారు. అలాగే, ముస్లింలలో ఉన్న భయాందోళనల్ని దూరం చేసేందుకు ఆయన స్వయంగా ముస్లింల ప్రార్థనా ప్రాంగణానికే వెళ్లారు. మసీదునూ, మదర్సానూ సందర్శించారు.

ఇన్నాళ్లూ సరైన నాయకత్వం లేకపోవడం వల్లనే భారత్ వెనుకబాటుకు గురైందని నరేంద్ర మోదీ పాలన స్పష్టం చేసింది. సరైన దిశానిర్దేశం లేకపోవడం వల్లనే భారతదేశం ప్రపంచంలో ముందుకు వెళ్లలేకపోతోందని బీజేపీ పాలన రుజువు చేసింది. భారతదేశం ఇంకా ఎన్నాళ్లు అభివృద్ధి చెందుతోన్న దేశంగానే ఉంటుందన్న ప్రశ్న ఇక వినిపించదు. ఎందుకంటే ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక శక్తి భారతదేశం. త్వరలోనే చైనాను కూడా దాటుకుని ముందుకు వెళ్లేలా ప్రభుత్వం అభివృద్ధి చేసి చర్యలు చేపడుతోంది. ప్రజాస్వామ్య దేశంలో 10 కోట్ల మంది కార్యకర్తలు ఉన్న ఏకైక పార్టీ బీజేపీ. ప్రపంచంలో భారత్‌ను విశ్వగురువుగా నిలిపే దిశలో బీజేపీ చేస్తున్న కృషి కూడా సత్ఫలితాలను ఇస్తోంది.

వ్యాసకర్త బీజేపీ సీనియర్ నాయకులు
(నేడు బీజేపీ ఆవిర్భావ దినోత్సవం)

‘నేను’ అనే మిథ్య

‘నేను’ అంటే ఏమిటి? అది ఒక వ్యక్తి శరీరమా లేక ఆత్మా? కంటికి కనిపించే శరీరం ఎప్పటికైనా మాయమయ్యేదే కాబట్టి, అలా అంతం కానటువంటి ‘ఆత్మ’ మాత్రమే ‘నేను’ అన్నది భారతీయ చింతనలోని ప్రధానమైన విషయం. ఈ ఆలోచనను మరికొంచెం ముందుకు తీసుకువెళ్ళి, ఒక చిత్రమైన సత్యాన్ని కనులముందు పరిచాడు కనుపర్తి అబ్బయామాత్యుడు, తన రచన ‘కవిరాజ మనోరంజనము’లో (ప్రథమాశ్వాసము, 152వ పద్యం). ఊర్వశి, పురూరవులకు సంబంధించిన కథ ఇతివృత్తంగా కలిగినది కావడం వలన ఈ కావ్యానికే ‘పురూరవశ్చరిత్రము’ అని మరొక పేరు కూడా ఉంది.



జ్యోతిర్మయం

కథ ప్రారంభంలోనే ఒక సందర్భంలో పురూరవునికి, నారద మహామునికి మధ్య వేదాంత పరమైన సంభాషణ జరుగుతుంది. ‘దేహము తా గానని నిజ మూహింపగ నేర్చినట్టి యుత్తమునకు, దద్దేహునకైన బాంధవ దేహంబులు మిథ్యలనుచు దెలియంబడవే?’ అంటాడు నారదుడు. ‘తన దేహమే తాను కాదు, మిథ్య అన్న నిజాన్ని అర్థం చేసుకున్న ఉత్తమునికి, తనకు రోజువారీ జీవనంలో మానవ సంబంధాల కారణంగా దగ్గరవాళ్లైన బంధువుల దేహాలు మాత్రం వాళ్ళు కాదు, అవి కూడా మిథ్యలే అన్న నిజం అర్థం కాదా?’ అన్నది అబ్బయామాత్యుడు ఉపయోగించిన తర్కం.

తాను మిథ్య అని గుర్తించిన వానికి, లోకమంతా మిథ్య అని తెలుసుకోవడానికి ఎక్కువ సమయం పట్టదు. ఆ కారణం చేత, ఒక వ్యక్తి తాను మిథ్య అని నిర్ధారణకు రావడమే ముఖ్యం; అదే అత్యంత కష్టమైనది. ఆ స్థితిని దాటినవాడికి అంతా తన ప్రతిబింబాలే అని తెలుసుకోవడానికి, నిర్ణయించుకోవడానికి ఏమి అడ్డంకి వస్తుంది? ఏమీ రాదు. కనుక మనిషి ముందు దాట వలసింది ‘నేను’ అనే మిథ్యను. ఆధ్యాత్మిక వర్తనాలలో అందరూ గుర్తించి మననం చేసుకోవలసిన మొదటి మాట ఇది.

– వెంకట్ భట్టు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

బీఆర్‌ఎస్‌లో ఇంటి దొంగలు



రెడ్యానాయక్

కురవి: 'బీఆర్‌ఎస్‌లో ఇంటి దొంగలున్నారు.. బీఆర్‌ఎస్‌ పేరు చెప్పి లక్షలు లక్షలు సంపాదించుకుంటూ నాయకులనిపించుకుంటున్నారు.. రేపు ఎట్లయినా రెడ్యానాయక్‌ను ఓడించాలని ప్రయత్నం చేస్తరు..' అంటూ డోర్నకల్‌ ఎమ్మెల్యే డీఎస్‌ రెడ్యానాయక్‌ ఘాటుగా విమర్శించారు. మహబూబాబాద్‌ జిల్లా కురవి మండలం అయ్యగారిపల్లి గ్రామంలో బుధవారం మండల బీఆర్‌ఎస్‌ ఆత్మీయ సమ్మేళనం జిల్లా అధ్యక్షురాలు, ఎంపీ మాలోత్‌ కవిత అధ్యక్షతన జరిగింది. సమ్మేళనానికి మంత్రి సత్యవతి రాథోడ్‌ వర్గీయులు ఎవరూ హాజరు కాలేదు. ఈ సందర్భంగా రెడ్యానాయక్‌ మాట్లాడుతూ తనను ఓడించాలని ఎంతోమంది మహామహులు తిరిగి ప్రచారం చేశారని చెప్పారు. మరి కొందరైతే ఆ గర్భశత్రువులేనని.. తనను చూస్తే వాళ్లకు నిద్రపట్టదని.. ఎప్పుడు చస్తాడా? పోతాడా.. అనుకుంటున్నారని పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రాములు కన్నుమూత



మెట్‌పల్లి (కోరుట్ల)/సాక్షి, హైదరాబాద్‌: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రాములు (82) కన్నుమూశారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో హైదరాబాద్‌ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం ఉదయం గుండెపోటుకు గురై తుదిశ్వాస విడిచారు. మెట్‌పల్లి మున్సిపాలిటీలో విలీనమైన వెంకట్రావ్‌పేట గ్రామ సర్పంచ్‌గా రాములు రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. ఆ తర్వాత పలుమార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. అయితే.. ఆయన తొలిసారి 2004లో జనతా పార్టీ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తర్వాత 2009లో జరిగిన ఎన్నికలకు దూరంగా ఉన్న రాములు 2014లో కాంగ్రెస్‌ నుంచి పోటీచేసి ఓడిపోయారు. రాములు, జ్యోతక్క దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు.

సీఎం కేసీఆర్‌ సంతాపం: మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రాములు మృతి పట్ల సీఎం కేసీఆర్‌ సంతాపం వ్యక్తం చేశారు. విద్యార్థి నాయకుడిగా, తదనంతరం ఉమ్మడి రాష్ట్రంలో ఎమ్మెల్యేగా పనిచేసిన రాములు రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారని స్మరించుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రాములు మృతిపట్ల టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, పలువురు కాంగ్రెస్‌ నేతలు, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సంతాపం వ్యక్తం చేశారు.

14 నుంచి 'మోదీ హఠావో.. దేశ్‌ బచావో'



బినోయ్‌ విశ్వం

సాక్షి, హైదరాబాద్‌/హనుమకొండ: దేశంలో ప్రజాస్వామ్య, లౌకిక పునాదులను ధ్వంసం చేస్తున్న మోదీ ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే హక్కే లేదని సీపీఐ పార్లమెంటరీ పార్టీ నాయకులు బినోయ్‌ విశ్వం చెప్పారు. దేశంలోని ప్రజాస్వామ్య, వామపక్ష పార్టీలన్నీ ఒకే వేదికపైకి వస్తేనే 2024 పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించవచ్చన్నారు. ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారిన బీజేపీ గురించి ప్రజలకు తెలిపేందుకు ఈ నెల 14 నుంచి మే 15 వరకు 'మోదీ హఠావో.. దేశ్‌ బచావో..' నినాదంతో దేశవ్యాప్త ఉద్యమానికి సీపీఐ జాతీయ సమితి పిలుపునిచ్చిందన్నారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. అదానీ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోకుండా అవినీతిపై ప్రధాని ఎన్ని మాటలు మాట్లాడినా వృథాయేనని విమర్శించారు.

కార్పొరేట్‌ శక్తులకు ప్రధాని అండ..

ఉమ్మడి వరంగల్‌ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సీపీఐ చేపట్టిన ప్రజాపోరు యాత్ర ముగింపు బహిరంగ సభలో బినోయ్‌ మాట్లాడుతూ దేశంలో ఆర్థిక అవకతవకలకు పాల్పడిన అదానీ సహా కార్పొరేట్‌ శక్తులందరికీ ప్రధాని మోదీ అండ ఉందన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి శివసేన నేత



దిలీప్‌ గోరెకు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం కేసీఆర్‌

సాక్షి, హైదరాబాద్‌: మహారాష్ట్ర నుంచి బీఆర్‌ఎస్‌లోకి చేరికలు కొనసాగుతున్నాయి. శివసేన పార్టీ బీడ్‌ జిల్లా అధ్యక్షుడు దిలీప్‌ గోరె బుధవారం హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్‌ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌ రావు సమక్షంలో పార్టీలో చేరారు. దిలీప్‌ గోరె గతంలో బీడ్‌ మున్సిపల్‌ మేయర్‌గా పనిచేయగా.. ప్రస్తుతం శివసేన పార్టీ బీడ్‌ జిల్లా అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. దిలీప్‌ గోరెతో పాటు మహారాష్ట్ర చెరకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాజ్‌ జనార్దన్‌రావు భంగర్‌తో పాటు పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఆర్మూరు ఎమ్మెల్యే జీవన్‌ రెడ్డి, మహారాష్ట్ర బీఆర్‌ఎస్‌ నేత, మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌ జాదవ్‌ పాల్గొన్నారు.

మోదీ పర్యటన ఖరారు

- 8వ తేదీనాటి షెడ్యూల్‌ వెల్లడించిన పీఎంఓ
- సికింద్రాబాద్‌–తిరుపతి వందేభారత్‌ ఎక్స్‌ప్రెస్‌ ప్రారంభం
- బీబీనగర్‌ ఎయిమ్స్‌ అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, యాదాద్రి: ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన ఖరారైంది. ఈ నెల 8న రాష్ట్రంలో ప్రధాని పాల్గొనే కార్యక్రమాల వివరాలను పీఎంవో బుధవారం వెల్లడించింది. శుక్రవారం ఉదయం 11.45 గంటలకు సికింద్రాబాద్‌ రైల్వే స్టేషన్‌ చేరుకోనున్న మోదీ.. సికింద్రాబాద్‌–తిరుపతి వందేభారత్‌ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభిస్తారు. సికింద్రాబాద్‌ రైల్వే స్టేషన్‌ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం 12.15 గంటలకు పరేడ్‌ గ్రౌండ్స్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. బీబీ నగర్‌ ఎయిమ్స్‌లో పలు అభివృద్ధి పనులను ఇక్కడి నుంచే వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో ఐదు జాతీయ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడంతో పాటు రైల్వేకు సంబంధించిన ఇతర అభివృద్ధి ప్రాజెక్టులను జాతికి అంకితం చేయనున్నట్లు పీఎంవో పేర్కొంది. మొత్తం రూ.11,300 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నట్లు వివరించింది.

ఐటీ సిటీ టూ టెంపుల్‌ సిటీ

సికింద్రాబాద్‌–తిరుపతి వందే భారత్‌ ఎక్స్‌ప్రెస్‌.. ఐటి సిటీ హైదరాబాద్‌ను, శ్రీ వేంకటేశ్వర స్వామి నివాసమైన తిరుపతిని కలుపుతుందని పీఎంవో తెలిపింది. ఇది మూడు నెలల స్వల్ప వ్యవధిలో తెలంగాణ నుంచి ప్రారంభం అవుతున్న రెండో వందే భారత్‌ రైలు అని తెలిపింది. ఇలావుండగా రూ.720 కోట్లతో ప్రపంచ స్థాయి సౌకర్యాలు, సుందరీకరణతో రూపొందించనున్న సికింద్రాబాద్‌ ఐకానిక్‌ రైల్వేస్టేషన్‌ భవనానికి ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు.

కొత్తగా 13 ఎంఎంటీఎస్‌ సేవలు!

హైదరాబాద్‌ – సికింద్రాబాద్‌ సబర్బన్‌ విభాగంలో 13 కొత్త మల్టీ మోడల్‌ ట్రాన్స్‌పోర్ట్‌ సర్వీస్‌ సేవలకు ప్రధాన మంత్రి ఫ్లాగ్‌–ఆఫ్‌ చేస్తారు. సికింద్రాబాద్‌–మహబూబ్‌నగర్‌ ప్రాజెక్టు డబ్లింగ్‌, విద్యుదీకరణ పనులను కూడా ప్రధాని జాతికి అంకితం చేయనున్నారు. బీబీనగర్‌ ఎయిమ్స్‌ దేశవ్యాప్తంగా ఆరోగ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలనే ప్రధానమంత్రి దృష్టికి నిదర్శనమని పీఎంఓ తెలిపింది.

రూ.1,365.95 కోట్ల వ్యయంతో పనులు

బీబీనగర్‌ ఎయిమ్స్‌కు ఉన్న 201.65 ఎకరాల స్థలంలో రూ.1,365.95 కోట్ల వ్యయంతో 750 పడకల ఆస్పత్రి, 20 భవన సముదాయాలు నిర్మించడంతో పాటు ఇతర వసతులు కల్పించనున్నట్లు ఎయిమ్స్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ వికాస్‌ భాటియా విలేకరులకు తెలిపారు. 4 కోట్ల తెలంగాణ ప్రజలతో పాటు ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌, ఒడిశా ప్రజలకు సైతం వైద్య సేవలు అందించనున్నట్లు చెప్పారు. ఎయిమ్స్‌లో 15 రకాల వ్యాధులకు సూపర్‌ స్పెషాలిటీ వైద్యం అందజేస్తామన్నారు. ప్రస్తుతం ప్రతి రోజూ వెయ్యి మంది వరకు ఓపీడీ సేవలు అందజేస్తున్నామని, 13 సాధారణ బెడ్‌లు, 20 ఐసీయూ బెడ్‌లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇప్పటి వరకు 1,200 శస్త్రచికిత్సలు చేశామని వెల్లడించారు. అత్యాధునిక వైద్యంతో పాటు డయాలసిస్‌, రేడియోథెరపీ సేవలు అందిస్తామన్నారు.

అణగారిన వర్గాల గొంతుక బాబు జగ్జీవన్‌రామ్‌

- ఘనంగా 116వ జయంతి వేడుకలు
- హాజరైన పలువురు ప్రముఖులు



జగ్జీవన్‌రామ్‌ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌

గన్‌ఫౌండ్రీ: డాక్టర్‌ బాబు జగ్జీవన్‌రామ్‌ అణగారిన వర్గాల గొంతుకగా నిలిచారని పలువురు ప్రముఖులు కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, బీజేఆర్‌ జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్‌ బాబు జగ్జీవన్‌రామ్‌ 116వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బషీర్‌బాగ్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కొప్పుల ఈశ్వర్‌ మాట్లాడుతూ.. బాబు జగ్జీవన్‌రామ్‌ పోరాటాలు నేటికీ ఆదర్శమన్నారు. ఆయన చూపిన మార్గాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌ మాట్లాడుతూ.... జగ్జీవన్‌రామ్‌ మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో హోంమంత్రి మహమూద్‌ అలీ, శాసన సభ్యులు రసమయి బాలకిషన్‌, సండ్ర వెంకట వీరయ్య, ముఠా గోపాల్‌, బీసీ కమిషన్‌ చైర్మన్‌ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఎమ్మెల్సీ ఎంఎస్‌ ప్రభాకర్‌, డిప్యూటీ మేయర్‌ మోతె శ్రీలతా రెడ్డి, ప్రజా యుద్ధనౌక గద్దర్‌, ఎస్సీ సంక్షేమశాఖ కార్యదర్శి యోగితా రాణా, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింములు, మాజీ ఎంపీ వి.హన్మంతరావుతో పాటు పలు సంఘాల నాయకులు, వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మరో 800 మెగావాట్ల థర్మల్‌ విద్యుత్‌ కేంద్రం

- ఇంకో 250 మెగావాట్ల సౌర విద్యుత్‌ ప్లాంటు
- కొత్తగా నిర్మించాలని సింగరేణి సంస్థ నిర్ణయం
- నిర్మాణ ప్రణాళికలు రూపొందించాలని సీఎండీ శ్రీధర్‌ ఆదేశం



సాక్షి, హైదరాబాద్‌: వ్యాపార విస్తరణలో భాగంగా మరో 800 మెగావాట్ల సూపర్‌ క్రిటికల్‌ థర్మల్‌ విద్యుత్‌ కేంద్రం, మరో 250 మెగావాట్ల సౌర విద్యుత్‌ కేంద్రాలను కలిపి మొత్తం 1,050 మెగావాట్ల సామర్థ్యంతో కొత్త విద్యుత్‌ కేంద్రాలను నిర్మించాలని సింగరేణి బొగ్గు గనుల సంస్థ నిర్ణయం తీసుకుంది. థర్మల్‌, సౌర్‌ విద్యుత్‌ కేంద్రాల సామర్థ్యాన్ని 3,350 మెగావాట్లకు పెంచుకోవాలని నిర్ణయించింది. హైదరాబాద్‌ సింగరేణి భవన్‌లో బుధవారం సంస్థ సీఎండీ ఎన్‌. శ్రీధర్‌ కొత్త విద్యుత్‌ కేంద్రాల నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. నెలరోజుల్లోగా కొత్త ప్లాంట్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.

2800 మెగావాట్లకు థర్మల్‌ విద్యుత్‌ సామర్థ్యం

సింగరేణి సంస్థ ఇప్పటికే మంచిర్యాల జిల్లా జైపూర్‌ వద్ద సుమారు 2 వేల ఎకరాల్లో 1,200 మెగావాట్ల థర్మల్‌ విద్యుత్‌ కేంద్రాన్ని నిర్వహిస్తుండగా, ఏటా రూ.500 కోట్ల ఆదాయాన్ని ఆర్జిస్తోంది. అదే ప్రాంగణంలో మరో 800 మెగావాట్ల సూపర్‌ క్రిటికల్‌ థర్మల్‌ విద్యుత్‌ కేంద్రం నిర్మాణ పనులను వచ్చే నెలలో ప్రారంభించనుంది. ఇంకో 800 మెగావాట్ల మరో థర్మల్‌ విద్యుత్‌ కేంద్రాన్ని నిర్మించాలని తాజాగా నిర్ణయించడంతో ..సింగరేణి థర్మల్‌ విద్యుత్‌ కేంద్రాల మొత్తం సామర్థ్యం 2800 మెగావాట్లకు పెరగనుంది. కొత్తగా ప్రతిపాదిత ప్లాంటుకు కావలసిన 120 ఎకరాల స్థలంతో పాటు నీరు, రైలు మార్గం వంటి అన్ని వసతులు ప్రస్తుత ప్రాంగణంలో అందుబాటులో ఉన్నాయని ఎన్‌.శ్రీధర్‌ వెల్లడించారు. దీనికి సంబంధించిన డీపీఆర్‌ ప్రతిపాదనలను సమర్పించాలని ఆదేశించారు.

550 మెగావాట్లకు చేరనున్న సౌర విద్యుత్‌ ప్లాంట్ల సామర్థ్యం: సింగరేణి సంస్థ ప్రస్తుతం 300 మెగావాట్ల సోలార్‌ విద్యుత్‌ ప్లాంట్ల నిర్మాణాన్ని చేపట్టగా, అందులో 224 మెగావాట్ల ప్లాంట్ల పనులు పూర్తయి విద్యుత్‌ ఉత్పత్తి జరుగుతోంది. మరో రెండు నెలల్లో మిగిలిన 76 మెగావాట్ల ప్లాంట్ల పనులు పూర్తి చేయనుంది. భూపాలపల్లి, మందమర్రి, మణుగూరు లోని ఖాళీ ప్రదేశాల్లో కొత్తగా మరో 250 మెగావాట్ల సౌర విద్యుత్‌ ప్లాంట్ల ఏర్పాటుపై నెలరోజుల్లోగా నివేదిక సమర్పించాలని ఎన్‌.శ్రీధర్‌ ఆదేశించారు. వీటి నిర్మాణంతో సింగరేణి సోలార్‌ విద్యుత్‌ సామర్థ్యం 550 మెగావాట్లకు చేరుకోనుంది.

సింగరేణిని బతికించండి..

- సీఎం కేసీఆర్‌కు సీఎల్పీ నేత భట్టి లేఖ
- బండి సంజయ్‌ అరెస్టు ఓ నాటకం
- బీజేపీ, బీఆర్‌ఎస్‌ డైవర్షన్‌ పాలిటిక్స్‌ చేస్తున్నాయని ధ్వజం



బహిరంగ లేఖను చూపిస్తున్న భట్టి

జైపూర్‌: 'తెలంగాణకు సింగరేణి ఓ గ్రోత్‌ఇంజన్‌, కానీ నేడు సింగరేణి మనుగడపై మన్ను పోసిందెవరు? వేలాది మందికి ప్రత్యక్షంగా, లక్షలాది మందికి పరోక్షంగా ఉపాధినిచ్చే సింగరేణి సంస్థలో ఇప్పుడు ఉద్యోగులు ఎందుకు పెరగడం లేదు' అని సీఎల్పీ నాయకుడు మల్లు భట్టి విక్రమార్క ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు సింగరేణిని బతికించండి అంటూ ఆయన ఇందారం నుంచి సీఎం కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాశారు. భట్టి చేపట్టిన పీపుల్స్‌మార్చ్‌ పాదయాత్ర బుధవారం మంచిర్యాల జిల్లా జైపూర్‌ మండలం ఇందారంలో కొనసాగింది. ఇందారం ఓపెన్‌కాస్టు గనులను పరిశీలించిన ఆయన, కేసీఆర్‌కు మూడు పేజీలతో బహిరంగ లేఖ రాశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఉద్యమ నాయకుడిగా ఉన్న సమయంలో తెలంగాణలో ఓపెన్‌కాస్టు గనులే ఉండవని కేసీఆర్‌ అన్నారని, కానీ నేడు సీఎంగా ఉన్న కేసీఆర్‌ అదే ఓపెన్‌కాస్టు గనులను విస్తరిస్తూ సింగరేణి సంస్థను ప్రైవేటుపరం చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గనులను అమ్ముకుంటున్నాయని, కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన గనుల బిల్లుకు నాడు టీఆర్‌ఎస్‌ ఎంపీలు మద్దతు ఇవ్వడం వల్ల నేడు వాటిని వేలం వేస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌ డైవర్షన్‌ పాలిటిక్స్‌ చేస్తూ ప్రజల దృష్టి మళ్లిస్తున్నారని, రాత్రికి రాత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను అరెస్టు చేయాల్సిన అవసరం ఏముందని, అదంతా ఒక నాటకమని అన్నారు. టీఎస్‌పీఎస్సీ, పదో తరగతి పేపర్ల లీక్‌, నదీ జలాల పంపకాలు, పోడు భూముల సమస్యలు, నిరుద్యోగ సమస్యలను గాలికొదిలేసిన ప్రభుత్వాలు అంతిమంగా ప్రజలను మోసం చేస్తున్నాయని ధ్వజమెత్తారు.

పార్టీలు కలసి రాకున్నా పోరాటం ఆగదు

- నిరుద్యోగులతో ముఖాముఖిలో షర్మిల



సాక్షి, హైదరాబాద్‌: ఇతర పార్టీలు కలసి రాకున్నా నిరుద్యోగుల కోసం తన పోరాటం మాత్రం ఆగదని వైఎస్సార్‌ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్‌ షర్మిల స్పష్టం చేశారు. బుధవారం లోటస్‌పాండ్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన నిరుద్యోగులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ, తనపై అధికార పార్టీ నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడినా భరించానని పేర్కొన్నారు. కేసీఆర్‌ నిరుద్యోగుల జీవితాలతో ఆటలు ఆడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో 1.91 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని పేర్కొంటూ.. దేశంలో కంటే తెలంగాణలో నిరుద్యోగం 2 శాతం అధికంగా ఉందన్నారు. అందుకే టీ–సేవ్‌ ఫోరం ఏర్పాటు చేసి ఉద్యమాన్ని ఉధృతం చేయాలని భావిస్తున్నామని తెలిపారు. ఈ విషయంలో కలసి వచ్చే పార్టీలతో లక్ష్యసాధనకు ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈనెల 7న రాష్ట్రవ్యాప్తంగా డిప్యూటీ కలెక్టర్లకు వినతి పత్రాలందించాలని ఆమె నిరుద్యోగులకు పిలుపునిచ్చారు. 8న రిలే దీక్షలు, 9న దిష్టి బొమ్మలు దగ్ధం చేయాలన్నారు.

షర్మిల పాలేరులో పోటీ చేస్తోందనే తమ్మినేనికి భయం: గట్టు

వైఎస్సార్‌ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు షర్మిల పాలేరులో పోటీ చేస్తోందనే భయంతోనే సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అవమానించేలా వ్యవహరించారని వైఎస్సార్‌టీపీ అధికార ప్రతినిధి గట్టు రామచంద్రరావు ఆరోపించారు. తమ్మినేని బీఆర్‌ఎస్‌తో ఒప్పందం చేసుకొని పాలేరులో పోటీ చేస్తున్నారని, అక్కడ ప్రత్యర్థి షర్మిల కాబట్టే ఇష్టానుసారం మాట్లాడారని విమర్శించారు.

'నా హక్కులకు భంగం కలిగించారు'

హనుమకొండ: రాత్రిపూట, అసౌకర్యాల మధ్య తనను పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించి, తన హక్కులకు భంగం కలిగించారని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ జాతీయ మహిళా కమిషన్‌ (ఎన్‌డబ్ల్యూసీ)కు బుధవారం ఫిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి హనుమకొండలోని పోలీస్‌ హెడ్‌క్వార్టర్‌ ఎదుట నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి, స్టేషన్‌కు తరలించిన విషయం తెలిసిందే. అయితే తనను మంగళవారం రాత్రి 10.30 నుంచి బుధవారం వేకువజామున 3.15గంటల వరకు పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచారని, అలాగే బుధవారం అకారణంగా గృహనిర్బంధం చేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

నిర్లక్ష్యం ఫలితమేనా?

టెన్త్‌ పేపర్ల అవుట్‌పై విద్యాశాఖపై విమర్శలు

- ఇంటెలిజెన్స్‌ నివేదికలోనూ పలు అంశాల ప్రస్తావన
- ప్రత్యేకంగా ఎలాంటి జాగ్రత్తలూ తీసుకోలేదని వెల్లడి
- ఇన్విజిలేటర్‌ వద్ద సెల్‌ఫోన్‌ ఉండటం, జిరాక్స్‌ సెంటర్లు తెరిచే ఉండటం నిర్లక్ష్యానికి నిదర్శనాలనే అభిప్రాయం



సాక్షి, హైదరాబాద్‌: పదవ తరగతి పరీక్షల విషయంలో పాఠశాల విద్యాశాఖ డొల్లతనం అడుగడుగున బయటపడుతోంది. ఈ శాఖ నిర్లక్ష్య వైఖరే సమస్యకు కారణమనే వాదన బలపడుతోంది. తెలుగు, హిందీ పేపర్‌ లీక్‌ వ్యవహారంపై ఇంటెలిజెన్స్‌ విభాగం ప్రభుత్వానికి ఓ నివేదిక అందజేసింది. పరీక్షల నిబంధనలు, విద్యాశాఖ తీసుకున్న జాగ్రత్తలు, క్షేత్రస్థాయిలో వాటి అమలు తీరును ఇంటెలిజెన్స్‌ ఆ నివేదికలో పొందుపరిచినట్టు తెలిసింది. పరీక్షల సందర్భంగా ఉండే సాధారణ నిబంధనలను క్షేత్రస్థాయికి పంపడం మినహా, ఎక్కడ, ఎలాంటి లోపాలున్నాయో వాకబు చేయడం, దానికి అనుగుణంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయడం లాంటివేమీ చేపట్టలేని నిఘా వర్గాల పరిశీలనలో తేలినట్లు తెలుస్తోంది. ఈ నివేదికపై సీఎస్‌ తాజాగా విద్యాశాఖ ఉన్నతాధికారుల వివరణ కోరినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

అంతటా వైఫల్యమే..

హనుమకొండ జిల్లాలో స్కూల్‌ ఆవరణలోకి వేరే వ్యక్తి వచ్చి ఫోటోలు తీసే అవకాశం ఉన్న పరిస్థితిని గుర్తించకపోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తోందని అంటున్నారు. ప్రతి పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతాల్లో 144వ సెక్షన్‌ అమలులో ఉంటుంది. పోలీసు పహారా కూడా ఉంటుంది. అయినప్పటికీ పరీక్ష కేంద్రం సమీపంలోకి ఇతరులు రావడం భద్రత వైఫల్యానికి అద్దంపడుతోంది. పరీక్షా కేంద్రానికి సమీపంలో జిరాక్స్‌ సెంటర్లు మూసివేయాలనే ఆదేశాలున్నాయి. కానీ వరంగల్‌ ఘటనలో ప్రశ్నపత్రాన్ని జిరాక్స్‌ తీసినట్టు పోలీసు వర్గాల విచారణలో తేలింది. మరోవైపు వికారాబాద్‌ జిల్లాలో ఇన్విజిలేటర్‌ సెల్‌ఫోన్‌ తీసుకుని వెళ్ళినా, పై అధికారులు గుర్తించకపోవడం, సీసీ కెమెరాలున్నా నిష్ప్రయోజనంగా మారడం వైఫల్యాలకు అద్దం పడుతోంది.

కొన్నేళ్ళుగా నడుస్తోందా?

టెన్త్‌ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో అనేక కొత్త అంశాలను ఇంటెలిజెన్స్‌ నివేదిక ప్రస్తావించినట్టు తెలిసింది. లీకేజీకి పాల్పడిన టీచర్లకు గతంలో నేర చరిత్ర ఉండటాన్ని ఎత్తి చూపినట్టు చెబుతున్నారు. తాండూరులో ప్రశ్నపత్రాన్ని వాట్సాప్‌ ద్వారా పంపిన బందెప్పపై గతంలోనే పోక్సో కేసు నమోదయ్యింది. ఇలాంటి టీచర్ల ప్రతి రిమార్క్‌ కంప్యూటర్‌లో నిక్షిప్తమవుతుంది. టీచర్ల సర్వీస్‌ రికార్డును పరిశీలించిన తర్వాతే విద్యాశాఖ కీలకమైన బాధ్యతల్లోకి తీసుకుంటుంది. పరీక్షల విషయంలో మరిన్ని జాగ్రత్తలు తప్పనిసరి. కానీ బందెప్ప విషయంలో దీన్ని విస్మరించడం విద్యాశాఖ నిర్లక్ష్యానికి నిదర్శనం. కాగా లీకేజీల వ్యవహారం కొన్నేళ్ళుగా నడుస్తోందా? అనే అనుమానాలకు కూడా ఇది తావిస్తోందని అంటున్నారు. కాగా ఇంటెలిజెన్స్‌ నివేదికల నేపథ్యంలో ప్రభుత్వానికి ఏం సమాధానం చెప్పాలనే దానిపై పాఠశాల విద్య వర్గాలు తర్జన భర్జన పడుతున్నాయి.

పోలీసుల అదుపులో ఆర్జిన్‌ డెయిరీ ఎండీ?

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే చిన్నయ్యపై ఆరోపణలు చేసిన ఆర్జిన్‌ డెయిరీ ఎండీ ఆదినారాయణ, డైరెక్టర్‌ షేజల్‌ పోలీసుల అదుపులో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వీరిరువురు కొంతకాలంగా ఎమ్మెల్యేపై తీవ్రమైన ఆరోపణలు చేస్తూ మంత్రి కేటీఆర్‌కు వీడియోలు సైతం విడుదల చేయడం తెలిసిందే. ఇటీవల గవర్నర్‌కూ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ల్యాంకో హిల్స్‌ అపార్టుమెంటులో ఉన్న తమ ఫ్లాట్‌కు బుధవారం పోలీసులు వచ్చినట్లు ఆదినారాయణ పలువురికి వాట్సాప్‌లో మెసేజ్‌ చేశారు. కాగా, మంచిర్యాల జిల్లాలో రైతులను మోసం చేశారంటూ పలు స్టేషన్లలో ఆయనపై 14 కేసులు నమోదయ్యాయి. అయితే ఏదైనా కేసు విషయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారా? అనేది తెలియాల్సి ఉంది. దీనిపై పోలీసులు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఈ ఘటనపై బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది ఎమ్వీ గుణ స్పందిస్తూ.. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుంటే అరెస్టు చూపాలని, రాజకీయ ఒత్తిళ్లతోనే ఇదంతా జరుగుతున్నట్లు అనిపిస్తోందని వ్యాఖ్యానించారు.

నకిలీ కాల్‌ సెంటర్‌తో ఖాతాలు ఖాళీ

▶ మొదటి పేజీ తరువాయి

అక్రమ మార్గంలో సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. లండన్‌లో ఉంటున్న స్నేహితులు వరంగల్‌కు చెందిన కుంచాల అజయ్‌ కుమార్‌, రామకృష్ణా రెడ్డి, పశ్చిమ బెంగాల్‌కు చెందిన రబీష్‌ కుమార్‌ ప్రసాద్‌ అలియాస్‌ రాహుల్‌, సర్వేష్‌ కుమార్‌ గుప్తా అలియాస్‌ ఆమెస్‌లకు విదేశీయులను మోసం చేసే పథకం గురించి చెప్పాడు. అయితే లండన్‌లో నకిలీ కాల్‌ సెంటర్‌ పెట్టి మోసాలు చేస్తే సులువుగా పట్టుబడతామని గ్రహించిన ముఠా.. హైదరాబాద్‌ కేంద్రంగా నకిలీ కాల్‌ సెంటర్‌ ఏర్పాటు చేయాలని భావించింది.

'ఎనీ డెస్క్‌'ద్వారా కూడా..

నెల రోజుల క్రితం పేట్‌ బషీరాబాద్‌ పోలీసు స్టేషన్‌ పరిధిలోని వీఎస్‌ఎస్‌ అపార్ట్‌మెంట్‌లో ఈ ముఠా సభ్యులు కాల్‌ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అమెజాన్‌ ప్రైమ్‌ ఓటీటీ సాంకేతిక సేవలు అందిస్తామనే నెపంతో ఆస్ట్రేలియా, కెనడా దేశస్తులను టార్గెట్‌ చేసుకున్నారు. ఆయా దేశాలకు చెందిన పౌరుల పేర్లు, ఫోన్‌ నంబర్లు, ఇతరత్రా వ్యక్తిగత వివరాలను పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఆకాశ్‌, వెస్లీల నుంచి కొనుగోలు చేశారు. టెలికాలర్లుగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన ముకేష్‌ రజాక్‌ అలియాస్‌ మార్క్‌, కర్మా షీపాల్‌ అలియాస్‌ జాక్‌, ఎండీ ముస్తఫా అలియాస్‌ డానియల్‌, అన్మోల్‌ ప్రదాన్‌ అలియాస్‌ స్టీఫెన్‌, రాయ్‌ రిష్కాంత్‌ అలియాస్‌ ర్యాన్‌, ఐడీపీఎల్‌ బాలానగర్‌కు చెందిన మహ్మద్‌ సమీర్‌ అలియాస్‌ సామ్‌ మహ్మద్‌ హాజీ, బొల్లారంకు చెందిన గుంజి పవన్‌ కుమార్‌ అలియాస్‌ కెవిన్‌, నిర్మల్‌కు చెందిన సాయి వీర ప్రసాద్‌ అలియాస్‌ జేమ్స్‌, జీడిమెట్లకు చెందిన నయాకోటి బస్వరాజులను నియమించుకున్నాడు. వీరు వాయిస్‌ ఓవర్‌ ఇంటర్నెట్‌ ప్రొటోకాల్‌ (వీఓఐపీ) ద్వారా విదేశీయులకు ఫోన్‌ చేసేవారు. మీరు వినియోగించే అమెజాన్‌ ప్రైమ్‌ యాప్‌ నకిలీదని, హ్యాక్‌ అయిందని, భద్రతా లోపాలున్నాయని చెప్పి నమ్మించేవారు. సాంకేతిక సేవలను అందించేందుకు కొంత రుసుము చెల్లించాలని చెప్పి మొబైల్‌కు లింక్‌లు పంపించి బ్యాంకు అకౌంట్లు ఖాళీ చేసేవారు. గిఫ్ట్‌ కార్డుల రూపంలో ఆస్ట్రేలియా బ్యాంకు ఖాతాలకు సొమ్మును బదిలీ చేయించుకునేవారు. కొన్ని సందర్భాల్లో బాధితుల సెల్‌ఫోన్‌లో ఎనీ డెస్క్‌ యాప్‌ను డౌన్‌లోడ్‌ చేసుకోవాలని చెప్పి, దాని ద్వారా బ్యాంకు ఖాతా వివరాలను తస్కరించి ఖాతా ఖాళీ చేసేవారు. ఈ క్రమంలో అపార్ట్‌మెంట్‌లో నకిలీ కాల్‌ సెంటర్‌ నిర్వహిస్తున్నట్లు మేడ్చల్‌ ఎస్‌ఓటీ పోలీసులకు సమాచారం అందడంతో దాడులు చేసి 13 మందిని అరెస్ట్‌ చేశారు. పరారీలో ఉన్న రామకృష్ణా రెడ్డి, ఆకాశ్‌, వెస్లీల కోసం గాలిస్తున్నారు. నిందితుల నుంచి 13 కంప్యూటర్లు, సీపీయూలు, హెడ్‌ సెట్లు, హార్డ్‌ డిస్క్‌, పెన్‌ డ్రైవ్‌, మెమొరీ కార్డు, సిమ్‌ కార్డులు, సెల్‌ఫోన్లు, చేతి గడియారాలు, కారు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు.

సీఎమ్మార్‌ గడువు పొడిగింపు

- ఈ నెలాఖరు వరకు పెంచిన కేంద్రం
- 2.5 లక్షల మెట్రిక్‌ టన్నుల వానాకాలం బియ్యం రాష్ట్ర అవసరాలకే

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు 2021–22 యాసంగి(రబీ) సీజన్‌కు సంబంధించిన ధాన్యాన్ని బియ్యంగా (కస్టమ్‌ మిల్లింగ్‌ రైస్‌)గా ఎఫ్‌సీఐకి అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈనెలాఖరు వరకు అవకాశం ఇచ్చింది. అదే సంవత్సరానికి సంబంధించిన వానాకాలం సీజన్‌ సీఎంఆర్‌ గడువును పెంచేది లేదని స్పష్టం చేసింది. మార్చి నెలాఖరుతో ఈ రెండు సీజన్‌ల సీఎంఆర్‌ గడువు ముగిసినప్పటికీ, ఇంకా సుమారు రూ. 4 వేల కోట్ల విలువైన 12 లక్షల మెట్రిక్‌ టన్నుల బియ్యం ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉంది. ఇందులో 2.5 లక్షల మెట్రిక్‌ టన్నుల వరకు గత వానకాలం సీజన్‌ బియ్యం ఇవ్వాల్సి ఉంది. గడువు పెంచకపోవడంతో ఈ సీజన్‌కు సంబంధించిన బియ్యాన్ని స్టేట్‌ పూల్‌ కోసం వినియోగించుకునే పరిస్థితి ఏర్పడింది. యాసంగి సీజన్‌కు సంబంధించిన 9.5 లక్షల మెట్రిక్‌ టన్నుల బియ్యాన్ని మాత్రం ఏప్రిల్‌ 30వ తేదీలోగా సెంట్రల్‌ పూల్‌ కింద ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉంటుంది. ఈ సీఎంఆర్‌ విషయంలో రీసైక్లింగ్‌ బియ్యం లేకుండా, నాణ్యమైన బియ్యం తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వ డిప్యూటీ కార్యదర్శి జై ప్రకాశ్‌ స్పష్టం చేశారు.

తెలంగాణ స్టేట్‌ వేరహౌసింగ్‌ కార్పొరేషన్‌
"వేరహౌసింగ్‌ సదన్‌", నాంపల్లి, హైదరాబాద్‌ - 500001
ఇ-ప్రొక్యూర్‌మెంట్‌ టెండరు ప్రకటన

తెలంగాణ రాష్ట్రంలో దిగువ తెలిపిన పనుల కోసం మేనేజింగ్‌ డైరెక్టర్‌, TSWC, హైదరాబాద్‌ వారిచే సమోదిత సివిల్‌ కాంట్రాక్టర్ల నుండి ఆన్‌లైన్‌ టెండర్లు కోరబడుతున్నవి: 1)వనపర్తి జిల్లా, అమరచింత (మం.), TSWC ధర్మాపూర్‌ (గ్రా.) వద్ద అనుబంధ పనులతో పాటు 10,000 M.T. (2X5000 M.T) సామర్థ్యం గల గోదాము నిర్మాణం, వ్యయం: రూ.7,76,79,374.91, 2) నిజామాబాద్‌ జిల్లా, వాయిల్‌పూర్‌ (మం), వాయిల్‌పూర్‌ (గ్రా.) వద్ద TSSOCA లో కొత్త ఆఫీస్‌ బిల్డింగ్‌ నిర్మాణం, వ్యయం: రూ.72,13,876.66, 3) జోగులాంబ గద్వాల జిల్లా, TSSOCA గద్వాల్‌ వద్ద సీడ్‌ సర్టిఫికేషన్‌ ఆఫీస్‌ బిల్డింగ్‌కు మరమ్మతులు, వ్యయం: రూ.27,06,864.82, 4) రంగారెడ్డి జిల్లా, బడంగ్‌పేట్‌ మున్సిపాలిటీ, బాలాపూర్‌ మండలం, గుర్రంగూడ గ్రామం, బాలాజీ హోమ్స్‌ వద్ద మల్టీపర్పస్‌ హాల్‌ నిర్మాణం, వ్యయం: రూ.28,30,165.43. తెరచు మరియు ముగింపు తేదీలు: 06-04-2023 నుండి 20-04-2023. ఏదేని ఇతర సమాచారాన్ని https://tender.telangana.gov.in లేదా TSWC, హైదరాబాద్‌ వారి కార్యాలయం నుండి పొందవచ్చును.

DIPR RO No.38-PP/CL/Adv/1/2023-24, Dt: 04.04.2023 సం/- మేనేజింగ్‌ డైరెక్టర్‌

ICMR-NATIONAL INSTITUTE OF NUTRITION
Jamai Osmania Post, Tarnaka, Hyderabad-500007, TS.

Advt.No.170/DABS/MAR/2023 Date: 04.04.2023

WALK-IN INTERVIEW

Eligible candidates are invited to attend the Walk-in-Interviews for various Project Posts for Pan India Study entitled "Diet and Biomarker Survey in India (DABS-I)" funded by ICMR. The Interviews will be held during the period **from 18th and 19th April, 2023** at ICMR-National Institute of Nutrition, Hyderabad. For more details like Name of the Post, Age, Essential Qualifications, Number of vacancies, Emoluments etc., visit our website: **nin.res.in/employement.html.**

Sd/-
Sr. Administrative Officer for Director

తెలంగాణ ప్రభుత్వము
పశువైద్య మరియు పశు సంవర్ధకశాఖ, సిద్దిపేట

టెండరు నోటీసు నం. 323/DV&AHO/2023 తేది : -03-2023

గొర్రెల పెంపకం మరియు అభివృద్ధి పథకం (ఫేజ్-II)లో భాగంగా సిద్దిపేట జిల్లా కొరకు కొనుగోలు చేయనున్న గొర్రెలను పొరుగు రాష్ట్రాల నుండి సిద్దిపేట జిల్లా పరిధిలోని వివిధ గ్రామాలకు Transport of Animals (Amendment) Rules, 2009 నియమాలను అనుసరించి రవాణా చేయుటకు ఆసక్తి, అర్హత, అనుభవం కలిగిన వాహన యజమానుల నుండి గొర్రె ఒక్కంటికి కిలోమీటరుకు ధర సీల్డ్‌ టెండర్ల ద్వారా కోరడమైనది. టెండరు వివరములు: 1) సీల్డ్‌ టెండర్లను సమర్పించువారు రూ. 500/- (రూపాయలు ఐదు వందలు మాత్రమే) చెల్లించి టెండరు దరఖాస్తు ఫారంను జిల్లా పశువైద్య మరియు పశుసంవర్ధక అధికారి వారి కార్యాలయము, సిద్దిపేట నుండి తేది : 08.04.2023 ఉ. 10.30 గం. నుండి 15.04.2023 సా. 05.00 గం.ల లోపు పొందవచ్చును. 2) టెండరు దరఖాస్తు ఫారంను సరి అయిన సమాచారంతో నింపి దానితోపాటుగా రూ. 10,000/- (పదివేలు మాత్రమే) స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా నందు జిల్లా కలెక్టర్‌, సిద్దిపేట గారి పేరున డిమాండ్‌ డ్రాఫ్ట్‌ రూపములో చెల్లించి అట్టి సీల్డ్‌ టెండర్లను జిల్లా పశువైద్య మరియు పశు సంవర్ధక అధికారి వారి కార్యాలయము, సిద్దిపేటనందు సమర్పించవలసిన చివరి తేది:15.04.2023 మ.03.00 గం.ల వరకు మాత్రమే. 3) గొర్రెల రవాణా వాహన జీసిన అర్హతలు టెండరు దరఖాస్తు ఫారం మరియు నియమ నిబంధనలు పొందుపరిచినట్లుగా ఉండవలెను మరియు మిగిలిన వివరాల కోసం జిల్లా పశువైద్య మరియు పశు సంవర్ధక శాఖ అధికారి వారి కార్యాలయము, సిద్దిపేట నందు సంప్రదించగలరు. 4) అట్టి సీల్డ్‌ టెండర్లను శ్రీయుత జిల్లా కలెక్టర్‌, సిద్దిపేట జిల్లా గారి కార్యాలయములో తేది : 15.04.2023 సా. 04.00 గం.లకు తెరువబడును. గడువు తర్వాత వచ్చిన ఫారములు స్వీకరించబడవు. అట్టి టెండర్లను వాయిదా వేయుటకు గానీ, రద్దు పర్చుటకుగానీ శ్రీయుత జిల్లా కలెక్టర్‌, సిద్దిపేట గారికి పూర్తి అధికారము కలదు. 5) టెండర్‌లో ఎంపిక అయిన టెండరుదారుడు ఖచ్చితంగా రూ. 10,00,000/- (పది లక్షల రూపాయలు) డిడి రూపములో జిల్లా కలెక్టర్‌గారి పేరున తీసి అగ్రిమెంట్‌ చేసుకొనవలెను.

సం/- జిల్లా కలెక్టర్‌ మరియు మేజిస్ట్రేట్‌, సిద్దిపేట జిల్లా
DIPR RO No. 43-PP/CL/ADVT/1/2023-24, Dt. : 05.04.2023

No. A-12034/1/2019-E-2 - DoC
భారత ప్రభుత్వం
డిపార్ట్‌మెంట్‌ ఆఫ్‌ కామర్స్‌

డిపార్ట్‌మెంట్‌ ఆఫ్‌ కామర్స్‌ వారు కాంట్రాక్చువల్‌ ప్రాతిపదికపైన దిగువ తెలిపిన ఉద్యోగాల కోసం ప్రతిభావంతులైన, సరికొత్త ఆలోచనలు గల మరియు ఉత్సాహవంతులైన ప్రొఫెషనల్స్‌ను నియమించుటకు ఉద్దేశిస్తున్నారు.

ఉద్యోగం	స్ట్రీమ్స్‌			
	ఎకనామిక్స్‌	డేటా సైన్స్‌	జనరల్‌ మేనేజ్‌మెంట్‌	మొత్తం
యంగ్‌ ప్రొఫెషనల్‌	9	4	2	15
అసోసియేట్‌	4	2	5	11
కన్సల్టెంట్‌	4	1	0	05
సీనియర్‌ కన్సల్టెంట్‌	0	1	1	02
మొత్తం	17	8	8	33

ఆసక్తిగల అభ్యర్థులు సవివరమైన ప్రకటన కోసం "https://commerce.gov.in/vacancies/" చూడవచ్చును. దరఖాస్తు యొక్క ఆన్‌లైన్‌ దాఖలు కోసం ఆఖరి తేది వార్తాపత్రికలో ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 21 రోజులు.

CBC 05101/11/0001/2324

క్లుప్తంగా...

సిసోడియా పాత్రపై కొత్త ఆధారం: ఈడీ

న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం విధానంలో అవకతవకలకు సంబంధించి ఆప్ నేత మనీశ్ సిసోడియా పాత్రపై కొత్త ఆధారం దొరికిందని ఈడీ బుధవారం కోర్టుకు తెలిపింది. ''దర్యాప్తు కీలక దశలో ఉంది. ఈ సమయంలో బెయిలివ్వకండి. కస్టడీ పొడిగించండి'' అని సిసోడియా బెయిల్ పిటిషన్‌పై జడ్జి ఎంకే నాగ్‌పాల్ ఎదుట ఈడీ లాయర్లు వాదించారు. ఈ వాదనను సిసోడియా తరఫు లాయర్లు ఖండించారు. బెయిల్ ప్రయత్నాలను ఈడీ ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుంటోందని ఆరోపించారు. అనంతరం విచారణను 13వ తేదీకి జడ్జి వాయిదా వేశారు.

కోనేట్లో అపశ్రుతి

తమిళనాట ఐదుగురు జలసమాధి

చెన్నై: తమిళనాడులో ఐదుగురు యువ అర్చకులు ప్రమాదవశాత్తూ కోనేట్లో మునిగి దుర్మరణం పాలయ్యారు. చెన్నై సమీపంలోని మదిపక్కం దగ్గరున్న మూవరసంపేట్ ఆలయంలో బుధవారం ఈ దుర్ఘటన జరిగింది. కోనేట్లో తీర్థవరి కార్యక్రమం నిర్వహించేందుకు నంగనల్లూర్‌లోని ధర్మలింగేశ్వరార్ ఆలయ అర్చక బృందం మూవరసంపేట్ వచ్చింది. 25 మంది ఒకేసారి వలయాకారంలో కోనేట్లో నిల్చుని కార్యక్రమం కొనసాగిస్తున్నారు. ఒకరు లోతున్నవైపు పడిపోయారు. అతడిని కాపాడపోయి మరో నలుగురూ జలసమాధి అయ్యారు. మృతులంతా పాతికేళ్లలోపు వయసు వారే. వారిలో ఒకరు కాలేజీ విద్యార్థి.

అరుణాచల్ ముమ్మాటికీ భారత్‌లో భాగమే: అమెరికా

చైనా దుర్బుద్ధిని తప్పుబట్టిన అగ్రరాజ్యం

వాషింగ్టన్: సరిహద్దు రాష్ట్రం అరుణాచల్ ప్రదేశ్‌లోని 11 ప్రాంతాలకు చైనా సొంతంగా పేర్లు పెట్టుకున్న ఉదంతంపై అమెరికా ఘాటుగా స్పందించింది. 'అరుణాచల్‌ను భారత్‌లో అంతర్భాగంగా మేం గుర్తించాం. పేర్లు మార్చేసి ఏకపక్షంగా ఆ ప్రాంతాలను చైనా తమవిగా చెప్పుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం' అంటూ అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌజ్ మంగళవారం తెలిపింది. ఈ విషయంలో మొదట్నుంచీ మేం ఒకే అభిప్రాయంతో ఉన్నామని వైట్‌హౌజ్ ప్రెస్ సెక్రటరీ జీన్ పియరీ పత్రికా సమావేశంలో స్పష్టంచేశారు. అరుణాచల్ ప్రాంతాలకు సొంతంగా కొత్త పేర్లు పెట్టుకుంటూ ఆదివారం చైనా పౌర వ్యవహారాల శాఖ ప్రకటన చేయడంతో అమెరికా పైవిధంగా స్పందించింది. 2017లోనూ ఆరు ప్రాంతాలకు, 2021 ఏడాదిలో 15 ప్రాంతాలకు ఇలా చైనా సొంత పేర్లు పెట్టుకుంది. చైనా చర్యలను భారత్ ఆనాడే తీవ్రంగా తప్పుబట్టింది.


దగాకోరు యాప్

యూజర్ల డేటా చోరీ చేస్తున్న చైనా షాపింగ్ అప్లికేషన్ 'పిండువొడువో'

వ్యాపారాన్ని పెంచుకోవడానికి అనైతిక వ్యవహారం

తమ ప్లేస్టోర్ నుంచి తొలగించిన గూగుల్

'పిండువొడువో' యాప్‌పై చర్యలు చేపట్టని చైనా ప్రభుత్వం



వినియోగదారుల సమాచారాన్ని దొంగిలిస్తాయన్న ఆరోపణలు చైనా మొబైల్ అప్లికేషన్ల(యాప్‌లు)పై ఎప్పటినుంచో ఉన్నాయి. అందుకే ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు ఇలాంటి యాప్‌లపై నిషేధం విధించాయి. చైనాలో బాగా జనాదరణ ఉన్న షాపింగ్ యాప్ 'పిండువొడువో' తమ యూజర్ల వ్యక్తిగత సమాచారాన్ని తస్కరిస్తున్నట్లు ఇటీవలే వెల్లడయ్యింది. 75 కోట్ల మంది డేటాను సేకరించి, వ్యాపార అభివృద్ధి కోసం వాడుకున్నట్లు బయటపడడం సంచలనం సృష్టిస్తోంది. ఈ యాప్‌ను ఫోన్లలో ఒకసారి ఇన్‌స్టాల్ చేసుకుంటే తొలగించడం చాలా కష్టమని సైబర్ సెక్యూరిటీ నిపుణులు చెబుతుండడం గమనార్హం. చైనా ప్రభుత్వం ఇప్పటికీ పిండువొడువో యాప్‌పై చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

- 75 కోట్ల మంది వినియోగదారుల విస్తృత డేటాను పిండువొడువో యాజమాన్యం వారికి తెలియకుండానే సేకరించింది. వారి ఆసక్తులు, అభిరుచులు, ప్రాధాన్యతలు ఏమిటో తెలుసుకుంది.
- వాటికి అనుగుణంగా నోటిఫికేషన్లు, ప్రకటనలు పంపించడానికి తన మెషీన్ లెర్నింగ్ మోడల్‌ను మెరుగుపర్చుకుంది.

అనుమతి లేకుండానే..

- మన ఫోన్లలోని డేటాను ఇతరులు చూడాలంటే మన అనుమతి తప్పనిసరి. పిండువొడువో మాత్రం ఇలాంటి అనుమతుల జోలికి వెళ్లలేదు.
- యూజర్ల ఫోన్లలోకి పిండువొడువో యాజమాన్యం తమ యాప్ ద్వారా మోసపూరిత సాఫ్ట్‌వేర్(మాల్‌వేర్)ను జొప్పించింది. దాని సాయంతో ఫోన్లలోని లొకేషన్లు, కాంటాక్ట్‌లు, క్యాలెండర్లు, నోటిఫికేషన్లు, ఫొటో ఆల్బమ్స్ యాక్సెస్ చేసుకుంది.
- ఫోన్లలోని సిస్టమ్ సెట్టింగ్స్ మార్చే వెసులుబాటు సైతం సొంతం చేసుకుంది. ఫోన్లలో ఉండే ఇతర యాప్‌లపైనా నిఘా పెట్టింది.
- ఒక్కమాటలో చెప్పాలంటే యూజర్లకు తెలియకుండానే వారి ఫోన్లను స్వేచ్ఛగా వాడుకుంది.
- గూగుల్ సంస్థ మార్చి నెలలో తన ప్లేస్టోర్ నుంచి పిండువొడువోను తొలగించింది.
- తమ యాప్‌పై వచ్చిన ఆరోపణలను యాజమాన్యం ఖండించింది.

ఏమిటీ పిండువొడువో?



కోలిన్ హువాంగ్

- చైనాలో ఇంటర్నెట్ వినియోగించే ప్రజల్లో నాలుగింట మూడొంతుల మంది పిండువొడువో యాప్ ఖాతాదారులే. మార్కెట్ విలువ ప్రఖ్యాత షాపింగ్ యాప్ 'ఈబే' కంటే మూడు రెట్లు ఎక్కువ.
- గూగుల్ మాజీ ఉద్యోగి కోలిన్ హువాంగ్ 2015లో షాంఘైలో స్టార్టప్ కంపెనీగా పిండువొడువో యాప్‌ను 6.49.0 అనే వెర్షన్‌తో ప్రారంభించాడు. ఈ-కామర్స్ దిగ్గజాలైన అలీబాబా, జేడీ డాట్ కామ్‌కు పోటీగా ఈ కంపెనీ ప్రస్థానం ఆరంభమైంది. గూగుల్ ప్లేస్టోర్‌తోపాటు చైనా యాప్ స్టోర్లలో అందుబాటులోకి వచ్చింది.
- పిండువొడువో నగరాలను కాకుండా తొలుత చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలనే తన లక్ష్యంగా చేసుకుంది. తక్కువ ఆదాయం కలిగిన ప్రజలకు చౌక ధరలకే వారు కోరుకున్న వస్తువులు చేరవేసింది. ఫ్రెండ్స్, ఫ్యామిలీ గ్రూప్‌లకు భారీగా డిస్కౌంట్లు ఇచ్చింది. దాంతో అనతి కాలంలోనే పిండువొడువో జనంలోకి బాగా చొచ్చుకెళ్లింది.
- 2018 ఆఖరు నాటికి నెలవారీ యూజర్లలో మూడంకెల వృద్ధిని సాధించింది. అదే సంవత్సరం న్యూయార్క్ స్టాక్ మార్కెట్‌లో లిస్టయ్యింది.
- ఈ యాప్ ఫోన్ బ్యాక్‌గ్రౌండ్‌లో రన్ అవుతూనే ఉంటుంది. అందుకే ఫోన్ల నుంచి సులభంగా తొలగించలేమని నిపుణులు వెల్లడించారు.

ఎప్పుడు బయటపడింది?

- పిండువొడువో యాప్‌లో మాల్‌వేర్ ఉన్నట్లు ఈ ఏడాది ఫిబ్రవరి మాసాంతంలో అనుమానాలు బలపడ్డాయి.
- చైనా సైబర్ సెక్యూరిటీ సంస్థ 'డార్క్ నేవీ' ఈ మేరకు ఒక నివేదిక విడుదల చేసింది. కానీ, ఆ యాప్ పేరును నేరుగా ప్రస్తావించలేదు.
- యాప్ నిర్వాకంపై ఇతర పరిశోధకులు దృష్టి పెట్టారు. మాల్‌వేర్‌తో డేటాను దొంగిలిస్తున్న సంగతి నిజమేనని తేల్చారు. పిండువొడువో అనేది ఒక దొంగ యాప్ అని స్పష్టం చేశారు.
- ఆరోపణలు వెల్లువెత్తడంతో యాప్ యాజమాన్యం అప్రమత్తమైంది. మార్చి 5న వెర్షన్ 6.50.0 పేరిట కొత్త అప్‌డేట్‌ను విడుదల చేసింది. చాలామంది ఇంజనీర్లు, ప్రొడక్ట్ మేనేజర్లను తమ అనుబంధ సంస్థ అయిన 'టెమూ'కు తరలించింది.
- 20 మందితో కూడిన సైబర్ సెక్యూరిటీ ఇంజనీర్ల బృందం ఇప్పటికీ పిండువొడువోలో కొనసాగుతోంది.

చైనా ప్రభుత్వం మౌనమెందుకో?



- కొత్త వెర్షన్ కూడా సురక్షితం కాదని నిపుణులు చెబుతున్నారు. అందులో అండర్‌లైయింగ్ కోడ్ ఉందని, డేటా చౌర్యం కోసం దాన్ని ఎప్పుడైనా రీయాక్టివేట్ చేయొచ్చని హెచ్చరిస్తున్నారు.
- చట్ట ప్రకారం చూస్తే పిండువొడువోను నిషేధించాల్సిందేనని నిపుణులు తేల్చిచెబుతున్నారు. కానీ, ఆ యాప్‌పై ఇప్పటికీ చర్యల్లేవు. యాప్ కార్యకలాపాలపై బహిరంగంగా ఏనాడూ స్పందించలేదు.
- చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న యాప్‌ల పేర్లతో కూడిన జాబితాను చైనా సమాచార సాంకేతిక శాఖ తరచుగా విడుదల చేస్తోంది. ఈ జాబితాల్లో పిండువొడువో పేరును ఒక్కసారి కూడా చేర్చలేదు.
- పిండువొడువో అనుబంధ యాప్ అయిన 'టెమూ' అమెరికాలో డౌన్‌లోడ్లలో అగ్రస్థానంలో ఉంది. పశ్చిమ దేశాల్లోనూ విస్తరిస్తోంది. ఇప్పుడు దీనిపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

బైడెన్ అసమర్థ పాలనలో... అమెరికా సర్వభ్రష్టం

దేశ చరిత్రలోనే అత్యంత చెత్త అధ్యక్షుడు: ట్రంప్

- బైడెన్ హయాంలో అణ్వాయుధ మూడో ప్రపంచ యుద్ధం
- విచారణ అనంతరం తొలి ప్రసంగంలో ట్రంప్ నిప్పులు
- తాను పూర్తిగా అమాయకుడినని పునరుద్ఘాటన
- అటార్నీ, సుప్రీంకోర్టు జడ్జిపైనా తీవ్ర విమర్శలు



వాషింగ్టన్: హష్ మనీ చెల్లింపుల కేసులో తాను పూర్తిగా అమాయకుడినని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. ఈ కేసులో తనపై దాఖలైన క్రిమినల్ అభియోగాలకు సంబంధించి మంగళవారం ఆయన న్యూయార్క్‌లో మన్‌హాటన్ జ్యూరీ ముందు విచారణకు హాజరవడం తెలిసిందే. అనంతరం ఫ్లోరిడాలో తన మద్దతుదారులను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగించారు. ఈ కేసు రాజకీయ కక్షసాధింపులో భాగమని ఆరోపించారు. వామపక్ష అతివాద ఉన్మాదులు దేశాన్ని సర్వనాశనం దిశగా తీసుకెళ్తున్నారంటూ అధ్యక్షుడు జో బైడెన్, ఆయన మద్దతుదారులపై నిప్పులు చెరిగారు. చట్టాన్ని అడ్డం పెట్టుకుని ఇప్పుడిలా ఎన్నికల ప్రక్రియనూ ముందుగానే ప్రభావితం చేయజూస్తున్నారని ఆరోపించారు. అలా ఎట్టి పరిస్థితుల్లోనూ జరగనివ్వబోమని హెచ్చరించారు. ''బైడెన్ దేశ చరిత్రలోనే అత్యంత చెత్త అధ్యక్షుడు. ఆయనకు ముందున్న ఐదుగురు అత్యంత అసమర్థ అధ్యక్షుల వైఫల్యాన్నింటినీ కలగలిపినా బైడెన్ పాలనా వైఫల్యాల్లో పదో వంతుకు కూడా తూగవు. అంతటి దారుణ పాలనతో అమెరికాను అన్ని రంగాల్లోనూ భ్రష్టు పట్టిస్తూ విఫల రాజ్యంగా మారుస్తున్నారు'' అంటూ తూర్పారబట్టారు. ''ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతోంది. ద్రవ్యోల్బణం అదుపు తప్పుతోంది. డాలర్ శరవేగంగా పతనమవుతోంది. గత 200 ఏళ్ల అమెరికా చరిత్రలో అత్యంత దారుణ పరాజయమిది! ఒక్కమాటలో చెప్పాలంటే అమెరికా ఇంకెంతమాత్రమూ సూపర్ పవర్ కాదు. సర్వనాశనం దిశగా పయనిస్తోంది'' అంటూ ఆవేదన వెలిబుచ్చారు. 2024లో మరోసారి అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తానని ట్రంప్ ఇప్పటికే ప్రకటించడం తెలిసిందే.

నేనుంటేనా...!

బైడెన్ అసమర్థత వల్ల నమ్మశక్యం కాని రీతిలో చైనాతో రష్యా, ఇరాన్‌తో సౌదీ అరేబియా చేతులు కలిపాయని ట్రంప్ ఆరోపించారు. ''చైనా, రష్యా, ఇరాన్, ఉత్తర కొరియా కలిసి అత్యంత వినాశకర సంకీర్ణంగా రూపొందాయి. ఎన్నో దేశాలు అణ్వాయుధాలను ప్రయోగిస్తామంటూ బాహాటంగా హెచ్చరికలు చేస్తున్నాయి. ఎవరు నమ్మినా నమ్మకపోయినా పూర్తిస్థాయి అణ్వాయుధ ప్రయోగాలతో కూడిన మూడో ప్రపంచ యుద్ధం ఎంతో దూరంలో లేదు. బైడెన్ హయాంలోనే జరిగి తీరుతుంది'' అని చెప్పుకొచ్చారు. ''నేనుంటే వీటిలో దేన్నీ జరగనిచ్చేవాన్ని కాదు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధమే జరిగేది కాదు. ఎన్నో లక్షల ప్రాణాలు పోయేవి కాదు. అందమైన ఉక్రెయిన్ పట్టణాలు నేలమట్టమయ్యేవి కాదు'' అని ట్రంప్ అన్నారు.

అదే నా తప్పిదం...

వినాశక శక్తుల బారినుంచి దేశాన్ని సాహసోపేతంగా కాపాడటమే తాను చేసిన ఏకైక తప్పిదమంటూ బైడెన్, ఆయన మద్దతుదారులపై ట్రంప్ నిప్పులు చెరిగారు. తనపై కేసు విషయంలో మన్‌హాటన్ జిల్లా అటార్నీ ఆల్విన్ బ్రాగ్‌తో పాటు దాన్ని పర్యవేక్షిస్తున్న సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ జువాన్ ఎం.మెర్చన్‌పైనా విరుచుకుపడ్డారు. వారిద్దరూ డెమొక్రటిక్ పార్టీ సానుభూతిపరులంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ''అంతే కాదు, వారిద్దరికీ నేనంటే విపరీతమైన ద్వేషం. జువాన్ భార్యకు, కుటుంబానికీ నేనంటే అసహ్యమే. ఆయన కూతురు ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ కోసం పని చేస్తోంది'' అన్నారు. ఎవరేం చేసినా తనను కుంగదీయలేరని, అమెరికాను మరోసారి గొప్ప దేశంగా మార్చి చూపిస్తానని చెప్పుకొచ్చారు.

ట్రంప్‌పై పరువు నష్టం కేసు...స్టార్మీ డేనియల్స్‌కు చుక్కెదురు

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై 2018 నాటి పరువునష్టం కేసులో శృంగార చిత్రాల తార స్టార్మీ డేనియల్స్‌కు చుక్కెదురైంది. ఆమె పిటిషన్‌ను కాలిఫోర్నియాలోని 9వ సర్క్యూట్ కోర్టు కొట్టేసింది. అంతేగాక ఈ సివిల్ కేసులో ట్రంప్ తరఫు లాయర్లకు ఫీజు కింద 1.2 లక్షల డాలర్లు చెల్లించాలని ఆదేశించింది. ఈ కేసులో ఇప్పటికే దిగువ కోర్టులు కూడా విధించిన మొత్తంతో కలిపి ట్రంప్ లాయర్లకు డేనియల్స్ 6 లక్షల డాలర్లకు పైగా చెల్లించాల్సి ఉంటుంది.

సీఎం బొమ్మైకి నా మద్దతు

పోటీ చేయను.. ఏ పార్టీలో చేరను ● కన్నడ నటుడు కిచ్చ సుదీప్

సాక్షి, బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి, బీజేపీ నేత బసవరాజ బొమ్మైకి తన మద్దతు ప్రకటిస్తున్నట్లు ప్రముఖ కన్నడ నటుడు కిచ్చా సుదీప్ ప్రకటించారు. బొమ్మై సూచించిన అభ్యర్థుల తరఫున ఎన్నికల్లో ప్రచారం చేస్తానని చెప్పారు. అయితే తాను బీజేపీలో తాను చేరడం లేదని, పోటీ చేయడం లేదని బుధవారం స్పష్టం చేశారు.

తొలినాళ్లలో సాయపడ్డారు

'కష్టకాలంలో నాకు అండగా నిలిచిన వారు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు సాయపడటం నా కర్తవ్యం. సీఎం వ్యక్తిత్వానికి గౌరవమిచ్చి ఈ నిర్ణయానికి చిత్ర పరిశ్రమలో నాకు గాడ్‌ఫాదర్ ఎవరూ లేరు. బొమ్మైని ప్రేమగా మామా అని పిలుస్తా. చిత్ర పరిశ్రమలో నేను తొలినాళ్లలో కష్టాల్లో ఉన్నపుడు ఆయన ఎంతో సాయపడ్డారు. అందుకే కృతజ్ఞతాపూర్వకంగా ఆయనకు మద్దతు ప్రకటిస్తున్నా'' అన్నారు. సుదీప్ నిర్ణయం బీజేపీకి పెద్ద బలమని బొమ్మై వ్యాఖ్యానించారు.

బెదిరింపు లేఖలు ఎవరు పంపారో తెలుసు

తనకు బెదిరింపు లేఖలు రావడంపై అంతకుముందు సుదీప్ మీడియాతో మాట్లాడారు. ''దానితో నేతలకు సంబంధం లేదు. అదెవరి పనో నాకు తెలుసు. వారికెలా బదులివ్వాలో నాకు తెలుసు. బెదిరింపులకు భయపడే వ్యక్తిని కాదు. గతంలో ఎవరు పిలిచినా వెళ్లి ప్రచారం చేశా. అంతమాత్రాన వారి పార్టీలకు మద్దతిచ్చినట్లు కాదు. అన్ని పార్టీలతోనూ నాకు సత్సంబంధాలున్నాయి. ఏ పార్టీని, ఎవరి కోసమూ టికెట్ కోరలేదు'' అని చెప్పారు. సుదీప్‌ను అసభ్య పదజాలంతో దూషిస్తూ ఆయన ప్రైవేట్ వీడియోలను సోషల్ మీడియాలో పెడతామంటూ రెండు బెదిరింపు లేఖలు రావడం తెల్సిందే. దీనిపై ఆయన మేనేజర్ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కేసును సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న సీఎం బొమ్మై, నటుడు సుదీప్

సుదీప్ కోసం పార్టీల ఆరాటం

మంచి జనాదరణ ఉన్న సుదీప్ మద్దతు కోసం కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్ కొంతకాలంగా ప్రయత్నిస్తున్నాయి. గత ఫిబ్రవరిలో సుదీప్ పీసీసీ చీఫ్ డీకే శివకుమార్‌ను కలవడంతో ఆయన కాంగ్రెస్‌లో చేరబోతున్నారని వార్తలు గుప్పుమన్నాయి. జేడీ(ఎస్) నేత కుమారస్వామి గతంలోనే సుదీప్‌ను కలిశారు. శివమొగ్గ జిల్లాకు చెందిన సుదీప్ సంఖ్యాధికులైన వాల్మీకి నాయక వర్గానికి చెందిన వారు. సామాజిక స్పృహ ఉన్న సుదీప్ బీజేపీకి మద్దతు పలకడం బాధాకరమని అంటూ నటుడు ప్రకాశ్‌రాజ్ మీడియాతో అన్నారు.

మీడియావన్‌పై నిషేధం ఎత్తివేత

విమర్శలను దేశ వ్యతిరేక కోణంలో చూడొద్దన్న సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: మలయాళ వార్తా చానల్ 'మీడియావన్'పై దేశ భద్రతా కారణాలతో గతేడాది కేంద్రం విధించిన నిషేధాన్ని సుప్రీంకోర్టు బుధవారం రద్దు చేసింది. నిజానిజాలు సరిచూసుకోకుండానే నిషేధాజ్ఞలు అమలుచేశారంటూ కేంద్ర హోం శాఖను తప్పుబట్టింది. మీడియాపై అకారణంగా నిషేధం అమలుచేస్తే పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలుగుతుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. నిషేధాన్ని సమర్థిస్తూ గతంలో కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టేసింది. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలుచేసింది. ''ప్రభుత్వ విధానాలను తప్పుబడుతూ చేసిన విమర్శలను దేశ వ్యతిరేక చర్యలుగా చిత్రీకరించవద్దు. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ అత్యంత ప్రధానం. పాలనపై వాస్తవాలు వెల్లడించే మీడియా ద్వారా పౌరులు ఒక అభిప్రాయానికొస్తారు. సరైన నిర్ణయాలు తీసుకునే ప్రజల ద్వారానే ప్రజాస్వామ్యం సరైన పథంలో ముందుకు సాగుతుంది. ఏకధృవ పోకడలు, అభిప్రాయాలు ప్రజాస్వామ్యానికి కీడు చేస్తాయి. ఛానెల్ లైసెన్స్‌ను రెన్యువల్ చేయకపోవడం భావ ప్రకటన స్వేచ్ఛపై ఆంక్షలు విధించడమే' అని అభిప్రాయపడింది. నిషేధానికి కారణాలను సీల్డ్‌కవర్‌లో కోర్టుకు మాత్రమే తెలియజేయడం సహజ న్యాయసూత్రాన్ని ఉల్లంఘించడమేనని న్యాయమూర్తి జస్టిస్ హిమా కోహ్లీ అన్నారు. మీడియావన్ వార్తలను తప్పుబడుతూ భద్రతా కారణాలతో 2022 జనవరి 31న కేంద్రం దానిపై నిషేధం విధించింది. చానల్ దాన్ని కేరళ హైకోర్టులో సవాలు చేయగా కేంద్రం నిర్ణయాన్ని సమర్థించింది. దాంతో చానల్ సుప్రీంను ఆశ్రయించింది.

చరిత్ర పుస్తకాల్లో 'గాంధీ, ఆరెస్సెస్' తొలగింపు

న్యూఢిల్లీ: దేశానికి స్వాతంత్య్రం రాగానే హిందూ, ముస్లింల మధ్య గొడవలు, సయోధ్య కోసం గాంధీ విఫలయత్నం, ఆయన హత్య తర్వాత ఆరెస్సెస్‌పై నిషేధం, గోధ్రా అల్లర్ల తర్వాత ఘటనలు తదితరాలను పన్నెండో తరగతి చరిత్ర పాఠ్య పుస్తకాల నుంచి ఎన్‌సీఈఆర్‌టీ తొలగించింది. హేతుబద్ధీకరణలో భాగంగా ఏయే అంశాలను తొలగించబోతున్నదీ తెలుపుతూ మండలి గత జూన్‌లో విడుదల చేసిన బుక్‌లెట్‌లో వీటి ప్రస్తావన లేకపోవడం గమనార్హం. దీనిపై కాంగ్రెస్ మండిపడింది. హిందూ అతివాదంపై గాంధీ అభిప్రాయాలు వంటి అంశాలను తొలగించడం భావితరాలకు వాస్తవాలు తెలియకుండా చేసే కుటిల యత్నమని ఆరోపించింది. బీజేపీ, ఆరెస్సెస్ ఎంత ప్రయత్నించినా చరిత్రను మార్చలేవని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు. విషయ నిపుణుల సూచన మేరకే వాటిని తొలగించినట్టు ఎన్‌సీఈఆర్‌టీ చీఫ్ దినేశ్ సాక్లానీ చెప్పారు. ఈ విషయంలో రాద్ధాంతం అనవసరమని అభిప్రాయపడ్డారు.

'దర్యాప్తు సంస్థల దుర్వినియోగం'పై విపక్షాలకు సుప్రీంలో చుక్కెదురు

- నేతలకు ప్రత్యేక హక్కులుండవు
- సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యలు
- మార్గదర్శకాల జారీకి నిరాకరణ
- పిటిషన్ ఉపసంహరించుకున్న పార్టీలు



న్యూఢిల్లీ: దర్యాప్తు సంస్థల దుర్వినియోగం అంశంపై విపక్షాలకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. వాటిని కేంద్రం తీవ్రంగా దుర్వినియోగం చేస్తోందంటూ కాంగ్రెస్ సహా 14 ప్రతిపక్ష పార్టీలు వేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం నిరాకరించింది. రాజకీయ నాయకులకు న్యాయపరంగా సాధారణ ప్రజలకు మించిన రక్షణలేమీ ఉండబోవని ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. ''ఈ పిటిషన్ ఎందుకు వేశారు? విచారణ నుంచి నేతలకు రక్షణ కల్పించేందుకా? వారికి ప్రత్యేక హక్కులేమైనా ఉన్నాయా?'' అని సీజేఐ ప్రశ్నించారు. నేతల పట్ల దర్యాప్తు సంస్థలు అన్యాయంగా వ్యవహరించాయని రుజువు చేసేందుకు ఒక్క క్రిమినల్ కేసునూ పిటిషన్లో పేర్కొనలేదని గుర్తు చేశారు. వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం విపక్షాల విజ్ఞప్తి ఆధారంగా అరెస్టుకు ముందు, తర్వాత కేంద్ర దర్యాప్తు సంస్థలకు నిర్దిష్ట మార్గదర్శకాలను జారీ చేయడం కుదరదని తేల్చిచెప్పారు. దాంతో, పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని పార్టీల తరఫున వాదించిన సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి కోరాల్సి వచ్చింది. అందుకు ధర్మాసనం అనుమతించింది. నేతల హక్కులకు భంగం కలిగే పక్షంలో నిర్దిష్టమైన రుజువు చూపుతూ ఎప్పుడైనా తమను ఆశ్రయించవచ్చని హామీ ఇచ్చింది.

కేంద్రానిది కక్షసాధింపు...

అంతకుముందు సింఘ్వి వాదిస్తూ నిర్దిష్టంగా ఫలానా కేసులో ఫలానా నేతలకు తాము ఎలాంటి రక్షణలూ కోరడం లేదని స్పష్టం చేశారు. కానీ ప్రతిపక్ష పార్టీల స్థైర్యాన్ని దెబ్బ తీసే ఉద్దేశంతో కేంద్రం వాటిపై దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతోందని ఆరోపించారు. విపక్ష నేతలను కేంద్రం ఉద్దేశపూర్వకంగానే లక్ష్యంగా చేసుకుంటోందన్నారు. ''మోదీ ప్రభుత్వ హయాంలో 2014–22 మధ్య వారిపై సీబీఐ, ఈడీ కేసులు ఏకంగా 600 శాతం పెరిగాయి. సీబీఐ 124 మంది రాజకీయ నాయకులపై దర్యాప్తు చేస్తే వారిలో ఏకంగా 108 మంది విపక్ష నేతలే'' అని చెప్పారు. పిటిషన్ వేసిన పార్టీల్లో కాంగ్రెస్‌తో పాటు డీఎంకే, ఆర్జేడీ, బీఆర్‌ఎస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, ఆప్, ఎన్సీపీ, శివసేన (యూబీటీ), జేఎంఎం, జేడీ(యూ), సీపీఎం, సీపీఐ, నేషనల్ కాన్ఫరెన్స్ ఉన్నాయి.

మళ్లీ వాయిదానే...

పార్లమెంటులో అదే తీరు ● బడ్జెట్ సమావేశాలకు నేటితో తెర

న్యూఢిల్లీ: అదానీ ఉదంతంపై సంయుక్త పార్లమెంటరీ సంఘం దర్యాప్తు కోరుతూ విపక్షాలు నిరసన కొనసాగించడంతో పార్లమెంటు ఉభయ సభలు బుధవారం కూడా వాయిదా పడ్డాయి. నలుపు దుస్తులతో హాజరైన విపక్ష సభ్యులు సభాపతుల విజ్ఞప్తులను పట్టించుకోకుండా నినాదాలు, నిరసనలు, ప్లకార్డులతో హోరెత్తించారు. దాంతో లోక్‌సభ, రాజ్యసభ కార్యకలాపాలేవీ చేపట్టకుండానే ముందు మధ్యాహ్నం రెండింటిదాకా, తర్వాత గురువారానికి వాయిదా పడ్డాయి. అదానీపై విపక్షాలు, రాహుల్ గాంధీపై అధికార బీజేపీ వాగ్యుద్ధం కారణంగా మార్చి 13న మొదలైన పార్లమెంటు మలి విడత బడ్జెట్ సమావేశాలు ఇప్పటిదాకా పెద్దగా కార్యకలాపాలేవీ జరపలేకపోయాయి. గురువారంతో బడ్జెట్ సమావేశాలకు తెర పడనుంది. మరోవైపు పార్లమెంటులో సమన్వయ సాధనకు విపక్ష నేతలు బుధవారం ఉదయం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చాంబర్లో భేటీ అయ్యారు. డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ, ఆప్, జేడీ(యూ), సీపీఎం, సీపీఐ, ఆర్జేడీ, జేఎంఎం, శివసేన (యూబీటీ), ఆరెస్పీ, ఐయూఎంఎల్ నేతలు పాల్గొన్నారు. అదానీ అంశంపై జేపీసీ విచారణ డిమాండ్‌పై ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కు తగ్గరాదని నిర్ణయించారు.

ధన్‌ఖడ్‌కు ఖర్గే లేఖ

భారత్‌లో ప్రజాస్వామ్యంపై బ్రిటన్లో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై రాజ్యసభలో మంత్రి పీయూష్ గోయల్, విపక్ష నేత ఖర్గే మధ్య వాగ్యుద్ధం జరిగింది. రాహుల్ రాజ్యసభకు వచ్చి క్షమాపణలు చెప్పాలన్న డిమాండ్‌పై అభ్యంతరం తెలుపుతూ మార్చి 13న ఖర్గే లేవనెత్తిన పాయింటాఫ్ ఆర్డర్‌ను తోసిపుచ్చుతున్నట్టు చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ ప్రకటించారు. కాంగ్రెస్ నేతలు సభను అవమానిస్తున్నారంటూ మంత్రి మండిపడగా విపక్షాలను నోరెత్తనివ్వడం లేదంటూ ఖర్గే దుయ్యబట్టారు. ధన్‌ఖడ్ నిర్ణయాన్ని తప్పుబడుతూ ఆయనకు ఖర్గే లేఖ రాశారు. సభాపతులు అధికార పక్షాలకు అనుకూలంగా ప్రవర్తించరాదని హితవు పలికారు.



బుధవారం ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మ అవార్డులు అందుకుంటున్న అఖిలేశ్ యాదవ్ (పద్మవిభూషణ్-తండ్రి దివంగత ములాయంసింగ్ యాదవ్ తరఫున), సుధామూర్తి, చినజీయర్ స్వామి (పద్మభూషణ్), ఎంఎం కీరవాణి, ఖాదర్ వలీ, నాగప్ప గణేశ్ కృష్ణరాజనాగర్, అబ్బారెడ్డి నాగేశ్వరరావు (పద్మశ్రీ)

సాక్షి హైదరాబాద్

గురువారం : 6 : ఏప్రిల్ : 2023



విద్యార్థులు అన్ని రంగాల్లో నైపుణ్యం పొందాలి

విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించాలని మంత్రి మల్లారెడ్డి అన్నారు. కండ్లకోయలోని సీఎంఆర్ కళాశాల వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. -8లో




త్యాగరాయ గానసభ ఆధునిక దేవాలయం

త్యాగరాయగానసభ ఆధునిక దేవాలయం వంటిదని మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. -8లో

డబ్బుల కోసం జబ్బుల సృష్టి!



నకిలీ వైద్య బిల్లులతో సీఎంఆర్ఎఫ్ ద్వారా నగదు మంజూరు చేయించుకుని కాజేసిన వ్యవహారంపై సీసీఎస్‌లో కేసు నమోదైంది. నలుగురు నిందితులు, రెండు ఆస్పత్రుల పాత్ర ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. -8లో







సాగరతీరంలో..విదేశీ సందడి



నగరంలో బెస్ట్ టూరిస్ట్ స్పాట్‌గా మారిన ట్యాంక్‌బండ్‌పై రోజు రోజుకూ సందడి పెరుగుతోంది. ఒక వైపు అతి పెద్ద అంబేడ్కర్ విగ్రహ నిర్మాణం, మరోవైపు అమరవీరుల స్మారకం, ఇంకోవైపు అందమైన సచివాలయ భవనాన్ని ట్యాంక్‌బండ్‌పై నుంచి తిలకిస్తే సుందర దృశ్యాలు ఆవిష్కృతమవుతున్నాయి. దీంతో టూరిస్టులు ఇటువైపు ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. నగరవాసులే కాకుండా.. బుధవారం పోర్చుగల్ నుంచి వచ్చిన టూరిస్టులు ట్యాంక్‌బండ్‌పై కలియతిరుగుతూ సందడి చేశారు. ఫోటోలు, సెల్ఫీలు దిగుతూ హుస్సేన్‌సాగర్ చుట్టూ ఉన్న అందాలను ఆస్వాదించారు.

- సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

న్యూస్‌రీల్

జూపార్కులో బెంగాల్ టైగర్ మృతి

- మూత్రపిండాల వ్యాధితో మృత్యువాత



బెంగాల్ టైగర్ జో (ఫైల్)

బహదూర్‌పురా: నెహ్రూ జూలాజికల్ పార్కులో పదేళ్ల వయసున్న రాయల్ బెంగాల్ టైగర్ జో మూత్రపిండాల సమస్యతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. జూపార్కులోని నిఖిల్, అపర్ణలకు పదేళ్ల క్రితం మగ పులి 'జో' జన్మించింది. ఆరు నెలలుగా జో ఆహారం తీసుకోకపోవడంతో జూ వెటర్నరీ వైద్యులు ప్రత్యేక పరీక్షలు జరిపి మూత్రపిండాల వ్యాధికి గురైనట్లు గుర్తించారు. చికిత్స అందించినా పరిస్థితిలో మార్పు రాలేదు. ఆహారం తీసుకోకపోవడంతో పూర్తిగా నీరసించిపోయిన జో బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు మృతి చెందినట్లు జూపార్కు అధికారులు తెలిపారు. వీబీఆర్ఐ, ల్యాంకోన్స్‌తో పాటు పశువైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. కాగా నెహ్రూ జూలాజికల్ పార్కులో గత కొంత కాలంగా పులులు, సింహాలు, ఎలుగుబంటి, అడవి దున్నలు తక్కువ వయసులోనే మూత్రపిండాలు, శ్వాసకోశ వ్యాధులు, కాలేయం చిన్నగా మారి మృత్యువాత పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత

శంషాబాద్: ప్రయాణికుడు అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. దుబాయ్ నుంచి ఈకే–524 విమానంలో వచ్చిన ప్రయాణికుడి కదలికలను అనుమానించిన అధికారులు అతడిని క్షుణ్ణంగా పరిశీలించారు. అతడి ప్యాంటుతో పాటు లోదుస్తులకు పేస్టుగా ఉన్న బంగారాన్ని పొరలుగా అతికించి 373 గ్రాముల బంగారం తీసుకొచ్చినట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.23 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు.

నేడు హనుమాన్ విజయ యాత్ర

గౌలిగూడ నుంచి తాడ్‌బండ్ వరకు...

- పెద్ద సంఖ్యలో హాజరుకానున్న భక్తులు
- సీసీ కెమెరాలతో నిఘా... రూట్ మొత్తం పోలీసుల బందోబస్తు
- వాహనదారులకు హెల్ప్‌లైన్ నంబర్లు: 040–27852482, 9010203626

హిమాయత్‌నగర్/సుల్తాన్‌బజార్: హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం తలపెట్టిన వీర హనుమాన్ విజయ యాత్రకు భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నాయకులు సన్నాహాలు పూర్తిచేశారు. ఉదయం 9 గంటలకు గౌలిగూడ రామమందిర్‌లో యజ్ఞంతో ప్రారంభమయ్యే ఈ యాత్రకు మొదటి పూజకు హరియాణా గవర్నర్ బండ్దారు దత్తాత్రేయ హాజరు కానున్నారు. ఈ యాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ రంగంలోకి దిగారు. సీసీ కెమెరాల నిఘాతో పాటు పటిష్ట బందోబస్తుకు పోలీసులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇక కోఠి ఆంధ్రా బ్యాంక్ చౌరస్తాలో వేలాదిమంది హనుమాన్ భక్తులతో సామూహిక హనుమాన్ చాలీసా నిర్వహించనున్నారు. వీర హనుమాన్ విజయయాత్రకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు తెలిపారు.

గౌలిగూడ టు తాడ్‌బండ్

'శ్రీ హనుమాన్ జయంతి విజయ యాత్ర'కు గౌలిగూడ టూ తాడ్‌బండ్ వరకు ప్రత్యేకమైన బందోబస్తుతో ఎవరికీ ఏవిధమైన ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టినట్లు ట్రాఫిక్ అడిషనల్ సీపీ జి.సుధీర్‌బాబు తెలిపారు. ట్రాఫిక్ సిబ్బందితో పాటు శాంతిభద్రతల సిబ్బంది సైతం ట్రాఫిక్ డ్యూటీలో ఉంటున్నట్లు తెలిపారు. యాత్ర సాగే రూట్‌లో ట్రాఫిక్ డైవర్షన్లు చేస్తూనే ప్రత్యామ్నాయ మార్గాలను సైతం సూచిస్తున్నామన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 7 గంటల సమయంలో సికింద్రాబాద్, దిల్‌సుఖ్‌నగర్, ఉప్పల్ వెళ్లేవారి కోసం రూట్‌ని కూడా సూచిస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు, వాహనదారులకు ఏమైనా అర్థం కాకపోయినా, సమస్యలున్నా నేరుగా 040–27852482, 9010203626 నంబర్లకు ఫోన్ చేయొచ్చన్నారు. ట్రాఫిక్ ఏర్పాట్లపై అడిషనల్ సీపీ సుధీర్‌బాబు బుధవారం మీడియాతో మాట్లాడి వివరాలు వెల్లడించారు. గౌలిగూడ యాత్ర ప్రారంభం నుంచి తాడ్‌బండ్ వరకు 12 కి.మీ.మేర యాత్ర కొనసాగనుంది. ఉదయం 11.30 గంటలకు గౌలిగూడ రామమందిరం నుంచి ఈ యాత్ర ప్రారంభం కానుంది. అక్కడి నుంచి కోఠి, సుల్తాన్‌బజార్, కాచిగూడ ఎక్స్‌రోడ్డు, నారాయణగూడ, కవాడిగూడ, బన్సీలాల్‌పేట్, మహంకాళి టెంపుల్, ప్యారడైజ్ ఎక్స్‌రోడ్డు మీదుగా తాడ్‌బన్ హనుమాన్ టెంపుల్ వరకు సాగుతుంది.



రూట్‌మ్యాప్‌ను వివరిస్తున్న సుధీర్‌బాబు

లష్కర్ సభకు భారీగా జనసమీకరణ

8న నగరానికి రానున్న ప్రధాని మోదీ

- ప్రధాని బహిరంగ సభకు నగరమే టార్గెట్
- బండి అరెస్ట్ నేపథ్యంలో పలువురి నేతల హౌస్ అరెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 8న సికింద్రాబాద్‌లో జరిగే ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభను భారతీయ జనతా పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మరో ఆరునెలల్లో ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ఈ సభను విజయవంతం చేయడం ద్వారా తెలంగాణలో పార్టీ బలంగా ఉందనే సంకేతాలివ్వాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే సుమారు 11 వేల కోట్ల అభివృద్ధి పనులు, వందే భారత్, 13 ఎంఎంటీఎస్ రైళ్లను ప్రారంభిస్తున్న ప్రధాని.. ఈ సభ ద్వారా రాష్ట్రంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారు. ఈ క్రమంలోనే పేరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే బహిరంగ సభకు సుమారు లక్ష మందిని తరలించాలని కమల నాయకత్వం నిర్ణయించింది. ప్రధానంగా హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల నుంచే భారీగా జనసమీకరణ చేయాలని భావిస్తోంది. తద్వారా అధిష్టానానికి పార్టీ పటిష్టతను చాటి చెప్పడంతో పాటు కేడర్‌లో మరింత ఉత్సాహాన్ని నింపవచ్చని అంచనా వేస్తోంది. ఇందుకోసం ఇప్పటికే ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం పోలింగ్ బూత్‌ల వారీగా లక్ష్యాలను విధించింది. ఒక్కో పోలింగ్ బూత్ నుంచి కనీసం వంద మందికి తగ్గకుండా వెంట తీసుకురావాలని ఆదేశించింది. ఉదయం 10.30 గంటలకు ఆయా పనులకు శంకుస్థాపన చేసి, అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభకు హాజరుకానున్నారు.

లక్ష చదరపు అడుగుల్లో షెడ్లు

భారీ జన సమీకరణతో పాటు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో పార్టీ శ్రేణులు, అభిమానులు కూర్చొనేందుకు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇప్పటికే మూడు భారీ షెడ్లు ఏర్పాటు చేశారు. అబిడ్స్, అంబర్‌పేట్, సనత్‌నగర్, సికింద్రాబాద్, మహేశ్వరం, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ముషీరాబాద్, ఉప్పల్, నాంపల్లి, రాజేంద్రనగర్, కల్వకుర్తి, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్, మేడ్చల్ నియోజకవర్గాలతో పాటు శివారులోని సంగారెడ్డి, మెదక్, యాదాద్రి భువనగిరి, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి భారీగా జనాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలతో పాటు దుబ్బాక, హుజూరాబాద్ నియోజకవర్గాల నుంచీ పెద్ద సంఖ్యలో జనసమీకరణ చేస్తున్నారు. ప్రధానితో పాటు పార్టీ అధినాయకత్వం కూడా ఈ సభకు హాజరయ్యే అవకాశం ఉండటంతో వారి ముందు బలప్రదర్శన చేసేందుకు ఎవరికి వారు పోటీపడుతున్నారు. మరో మూడు రోజు ల్లో నగరానికి ప్రధాని రానున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు ఆయా ఏర్పాట్లలో బిజీగా ఉంటే...పదో తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ కేసులో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను పోలీసులు అరెస్ట్ చేయడంపై బీజేపీ నేతలు భగ్గున మండిపడుతున్నారు. పలువురు నేతలను హౌస్ అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నారు.



రెడ్ అలర్ట్

- ప్రధాని పర్యటన నేపథ్యంలో సికింద్రాబాద్‌లో విస్తృతంగా తనిఖీలు



ముస్తాబైన 10వ నంబర్ ప్లాట్‌ఫామ్

సికింద్రాబాద్: సికింద్రాబాద్‌లో రెడ్అలర్ట్ కొనసాగుతోంది. ప్రధాని నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా పలు విభాగాల పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. బేగంపేట విమానాశ్రయం నుంచి పరేడ్‌మైదానం మీదుగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వరకు ఎక్కడ చూసినా పోలీసు పికెటింగ్‌లు ఏర్పాటు చేశారు. పరేడ్ మైదానం, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను ఇప్పటికే ఎస్‌పీజీ పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఎస్‌పీజీ బృందాలు బుధవారం కూడా ప్రధాని పర్యటించే రెండు ప్రాంతాలను సందర్శించి ఏర్పాట్ల తీరును పర్యవేక్షించారు. ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులతో సమన్వయం చేసుకుంటున్న ఎస్‌పీజీ అధికారులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

భద్రతకు 800 మంది

అన్ని రైల్వే డివిజన్ల నుంచి ఆర్‌పీఎఫ్ బృందాలను సికింద్రాబాద్‌కు రప్పిస్తున్నారు. ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీతోపాటు వివిధ విభాగాలు కలుపుకొని మొత్తంగా 800 మంది పోలీసుల నేతృత్వంలో రైల్వేస్టేషన్‌లో ప్రధాని భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లోని 10 ప్లాట్‌ఫామ్‌లను, పరిసర ప్రాంతాలను నిశితంగా సోదాలు చేస్తున్నారు. రైల్వేస్టేషన్‌లోనూ ప్రయాణికుల లగేజీలు తనిఖీ చేస్తున్నారు. జీఆర్‌పీ ఎస్‌పీ షేక్‌సలీమా, ఆర్‌పీఎఫ్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ దేబశ్మిత బెనర్జీ నేతృత్వంలో విస్తృతంగా తనిఖీలు, బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

ముస్తాబవుతున్న రైల్వేస్టేషన్

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ 10వ నెంబర్ ప్లాట్‌ఫామ్ నుంచి ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు. ఇందుకోసం బోయిగూడ ప్రవేశ ద్వారం నుంచి 10వ ప్లాట్ ఫామ్ వరకు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ప్లాట్‌ఫామ్ ఆసాంతం కాషాయం, తెలుపు వర్ణం వస్త్రాలతో అలంకరిస్తున్నారు. ఈ నెల 8న ఉదయం 11.10 గంటలకు బేగంపేట విమానాశ్రయంకు నరేంద్రమోదీ చేరుకోనున్నారు. 11.20 నిమిషాలకు వందే భారత్ రైలును జెండా ఊపి ప్రారంభిస్తారు.

బండి అరెస్టుపై నిరసనల వెల్లువ!



సాక్షి, సిటీబ్యూరో: బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్ట్‌ను నిరసిస్తూ బీజేపీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. లిక్కర్ స్కాం, లీకుల స్కాం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే బండి సంజయ్‌ను అరెస్ట్ చేశారని ఆరోపించారు. ఫిలింనగర్, గౌతం నగర్, అబిడ్స్, అంబర్ పేట్, కాచిగూడలోని నింబోలి అడ్డా, ఓల్డ్ బోయన్‌పల్లి, సైదాబాద్, మూసారంబాగ్ చౌరస్తా, బన్సీలాల్ పేట్, నాగారం, దమ్మాయిగూడ, రాజేంద్రనగర్ అంబేడ్కర్ చౌరస్తా, మల్లాపూర్, కుషాయిగూడ, మీర్‌పేట్, తుక్కుగూడ, పెద్ద అంబర్‌పేట్ తదితర ప్రాంతాల్లో ఆందోళనకు దిగారు. సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. నిరసనకారులను పోలీసులు అడ్డుకుని, అదుపులోకి తీసుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి సహా బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి సహా మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి తదితర కీలక నేతలను హౌస్ అరెస్ట్ చేశారు. రాష్ట్రంలో నియంతృత్వ పాలన కొనసాగుతోందని ఆరోపించారు. బీజేపీ శ్రేణులకు పోటీగా పలుచోట్ల బీఆర్‌ఎస్ నేతలు ఆందోళనకు దిగారు. బీజేపీ నేతలు విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్నారని ఆరోపించారు. పేపర్ లీకేజీతో సంబంధం ఉన్న ఏ ఒక్కరిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ఇటు బీజేపీ శ్రేణులు, అటు బీఆర్‌ఎస్ శ్రేణులు పోటాపోటీగా ఆందోళనలు చేపట్టడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

పాత కక్షలతోనే హత్య



ఆకాష్‌సింగ్ (ఫైల్)

టప్పాచబుత్రలో కాల్పుల కలకలం

- మృతుడు బీజేపీ నేత బంధువు

అబిడ్స్/గోల్కొండ: పాతబస్తీలోని టప్పాచబుత్రలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన కాల్పుల ఘటన ఈ ప్రాంతంలో కలకలం రేపింది. పాత కక్షల కారణంతో ఓ యువకుడిని రివాల్వర్‌తో కాల్చి...కత్తితో పొడిచి హత్య చేయడం విషాదం నింపింది. ఈ ఘటనపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..హరిదాస్‌నగర్‌కు చెందిన ఆకాష్‌సింగ్ (26) అలియాస్ చోటు, కార్వాన్ జాఫర్‌గూడకు చెందిన క్రాంతిసాగర్ మధ్య పాత కక్షలున్నాయి. గతంలో క్రికెట్ బుకీగా వ్యవహరించడంతో పాటు పలు వ్యాపారాలు చేసిన క్రాంతిసాగర్ గతేడాది దసరా ఉత్సవాల్లో ఆకాష్‌సింగ్‌తో చిన్న విషయంపై గొడవకు దిగారు. ఆ గొడవలో క్రాంతిసాగర్‌తో పాటు అతని స్నేహితులు మరో ముగ్గురిని ఆకాష్‌సింగ్ దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అప్పట్లో పోలీసులు ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఆకాష్‌సింగ్‌పై పగబూనిన క్రాంతిసాగర్ మంగళవారం రాత్రి పొద్దుపోయాక 12.30 గంటల సమయంలో ఆకాష్‌సింగ్ స్నేహితుడు ఇమ్రాన్‌కు ఫోన్‌చేసి టప్పాచబుత్రకు రమ్మన్నాడు. క్రాంతిసాగర్‌తో సయోధ్య కుదిరిస్తానని చెప్పడంతో ఆకాష్‌సింగ్ తన ఇంట్లో చెప్పి అక్కడకు వచ్చాడు. ఆకాష్‌సింగ్ ఇమ్రాన్‌తో మాట్లాడుతుండగా వెనుకనుంచి వచ్చిన క్రాంతిసాగర్ అనుమతి లేని రివాల్వార్‌తో ఆకాష్‌సింగ్ తలపై, చాతిలో అతి దగ్గరగా మూడు రౌండ్లు కాల్పులు జరపడంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. దీంతో పాటు కత్తితో కూడా ఆకాష్‌సింగ్‌ను పొడిచాడు. విషయం తెలుసుకున్న టప్పాచబుత్ర పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆకాష్‌సింగ్‌ను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందాడని డాక్టర్లు ధృవీకరించారు.

మృతుడు కార్వాన్ బీజేపీ నేత బంధువు

ఆకాష్‌సింగ్ కార్వాన్ బీజేపీ ఇన్‌చార్జి అమర్‌సింగ్‌కు మేనల్లుడు. కార్వాన్‌లో ఆకాష్‌సింగ్ మృతితో విషాదఛాయలు అలుముకున్నాయి. ఉస్మానియా ఆసుపత్రికి ఆకాష్‌సింగ్ బంధువులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

పోలీసుల అదుపులో నిందితులు

క్రాంతిసాగర్‌తో పాటు అతని ఇద్దరి స్నేహితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. వారి వద్ద హత్యకు ఉపయోగించిన రివాల్వర్, కత్తినికూడా స్వాధీనపరచుకున్నట్లు తెలిసింది. ఈ కేసును టప్పాచబుత్ర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



అమీర్‌పేటలో..



ఎండ..వాన!

- సిటీలో విచిత్ర వాతావరణం
- పగలు వేసవి తాపం... సాయంత్రం వర్షం

నగరంలో వర్షపాతం ఇలా (రాత్రి 9 గంటల వరకు)

ప్రాంతం	మిల్లీ మీటర్లు
టోలిచౌకీ	21.8
బంజారాహిల్స్	17.3
వెంకటేశ్వరకాలనీ	11.0
శ్రీరాంనగర్	8.8
ఆసిఫ్‌నగర్	8.0
మైత్రివనం	7.5

సాక్షి, సిటీబ్యూరో: మధ్యాహ్నం వరకు భగభగ మండిన ఎండలతో నగరవాసులు ఇబ్బందులు ఎదుర్కోగా.. సాయంత్రం వేళ వరుణుడు ఒక్కసారిగా దంచి కొట్టడంతో నగరమంతా చల్లబడింది. తొలుత కొద్ది పాటి వర్షం ఉపశమనం కలిగించగా, సాయంత్రం ఆకాశంలో ఒక్కసారిగా మబ్బులు కమ్ముకొని భారీ వర్షం ముంచెత్తింది. ఉరుములు, మెరుపులతో గంట పాటు హడలెత్తించింది. ఎప్పటిలాగే వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ట్రాఫిక్ స్తంభించింది. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. గత మూడు రోజులుగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత ప్రభావం కనిపించింది. పలు చోట్ల సాధారణం కంటే నాలుగు నుంచి ఆరు డిగ్రీల ఉష్ణోగ్రత అధికంగా నమోదైంది. ఇక బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, అమీర్‌పేట్, ఖైరతాబాద్, మెహిదీపట్నంలలో భారీ వర్షం కురిసింది. కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్ పరిసర ప్రాంతాల్లో ఒక మోస్తరుగా వర్షం కురిసింది. కొన్నిచోట్ల ఉరుములు, మెరుపుల శబ్దానికి నగరవాసులు వణికి పోయారు.

వాతావరణ శాఖ సూచన

ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో మరో మూడురోజుల పాటు తేలిక పాటి నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. శివార్లలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని అధికారులు హెచ్చరించారు.



బంజారాహిల్స్‌లో..





ముంచెత్తిన అభిమానం

బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా బుధవారం పలువురు నేతలు, సంఘాల ప్రతినిధులు, అధికారులు బషీర్‌బాగ్‌లో ఆయన విగ్రహానికి భారీ ఎత్తున పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గొప్ప సంఘసంస్కర్త జగ్జీవన్ రామ్


నివాళులర్పిస్తున్న జలమండలి ఎండీ దాన కిశోర్

సాక్షి, సిటీబ్యూరో : స్వాతంత్ర్య సమరయోధుడిగా, సంఘసంస్కర్తగా, రాజకీయవేత్తగా జగ్జీవన్ రామ్ దేశానికి విశేష సేవలందించారని జలమండలి ఎండీ దానకిశోర్ కొనియాడారు. బుధవారం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో జరిగిన మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. అణగారిన వర్గాలు, కార్మికులకు హక్కులు కల్పించడంలో ఎంతో కృషి చేశారన్నారు.

కార్మికుల భద్రతలో ముందంజ

జలమండలి తమ కార్మికుల కోసం మంచి పనులు చేయడంలో, వారికి భద్రత కల్పించడంలో ఎప్పుడూ ముందుంటుందని ఎండీ దాన కిశోర్ వెల్లడించారు. మానవ రహిత పారిశుద్ధ్య పనులు చేపట్టిందని, మ్యాన్ హోళ్లలో దిగకుండానే పనులు చేపట్టేలా యంత్రాలతో శుభ్రం చేసే ప్రత్యేకంగా ఎయిర్ టెక్ మిషన్లను జలమండలి రూపొందించిందన్నారు. ఇది దేశంలోనే మొదటిసారి అని, దీనికి పీఎం కార్యాలయంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రశంసలు అందుకున్నామన్నారు. కార్మికుల భద్రతను మరింత పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. అనంతరం ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ యూనియన్ నాయకులు జలమండలి ప్రధాన కార్యాలయం నుంచి ఎల్బీ స్టేడియం వద్దనున్న జగ్జీవన్ రామ్ విగ్రహం వరకు చేపట్టిన ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్

నివాళులర్పించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్

బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జీహెచ్‌ఎంసీ కమిషనర్ డీఎస్ లోకేశ్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ నివాళి

సాక్షి, సిటీబ్యూరో: బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ అని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 116వ జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జగ్జీవన్ రామ్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



డబ్బుల కోసం జబ్బుల సృష్టి!

- ముఖ్యమంత్రి సహాయ నిధుల కోసం నలుగురి కుట్ర
- సహకరించిన నల్లగొండ, ఖమ్మంలోని ఆస్పత్రులు
- నగదు మంజూరు చేశాక గుర్తించిన అధికారులు
- కేసు నమోదు చేసిన హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు
- మరికొన్ని బిల్లులు ఇలా నకిలీవే అనే అనుమానాలు

హిమాయత్‌నగర్: నకిలీ వైద్య బిల్లులతో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) నుంచి నగదు మంజూరు చేయించుకుని కాజేసిన వ్యవహారంపై హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో (సీసీఎస్) కేసు నమోదైంది. ప్రాథమిక సమాచారం ప్రకారం నలుగురు నిందితులతో పాటు రెండు ఆస్పత్రుల పైనా ఇది రిజిస్టరైంది. దర్యాప్తు నేపథ్యంలో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు చెబుతున్నారు. అనారోగ్యం బారినపడిన వారిని ఆదుకోవడానికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి నిధులు మంజూరవుతూ ఉంటాయి. ఆయా ఆస్పత్రుల్లో చేరడానికి ముందే రోగులు దరఖాస్తు చేసుకుంటే లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసీ) ఇవ్వడం ద్వారా ఉచిత వైద్యం అందేలా అధికారులు చర్యలు తీసుకుంటారు. ఎల్‌ఓసీ జారీ కావడానికి కొంత సమయం పడుతుంది. ఈ నేపథ్యంలోనే అనివార్య కారణాలు, అత్యవసర పరిస్థితుల్లో ముందే ఆస్పత్రుల్లో చేరి వైద్యం చేయించుకున్న వాళ్లు ఆ మొత్తాన్ని రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకుంటారు. ఈ బిల్లుల్ని స్క్రూటినీ చేసే కమిటీ ఎంత మంజూరుకు సిఫార్సు చేస్తుందో ఆ మొత్తం రోగుల ఖాతాల్లోకి బదిలీ అవుతాయి. నల్లగొండ జిల్లా జన్‌పహాడ్‌కు చెందిన బి.జ్యోతి, బి.లక్ష్మి, మంగళ్ దుబ్బతండాకు చెందిన ధీరావత్ నగర్ మిర్యాలగూడలోని మహేష్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో, పోల్యాతండాకు చెందిన రమావత్ శివ ఖమ్మం నెహ్రూనగర్‌లోని శ్రీ వినాయక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చికిత్స పొందినట్లు నాలుగు బిల్లులు సీఎంఆర్‌ఎఫ్‌కు చేరాయి. వీటిని పరిశీలించిన సీఎంఆర్‌ఎఫ్ కార్యాలయం రూ.1,52,196, రూ.1,50,567, రూ.1,50,272, రూ.1,55,854 మంజూరు చేస్తూ తమ రెవెన్యూ విభాగానికి ఫైల్ పంపింది. దీని ఆధారంగా ఆ మొత్తం మంజూరు చేసిన సీఎంఆర్‌ఎఫ్ రెవెన్యూ అధికారులు ఆ మొత్తాలను రోగుల ఖాతాల్లోకి బదిలీ చేశారు. ఆపై అధికారులు చేపట్టిన వెరిఫికేషన్‌లో భాగంగా ఈ నాలుగు బిల్లులపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆస్పత్రులతో కలిసి కొందరు కుట్ర చేసి సీఎంఆర్‌ఎఫ్ నిధులు కాజేసినట్లు ఆరోపిస్తూ రెవెన్యూ డిపార్ట్‌మెంట్ (సీఎంఆర్‌ఎఫ్) సెక్షన్ ఆఫీసర్ డీఎస్ఎన్ మూర్తి గత నెల 21న సైఫాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇలాంటి బిల్లులు మరికొన్ని వచ్చి ఉండచ్చని, రాష్ట్ర వ్యాప్తంగా ఈ స్కామ్ మూలాలు ఉంటాయని అనుమానించారు. దీంతో కేసు పరిధి నేపథ్యంలో దర్యాప్తు నిమిత్తం సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఈ ఫైల్ అందుకున్న ఇక్కడి అధికారులు గత శుక్రవారం ఐపీసీలోని 420, 468, 471, 120 (బీ) రెడ్ విత్ 34 సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్‌ను రీ-రిజిస్టర్ చేసి దర్యాప్తు ప్రారంభించారు. జ్యోతి, లక్ష్మి, ధీరావత్, శివలతో కలిసి కుట్ర పన్నిన ఆస్పత్రులు నకిలీ బిలుల్లు జారీ చేయడం ద్వారా కమీషన్ పొందాయా? లేక ఆస్పత్రుల పేరుతో ఈ నలుగురూ లేదా ఈ నలుగురి పేర్లతో పాటు ఆస్పత్రుల పేరులో మరెవరైనా బోగస్ బిల్లులు తయారు చేసి సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారా? అనే కోణాల్లో సీసీఎస్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయం నిర్ధారించడానికి రోగులుగా చెప్పుకున్న నలుగురి వివరాలు ఆరా తీయడంతో పాటు ఆస్పత్రులకు నోటీసులు జారీ చేయనున్నారు.

సాధారణంగా సీఎంఆర్‌ఎఫ్ దరఖాస్తులన్నీ ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల సిఫార్సులతో వారి వ్యక్తిగత సహాయకుల ద్వారానే సీఎంఆర్‌ఎఫ్‌కు వస్తాయి. ఇవి కూడా అలానే వచ్చాయా? అదే జరిగితే ఆయా ఎమ్మెల్యేలను కలిసింది ఎవరు? వారిని తీసుకువచ్చింది ఎవరు? తదితర కోణాల్లోనూ సీసీఎస్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఉదంతం నేపథ్యంలో ఇతర దరఖాస్తులనూ సీఎంఆర్‌ఎఫ్ అధికారులు పరిశీలించాలని నిర్ణయించారని తెలిసింది. ఈ వ్యవహారంలో ఉన్న దళారుల అంశాన్ని అటు సీఎంఆర్‌ఎఫ్, ఇటు పోలీసు అధికారులు సీరియస్‌గా తీసుకున్నారని సమాచారం.

'త్యాగరాయగానసభ ఆధునిక దేవాలయం'


డాక్టర్ కొమ్ము వెంకటరమణకు పురస్కారం అందజేస్తున్న మధుసూదనాచారి

చిక్కడపల్లి: త్యాగరాయగానసభ ఆధునిక దేవాలయం అని తెలంగాణ తొలి స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. బుధవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగారాయగానసభలో గానసభ పూర్వాధ్యక్షుడు కళావెంకటదీక్షితులు జయంతి సందర్భంగా డాక్టర్ కొమ్ము వెంకటరమణకు కళా వెంకట దీక్షితులు స్మారక పురస్కార ప్రదానోత్సవం అందజేశారు. సభకు ప్రస్తుత అధ్యక్షుడు కళావీఎస్ జనార్ధనమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మధుసూదనాచారి మాట్లాడుతూ.. గానసభ వ్యవస్థాపకులు కళా సుబ్బారావు, కళావెంకట దీక్షితులు కారణజన్ములు అని అన్నారు. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో నైపుణ్యం పొందాలి

మేడ్చల్‌రూరల్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించాలని మంత్రి మల్లారెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్ లింబాద్రిలు అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ టెక్నికల్, ఈసీ కళాశాలల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. వార్షికోత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న వారు మాట్లాడుతూ విద్యార్థులు తమ చదువులు పూర్తి అయ్యేంత వరకు జల్సాలకు దూరంగా ఉండాలని అప్పుడే భవిష్యత్ స్వర్ణమయం అవుతుందన్నారు.

సందడి చేసిన హీరో నాగచైతన్య...

సీఎంఆర్ టెక్నికల్ కళాశాల వార్షికోత్సవంలో సినీ హీరో అక్కినేని నాగచైతన్య సందడి చేశారు. విద్యార్థి దశ విలువైందని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత శిఖరాలకు చేరాలని కోరారు. అంతకు ముందుకు మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడారు.


సీఎంఆర్ టెక్నికల్ కళాశాల వార్షికోత్సవంలో సినీ హీరో నాగచైతన్య, మంత్రి మల్లారెడ్డి

భారతి అల్ట్రా ఫాస్ట్‌తో వేగంగా నిర్మాణ ప్రక్రియ

సైదాబాద్: సిమెంట్ రంగంలో వినియోగదారుల మన్ననలు విశేషంగా పొందుతూ దేశంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రా ఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను విడుదల చేసిందని హైదరాబాద్ టెక్నికల్ ఇంజినీర్ నితీష్ యాదవ్ తెలిపారు. బుధవారం ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలోని శ్రీజగదీశ్వరీ ట్రేడర్స్ వద్ద తాపీ మేస్త్రీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతం అవుతుందన్నారు. పిల్లర్లు, బ్రిడ్జ్‌లు, రహదారుల నిర్మాణంలో భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ సరైన ఎంపిక అన్నారు. అల్ట్రా ఫాస్ట్ వినియోగదారులకు ఉచితంగా సాంకేతిక సహాయం కూడా అందజేస్తామని ఆయన తెలిపారు. స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని వివరించారు. శ్రీజగదీశ్వరీ ట్రేడర్స్ యజమాని, డీలర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, భారతి సిమెంట్ వారి సర్వీస్ చాలా వేగంగా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా 60 మంది తాపీమేస్త్రీలకు రూ. లక్ష ప్రమాద బీమా బాండ్లను అందజేసారు. ప్రమాద బీమా అందజేయడంపై సమావేశంలో పాల్గొన్న తాపీ మేస్త్రీలు సంతోషం వ్యక్తం చేసారు.


తాపీ మేస్త్రీకి ప్రమాద బీమా బాండ్ అందజేస్తున్న నితీష్ యాదవ్, డీలర్ శ్రీనివాస్

తెలంగాణ టూరిజం శాఖ సొమ్ము స్వాహా

నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు

హిమాయత్‌నగర్ : టూరిజం శాఖకు చెల్లించాల్సిన మొత్తం చెల్లించకుండా రూ.70 లక్షలు స్వాహా చేసిన క్రెడిట్, డెబిట్ కార్డుల సర్వీస్ ప్రొవైడర్‌పై శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. హిమాయత్‌నగర్‌లోని 'తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్'(టీఎస్‌టీడీసీ)కు చెందిన టూరిజం స్పాట్స్‌కు హగ్లీ టెక్నాలజీస్ యజమాని జయచందర్ డెబిట్, క్రెడిట్ కార్డుల సర్వీస్‌ను అందిస్తుంటాడు. ఆయా ప్రాంతాల్లో కార్డులు స్వైప్ చేసిన సొమ్ములో కమీషన్ మినహాయించుకుని మిగతా సొమ్మును టూరిజం శాఖకు చెల్లించా. అయితే కొంతకాలంగా జయచందర్ టూరిజం శాఖకు ఇవ్వాల్సిన డబ్బును ఇవ్వకుండా వ్యక్తిగతంగా వినియోగించుకున్నాడు. ఏడాది కాలంలో దాదాపు రూ.70 లక్షలు కాజేశాడు. దీనిపై ఫైనాన్స్ జీఎం సమాధానం.. జయచందర్‌ను నిలదీయడంతో కొంత డబ్బు చెల్లించాడు. మార్చి 31న అకౌంట్ సెటిల్‌మెంట్‌కు జయచందర్‌ను హిమాయత్‌నగర్‌లోని కార్యాలయానికి సమాధానం పిలిచారు. ఆ సమయంలో ఇద్దరి మధ్యా వాదోపవాదాలు జరగ్గా మహిళా అధికారైన సమాధానంను దుర్భాషలాడాడు. దీంతో ఆమె ఉన్నత అధికారులకు, నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు.


హైకోర్టు ఆవరణలో జరిగిన హెచ్‌సీఏఏ (హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్) వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ నవీన్‌రావు, జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ శ్రీనివాస్‌రావు, అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు రఘునాథ్, కృష్ణారెడ్డి, మల్లారెడ్డి, నరేందర్ తదితరులు –సాక్షి, హైదరాబాద్

ప్రత్యామ్నాయ సంస్కృతి కోసం సాహిత్య వేదిక

సాక్షి, సిటీబ్యూరో: ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీన పరిచి దేశ రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ ప్రయత్నాలకు వ్యతిరేకంగా గళమెత్తాల్సిన అవసరముందని జి.విమల గద్దర్ తెలిపారు. ఈ కార్యాచరణలో భాగంగా గద్దర్ సాహిత్య సాంస్కృతిక వేదికను ప్రారంభించామని, దీనికి సంబంధించి గురువారం అల్వాల్‌లోని యాదమ్మ నగర్ డా.జీవి.చంద్రకిరణ్ స్మారక మందిరంలో ఆవిర్భావ సదస్సును నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఉద్యోగ రిజర్వేషన్లు ఉన్న రైల్వే, విమాన తదితర పెద్ద పరిశ్రమలన్నీ ప్రైవేటు పరమైతున్న తరుణంలో ప్రత్యామ్నాయ సంస్కృతిపైన పోరాటం చేయాల్సిన అవసరముందని అన్నారు. ప్రైవేటీకరణతో చేతివృత్తులన్నీ అంతరించి, కులవృత్తులపైన ఆధారపడిన ప్రజలు తీవ్ర సంక్షోభంలోకి చేరుకోనున్నారని తెలిపారు.

ఇదేంది 'బై'!

- అసైన్డ్, సీలింగ్ భూములకు పట్టా
- సర్వేనంబర్లకు బై నంబర్లు వేసి మార్పు
- రిజిస్ట్రేషన్ శాఖలో ఒకలా.. ధరణిలో మరోలా ఉంటున్న వివరాలు
- రెవెన్యూ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: నిన్న మొన్నటి వరకు అసైన్డ్, సీలింగ్, భూదాన్, వక్ఫ్ జాబితాలో ఉన్న భూములు సడన్‌గా పట్టా భూములుగా మారుతున్నాయి. అసలు సర్వే నంబర్లు మాయమై.. వాటి స్థానంలో కొత్తగా అనేక బై నంబర్లు పుట్టుకొస్తున్నాయి. రాత్రికి రాత్రే భూముల క్లాసిఫికేషన్లు మారిపోతున్నాయి. అంతేకాదు ఒకే రెవెన్యూ పరిధి.. ఒకే సర్వే నంబర్‌లోని భూముల వివరాలు.. ఇటు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌లో ఒకలా.. అటు 'ధరణి' వెబ్‌సైట్‌లో మరోలా నమోదు చేసి తీవ్ర గందరగోళం సృష్టిస్తున్నారు.

- ఇబ్రహీంపట్నం మండలం ఆదిబట్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 44లో 13.26 ఎకరాల భూమి ఉంది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ విభాగంలో సీలింగ్ సర్‌ప్లస్ లాండ్‌గా నమోదై ఉంది. కానీ ధరణిలో ఇదే సర్వే నంబర్‌కు ఇటీవల బై నంబర్లు పుట్టుకొచ్చాయి. నిషేధిత జాబితాలో ఉన్న భూమి పట్టా భూమిగా మారింది. అధికారులు ఏ ఆధారాలతో దీన్ని పట్టా భూమిగా మార్చారో ఇప్పటికీ అంతు చిక్కడం లేదు.
- అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాచారం రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్లు 86, 90, 93, 99, 100, 101లలో సుమారు 17 ఎకరాల భూమి ఉంది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్‌లో అర్బన్ ప్రొహిబిటెడ్ జాబితాలో నమోదై ఉంది. అంటే ఈ భూములు అమ్మడం, కొనడంపై నిషేధం. కోర్టు కేసులో ఉన్న ఈ భూమి 'ధరణి'లో పట్టా భూమిగా ఎలా మారిందో అర్థం కావడం లేదు.
- మహేశ్వరం మండలం కొంగరకుర్దు- ఎలో సుమారు 500 ఎకరాల వక్ఫ్ భూమి ఉంది. 1954 నుంచి ఇప్పటి వరకు పట్టా కాలమ్‌లో సయ్యద్ షారాజ్ ఖత్తార్ హుస్సేన్‌సాబ్ దర్గా పేరు ఉంది. సర్వే నంబర్లు 85, 86, 88, 89లోని 58 ఎకరాల భూమిని వక్ఫ్ భూమిగా పేర్కొంటూ 2008లో అప్పటి ప్రభుత్వం గెజిట్ కూడా జారీ చేసింది. ఈ వక్ఫ్ భూమి పట్టా భూమిగా ఎలా మారిందనేదీ అంతు చిక్కడం లేదు. కొంగరకుర్దు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 82లోని అరెకరాల వక్ఫ్ భూమికి సైతం పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేసి, ఆ తర్వాత రద్దు చేయడం జిల్లా రెవెన్యూ అధికారులకే చెల్లింది.
- మాడ్గుల మండలం ఇర్విన్ రెవెన్యూ పరిధిలో రాజబహదూర్ కుటుంబానికి సర్వే నంబర్లు 186, 299, 534,539,716,845,1152,1198, 1236,1240,1306, 1406,1413,1414లలో వంద ఎకరాలకుపైగా భూమి ఉంది. నాలుగు సర్వే నంబర్లలో ఏకంగా 24.35 ఎకరాల భూమిని సక్సేషన్ పద్ధతిలో భూ మార్పిడి ఎలా చేశారనేదీ అంతు చిక్కడం లేదు. కొంత మంది రెవెన్యూ అధికారులు అడిగినంత ముట్టచెబితే చాలు ఏదైనా చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నాటడంపైనే దృష్టి.. సంరక్షణపై కాదు..

- హరితహారంలో అధికారుల తీరు
- సంరక్షణ లేక ఎండుతున్న మొక్కలు
- జిల్లాలో 30 శాతం ఎండిపోయిన హరితహారం మొక్కలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేస్తున్న హరితహారం లక్ష్యాన్ని పూర్తి చేయాలనే ధ్యాస తప్ప వాటి సంరక్షణపై అధికారులు శ్రద్ధ చూపటం లేదు. హరితహారంలో భాగంగా పట్టణాల్లో నర్సరీలను పురపాలక సంఘాలు, పంచాయతీల్లో నర్సరీలను డీఆర్డీఏ పర్యవేక్షిస్తోంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటి వరకు 8 విడతలుగా హరితహారంలో దాదాపు 4.88 కోట్ల మొక్కలు నాటారు. అధికారిక లెక్కల్లో జియో ట్యాగింగ్ రూపంలో వాటి లెక్కలు కనపడుతున్నాయి తప్ప.. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. కొన్ని పంచాయతీలు, పురపాలక సంఘాల పరిధిలో వాటి సంరక్షణపై శ్రద్ధ చూపుతుండగా మరి కొన్ని చోట్ల పూర్తిగా నిర్లక్ష్యంగా చేస్తున్నారు. మొక్కలు నాటే సమయంలో చూపుతున్న శ్రద్ధ, పర్యవేక్షణ, సంరక్షణ చర్యల్లో కనిపించటం లేదు. నర్సరీల నిర్వహణకు రూ. లక్షల్లో వ్యయం చేసి మొక్కలు పెంచి, వాటిని సంరక్షణ చేయకుండా గాలికి వదిలేయటం వల్ల ప్రజాధనం వృథా అవుతోంది.

వ్యయం ఇలా..

ఒక్కో నర్సరీలో మొక్కల పెంపకానికి కూలీకి రూ. 257 రోజువారీగా చెల్లిస్తున్నారు. ఒక్కో మొక్క నాటేందుకు, పాదులు తీసేందుకు రూ.37 వరకు చెల్లిస్తున్నారు. రక్షణ కంచెకు రూ. 6 వరకు, నీరు పోసేందుకు రూ.3 చెల్లిస్తున్నారు. ఇంత వ్యయం చేసి మొక్కను బతికించుకోకుంటే నిధులు వృథా అవుతున్నాయి. పంచాయతీ, పట్టణాలకు వచ్చే పల్లె, పట్టణ ప్రగతి నిధులు, ఇతర గ్రాంట్స్ పదిశాతం వరకు హరితహారానికి వెచ్చిస్తున్నారు. ఇటు హరితహారంలో మొక్కలు బతకపోగా అటు పంచాయతీలు, పురపాలికల్లోని నిధుల్లో నుంచి పది శాతం కోతతో ఇతర అభివృద్ధి పనులకు ఆటంకాలు తప్పటం లేదు.

టార్గెట్ పూర్తిచేస్తారంతే..

ప్రతి ఇంటికి అయిదు చొప్పున మొక్కలు అందజేస్తున్నారు. వాటిని కేవలం లక్ష్యం కోసం అందిస్తున్నారే తప్ప అవసరమైనవి అందించక పోవటంతో ఇంటి యజమానులు వాటిని నాటడం లేదు. ఇంటి ఆవరణ లేని వారికి సైతం ఇవ్వటంతో వృథాగా పడేస్తున్నారు. ఇళ్ల ఆవరణలో నాటేందుకు అనువుగా ఉండే పండ్లు, పూల మొక్కలు అందిస్తే కొంత వరకు ప్రయోజనకరంగా ఉంటుంది.

పర్యవేక్షణ కొరవడి...

జిల్లాలో గ్రామాలు, పట్టణాల మధ్య రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కల సంరక్షణలో పర్యవేక్షణ లోపం కనిపిస్తోంది. శాఖల మధ్య కొరవడిన సమన్వయంతో మొక్కలకు నీరందటం లేదు. దీంతో మొక్కలు ఎండిపోతున్నాయి. జిల్లాలో మూడు చింతలపల్లి, ఉద్దమర్రి, కేశ్వాపూర్, కేశవరం, అలియాబాద్, మజీద్‌పూర్, ఎదులాబాద్, కొర్రెముల, రావల్‌కోల్, సోమారం, ఎల్లంపేట, శ్రీరంగవరం, బండమాదారం, తిమ్మాయిపల్లి, కీసర , అంకిరెడ్డిపల్లి, యాద్గార్‌పల్లి గ్రామాల్లో మొక్కలకు నీటి నిర్వహణ సరిగా లేకపోవటంతో ఎండిపోతున్నాయి. మేడ్చల్, ఘట్కేసర్,దుండిగల్, బోడుప్పల్, నిజాంపేట్, గుండ్లపోచంపల్లి, నాగారం, తూముకుంట, కొంపెల్లి పురపాలక సంఘాల్లోని పలు కాలనీల్లో కూడా మొక్కలు వాడిపోతున్నాయి

ఎండిపోయిన 30 శాతం మొక్కలు

మండుతున్న ఎండల్లో మొక్కల సంరక్షణపై ప్రస్తుతం అధికార యంత్రాంగం తీసుకుంటున్న ప్రత్యేక చర్యలు ఏమీ లేవని తెలుస్తోంది. దీంతో హరితహారం మొక్కలు ఎండిపోతున్నాయి.ఇలా జిల్లాలో 30 శాతం మొక్కలు ఎండిపోయాయి. డీఆర్‌డీఏ, అటవీ, పంచాయతీ, మున్సిపాలిటీతోసహా సంబంధిత శాఖలు, స్వచ్ఛంధ సంస్థలు ఎండుతున్న మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపేలా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

TUITIONS
Bridge Course for 10th Completed Students. Maths, All Subjects Tuitions for Intermediate. 9 Students per Batch. 100% Personal Care. 100% Improvement Guarntee. Contact: 85230 58441 [B-13]

Real Estate

PLOT FOR SALE
హైదరాబాద్ @ రామోజీఫిల్మ్‌సిటీ దగ్గర కొత్తగూడెం ఫ్రూట్ మార్కెట్ & HMDA లాజిస్టిక్ హబ్ పక్కనే ఉన్న మాన్యూ HMDA వెంచర్‌లో ఇల్లు కట్టుకునే ప్లాట్లు కలవు. Ph: 9666645756 [HA-2459]

కేవలం 2 లక్షలకే 121 చ.గ. ఫామ్ ప్లాట్ కొనండి. ప్రతి ప్లాట్‌పై ఖచ్చితమైన బహుమతులు గెలుపొందండి. Breeza కారు,హీరో బైక్స్-10, LED T.V. లు-10, A/C లు-10 మరెన్నో బహుమతులు. 9154047151, 9700518878. [WA-6935]

Services

BUSINESS SERVICE
మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739 [H-792847]

LOST
I, Mididoddi Raj Kumar S/o. Mididoddi Lingaiah. I Lost my original Passport No.B2670086 While Renovation my House, Any Body Find Call: 9652257572 [H-797564]

I, VEERAMALLA SRIKANTH S/o. VEERAMALLA VENKATAIAH R/o. H.No :- 7-8/C, Bank colony, Pedda Amberpet, Abdulla purmet, Ranga Reddy, T.S. I have lost my original Sale Deed Document & Link Documents. Doc No:- 4273/2017. while traveling from my house to LB Nagar on 02/04/2023, if anybody found call 7799683634 [H-796886]

Wanted

సెక్యూరిటీ గార్డులు కావలెను. 8గం॥ల డ్యూటీ జీతం: 20,000 to 25,000, రూం + భోజనం ఫ్రీ వయస్సు: 40 సం॥లలోపు Ph: 9912343565/ 9000861616 [HA-10706]

టెలీకాలర్స్ డ్రైవర్స్, (కార్లు, ట్రాలీ), డేటా ఎంట్రీ, రిపోర్టర్లు, వెబ్ డిజైనింగ్, వీడియో ఎడిటింగ్, సూ.వైజర్, టీచర్లు, లెక్చరర్స్, హెల్పర్స్, ఆయాలు, మేస్త్రీలు, వర్కర్లు కా॥ జీ. 15-25K+ హాస్టల్ @ 9505261777 ఫీజు లేదు. [H-797609]

ప్రముఖ కార్పొరేట్ కంపెనీ Uppal లో Marketing కొరకు GM/ MM/ BDE/ BDO/ Telecallers M/F కావలెను. గృహిణులు మరియు రిటైర్డ్ Persons కి ప్రత్యేకత కలదు. Ph: 9100009678 [H-781459]

అర్జంటుగా సెక్యూరిటీ గార్డులు కావలెను. కూకట్‌పల్లి, తెల్లాపూర్, యాదగిరి గుట్ట, నిజామాబాద్ ఏరియాలలో రూం + Food + ESI + PF సౌకర్యం కలదు. Ph: 9398915299/ 8639110999 [HA-10707]

ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795299]

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం, జీ: 18K ఏజెంట్ కమీషన్ 3K.ఫోన్: 9848571888 [H-793408]

టిఫిన్ సెంటర్‌లో పని చేయుటకు అనుభవం గల సూపర్ వైజర్స్ కావలెను ఇక్కడే ఉండి చేసుకునే వారికి. మంచి జీతం+ భోజనం+ వసతి కలదు. 9666934949. [H-792851]

మ్యాన్ పవర్ & సెక్యూరిటీ ఫీల్డ్‌లో అనుభవమున్న ఫీల్డ్ ఆఫీసర్స్ కావలెను. Contact : Mega Group Man Power & Security. Cell : 70326 10569, 70931 25169. [NA-5483]

ఇంటర్‌మీడియెట్ కాలేజ్‌లో పనిచేయుచున్న లెక్చరర్లు, స్టాఫ్, స్కూల్ టీచర్లు, సంప్రదించగలరు. సెల్. ✆ 78426 66755 [B-25]

శ్రీలక్ష్మి హోమ్‌కేర్: Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబీకేర్ ఇంటి/వంటపనికి స్త్రీ/పు॥ కావలెను. జీతం: 16k-18k రూం+మీల్స్‌ఫ్రీ ✆9347148051 [G-540]

Wanted Telecallers & RS (F) for Banking Process of Business & Mortgage Loans At T: Salary + Inc Language - Telugu, Hindi, English. Ph: 9949144400 [HA-870]

Wanted Accountants, Sales Executive Company Name Santhosh Electrical Services Location KPHB, Hyd Call / Watsapp: 9014203882 [H-793647]

Urgent Need Female Tele callers for tax related services and Personal Loans frshr or exp can apply @SR NAGAR 8008807890 [H-781559]

Work From Home MNC Req. Retired/VRS, Housewifes Emp/Un Emp. M/F, p/f time. Age: 30 + only. Good Income. Ph:7036332956 [HA-92856]

Work From Home in MNC, Training and Support System Provided, Any Back ground People Can Work with us. Whats App: Name, Age, Qly. Ph: 9603221166. [HA-1101]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి
హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు), ప్రతి అదనపు లైనుకు రూ. 540/-
గమనిక : జాబ్‌పై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

జోన్ సెంటర్స్

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9010188892	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9010213322
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

క్లుప్తంగా

రంజాన్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి



ముస్లిం మహిళలకు కానుకలు అందజేస్తున్న గోపీనాథ్

రహమత్‌నగర్: పవిత్ర రంజాన్‌ను శాంతియుతంగా జరుపుకోవాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పిలుపునిచ్చారు. బోరబండలోని ఆచార్య జయశంకర్ కమ్యూనిటీహాల్లో బుధవారం బీఆర్ఎస్ పార్టీ తరఫున ముస్లిం మహిళలకు ఆయన కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల పండుగలకు కానుకలు అందించడం తనకు ఆనవాయితీగా వస్తుందన్నారు. డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణమోహన్, ఇన్‌చార్జ్ సిరాజ్, కో ఆర్డినేటర్ విజయసింహ, మైనారిటీ అధ్యక్షుడు సర్దార్, షేక్ షరీఫ్, ఫయాజ్‌ఖాన్, ఇర్ఫాన్, అహ్మద్, సత్తార్, మోయిజ్, ముక్రం, యూసుఫ్ పాల్గొన్నారు.

వర్క్‌ఫ్రం హోం పేరుతో లూటీ

ఇన్వెస్ట్‌మెంట్ చేపించి రూ.20లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: అత్యాశకు పాల్పడ్డ ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు సైబర్ నేరగాళ్లు భారీ టోకరా వేశారు. బాధితుడి నుంచి ఇన్వెస్ట్‌మెంట్ చేపించి లక్షల రూపాయిలు కాజేశారు. తనకు న్యాయం చేయాలంటూ బాధితుడు బుధవారం సిటీ సైబర్‌క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. వెంగళరావునగర్‌కు చెందిన ఓ యువకుడు ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఓ వ్యక్తి పార్ట్‌టైం జాబ్ ఇస్తానని, అది కూడా వర్క్‌ఫ్రం హోం అన్నాడు. తక్కువ సమయంలో లక్షలు సంపాదించొచ్చని చెప్పాడు. వివరాలన్నీ సేకరించిన తర్వాత జాబ్ వచ్చేలోపు ఇన్వెస్ట్ చేయమని సూచించాడు. తొలుత పెట్టిన పెట్టుబడికి కొంత లాభాలు ఇచ్చి నమ్మకాన్ని కలగచేసుకున్నాడు. ఆ తర్వాత రూ.20 లక్షలు పలు దఫాలుగా పెట్టించి వాటిలో ఒక్క రూపాయి లాభాలు ఇవ్వకపోగా మరిన్ని డబ్బులు కావాలంటూ వేధిస్తున్నాడు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసుల సాయం కోరగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


సమస్యలపై బస్తీ కమిటీ ప్రతినిధులు దృష్టి సారించాలి



బస్తీ కమిటీని అభినందిస్తున్న సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: సమస్యల సాధనలో బస్తీ కమిటీ ప్రతినిధులు ముందుండాలని కార్పొరేటర్ సీఎన్. రెడ్డి కేసీఆర్‌నగర్ బస్తీ నూతన కార్యవర్గానికి సూచించారు. నూతనంగా ఎన్నికైన కేసీఆర్ బస్తీ కమిటీ ప్రతినిధులు బుధవారం సీఎన్‌రెడ్డిని కలిసి బస్తీ అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎన్. రెడ్డి మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కేసీఆర్ బస్తీ అభివృద్ధిపై ప్రత్యేకశ్రద్ధ పెట్టారని తెలిపారు. డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మన్సూర్, ప్రధాన కార్యదర్శులు సుబ్బరాజు, శ్రీనివాస్, బస్తీ అధ్యక్షుడు మాధవ్, జనరల్ సెక్రటరీ ఆంజనేయులు, వెస్ ప్రెసిడెంట్లు సుధాకర్, రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాము, ఆర్గనైజింగ్ సెక్రటరిలు కుమార్, కమృద్ధిన్, దుర్గయ్య మేఘన పద్మ, శంకర్, రాజు, మల్లేష్ పాల్గొన్నారు.

భారీ వర్షం.. రోడ్లు జలమయం



బంజారాహిల్స్‌లో కురుస్తున్న వర్షం

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం పడింది. మధ్యాహ్నం వరకు సూర్యుడితాపానికి తల్లడిన ప్రజలు రాత్రి 7.30 గంటల ప్రాంతంలో కురిసిన భారీ వర్షంతో చల్లబడ్డారు. తొలుత కాసేపు జల్లులు పడి నిలిచిపోయింది. రాత్రి మరోసారి అందుకున్న వర్షం భారీగా పడింది. దీంతో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరనగర్, పంజాగుట్ట, నందినగర్ తదితర ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. తెలంగాణ భవన్ ముందు భారీగా వరదనీరు చేరుకొంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లోని కొన్ని రహదారుల్లో ట్రాఫిక్‌కు సైతం అంతరాయం ఏర్పడింది.

స్ఫూర్తి ప్రదాత బాబూ జగ్జీవన్‌రామ్



కొత్త చెరువు వద్ద.. ఎమ్మెల్యే దానం నాగేందర్



వేడుకల్లో ఖైరతాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి

బంజారాహిల్స్: బాబూ జగ్జీవన్‌రాం జయంతి వేడుకలు బుధవారం వాడవాడలా ఘనంగా జరిగాయి. సామాజిక సమానత్వం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి బాబూజీ తన జీవితాన్ని అంకితం చేశారని ఫిలింనగర్ మహనీయుల చౌరస్తాను, బీజేఆర్‌నగర్ కొత్త చెరువు వద్ద జగ్జీవన్‌రాం విగ్రహాలకు పూలమాలలు వేసిన అనంతరం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కొనియాడారు. బాబూజీకి ఘననివాళి అర్పించిన ఆయన మాట్లాడుతూ.. బాబూజీ చూపిన మార్గం అందరికీ అనుసరణీయం అన్నారు. ఖైరతాబాద్ కాంగ్రెస్ నేత డాక్టర్ రోహిణ్‌రెడ్డి బాబూజీ జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి బంజారాహిల్స్‌లోని తన కార్యాలయంలో బాబూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, ఖైరతాబాద్, సోమాజిగూడ, చింతలబస్తీ ప్రాంతాల్లో ప్రత్యేకంగా కార్యక్రమాలు ఏర్పాటుచేసి బాబూజీ జాతికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.

ఎర్రగడ్డ డివిజన్‌లో..

శ్రీనగర్‌కాలనీ: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను బుధవారం ఎర్రగడ్డ డివిజన్‌లో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సంజీవ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, శ్రీకాంత్, బాలకృష్ణ, ప్రభాకర్, తరుణ్, దయానంద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

ఎర్రగడ్డ డివిజన్‌లో గ్రేటర్ జనరల్ సెక్రటరీ రవిగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి హాజరై నివాళులర్పించారు.

ఖైరతాబాద్ లైబ్రరి చౌరస్తాలో..

ఖైరతాబాద్: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఖైరతాబాద్ లైబ్రరి చౌరస్తాలో ఏర్పాటుచేసిన వేడుకల్లో కార్పొరేటర్ విజయారెడ్డి పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎస్.కె.షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీఆర్ హిల్స్‌లో..

రహమత్‌నగర్: జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయమని జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని ఎస్పీఆర్‌హిల్స్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకుడు భవానీ శంకర్, వినోద్‌కుమార్, జేపీ జ్ఞానేశ్వర్, నాగరాజు, రాములు, కేశవులు, సాయి, ఎర్రగడ్డ డివిజన్ నాయకుడు కష్ణమోహన్ పాల్గొ న్నారు.



నివాళులర్పిస్తున్న ఎర్రగడ్డ బీఆర్ఎస్ నేతలు



ఫిలింనగర్ మహనీయుల చౌరస్తాలో నివాళులర్పిస్తున్న దృశ్యం



నివాళులర్పిస్తున్న బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ నరేందర్



నివాళులర్పిస్తున్న జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ సీనియర్ నేత మామిడి నర్సింగ్‌రావు



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి

నేడు హనుమాన్ శోభాయాత్ర



హనుమాన్ శోభాయాత్ర నిర్వాహకులతో సమావేశమైన పంజగుట్ట పోలీసులు

బంజారాహిల్స్: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని నేడు హనుమాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించేందుకు శోభాయాత్ర నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 8 ప్రాంతాల్లో శోభాయాత్ర జరగనున్న నేపథ్యంలో పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 9 చోట్ల, పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు చోట్ల శోభాయాత్రలు నిర్వహించనున్నారు. ఇందు కోసం అదనపు బలగాలను మోహరిస్తున్నారు. తెల్లవారుజాము నుంచే శోభాయాత్రలను నిర్వహించే ప్రాంతాల్లో పోలీసు పికెటింగ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. శాంతియుత వాతావరణంలో శోభాయాత్ర నిర్వహించుకోవాలని పోలీసులు సూచించారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో అదనంగా 20 మంది పోలీసులను నియమించారు. పటిష్టమైన నిఘా ఏర్పాటుచేసినట్లు అధికారులు తెలిపారు. దారిపొడవునా సీసీ కెమెరాలు కూడా వినియోగంలోకి తీసుకురానున్నారు. మఫ్టీ పోలీసులతో నిఘా ఏర్పాటుచేశారు. ఇప్పటికే ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను రూపొందించారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి ఈ శోభాయాత్ర నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాటుచేశారు.

మద్యం దుకాణాలు బంద్..

హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు గురువారం ఉదయం 6 గంటల నుంచి శుక్రవారం ఉదయం 6 గంటల వరకు మద్యం దుకాణాలు మూసివేస్తూ పోలీసులు నోటిఫికేషన్ జారీ చేశారు. మద్యం దుకాణాలతోపాటు పబ్బులు, బార్లు, కల్లు దుకాణాలు మూసివేయాలని నగర సీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు.

ప్రేమ పేరుతో వేధిస్తున్న యువకుడిపై కేసు

బంజారాహిల్స్: ప్రేమ పేరుతో తన కుమార్తె వెంటపడి వేధిస్తున్న నిందితుడిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు శివ అనే యువకుడిపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 2లోని ఇందిరానగర్‌లో నివసించే యువతిని కొంత కాలంగా శివ అనే యువకుడు ప్రేమిస్తున్నాని వెంటపడుతూ ఒప్పుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తున్నాడు. ఆ యువతి పేరును టాటూ వేయించుకోవడమే కాకుండా ఆమెను దారి కాచి వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ నెల 3న మధ్యాహ్నం యువతి కళాశాల నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా శివ వెంటపడి ప్రేమిస్తున్నాని వేధించాడని, తనకు ఫోన్‌లో తెలిపిందని, టార్చర్ భరించలేకపోతున్నానని రోదించిందని బాధితురాలి తల్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్: ప్లాట్ అమ్ముతావా లేదా అంటూ బెదిరింపులకు పాల్పడటమే కాకుండా తన కార్యాలయంలో అక్రమంగా ప్రవేశించి ఫర్నిచర్ ధ్వంసం చేశారంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు నిందితులైన శేఖర్‌రెడ్డి, హరిచరణ్‌గౌడ్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. బంజారాహిల్స్ రోడ్ నంబరు 14లోని నందినగర్‌లో హెచ్ సూర్యకు కార్యాలయం ఉంది. ఈనెల 4న రాత్రి శేఖర్‌రెడ్డి, హరిచరణ్‌గౌడ్‌తోపాటు మరో ముగ్గురు ఆయన కార్యాలయంలోకి అక్రమంగా ప్రవేశించారు. రాజేంద్రనగర్ బద్వేల్‌లో ఉన్న ప్లాట్‌ను అమ్మాలంటూ ఒత్తిడి తీసుకొచ్చారు. ఒప్పుకోకపోవడంతో కొట్టేందుకు యత్నించారు. అసభ్య పదజాలంతో దూషిస్తూ కార్యాలయంలోని కుర్చీలు, టేబుళ్లు ధ్వంసం చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

సనత్‌నగర్: పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రభుత్వం చేపట్టే చర్యలకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. బేగంపేట డివిజన్‌లోని మినర్వాహౌస్‌లో వాల్మీకి సఫాయి కర్మచారి సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన సులభ్ కాంప్లెక్స్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇష్టానుసారంగా చెత్తా చెదారం పారబోయడంతో ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించేలా అనేక కార్యక్రమాలను జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అదేవిధంగా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ప్రధాన కేంద్రాలు, అధిక రద్దీ ఉండే ప్రాంతాల్లో సులభ్ కాంప్లెక్స్‌లు, టాయిలెట్స్‌ను నిర్మించినట్లు వివరించారు.

భర్త చికిత్సకు వచ్చి రోడ్డు ప్రమాదంలో భార్యకు గాయాలు

బంజారాహిల్స్: భర్త చికిత్స కోసం వచ్చిన భార్య రోడ్డు ప్రమాదానికి గురై ఒకే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన ఇది. వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా సామ్య తండాకు చెందిన గుగులోతు మంగీలాల్‌కు కేన్సర్ చికిత్స చేయించేందుకు వారం క్రితం భార్య చాందిని అతన్ని బసవతారకం ఆసుపత్రికి తీసుకొచ్చింది. ఒకవైపు ఆసుపత్రిలో చికిత్స జరుగుతుండగా మంగళవారం ఆమె టిఫిన్ తినడానికి వెళ్లి తిరిగి వస్తుండగా అటుగా వచ్చిన ద్విచక్ర వాహనం ఆమెను ఢీకొట్టడంతో గాయాలపాలైంది. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే ఆమెను బసవతారకం ఆసుపత్రికి తీసుకెళ్లారు. దీంతో భార్యాభర్తలిద్దరూ ఒకే ఆసుపత్రిలో చికిత్స పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'అరాచకాలు సృష్టించడమే బీజేపీ నాయకుల లక్ష్యం'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాగంటి, కార్పొరేటర్లు

వెంగళరావునగర్: రాష్ట్రంలో నిరంతరం ఏదో ఒక ప్రాంతంలో అరాచకాలు సృష్టించడమే బీజేపీ నాయకుల ప్రధాన లక్ష్యమని బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆరోపించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాగంటి మాట్లాడుతూ.. అరాచకాల్లో భాగంగానే పదో తరగతి లీకేజీ పేరుతో బండి సంజయ్ నేతృత్వంలో కుట్రలకు తెరతీశారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వాన్ని ఏదో రకంగా అప్రతిష్టపాలు చేయాలనే లక్ష్యంతో కొన్ని నెలలుగా బీజేపీ నేతలు అనేక కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని సరైన మార్గంలో ఉండకపోతే ప్రజలు వెంటపడి తరిమే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో బీజేపీ చేసే కుట్రలను సమర్థవంతంగా ఎదుర్కొని మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాజ్‌కుమార్, దేదీప్య విజయ్, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప జన్మనక్షత్ర మహోత్సవాలు



అయ్యప్ప ఆలయంలో స్వామివారి జన్మనక్షత్ర మహోత్సవాలు

బంజారాహిల్స్: శ్రీనగర్‌కాలనీలో వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో కొలువుదీరిన అయ్యప్ప స్వామి జన్మనక్షత్ర మహోత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు శ్రీనివాసశర్మ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకల్లో ఉదయం 5 గంటలకు సుప్రభాత దర్శనం, మహాగణపతి హోమం, మహన్యాస పూర్వక లఘు రుద్రాభిషేకం(ఆవు నెయ్యితో) పడిపూజ, భజన, మధ్యాహ్న హారతి కనుల పండువగా నిర్వహించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. సాయంత్రం జరిగిన అయ్యప్ప పల్లకీ సేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి జరిగిన భజన, హారతి, హరివారసనంలో భక్తులు వందలాదిగా విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకోగా ఆలయ వర్గాలు తగిన ఏర్పాట్లు చేశాయి. ఆలయ ఈఓ లావణ్య స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఈ వేడుక వైభవంగా నిర్వహించినందుకు అర్చకులను అభినందించారు.

అవార్డుల ప్రదానం



అవార్డు గ్రహీతలతో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షుడు రవి మాడభూషి

బంజారాహిల్స్: రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ రోటరీ వొకేషనల్ ఎక్సలెన్స్ అవార్డ్స్– 2023 ప్రదానోత్సవ కార్యక్రమం జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో కనుల పండుగగా జరిగింది. ఎస్ఎస్‌పీడీఎల్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరక్టర్ సురేష్ చల్ల, డిస్ట్రిక్ట్ గవర్నర్(3150) రాజశేఖర్‌రెడ్డి తాళ్ల, అసిస్టెంట్ గవర్నర్ భుజంగరావు తదితరులు ఈ అవార్డులను అందజేశారు. రాఘవరావు మెమోరియల్ అవార్డును అకార్ ఆశ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ భరతేంద్ర, ఈశ్వ ఫౌండేషన్ ఫర్ ఎడ్యుకేషన్, హెల్త్‌కేర్ బ్లడ్ వారియర్స్, సామవేద మ్యూజిక్ అకాడమీ, షాహిన్ ఉమెన్ రీసోర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లకు ఈ అవార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ ప్రెసిడెంట్ రవి మాడభూషి, కార్యదర్శి మీరా ఏరుబండి, అవార్డుల కమిటీ చైర్‌పర్సన్ చంపకరావు తదితరులు పాల్గొన్నారు.

'బండి'ని తక్షణమే విడుదల చేయాలి



కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నేతలు

వెంగళరావునగర్: ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేసిన బండి సంజయ్‌ను తక్షణమే విడుదల చేయాలని బీజేపీ సీనియర్ నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో బండి సంజయ్ అరెస్టును నిరసిస్తూ యూసుఫ్‌గూడ, మధురానగర్ ప్రధాన రహదారుల్లో బుధవారం ఆందోళనా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారిపై సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయా నేతలు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను ఎత్తిచూపితే అరెస్టులు చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టి అక్రమాలకు పాల్పడుతుందని విమర్శించారు. ఆయా కార్యక్రమాల్లో ఆ పార్టీ నేతలు ప్రేమ్‌కుమార్, సుప్రియాగౌడ్, అట్లూరి రామకృష్ణ, విజయ్, చంద్రమోహన్, కనకరాజు, మధుసూదన్, మహేష్, నర్మద, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలి



చలో ఢిల్లీ కార్యక్రమానికి బయలుదేరిన సీఐటీయూ నాయకులు

వెంగళరావునగర్: కేంద్రం అనుసరిస్తున్న మతోన్మాద విధానాలను దేశ ప్రజలంతా కలిసికట్టుగా వ్యతిరేకించాలని పలువురు సీఐటీయూ నేతలు పిలుపునిచ్చారు. బుధవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీలో జరుగుతున్న బహిరంగ సభకు జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి మంగళవారం రాత్రి పలువురు సీఐటీయూ నేతలు తరలివెళ్లారు. ఇందులో భాగంగా పలు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బోరబండ, రహమత్‌నగర్ చౌరస్తా, యూసుఫ్‌గూడ, మధురానగర్ తదితర ప్రాంతాల్లో సీఐటీయూ నేతలు మాట్లాడుతూ.. కేంద్రం ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని తెలియజేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉపాధి హామీ పనికి నిధులు పెంచాలని, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. చంద్రశేఖర్‌రావు, రాపర్తి అశోక్, భిక్షపతి, బీఆర్.నాయుడు, పాపారావు, ఆచారి పాల్గొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 47, పచ్చకాకర 45, పందిరి బీర 45, క్యాబేజీ 12, క్యారెట్ 17, దొండ 35, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 65, గోకరకాయ 50, కీర 13, దోసకాయ 23, బీట్‌రూట్ 18, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 18, చామగడ్డ 55, మొరంగడ్డ 19, కందగడ్డ 40, సొరకాయ 9, పొట్లకాయ 15 మునగకాయ 4–6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

అక్రమంగా తాగునీటి పైప్‌లైన్ వేసుకున్న వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్: తన ఇంట్లోకి అక్రమంగా తాగునీటి పైప్‌లైను వేసుకున్న నిందితుడిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. ఎల్లారెడ్డిగూడ ఎస్పీహెచ్ కాలనీ ప్లాట్ నంబరు 38లో రమాకాంత్ అనే వ్యక్తి 25ఎంఎం వాటర్ కనెక్షన్‌ను పగులగొట్టి అదనంగా అనుమతులు లేకుండానే 15ఎంఎం వాటర్ కనెక్షన్‌ను తీసుకున్నట్లు సమాచారం అందడంతో ఎల్లారెడ్డిగూడ జలమండలి సెక్షన్ మేనేజర్ శ్యాం కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాము ఎలాంటి తాగునీటి కనెక్షన్ అనుమతిని వ్వలేదని, అడ్డదారిలో జలమండలి సిబ్బంది కళ్లుకప్పి అక్రమంగా 15 ఎంఎం వాటర్ కనెక్షన్ తీసుకున్న రమాకాంత్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పండ్ల వ్యాపారిపై దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

బంజారాహిల్స్: మద్యం మత్తులో న్యూసెన్స్‌కు పాల్పడటమే కాకుండా పండ్ల వ్యాపారిపై కత్తితో దాడి చేసి గాయపర్చిన ఘటనలో నిందితుడిని బుధవారం జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. శ్రీరాంనగర్ చౌరస్తాలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన పవన్‌కుమార్ అనే యువకుడు కొంత కాలంగా పండ్లు విక్రయిస్తున్నాడు. ఇదే ప్రాంతానికి చెందిన మహ్మద్ జుబేర్ ఈ నెల 4న సాయంత్రం పవన్‌కుమార్ వద్దకు వచ్చి అకారణంగా గొడవకు దిగాడు. బండిని పక్కకు జరపాలంటూ మద్యం మత్తులో హెచ్చరించాడు. వినకపోవడంతో బండి మీద ఉన్న కత్తితో పవన్‌కుమార్‌పై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో పవన్‌కుమార్ గాయలయ్యాయి. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం స్థానికులు ఆసుపత్రికి తరలించారు. నిందితుడిపై ఐపీసీ సెక్షన్ 307 కింద కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

క్లుప్తంగా...

'డాక్టర్' గారు వచ్చేశారు!

- నేటి నుంచి పూర్తి స్థాయిలో 'ఫ్యామిలీ డాక్టర్'
- పల్నాడు జిల్లా లింగంగుంట్లలో ప్రారంభించనున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: ప్రజలు, ప్రభుత్వ వైద్యుల మధ్య అనుబంధాన్ని బలపరచడం ద్వారా మెరుగైన వైద్య సంరక్షణపై ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దృష్టి సారించింది. గ్రామీణ ప్రజలు చిన్న చిన్న అనారోగ్య సమస్యలకు ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతిష్టాత్మక 'ఫ్యామిలీ డాక్టర్' విధానానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారు. గత ఏడాది అక్టోబర్ 21 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మొదలైన ట్రయల్ రన్ విజయవంతం కావడంతో పూర్తి స్థాయిలో అమలు చేయనున్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్లలో ముఖ్యమంత్రి జగన్ చేతుల మీదుగా ఫ్యామిలీ డాక్టర్ విధానం పూర్తి స్థాయిలో అమలు కార్యక్రమం గురువారం ప్రారంభం కానుంది. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉన్న కుటుంబాలు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా తమ కుటుంబ వైద్యుడిని సంప్రదిస్తున్నారు. వారి ఆరోగ్యం పట్ల సంబంధిత వైద్యుడు నిరంతరం ఫాలోఅప్‌లో ఉంటారు. ఆయా కుటుంబాల్లోని వ్యక్తుల ఆరోగ్యంపై డాక్టర్‌కు సమగ్ర అవగాహన ఉంటుంది. ఒక అనుబంధం ఏర్పడి ఆ కుటుంబానికి మెరుగైన వైద్య సంరక్షణ అందుతుంది. ఇదే తరహాలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సంరక్షణ ఉచితంగా అందించాలన్నది ఫ్యామిలీ డాక్టర్ విధానం లక్ష్యం.

'మార్గదర్శి' కేసులో ఏ-2 శైలజ విచారణ నేడు

▶ మొదటి పేజీ తరువాయి

రామోజీరావే నిధుల మళ్లింపు నిజమేనని దాదాపుగా అంగీకరించడంతో ఈ కేసులో సీఐడీ కీలక పురోగతి సాధించినట్లయింది. ఈ నేపథ్యంలోనే ఈ కేసులో ఏ-2గా ఉన్న చెరుకూరి శైలజ కిరణ్‌ను గురువారం విచారించనుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. శైలజను హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆమె నివాసంలోనే విచారించనున్నారు. రామోజీరావు, శైలజ స్టేట్‌మెంట్లను విశ్లేషించిన అనంతరం ఈ కేసులో తదుపరి చర్యలకు ఉపక్రమించాలని సీఐడీ భావిస్తోంది. వారిద్దరినీ ఆంధ్రప్రదేశ్‌కు పిలిపించి మరీ విచారించేందుకు సీఐడీ సంసిద్ధమవుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

'చుక్కల' చిక్కుల్లేవ్!

చుక్కల భూములకు శాశ్వత విముక్తి కల్పించిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: భూముల చరిత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరో విప్లవాత్మక ముందడుగు వేసింది. రాష్ట్రంలో దశాబ్దాలుగా స్తంభించిపోయిన చుక్కల భూముల సమస్యను శాశ్వతంగా పరిష్కరించింది. ఒకేసారి 15 జిల్లాల్లో 2.06 లక్షల ఎకరాల చుక్కల భూములను నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగించి రైతన్నలకు ఊరట కల్పించింది. రెవెన్యూ శాఖ నిర్వహించిన సుమోటో వెరిఫికేషన్ ద్వారా రికార్డులన్నింటినీ పూర్తిగా పరిశీలించి చుక్కల నుంచి విముక్తి కల్పించింది. ''22 ఏ (1) ఇ''నుంచి తొలగిస్తూ ఇప్పటికే 10 జిల్లాలకు సంబంధించిన జీవోలు జారీ కాగా మిగతావి త్వరలో వెలువడనున్నాయి. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో అత్యధికంగా 43 వేల ఎకరాల చుక్కల భూములకు విముక్తి లభించింది. ఈ భూములను రైతులు ఇక స్వేచ్ఛగా అమ్ముకోవచ్చు. వాటిపై రుణాలు పొందేందుకు కూడా ఎలాంటి ఇబ్బంది ఉండదు.



భూముల సమస్యలపై స్పెషల్ ఫోకస్
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీర్ఘకాలంగా పేరుకుపోయిన భూముల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. దేశ చరిత్రలో ఏ రాష్ట్రం చేయని విధంగా అన్ని భూములను రీ సర్వే చేస్తోంది. షరతులు గల పట్టా భూములను 22 ఏ జాబితా నుంచి తొలగించడంతో కృష్ణా జిల్లా అవనిగడ్డలో 18 వేల ఎకరాలకు సంబంధించి రైతులకు మేలు జరిగింది. అనాధీనం, ఖాళీ కాలమ్ భూముల సమస్యను పరిష్కరించేందుకు చట్టాన్ని మార్చింది. కృష్ణా, గోదావరి డెల్టాలోని లంక భూములకు డి పట్టాలిచ్చేందుకు నిబంధనలను సవరించింది. అదే క్రమంలో చుక్కల భూముల సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తోంది.

1.81 లక్షల సర్వే నెంబర్ల రీ-వెరిఫికేషన్: సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రాష్ట్రంలో చుక్కల భూములన్నింటినీ సుమోటోగా రీ వెరిఫికేషన్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా చుక్కల భూముల పేరుతో ఉన్న 4.06 లక్షల ఎకరాలను రెవెన్యూ యంత్రాంగం సుమోటోగా రీ వెరిఫికేషన్ చేసింది. ఆర్డీవోలు, తహశీల్దార్లు 1.81 లక్షల సర్వే నెంబర్లలోని 4.06 లక్షలపైగా ఎకరాలకు సంబంధించిన భూములను రీ వెరిఫికేషన్ చేశారు.

చుక్కల భూములంటే?

ఆంగ్లేయుల హయాంలో నిర్వహించిన రీ సర్వేలో కొందరు భూ యజమానులు సర్వేకు ముందుకు రాకపోవడం, భూమి ఎవరిదో నిర్ధారించలేకపోవడంతో ఆర్ఎస్ఆర్-1లోని పట్టాదార్ కాలమ్, రిమార్క్స్ కాలమ్‌లో మూడు చుక్కలు పెట్టి వదిలేశారు. శిస్తు కట్ట లేని రైతులు సర్వేకు విముఖత చూపడంతో ఆ భూములు ఎవరివో రికార్డుల్లో నమోదు కాలేదు. ఇక ఆ తర్వాత మళ్లీ సర్వే జరగలేదు. రికార్డులు అలా చుక్కలతోనే ఉండడంతో వాటిని చుక్కల భూములుగా వ్యవహరిస్తున్నారు.

టీడీపీని కలుపుకొందామని బీజేపీని కోరాం

నాదెండ్ల మనోహర్ పరోక్షంగా వెల్లడి



సాక్షి, అమరావతి: టీడీపీని కూడా పొత్తులో కలుపుకొనిపోదామని బీజేపీ పెద్దలను కోరినట్లు జనసేన నాయకుడు నాదెండ్ల మనోహర్ పరోక్షంగా వెల్లడించారు. ఢిల్లీ పర్యటన అనంతరం ఆయన బుధవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. టీడీపీతో పొత్తు గురించి బీజేపీ నాయకులతో మాట్లాడారా? అని మీడియా ప్రశ్నించగా.. స్పందిస్తూ.. 'రాజకీయాలు అన్నాక అన్ని అంశాలూ చర్చకు వస్తాయి'అని జవాబిచ్చారు. 'బీజేపీ పెద్దలతో పవన్‌కల్యాణ్ భేటీలో భాగంగా రాష్ట్ర రాజకీయాల గురించి మాట్లాడాం. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని మేము తీసుకున్న నిర్ణయాన్ని వారికి వివరించాం. వాళ్లు కూడా అర్థం చేసుకున్నారు. త్వరలోనే అన్ని పార్టీలూ కలిసి వైఎస్సార్‌సీపీ విముక్త ఏపీ కోసం పనిచేసే విధంగా ముందుకు వెళ్తాం'అని మనోహర్ చెప్పారు. కాగా, టీడీపీతో పొత్తుకు బీజేపీ పెద్దలు అంగీకరించడం లేదని వార్తలు వస్తున్నాయని ప్రశ్నించగా.. 'అది మీడియా ఎవరో ఒకరు చెబుతున్న మాటే'అని బదులిచ్చారు.

మా పొత్తు జనసేనతో మాత్రమే

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



సాక్షి, అమరావతి: బీజేపీ, జనసేన పార్టీలు మాత్రమే కలిసి ముందుకెళ్తాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు చెప్పారు. బుధవారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఢిల్లీ పర్యటన, టీడీపీతో పొత్తు గురించి మీడియా ప్రశ్నించగా.. సోము వీర్రాజు జవాబిచ్చారు. బీజేపీ, జనసేన కలిసే ఉన్నాయని.. కలిసే ముందుకెళ్తాయని చెప్పారు. అందువల్లే పవన్ కల్యాణ్ ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడిని, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిని కలిశారని పేర్కొన్నారు. పవన్‌ను చంద్రబాబు, చంద్రబాబును పవన్ కలిసినంత మాత్రాన.. వాళ్లు రాజకీయంగా ఒక్కటైనట్టు కాదన్నారు. రాష్ట్రపతి ఎన్నికల సమయంలో చంద్రబాబు వద్ద తాను కూడా కూర్చున్నానని గుర్తు చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ, జనసేన కలిసి పోరాడుతాయని తెలిపారు. రాజకీయాల్లో ఏదీ వ్యూహం ప్రకారం జరగవన్నారు.

అభ్యర్థులు లేకపోవడంతోనే పొత్తులకు వెంపర్లాట

టీడీపీ, జనసేనను ఉద్దేశించి మంత్రి ఆదిమూలపు సురేశ్ వ్యాఖ్య



ఒంగోలు: 'పవన్‌కల్యాణ్ నిలకడలేని మనిషి. ఆయనకు ఒక సిద్ధాంతం, భావజాలం లేవు. ఆయన చేస్తున్నది రాజకీయంలా అనిపించడం లేదు. రాజకీయ వ్యభిచారంలా ఉంది'అని మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేశ్ అన్నారు. బుధవారం ఒంగోలులో ఆయన మీడియాతో మాట్లాడారు. పవన్‌కల్యాణ్ ఒక వైపు బీజేపీతో అంటకాగుతూ.. మరోవైపు టీడీపీతో ఒప్పందంలో ఉంటారని విమర్శించారు. ఆయన ఏ పార్టీతో పొత్తులో ఉన్నారో కనీసం ప్రజలకైనా స్పష్టత ఇవ్వాలన్నారు. 175 నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు లేకపోవడం వల్లే టీడీపీ, జనసేన పార్టీలు పొత్తుల కోసం వెంపర్లాడుతున్నాయని విమర్శించారు. ఇలాంటి వారు గుంపులు గుంపులుగా వచ్చినా.. వైఎస్ జగన్ నేతృత్వంలో 175 నియోజకవర్గాల్లో గెలిచి తీరుతామన్నారు. తాము చేసిన సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలపై ఉన్న నమ్మకంతోనే గడప గడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడుతున్నామని తెలిపారు.

కన్నులపండువగా సీతారాముల కల్యాణం



మాంగల్యాన్ని చూపుతున్న వేదపండితులు

- భక్తులతో కిటకిటలాడిన ఒంటిమిట్ట

సాక్షి ప్రతినిధి, కడప/ఒంటిమిట్ట: సాక్షి ప్రతినిధి, కడప/ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో వైభవంగా జరుగుతున్న శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి సీతారాముల కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. పున్నమి వెన్నెల్లో జరిగిన ఈ కల్యాణాన్ని వేలాదిమంది భక్తులు కనులారా తిలకించి తరించారు. శ్రీసీతారాముల కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చిన వేలాదిమంది భక్తులకు శ్రీవారి సేవకులు ముత్యంతో కూడిన తలంబ్రాలను పంపిణీ చేశారు. అంతకుముందు శ్రీసీతారాముల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ శోభాయాత్రగా ఆలయం నుంచి కల్యాణవేదికకు తీసుకొచ్చారు. శ్రీకోదండరాముడి కల్యాణం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, కొట్టు సత్యనారాయణ దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.

వైభవంగా ముగిసిన శ్రీవారి వసంతోత్సవాలు



వసంత మండపానికి ఊరేగింపుగా బయలుదేరిన ఉత్సవమూర్తులు

తిరుమల: మూడురోజులుగా తిరుమలలోని వసంతోత్సవ మండపంలో వైభవంగా నిర్వహించిన సాలకట్ల వసంతోత్సవాలు బుధవారం పరిసమాప్తమయ్యాయి. తొలి రోజు, రెండవరోజు శ్రీ మలయప్ప స్వామివారు ఉభయ దేవేరులతో కలసి వసంతోత్సవంలో పాల్గొన్నారు. చివరిరోజున శ్రీ భూ సమేత మలయప్పస్వామితో పాటు శ్రీ సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి వారు, శ్రీరుక్మిణీ సమేత శ్రీకృష్ణ స్వామివారు వసంతోత్సవంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామి, సీతా రామలక్ష్మణ ఆంజనయ స్వామి, రుక్మిణీ సమేత శ్రీకృష్ణుల వారిని ఒకే వేదికపై భక్తులు దర్శించుకున్నారు.

175 స్థానాల్లో పోటీచేస్తామని నీకెందుకు చెప్పాలి?

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు



సాక్షి, విశాఖపట్నం: 'రాష్ట్రంలో 175 స్థానాల్లో పోటీచేస్తామని నీకెందుకు చెప్పాలి. నువ్వెవరు నన్నడగడానికి. 175 స్థానాల్లోను ఓడిస్తాం. పులివెందులలో కూడా. టీడీపీని లేకుండా చేయడం జగన్ వల్లే కాదు. ఆయన్ని పుట్టించిన దేవుడి వల్ల కూడా కాదు..' అని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. విశాఖపట్నంలో బుధవారం నిర్వహించిన టీడీపీ ఉత్తరాంధ్ర జోనల్-1 సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీతో పెట్టుకున్న జగన్ పార్టీని బంగాళాఖాతంలో కలిపేస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చాక తాడేపల్లిలో జగన్ ప్యాలెస్ కూల్చడానికి నిమిషం పట్టదని చెప్పారు. ముందస్తు ఎన్నికలు వచ్చినా, 2024లో వచ్చినా గెలిచేది తెలుగుదేశమేనని చెప్పారు. పార్టీని బలోపేతం చేసేందుకు ఎవరు వచ్చినా పార్టీలో చేర్చుకుందామన్నారు.

త్వరలోనే శంషాబాద్‌కు ఎంఎంటీఎస్ సర్వీసులు

- ఫలక్‌నుమా నుంచి ఉందానగర్‌కు 20 సర్వీసుల పొడిగింపు
- శంషాబాద్ నుంచి లింగంపల్లి వరకు ప్రయాణ సౌలభ్యం

శంషాబాద్: శంషాబాద్ (ఉందానగర్) రైల్వే స్టేషన్ వరకు ఎంఎంటీఎస్ సర్వీసులు మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్నట్లు సమాచారం. ప్రస్తుతం లింగంపల్లి నుంచి ఫలక్‌నుమా వరకు ఉండే ఎంఎంటీఎస్ సరీసుల్లో ఇరవై సర్వీసులను ఉందానగర్‌కు పొడిగిస్తున్నారు. దీంతో శంషాబాద్ ఫలక్‌నుమా నుంచి సికింద్రాబాద్‌ల మీదుగా లింగంపల్లి వరకు సర్వీసులు కొనసాగనున్నాయి. ఉదయం 5 గంటలకు మొదలు కొని రాత్రి 10 గంటల మధ్య ఎంఎంటీఎస్ సర్వీసులు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. సుమారు దశాబ్దకాలంగా ఊరిస్తున్న ఎంఎంటీఎస్ సర్వీసులు ఉందానగర్ వరకు నడిపించాలనే డిమాండ్ ప్రజల నుంచి ఉంది. ఇటీవల విద్యుద్దీకరణ, డబ్లింగ్ పనులు పూర్తి కావడంతో ఎంఎంటీఎస్ కల నెరవేరేందుకు మార్గం సుగమమైంది. మొత్తం మీద ప్రయాణికులకు ఎంఎంటీఎస్ సర్వీసులు త్వరలోనే అందుబాటులోకి వచ్చేందుకు రైల్వేశాఖ అన్ని పనులు చక్కబెట్టింది.

యువతిని వంచించిన వ్యక్తిపై అత్యాచారం కేసు

బంజారాహిల్స్: ప్రేమిస్తున్నానని యువతికి మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడి.. ఆ తర్వాత ముఖం చాటేసిన ఘటనలో నిందితుడిపై బంజారాహిల్స్ పోలీసులు అత్యాచారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నారాయణపేటకు చెందిన యువతి నగరంలో ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతోంది. వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం పర్సాపూర్ తండాకు చెందిన వాంకుడోతు మహిపాల్ నాయక్(27)తో ఏర్పడిన పరిచయం ప్రేమకు దారి తీసింది. గత నెల 21న మహిపాల్ నాయక్ ఆమె చదువుతున్న కళాశాలకు వెళ్లి మాట్లాడుకుందామని చెప్పి బంజారాహిల్స్‌లోని ఓయో హోటల్‌కు తీసుకొచ్చాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత వాట్సాప్ మెసేజ్‌లకు స్పందించకుండా ఆమె ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేశాడు. దీంతో ఆ యువతి గత నెల 30న అవమానం, నమ్మకద్రోహం భరించలేక కళాశాల హాస్టల్ పై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కాళ్లు, చేతులు విరగడంతో ఆసుపత్రిలో చేర్చారు. తనను మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది. మహిపాల్‌నాయక్‌పై ఐపీసీ సెక్షన్ 376, 417, 420, 493 కింద కేసు నమోదు చేసి బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నగర వార్తలు

నకిలీ ఇన్సూరెన్స్ సర్టిఫికెట్ల ముఠా ఆటకట్టు



కేసు వివరాలను వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి

పాత నేరస్తుడే ప్రధాన నిందితుడు

- 116 ఫేక్ ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లు స్వాధీనం
- ముగ్గురి అరెస్టు, పరారీలో మరొకరు

గచ్చిబౌలి: ద్విచక్ర వాహనాలు, కార్లు వంటి వాహనాలకు నకిలీ ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లు విక్రయిస్తున్న ముఠాను మాదాపూర్ ఎస్ఓటీ, మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. గచ్చిబౌలిలోని మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ శిల్పవల్లి తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హఫీజ్‌పేట ఆదిత్యనగర్‌లో నకిలీ ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లు తయారు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. మాదాపూర్ ఎస్ఓటీ, మియాపూర్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. న్యూ హఫీజ్‌పేటకు చెందిన మహ్మద్ సర్వర్ షరీఫ్(28), పటాన్‌చెరులో ఉంటున్న మహారాష్ట్ర వాసి ఆటో డ్రైవర్ మీర్జా ఇలియాజ్ బేగ్(62), హఫీజ్‌పేటకు చెందిన ఆటో డ్రైవర్ షేక్ జమీల్ అహ్మద్(46)లను అరెస్ట్ చేశారు. మరో నిందితుడు అజహర్ పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి వివిధ కంపెనీలకు చెందిన 116 నకిలీ ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లు, రూ.7.25 లక్షల విలువైన రెండు కంప్యూటర్లు, కలర్ ప్రింటర్, లాంబర్డ్ రబ్బర్ స్టాంప్, నాలుగు సెల్‌ఫోన్లు, బజాజ్ ఆటో, రూ.79 వేల నగదు స్వాధీనం చేసున్నారు.

ఇంటర్నెట్ కేఫ్ నిర్వహించే ప్రధాన నిందితుడు సర్వర్ షరీఫ్ నకిలీ మీ సేవ సర్టిఫికెట్లు తయారు చేయడంతో 2019లో మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. అయినా అతని ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. నకిలీ ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లు తయారుచేసి, కమిషన్ ఆశ చూపి ముగ్గురు మధ్యవర్తుల ద్వారా విక్రయిస్తున్నాడు. రూ.500 నుంచి రూ.2,500 లకు టూ వీలర్, ఫోర్ వీలర్ ఫేక్ ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లను విక్రయిస్తున్నారు. ఐసీఐసీఐ లాంబర్డ్, భారతి, డిజిట్, హెచ్‌డీఎఫ్‌సీ, యునైటెడ్ ఇండియా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీల వెబ్‌సైట్‌ల నుంచి సర్టిఫికెట్లను డౌన్ లోడ్ చేసి స్టాంప్ వేసి ఫేక్ సర్టిఫికెట్లు తయారు చేస్తున్నారు.

తెలిసి కూడా తీసుకుంటున్నారు: డీసీపీ

వాహనాల యజమానులు ఫేక్ ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లు అని తెలిసి కూడా తీసుకుంటున్నారని డీసీపీ అన్నారు. ప్రమాదం జరిగినప్పుడు ఫేక్ సర్టిఫికెట్‌తో ఎలాంటి క్లెయిమ్ రాదన్న విషయాన్ని వాహనదారులు గమనించాలన్నారు. క్లెయిమ్ రాకపోతే బాధిత కుటుంబాలు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. నకిలీ ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లను కొనడం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో సైబరాబాద్ ఎస్ఓటీ డీసీపీ రషీద్, మాదాపూర్ అడిషన్ డీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి, మియాపూర్ ఏసీపీ నర్సింహారావు, మియాపూర్ సీఐ తిరుపతి రావు, ఎస్ఓటీ సీఐ శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బడుగుల పెన్నిధి బాబూ జగ్జీవన్‌రామ్



సమావేశంలో మాట్లాడుతున్న వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

గన్‌ఫౌండ్రీ: బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి బాటలు వేసిన మహనీయుడు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. బుధవారం బాబూ జగ్జీవన్‌రామ్ 116వ జయంతి సందర్భంగా బషీర్‌బాగ్‌లో జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. సంఘటితంగా ఉంటే ఎంతటి సమస్య అయినా పరిష్కారం అవుతుందని, బలహీన వర్గాల ప్రజలంతా ఐక్యంగా ఉండాలని సూచించారు. ప్రజా యుద్ధనౌక గద్దర్ మాట్లాడుతూ, కనీసం ఒక్కరోజైనా దళితుడిని ముఖ్యమంత్రి స్థానంలో కూర్చోబెట్టి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన దళిత ముఖ్యమంత్రి హామీని నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. ట్యాంక్‌బండ్ వద్ద 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జయంతి ఉత్సవ కమిటీ వర్కింగ్ చైర్మన్‌ను మేడి పాపయ్య మాదిగ, జంగా శ్రీనివాస్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, వివిధ ఉద్యోగ, కుల, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ, పీజీ విద్యార్థులకు 'కామర్స్ టాలెంట్ టెస్ట్'

సాక్షి, సిటీబ్యూరో: నగరం వేదికగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్, అశోక స్కూల్ ఆఫ్ బిజినెస్ అండ్ ఆంబిషన్స్ కేరీర్ కౌన్సిలర్స్ సంయుక్త ఆధ్వర్యంలో డిగ్రీ, పీజీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా కామర్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఈనెల 10న నిర్వహించే ఈ టెస్టు లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మొదటి బహుమతిగా 5 వేలు, ద్వితీయ బహుమతిగా 3 వేలు, తృతీయ బహుమతిగా 2 వేల నగదు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. అంతేకాకుండా పది మందికి ప్రోత్సాహక బహుమతులు ఇస్తామన్నారు.

వైద్యురాలి అదృశ్యం

జవహర్‌నగర్: మహిళా డాక్టర్ అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. యాప్రాల్‌లోని మేఘాద్రి హైట్స్ అపార్ట్‌మెంట్‌లో ఉండే మాజీ సైనికుడు ఎడమకంటి లక్ష్మయ్య కుమార్తె మాధవి(25) కూకట్‌పల్లిలోని ప్రతిమ ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్‌గా పని చేస్తోంది. ఈ నెల 4న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో దూకి ఫార్మసీ విద్యార్థి ఆత్మహత్య



అక్షయ్ ఫొటోతో పాటు వాట్సాప్ స్టేటస్‌లో పెట్టిన సూసైడ్‌నోట్

కీసర: నా చావుకు ఎవరూ కారణం కాదు.. అని వాట్సాప్ స్టేటస్‌లో సూసైడ్ నోట్ పెట్టి..ఫార్మసీ విద్యార్థి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కీసర పోలీసు స్టేషన్ పరిధిలోని చీర్యాల గ్రామంలో బుధవారం ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన దేవకరే అక్షయ్(23) చీర్యాలలోని గీతాంజలి కళాశాలలో డి-ఫార్మసీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఇతడి తండ్రి నాందేడ్‌లో వ్యాపారి. చదువు నిమిత్తం ఇద్దరు విద్యార్థులతో కలిసి చీర్యాలలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. అక్షయ్ మంగళవారం రాత్రి జరిగిన కళాశాల వార్షికోత్సవ వేడుకల్లో మిత్రులతో కలిసి పాల్గొన్నాడు.

కార్యక్రమం ముగిశాక అందరూ గదికి వెళ్లారు. ఉన్నట్టుండి అక్షయ్ కన్పించక పోవడంతో మిత్రులు అతడి కోసం వెతికారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా వెళ్లగా చీర్యాల సమీపంలోని నాట్కాన్ చెరువు కట్టపై అతని చెప్పులు సెల్‌ఫోన్ కన్పించాయి. చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించుకొని కీసర పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గత ఈతగాళ్ల సహాయంతో బుధవారం మధ్యాహ్నం మృతదేహన్ని చెరువులోంచి బయటకు తీయించారు. నాందేడ్ ఉండే తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. తన చావుకు ఎవరు కారణం కాదని మృతుడు తన సెల్‌ఫోన్ వాట్సాప్ స్టేటస్‌లో సూసైడ్ నోట్ పెట్టాడు. ఇదిలా ఉండగా, అక్షయ్ ఆర్మీలో జవాన్‌గా సెలెక్ట్ అయ్యాడని, ఒక్కడే కొడుకు కావడంతో తల్లిదండ్రులు అభ్యంతరం తెలిపారని, ఈ విషయాన్ని తరచూ తమకు చెప్పి మనస్తాపానికి గురయ్యేవాడని స్నేహితులు తెలిపారు. మృతదేహన్ని పోలీసులు పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'గేట్'లో హెచ్‌సీయూ విద్యార్థినికి 5వ ర్యాంకు



స్వాతి

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థిని గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ ('గేట్')లో అత్యుత్తమ ర్యాంకు సాధించింది. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సిస్టమ్స్ అండ్ కంప్యూటేషనల్ బయాలజీ (2020 బ్యాచ్) ఎంఏ, ఐఎంఎస్‌సీ చదివిన స్వాతి ఆలిండియా స్థాయిలో 5వ ర్యాంకు సాధించి అరుదైన ఘనత సాధించింది. ఆమె గేట్ ఎక్స్ఎల్ (లైఫ్ సైన్సెస్) పేపర్‌లో 1000కి 957 గేట్ స్కోర్‌తో క్లియర్ చేయడం మరో విశేషం. అత్యుత్తమ ర్యాంక్ సాధించిన స్వాతిని పలువురు ప్రొఫెసర్లు, విద్యార్థులు అభినందించారు.

'మనూ' వృత్తి విద్యాకోర్సులకు ప్రభుత్వ ఆమోదం

- వీసీ సయ్యద్ ఐనుల్ హసన్ వెల్లడి



సమావేశంలో పాల్గొన్న వీసీ సయ్యద్ ఐనుల్‌హసన్, మెడికోవర్ ఆస్పత్రి వైద్యబృందం

రాయదుర్గం: గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం నిర్వహించే వృత్తి విద్యా కోర్సులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం ఉందని ఉర్దూ వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ తెలిపారు. వర్సిటీ ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఫిజియోథెరపిస్టులు, స్కిల్ స్పెషలిస్టులు, కార్డియాలజిస్టులకు బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ కోర్సులు (బి.ఒక్) చివరి సెమిస్టర్ పూర్తైన విద్యార్థులకు మెడికోవర్ ఆసుపత్రిలో పని చేసేందుకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లను అందజేశారు. ఈ సందర్భంగా వీసీ ఐనుల్‌హసన్ మాట్లాడుతూ, బ్యాచిలర్ స్థాయిలో పారామెడికల్ వృత్తి విద్యాకోర్సులను ప్రారంభించడంలో ముందున్న మొదటి విశ్వవిద్యాలయం 'మనూ'అని అన్నారు. ఒకేషనల్ మొదటి బ్యాచ్‌లోని 50 మంది విద్యార్థులలో 16 మంది విద్యార్థులకు వారి చివరి పరీక్షకు ముందే రేడియాలజీ, మెడికల్ ల్యాబ్ విభాగంలో మెడికోవర్ ఆస్పత్రి ఎంపిక చేసిందన్నారు. ఈ బ్యాచ్ తన ఆరు నెలల ఇంటర్న్‌షిప్‌ను ఇటీవలే ముగించిదన్నారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలో మాస్టర్ ఆఫ్ ఒకేషనల్ కోర్సులు, ఇతర కోర్సులను కూడా ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో మెడికోవర్ ఆస్పత్రి కార్డియాలజిస్ట్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ శరత్‌రెడ్డి, ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ మెడికోవర్ ఆస్పత్రి గ్రూప్ మెడికల్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ సతీష్‌కుమార్ కైలాసం, స్కూల్ ఆఫ్ సైన్సెస్ ఇన్‌చార్జ్ డీన్ సయ్యద్ నజ్మాల్ హసన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ-పట్టణ కుటుంబాల్లో పోషకాహార లేమి ఏ విధంగా ఉందో మూలాల నుంచి క్షుణ్ణంగా అధ్యయనం చేసిన కరీంనగర్ వాసి శిరీష జునుతులకు ఇన్నోవేటివ్ మెథడ్స్ అండ్ మెట్రిక్స్ ఫర్ అగ్రికల్చర్ అండ్ న్యూట్రిషన్ ఆక్షన్స్ (ఇమ్మన)నుంచి యాభై లక్షల రూపాయల ఫెలోషిప్ లభించింది. ప్రపంచవ్యాప్తంగా ఈ ఫెలోషిప్‌ను ఆరుగురు అందుకోగా వారిలో మన దేశం నుంచి శిరీష ఒక్కరే కావడం విశేషం. ఫెలోషిప్ వివరాలతో పాటు అగ్రికల్చర్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ విభాగాల్లో తను చేస్తున్న కృషి గురించి వివరించింది శిరీష.


● శిరీష

ఆరుగురిలో ఒకరు

పోషకాహారంపై అధ్యయనానికి గుర్తింపు

''ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి ఫుడ్ అండ్ న్యూట్రిషన్‌లో పీహెచ్‌డీ చేశాను. మేనేజ్‌లో రెండేళ్లుగా వర్క్ చేస్తున్నాను. అర్బన్ ఫార్మింగ్, మైక్రో గ్రీన్స్, ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్‌లో ప్రాజెక్ట్ వర్క్ పూర్తిచేశాను. ఇప్పుడు ఈ ఫెలోషిప్ అగ్రికల్చర్, న్యూట్రిషన్, హెల్త్ ఈ మూడు విభాగాల్లో చేసిన ప్రాజెక్ట్‌కి వచ్చింది. ఇలా వచ్చిన నగదు మొత్తాన్ని ప్రాజెక్ట్ వర్క్‌కే వాడతాను. నేను గ్రామీణ, గిరిజన స్థాయిల్లో చేసిన ప్రాజెక్ట్ రిజల్ట్‌ని ఇక్రిశాట్‌లో జరిగిన కాన్ఫరెన్స్‌లో ప్రెజెంట్ చేశాను. స్వీడన్, మలావిల్లోనూ ఈ విశేషాలు తెలియజేయబోతున్నాను. అంతర్జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తులో ప్రెజెంటేషన్‌కి అవకాశం వచ్చిందంటే దీని ప్రాముఖ్యత ఈ సమయంలో చాలా ఉందని అర్థమవుతోంది. కష్టమైన టాస్క్ అయినప్పటికీ సకాలంలో పూర్తి చేయగలిగానని ఆనందంగా ఉంది.

గ్రామీణ స్థాయికి వెళ్లాలి...

వ్యవసాయం అనగానే మన జనాభాకు సరిపడా ఆహారోత్పత్తి జరగాలనే ఇన్నాళ్లుగా ఆలోచిస్తున్నాం. ఇప్పటివరకు మన దేశం ఈ విషయంలో రెండవ స్థానంలో ఉంది. పోషకాహారలోపంలో మాత్రం మొదటి స్థానంలో ఉంది. మన దగ్గర చాలా మంది పోషకాహార లేమి సమస్యను ఎదుర్కొంటున్నారు. వ్యవసాయానికి సంబంధించిన అధికారులకు గైడ్‌లైన్స్ ఇవ్వడం వల్ల, వారు సులువుగా ప్రజల్లోకి తీసుకెళతారు. ఈ అధికారులు చెప్పడం వల్ల దీని ప్రభావం కూడా బాగుంటుంది. ఏ సాగు చేయాలి, ఎలాంటి పంటలు వేయాలి, కుటుంబాన్ని బట్టి, వారి పోషకాహార స్థాయులను బట్టి దిగుబడి చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయి అనే విషయాల మీద ఇంకా సరైన అవగాహన రావాల్సి ఉంది. దీనివల్ల రక్తహీనత, పోషకాహారం లేమి వంటివి తగ్గించవచ్చు.

అవగాహన ముఖ్యం

మాది కరీంనగర్ జిల్లా, బొంతుపల్లి గ్రామం. వ్యవసాయం కుటుంబం. బిఎస్సీ హోమ్‌సైన్స్ చేశాక ఎమ్మెస్సీకి ఫుడ్ అండ్ న్యూట్రిషన్‌ను ఎంచుకున్నాను. ఆ తర్వాత పీహెచ్‌డీ చేస్తున్నప్పుడే ఎన్ఐఆర్‌డీలో జరిగిన మీటింగ్‌లో ఈ ఫెలోషిప్‌కి అప్లయ్ చేసుకోవచ్చు అని తెలిసి అప్లయ్ చేశాను. దాదాపుగా నా చదువు అంతా ఫెలోషిప్స్‌తోనే గడిచింది. మా అన్నయ్య ఇచ్చే గైడ్‌లైన్స్ కూడా బాగా సహాయపడ్డాయి.

గిరిజనుల ఆహారం

అంగన్‌వాడీలు, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ ద్వారా గ్రామీణ మహిళల కుటుంబాల పోషకాహార స్థాయిలు ఎలా ఉన్నాయి.. అనే దానిమీద స్టడీ చేశాను. మిల్లెట్స్‌ని ఆహారంగా తీసుకోవడం ఇటీవల పట్టణాల్లోనూ పెరిగింది. అయితే, గిరిజనులు ఎప్పటి నుంచో వీటిని తీసుకుంటున్నారు. దీనివల్ల వారి రోగనిరోధకశక్తి పట్టణాల్లో వారికన్నా మెరుగ్గా ఉంది. ఈ విషయాన్ని నేరుగా తెలుసుకోవడానికి తెలంగాణలోని గిరిజనుల కుటుంబాలను కలుసుకొని స్టడీ చేశాను. రాగి అంబలి, జొన్నరొట్టె, ఆకుకూరలు వారి ఆహారంలో ప్రధానంగా ఉంటాయి. అదే గ్రామాల్లో అయితే అవగాహన తక్కువే. ఈ విషయంగా అవగాహన సదస్సులు జరగాల్సిన అవసరం ఉంది. మార్పు తీసుకు రావడానికి అందరి కృషి అవసరం'' అని వివరించింది శిరీష.

– నిర్మలారెడ్డి



ఇక్రిశాట్‌లో అవార్డు అందుకుంటూ...

గెలుపు దారి

రోహిక మిస్త్రీ, రేఖా ఝున్‌ఝున్‌వాలాల మధ్య ఉన్న ప్రధాన సారూప్యత ఏమిటంటే...
ఇద్దరూ పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకొని నిలబడ్డారు.
తడబడకుండా ధైర్యంగా అడుగు ముందుకు వేశారు.
తమ తెలివితేటలు, కార్యదక్షతతో విజయపరంపరను ముందుకు తీసుకు వెళుతున్నారు.
తాజాగా ఫోర్బ్స్ వరల్డ్స్ బిలియనీర్స్ జాబితాలో మన దేశం నుంచి చోటు సంపాదించిన న్యూకమర్స్‌లో ఈ ఇద్దరూ ఉన్నారు...


● భర్త రాకేష్‌తో రేఖా ఝున్‌ఝున్‌వాలా


● భర్త సైరస్ మిస్త్రీతో రోహిక మిస్త్రీ

దుఃఖనది దాటి గెలిచారు

సైరస్ మిస్త్రీ పరిచయం అక్కరలేని పేరు. లండన్ బిజినెస్ స్కూల్‌లో మాస్టర్స్ చేసిన మిస్త్రీ ఆతరువాత కుటుంబవ్యాపారంలోకి వచ్చాడు. 2012లో టాటా గ్రూప్ ఛైర్మన్ అయ్యాడు.

మిస్త్రీ జీవితంలో జయాపజయాలు ఉన్నాయి. 'నిర్దేశిత లక్ష్యాల విషయంలో మిస్త్రీ విఫలమయ్యాడు' అంటూ కొద్దికాలానికి ఛైర్మన్ పదవి నుంచి మిస్త్రీకి ఉద్వాసన పలికింది టాటా గ్రూప్.

న్యాయపోరాటం సంగతి ఎలా ఉన్నా మిస్త్రీ ధైర్యాన్ని కోల్పోయే పరిస్థితి వచ్చింది. ఆ సమయంలో భర్తకు అండగా నిలబడి ఎంతో శక్తిని ఇచ్చింది రోహిక.

ప్రచారానికి దూరంగా ఉండే రోహిక గురించి బయట పెద్దగా ఎవరికి తెలియదు. అయితే భర్త నోటి నుంచి 'రోహిక' పేరు వినిపించేది.

దిగ్గజ న్యాయవాది ఇక్బాల్ చాగ్లా కుమార్తె అయిన రోహిక కొన్ని ప్రైవెట్, పబ్లిక్ కంపెనీలలో డైరెక్టర్‌గా పనిచేసింది.

ఒకసారి రోహికను క్లైమెన్‌టైన్ స్పెన్సర్ చర్చిల్‌తో పోల్చాడు సైరస్ మిస్త్రీ. చర్చిల్ భార్య అయిన క్లైమెన్‌టైన్ ధైర్యశాలి. ముందుచూపు ఉన్న వ్యక్తి. భర్తకు ఎన్నో సందర్భాలలో అండగా నిలబడి ధైర్యాన్ని ఇచ్చింది. తప్పులను సున్నితంగా ఎత్తి చూపింది. ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడడం తన నైజం.

వర్క్–ఫ్యామిలీ లైఫ్‌లో సమన్వయాన్ని కోల్పోతున్న మిస్త్రీని దారిలోకి తెచ్చింది రోహిక.

'సమస్యలు ఉన్నాయని సరదాలు వద్దనుకుంటే ఎలా!' అంటూ భర్తను విహారయాత్రలకు తీసుకెళ్లేది. ఆ యాత్రలలో వ్యాపార విషయాలు అనేవి చివరి పంక్తిలో మాత్రమే ఉండేవి.

54 ఏళ్ల వయసులో సైరస్ మిస్త్రీ ఒక రోడ్డు ప్రమాదంలో మరణించాడు. రోహికకు ఊహించని షాక్!

దుఃఖసముద్రంలో మునిగిపోయిన రోహిక తనకు తాను ధైర్యం చెప్పుకొని ఒడ్డుకు వచ్చింది. మైదానంలో అడుగు పెట్టి ఆట మొదలు పెట్టింది.

'నువ్వే నా ధైర్యం' అనేవాడు రోహికను ఉద్దేశించి మిస్త్రీ.

భర్త జ్ఞాపకాలనే ధైర్యం చేసుకొని, శక్తిగా మలచుకొని ముందుకు కదిలింది రోహిక.

'మిస్త్రీల శకం ముగిసింది' అనుకునే సందర్భంలో 'నేనున్నాను' అంటూ వచ్చి గెలుపు జెండా ఎగరేసింది రోహిక మిస్త్రీ.

స్టాక్ మార్కెట్ చరిత్రలో 'స్టార్'గా మెరిశాడు రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా. పెట్టుబడి పాఠాల ఘనాపాఠీ రాకేశ్‌కు భార్య ఎన్నో పాఠాలు చెప్పింది. అవి ఆరోగ్య పాఠాలు కావచ్చు. ఆత్మీయ పాఠాలు కావచ్చు. రేసులకు వెళ్లి ఏ అర్ధరాత్రో ఇంటికి వచ్చే భర్తను ఆ అలవాటు మానిపించింది. సిగరెటు అలవాటును దూరం చేసింది. ఆరోగ్యకరమైన జీవనశైలి దిశగా భర్తను అడుగులు వేయించింది.

తన పేరు, భార్య పేరులోని కొన్ని ఆంగ్ల అక్షరాలతో తన స్టాక్ బ్రోకింగ్ కంపెనీకి 'రేర్' అని పేరు పెట్టాడు రాకేశ్.

భర్త హఠాన్మరణం రేఖను కుంగదీసింది. చుట్టూ అలముకున్న దట్టమైన చీకట్లో వెలుగు రేఖ కరువైంది. అలాంటి దురదృష్టపు రోజుల్లో వేధించే జ్ఞాపకాలను పక్కనపెట్టి వెలుగు దారిలోకి వచ్చింది రేఖ.

'ఆరు నెలలు సహవాసం చేస్తే వారు వీరవుతారు' అనే సామెత ఉంది.

అది నిజమో కాదో తెలియదుగానీ 'యూనివర్శిటీ ఆఫ్ ముంబై'లో చదువుకున్న రేఖ భర్త రాకేశ్‌లో ఒక విశ్వవిద్యాలయాన్ని దర్శించింది. అక్కడ ఎన్నో పాఠాలు నేర్చుకుంది.

భర్త బాటలోనే ఇన్వెస్టర్‌గా, ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఘనమైన విజయాలు సాధిస్తోంది రేఖ ఝున్‌ఝున్‌వాలా.

బ్యూటిప్స్

ముఖం మెరుపులీనాలంటే..?

టమాటాను గుండ్రంగా కట్ చేసి ఒక ముక్కను తీసుకుని పంచదారలో ముంచాలి. తరువాత ఈ ముక్కను ముఖంపై సున్నితంగా రుద్దాలి. పదినిమిషాల తరువాత నీళ్లతో కడుక్కోవాలి. తరువాత స్పూను శనగ పిండి, అరస్పూను అలోవెరా జెల్, రెండు స్పూన్ల టొమాటో రసం, అర స్పూను తేనె వేసి పేస్టులా కలుపుకోవాలి. ఈపేస్టుని ముఖానికి ఫేస్‌ప్యాక్‌లా వేసుకుని ఆరిన తర్వాత చల్లటి నీటితో కడిగేసుకోవాలి. ఇలా చేస్తే ముఖంపై ఉన్న మృత కణాలు, ట్యాన్ పోయి ముఖం కాంతిమంతమవుతుంది.



భ్రమణ కాంక్ష


● శశి, గునిత్, అనుష


● పర్వతాల మధ్య క్యాంప్

పర్వత పుత్రికలు

హిమాలయాలు... వింధ్య పర్వతాలు... వీటిని చూడాలని ఎవరికి ఉండదు? రాబోయే వేసవి సెలవుల్లో పర్వత సౌందర్యం చూడాలని చాలామంది అనుకుంటారు. కాని ఆరోగ్య, వయసు సమస్యలు, దివ్యాంగ పరిమితులు కొందరిని భయపెట్టవచ్చు. అయితే ఎవరికైనా సరే పర్వతాలను దగ్గరుండి చూపిస్తాం అంటున్నారు ముగ్గురు మహిళా ట్రెక్ గైడ్లు – శశి, గునిత్, అనుష. పిల్లల నుంచి వృద్ధుల వరకూ అందరికీ వీరు అపరేట్ చేస్తున్న ట్రెక్ టూర్లు అద్భుత పర్వత దర్శనం చేయిస్తున్నాయి.

'కలగను.. కనుగొను' అనే ట్యాగ్‌లైన్ ఉంటుంది అనుష, శశి, గునీత్ నడిపే 'బొహెమియన్ అడ్వంచర్స్' అనే ట్రెకింగ్ ఏజెన్సీకి. లోకాన్ని చూసి రావాలన్న కలను నెరవేర్చుకోవడానికి దారిని కనుగొనమని, ఆ దారి కనుగొనడంలో తాము సాయం చేస్తామని అంటారు వీరు ముగ్గురు.

మన దేశంలో పూర్తిగా స్త్రీలు మాత్రమే నడుపుతున్న ట్రెకింగ్ ఏజెన్సీలలో వీరిది ఒకటి. అయితే వీరి ప్రత్యేకత అంతా పర్వతాలే. 'డెహరాడూన్‌లో మా ఆఫీస్ ఉంటుంది. ఉత్తరాఖండ్‌లో, లద్దఖ్‌లో, హిమాలయాల బేస్ క్యాంప్ వరకు, వింధ్య పర్వతాల్లో మేము పర్వతారోహణకు తీసుకెళతాం. ప్రతి ముగ్గురు టూరిస్టులకు ఒక గైడ్ అనే పద్ధతిని మేము పాటిస్తాం.అందుకే వృద్ధులు, పిల్లలు, ఒంటరి స్త్రీలు... ఎవరైనా సరే క్షేమంగా మాతో పాటు ట్రెకింగ్ చేయవచ్చు. మా గైడ్లు కూడా స్త్రీలే. అందుకే మేము నిర్వహించే పర్వత యాత్రలకు విశేషంగా టూరిస్టులు వస్తారు' అంటుంది శశి బహుగుణ.

2013లో మొదలు

బ్యాంకింగ్ రంగంలో పని చేసే శశి బహుగుణది డెహ్రాడూన్. పబ్లిషింగ్ రంగంలో పని చేసిన గునిత్ పురిది రుద్రపూర్ (ఉత్తరాఖండ్). గతంలో బిజినెస్ జర్నలిస్ట్‌గా పని చేసిన అనుష సుబ్రమణియన్‌ది ముంబై. వీరు ముగ్గురికీ పర్వతారోహణ అంటే చాలా ఇష్టం. తరచూ చేసే ట్రెక్కింగ్‌లో ఒకరికి ఒకరు పరిచయం అయ్యారు. అయితే 2013లో ఉత్తరాఖండ్‌లో వచ్చిన వరదలు వీరు ముగ్గురిని కదిలించాయి. వెంటనే పనులన్నీ ఆపి వరద ప్రాంతాలకు చేరుకుని సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పర్యాటకులను కాపాడారు. ఆ సమయంలోనే వారికి అనిపించింది పర్యాటకులను సురక్షితంగా ఉంచే పర్వతారోహణ యాత్రలను నడిపే సంస్థను ప్రారంభించాలని. 'అబ్రహం లింకన్‌ను గుర్తు చేసుకున్నాం. పర్వతాల వలన పర్వతాల చేత పర్వతాల కొరకు ఇకపై బతకాలని నిర్ణయించుకున్నాం' అంది శశి బహుగుణ. ట్రెకింగ్‌ను ఎక్కువగా శశి ప్లాన్ చేస్తుంది. గునిత్ వాహనాలు నడపడంలో ఎక్స్‌పర్ట్. వంటలో కూడా. అనుష మంచి గైడ్. 'అందువల్ల మేము కారులో హిమాలయాల్లోని ప్రతి మూల తిరిగాము. మాకు తెలియని పర్వత దారులు లేవు' అంటారు వారు.

ప్రతి ఒక్కరికి హక్కుంది

'పర్వతారోహణ అంటే వయసు, ఆరోగ్యం ఉన్నవాళ్లనే అందరూ అనుమతిస్తారు. కాని మేము ఆ నియమం పెట్టుకోలేదు. ఇన్‌క్లూజివ్ ట్రెకింగ్స్‌ను నిర్వహించాలనుకున్నాం. అనారోగ్యం ఉన్నవారిని, దివ్యాంగులను కూడా ఆరోహణకు తీసుకెళ్లాలనుకున్నాం. ఎందుకంటే పర్వతాలు అందరివి. అందరికీ వాటిని చూసే హక్కుంది. అందుకే పర్వతాలు చూడాలనుకుని వచ్చేవారి హెల్త్ హిస్టరీ అంతా చెక్ చేస్తాం. వారికి ఇవ్వాల్సిన శిక్షణ ఇస్తాం. అంధులను కూడా చేయి పట్టి 50 కిలోమీటర్ల దూరం మేరకు ట్రెకింగ్‌కు తీసుకెళ్లిన అనుభవం మాకు ఉంది. పార్కిన్‌సన్ వ్యాధి ఉన్నవాళ్లను కూడా తీసుకెళ్లాం. డయాబెటిక్ పేషెంట్లు కూడా వచ్చారు. అయితే ప్రతి దశలో ఆరోగ్యం చెక్ చేయిస్తూ తీసుకెళతాం. మరీ జటిలంగా మారితే వెంటనే హెలికాప్టర్ తెప్పించి వెనక్కు పంపించేస్తాం' అంటారు వారు.

పహాడీ గైడ్లు

అనుష, శశి, గునిత్‌లు తాము నడుపుతున్న ట్రెకింగ్‌ల కోసం స్థానిక యువతులను గైడ్లుగా తీసుకుని వారికి ఉపాధి కల్పిస్తున్నారు. 'అందరూ కొండప్రాంతం వారే. లోకల్ గిరిజన యువతులు. వారికి పర్వతాలు కొట్టిన పిండి. అందుకని వారికి తగిన శిక్షణ ఇచ్చి మా టీమ్‌లో కలుపుకున్నాం. మా దృష్టి ముఖ్యంగా 40 నుంచి 50 ఏళ్ల మధ్య ఉన్న స్త్రీలపై ఉంటుంది. వీరు పిల్లలు ఎదిగొచ్చాక పర్యటనలకు వెళదామనుకుంటారు. అటువంటి వారికి సురక్షితమైన ఏజెన్సీలు ఉన్నాయని తెలియాలి. వారు ఊపిరి పీల్చుకుంటే కుటుంబ కార్యక్రమాల్లో మళ్లీ ఫ్రెష్‌గా పడతారు. మా విన్నపం ఏమంటే ఒంటరిగా తిరగాలనుకున్నా మంచి ఏజెన్సీలను చూసి వెళ్లండి వెళ్లనివ్వండి అని చెప్పడమే' అంటారు.

పర్వతాలను చూపడానికి చుక్కానులుగా మారిన ఈ ముగ్గురు అభినందనీయులు.

మీ ఫాలోవర్స్ అసలా? నకిలీనా?

సైబర్ టాక్


ప్రతీకాత్మక చిత్రం

సౌజన్య (పేరుమార్చడమైనది) సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటుంది. రాత్రి తను చేసిన పోస్ట్‌కు ఉదయం విపరీతంగా లైక్స్ రావడం, ఫాలోవర్స్ పెరగడం చూసి తెగ సంతోషించింది. ఒకట్రెండు రోజులు సజావుగా సాగినా ఆ తర్వాత నుంచి ప్రచార వస్తువుల గురించి ప్రకటనలు పెరిగాయి. తన చేసిన పోస్ట్‌లకు చెడుగా కామెంట్స్ పెడుతున్నారు. దీని వల్ల తన పేరు దెబ్బతింటుందనే ఆందోళన ఆమెను విపరీతమైన టెన్షన్‌కు గురిచేసింది.

సోషల్ మీడియా సొసైటీలో ఫాలోవర్స్, లైక్స్, కామెంట్స్‌ను బట్టి విలువకట్టే రోజులు ఇవి. సినిమా స్టార్స్‌తోపాటు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు కూడా పెద్ద సంఖ్యలో అభిమానులు ఉంటారు. ఈ ఇన్‌ఫ్లుయెన్సర్లు తమ సేవల గురించే కాదు, వస్తువుల బ్రాండ్‌లతో వినియోగదారులను ఆకట్టుకుంటుంటారు. అయితే, బ్రాండ్ ఎండార్స్‌మెంట్లను నిర్వహించే వ్యాపారాల దృష్టిని ఆకర్షించడానికి స్టార్స్, ఇన్‌ఫ్లుయెన్సర్లు కూడా ఫాలోవర్స్‌ను కొనుగోలు చేస్తుంటారు. ఇది ఒక పోటీలా మారుతుంటుంది. దీనిని గుర్తించిన నకిలీ ఫాలోవర్స్ అధిక సంఖ్యలో పుట్టుకొస్తుంటారు. తమ మోసాలకు కొత్త తెర తీస్తుంటారు. దీనివల్ల ఆదాయ మార్గాలకు గండికొట్టడం, పేరు ప్రతిష్ఠలు దెబ్బతీయడం వంటివి జరుగుతుంటాయి.

నిజమైన ఫాలోవర్స్‌ను ఎలా పొందాలంటే..

● ఆకర్షణీయమైన కంటెంట్‌ను సృష్టించాలి. మీ కంటెంట్ ప్రేక్షకులకు సమాచారంగా, వినోదాత్మకంగా, చూడటానికి ఆకర్షణీయంగా ఉండాలి. క్వాలిటీ ఫొటోలు, వీడియోలు వాడాలి. ●ట్రెండింగ్ హ్యాష్‌ట్యాగ్‌ను ఉపయోగించాలి. ● క్రమం తప్పకుండా పోస్ట్ చేయడం వల్ల మీ ప్రేక్షకులు మీ కంటెంట్‌పై ఆసక్తిని కలిగి ఉంటారు. ● వ్యాఖ్యలు, సందేశాలకు ప్రతిస్పందించడం, అభిప్రాయాలను అడగడం, సంభాషణలను ప్రారంభించడం ద్వారా వీక్షకులతో సన్నిహితంగా ఉండాలి. ఇది ఫాలోవర్స్‌తో సంబంధాలను మెరుగుపరుచుకోవడానికి సహాయపడుతుంది. ● పోటీలు, బహుమానాలను ప్రకటించడం వల్ల కొత్త ఫాలోవర్లు పెరుగుతారు. మీ ఫాలోవర్లకు బహుమతులు ఇచ్చి ప్రోత్సహించవచ్చు. ● మీ వెబ్‌సైట్, ఇతర సోషల్ మీడియా అకౌంట్స్‌ను ప్రచారం చేసేలా ఉండాలి. దీనివల్ల చూసేవారి సంఖ్య పెరగడంతోపాటు కొత్త ఫాలోవర్లను ఆకర్షించడానికి సహాయపడుతుంది.

నకిలీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు...

● ఇతరులను కించపరిచేలా ప్రతికూల కథనాలను, సమీక్షలు రాస్తారు.
● వారి వ్యూవర్‌షిప్‌ను పెంచడానికి మోసపూరిత ఫొటోలను పోస్ట్ చేస్తారు.
● నకిలీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని, పెట్టుబడులు పెట్టాలని సిఫార్సు చేస్తూ, అవి తమకు తాముగా ప్రయోజనం పొందేలా చూస్తారు.

నకిలీ ఫాలోవర్లు ఏం చేస్తారంటే..

● కృత్రిమంగా ఫాలోవర్లను పెంచే ప్రయత్నంలో సోషల్ మీడియా ఖాతాలను ఫాలో అవడానికి ఆటోమేటెడ్ అకౌంట్స్‌ను రూపొందిస్తారు. ● ఫాలోవర్ కౌంట్, లైక్స్, కామెంట్స్ మళ్లించేందుకు వాస్తవంగా కంటే ఎక్కువ జనాదరణ లేదా ప్రభావవంతమైనదిగా కనిపించేలా చేయడానికి అకౌంట్లు సృష్టించబడతాయి. వీటిని థర్డ్‌పార్టీ ప్రొవైడర్ల నుంచి కొనుగోలు చేయచ్చు. లేదా నకిలీ ఖాతాలను సృష్టించే ప్రక్రియను ఆటోమేట్ చేసే సాఫ్ట్‌వేర్ సాధనాలను ఉపయోగించి సృష్టించవచ్చు. ● నకిలీ ఫాలోవర్లు అనైతికంగా ప్రవర్తిస్తారు. భవిష్యత్తులో మీ బ్రాండ్‌నేమ్‌ని దెబ్బతీస్తారు. వినియోగదారులు నిజమైన వ్యక్తులతో సన్నిహితంగా ఉండేలా ఫేక్ అకౌంట్స్‌ను క్రమం తప్పకుండా తొలగించాలి.

నకిలీ అకౌంట్స్‌ను గుర్తింవచ్చు..

సోషల్ మీడియా ఫాలోవర్లను గుర్తించడం సవాల్‌గా ఉంటుంది. అయితే, నిజమైన వినియోగదారుల నుండి వీరిని వేరు చేయడంలో సహాయపడే కొన్ని సూచికలు...

● నకిలీ ఖాతాలో ప్రొఫైల్ సమాచారం ఉండదు. ప్రొఫైల్ ఫొటో సరైనది ఉండదు. బయో, లొకేషన్ వంటి అసంపూర్ణమైన లేదా ఖాళీ ప్రొఫైల్ ఉంటుంది.
● వీరి ఖాతాలో అతి సాధారణ కంటెంట్ ఉంటుంది. పోస్ట్‌కు ప్రతిస్పందనగా ఎమోజీలు ఉంటాయి. లేదా సంబంధం లేని వెబ్‌సైట్ లింక్‌లతో స్పామ్ కామెంట్స్ వదిలేయవచ్చు. ● వీరి ఖాతాలకు చాలా తక్కువ మంది ఫాలోవర్లు ఉంటారు. కానీ, వీరు పెద్ద సంఖ్యలో ఇతర ఖాతాలను ఫాలో చేస్తుంటారు. ● ఇతరులతో ఎలాంటి ఇంటరాక్షన్ ఉండదు. కంటెంట్‌ను షేర్ చేయడం లేదా ఇతర యూజర్స్‌కి మెసేజ్‌లు, పోస్ట్‌లు.. అప్‌లోడ్ చేయడం నకిలీ అకౌంట్స్ వారు చేయరు.
● ఫాలోవర్ కౌంట్‌లో ఆకస్మిక పెరుగుదల ఉంటే అనుమానించాలి.

నకిలీ ఖాతాల గురించి రిపోర్ట్ చేయడానికి...

మీ డేటాను యాక్సెస్ చేయకుండా అకౌంట్‌ను బ్లాక్ చేయవచ్చు.
లేదంటే సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లకు నివేదించవచ్చు.
https://www.facebook.com/help/306643639690823
https://help.twitter.com/en/rules-and-policies/platform-manipulation
https://www.linkedin.com/help/linkedin/answer/a1338436/report-fake-profiles?lang=en
https://help.instagram.com/446663175382270


ఇన్‌పుట్స్: అనీల్ రాచమల్ల, డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్



కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో శుబ్‌మన్ గిల్

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వన్డే ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్ శుబ్‌మన్ గిల్ కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకున్నాడు. బుధవారం విడుదల చేసిన బ్యాటింగ్ తాజా ర్యాంకింగ్స్‌లో గిల్ ఒక స్థానం పురోగతి సాధించి ఐదు నుంచి నాలుగో స్థానానికి చేరుకున్నాడు. భారత్‌కే చెందిన విరాట్ కోహ్లి ఆరో ర్యాంక్‌లో, రోహిత్ శర్మ ఎనిమిదో ర్యాంక్‌లో ఉన్నారు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత పేసర్ మొహమ్మద్ సిరాజ్ మూడో స్థానంలో కొనసాగుతున్నాడు.



కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టులో జేసన్ రాయ్

ఇంగ్లండ్ జట్టు డాషింగ్ ఓపెనర్ జేసన్ రాయ్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు రూ. 2 కోట్ల 80 లక్షలకు కొనుగోలు చేసింది. ఈనెల 9న గుజరాత్ టైటాన్స్‌తో జరిగే మ్యాచ్‌కు జేసన్ రాయ్ జట్టుతో కలుస్తాడు. గాయంతో ఐపీఎల్ టోర్నీకి దూరమైన శ్రేయస్ అయ్యర్ స్థానంలో రాయ్‌ను తీసుకున్నారు.రాయ్ 2017లో గుజరాత్ లయన్స్ తరఫున, 2021లో సన్‌రైజర్స్ తరఫున ఐపీఎల్ టోర్నీలో ఆడాడు. ఇంగ్లండ్ జట్టుకు 64 టి20 మ్యాచ్‌ల్లో ప్రాతినిధ్యం వహించిన రాయ్ 1,522 పరుగులు చేశాడు.

హంపికి ఆరో స్థానం



న్యూఢిల్లీ: అంతర్జాతీయ చెస్ సమాఖ్య మహిళల గ్రాండ్‌ప్రి టోర్నమెంట్‌ను భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి ఆరో స్థానంతో ముగించింది. గొర్యాక్చినా (రష్యా)తో బుధవారం జరిగిన చివరిదైన 11వ రౌండ్ గేమ్‌ను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హంపి 32 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. ఓవరాల్‌గా హంపి 4.5 పాయింట్లతో ఆరో ర్యాంక్‌లో నిలిచింది. ఆంధ్రప్రదేశ్‌కే చెందిన మరో గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారిక 3.5 పాయింట్లతో ఏడో ర్యాంక్‌లో నిలిచింది. షువలోవా (రష్యా)తో జరిగిన చివరి గేమ్‌లో హారిక 66 ఎత్తుల్లో ఓటమి చవిచూసింది. భారత్‌కే చెందిన వైశాలి రెండు పాయింట్లతో పదో ర్యాంక్‌తో సరిపెట్టుకుంది.

భారత మాజీ క్రికెటర్ సుధీర్ నాయక్ మృతి



న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు మాజీ ఓపెనర్, వాంఖెడే స్టేడియం క్యూరేటర్ సుధీర్ నాయక్ బుధవారం మృతి చెందారు. ముంబైకి చెందిన 78 ఏళ్ల సుధీర్ నాయక్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సునీల్ గావస్కర్, అజిత్ వాడేకర్, దిలీప్ సర్దేశాయ్, అశోక్ మన్కడ్‌లాంటి స్టార్స్ జట్టుకు అందుబాటులో లేని సమయంలో సుధీర్ తన నాయకత్వంలో ముంబై జట్టును 1971 సీజన్‌లో రంజీ చాంపియన్‌గా నిలబెట్టారు. 1974–1975లలో ఆయన భారత్ తరఫున మూడు టెస్టులు ఆడి 141 పరుగులు, రెండు వన్డేలు ఆడి 38 పరుగులు చేశారు.

'కింగ్స్' మరో పంజా

ఐపీఎల్ క్లైమాక్స్ డ్రామా ప్రేక్షకుల్ని కట్టిపడేసింది. భారీ లక్ష్యం ముందుంటే 124 పరుగులకే 6 వికెట్లు కోల్పోయిన రాజస్తాన్ రాయల్స్ విజయానికి దూరమైంది. 18 బంతుల్లో 53 పరుగుల సమీకరణం అసాధ్యమనిపించింది. కానీ హిట్టర్ హెట్‌మైర్ (18 బంతుల్లో 36; 1 ఫోర్, 3 సిక్సర్లు)... 'ఇంపాక్ట్ ప్లేయర్' ధ్రువ్ జురెల్ (15 బంతుల్లో 32 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధనాధన్ ఆటతో గెలుపు ఆశలు చిగురించాయి. ఆఖరి ఓవర్లో విజయానికి కావాల్సిన 16 పరుగుల్ని పంజాబ్ సీమర్ సామ్ కరన్ తెలివైన బౌలింగ్‌తో అడ్డుకున్నాడు. దీంతో పంజాబ్ కింగ్స్ 5 పరుగులతో గట్టెక్కింది.



ధావన్

- చెలరేగిన ప్రభ్‌సిమ్రాన్, ధావన్
- 5 పరుగులతో రాజస్తాన్‌పై పంజాబ్ గెలుపు
- సామ్సన్, హెట్‌మైర్ మెరుపులు వృథా

గువాహటి: పంజాబ్ కింగ్స్ భారీ స్కోరుతో మరో విజయం సాధించింది. ఐపీఎల్‌లో బుధవారం జరిగిన పోరులో శిఖర్ ధావన్ బృందం 5 పరుగులతో రాజస్తాన్ రాయల్స్‌పై గెలిచింది. మొదట పంజాబ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 197 పరుగులు చేసింది. ధావన్ (56 బంతుల్లో 86 నాటౌట్; 9 ఫోర్లు, 3 సిక్సర్లు), ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (34 బంతుల్లో 60; 7 ఫోర్లు, 3 సిక్సర్లు) ధాటిగా ఆడారు. హోల్డర్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం భారీ లక్ష్యఛేదనకు దిగిన రాజస్తాన్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 192 పరుగులు చేయగలిగింది. సామ్సన్ (25 బంతుల్లో 42; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నాథన్ ఎలిస్ 4 వికెట్లు తీశాడు.

శుభారంభం...

తొలి ఓవర్లోనే బౌండరీతో తన ఉద్దేశాన్ని చాటిన ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్ క్రీజులో ఉన్నంత సేపూ అదే జోరు కొనసాగించాడు. ఆసిఫ్ వేసిన నాలుగో ఓవర్లో 3 ఫోర్లు, మిడ్ వికెట్ మీదుగా భారీ సిక్సర్ బాదాడు. అనుభవజ్ఞుడైన అశ్విన్‌ను దించినా... బౌండరీలతో తన ఎదురుదాడి కొనసాగించాడు. పవర్ ప్లేలో పంజాబ్ 63/0 స్కోరు చేసింది. కాసేపటికే ప్రభ్‌సిమ్రాన్ 28 బంతుల్లో అర్ధసెంచరీ (7 ఫోర్లు, 2 సిక్సర్లు) పూర్తి చేసుకున్నాడు. ఓపెనింగ్ భాగస్వామ్యానికి ఎట్టకేలకు పదో ఓవర్లో బ్రేక్ పడింది. ప్రభ్‌సిమ్రాన్‌ను హోల్డర్ అవుట్ చేయడంతో 90 పరుగుల వద్ద తొలి వికెట్ కూలింది. ధావన్ పవర్ ఫుల్ షాట్ రాజపక్స కుడి మోచేతికి బలంగా తగలడంతో రిటైర్డ్‌హర్ట్ అయ్యాడు. తర్వాత జితేశ్ శర్మ (16 బంతుల్లో 27; 2 ఫోర్లు, 1 సిక్స్)అండతో ధావన్ రెచ్చిపోయాడు.

వణికించిన హెట్‌మైర్, ధ్రువ్

ఆరంభంలోనే ఓపెనర్లు అశ్విన్ (0), యశస్వి జైస్వాల్ (11)లను... పవర్‌ప్లేలోనే బట్లర్ (11 బంతుల్లో 19; 1 ఫోర్, 1 సిక్స్)లాంటి హిట్టర్ వికెట్లను కోల్పోయిన రాజస్తాన్‌కు కొండంత లక్ష్యం ఛేదించడం అసాధ్యమైంది. చివర్లో హెట్‌మైర్, ధ్రువ్ ఏడో వికెట్‌కు చకచకా జోడించిన 62 పరుగుల భాగస్వామ్యం పంజాబ్ శిబిరాన్ని వణికించింది. రాజస్తాన్‌ను గెలుపు వైపునకు తీసుకెళ్లింది. కానీ ఆఖరి ఓవర్ వేసిన కరన్ కింగ్స్‌ను గెలిపించాడు.

స్కోరు వివరాలు: పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రాన్ (సి) బట్లర్ (బి) హోల్డర్ 60; ధావన్ (నాటౌట్) 86; రాజపక్స (రిటైర్డ్‌హర్ట్) 1; జితేశ్ శర్మ (సి) పరాగ్ (బి) చహల్ 27; సికందర్ (బి) అశ్విన్ 1; షారుఖ్ (సి) బట్లర్ (బి) హోల్డర్ 11; సామ్ కరన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 197. వికెట్ల పతనం:** 1-90, 2-158, 3-159, 4-196. **బౌలింగ్:** బౌల్ట్ 4-0-38-0, ఆసిఫ్ 4-0-54-0, అశ్విన్ 4- 0-25-1, హోల్డర్ 4-0-29-2, చహల్ 4- 0-50-1.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (సి) సబ్-షార్ట్ (బి) అర్ష్‌దీప్ 11; అశ్విన్ (సి) ధావన్ (బి) అర్ష్‌దీప్ 0; బట్లర్ (సి అండ్ బి) ఎలిస్ 19; సామ్సన్ (సి) సబ్-షార్ట్ (బి) ఎలిస్ 42; పడిక్కల్ (బి) ఎలిస్ 21; పరాగ్ (సి) షారుఖ్ (బి) ఎలిస్ 20; హెట్‌మైర్ (రనౌట్) 36; ధ్రువ్ (నాటౌట్) 32; హోల్డర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 192. వికెట్ల పతనం:** 1-13, 2-26, 3-57, 4-91, 5-121, 6-124, 7-186. **బౌలింగ్:** కరన్ 4-0-44-0, అర్ష్‌దీప్ 4-0-47-2, హర్‌ప్రీత్ 2-0-15-0, ఎలిస్ 4-0-30-4, చహర్ 4-0-31-0, సికందర్ 2-0-24-0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
గుజరాత్	2	2	0	4	0.700
పంజాబ్	2	2	0	4	0.333
బెంగళూరు	1	1	0	2	1.981
రాజస్తాన్	2	1	1	2	1.675
లక్నో	2	1	1	2	0.950
చెన్నై	2	1	1	2	0.036
కోల్‌కతా	1	0	1	0	-0.438
ఢిల్లీ	2	0	2	0	-1.703
ముంబై	1	0	1	0	-1.981
హైదరాబాద్	1	0	1	0	-3.600

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

కోల్‌కతా × బెంగళూరు (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

మిథాలీ, ధోని, యువరాజ్‌లకు ఎంసీసీ జీవితకాల సభ్యత్వం



లండన్: క్రికెట్ నియమావళికి కేంద్ర బిందువైన విఖ్యాత మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) 17 మంది మేటి క్రికెటర్లకు జీవితకాల సభ్యత్వం కల్పించింది. ఈ జాబితాలో భారత్ నుంచి ఐదుగురు క్రికెటర్లు ఉన్నారు. అంతర్జాతీయ మహిళల క్రికెట్ నుంచి వీడ్కోలు తీసుకున్న భారత మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్, పేస్ బౌలర్ జులన్ గోస్వామిలతో పాటు ఎమ్మెస్ ధోని, యువరాజ్ సింగ్, సురేశ్ రైనాలకు ఈ గౌరవం దక్కింది. ధోని నాయకత్వంలో భారత్ 2007 టి20 వరల్డ్‌కప్, 2011 వన్డే వరల్డ్‌కప్ టైటిల్స్ సాధించింది. యువరాజ్ సింగ్ ఈ రెండు గొప్ప విజయాల్లో కీలకపాత్ర పోషించాడు. సురేశ్ రైనా తన 13 ఏళ్ల కెరీర్‌లో మూడు ఫార్మాట్‌లలో కలిపి 7,988 పరుగులు సాధించాడు. హైదరాబాద్‌కు చెందిన మిథాలీ రాజ్ వన్డేల్లో అత్యధిక పరుగులు (7,805) చేసిన మహిళా క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పింది. అత్యధిక మ్యాచ్‌ల్లో (155) కెప్టెన్‌గా వ్యవహరించిన ప్లేయర్‌గానూ ఆమె గుర్తింపు పొందింది. జులన్ వన్డేల్లో అత్యధిక వికెట్లు (255) తీసిన బౌలర్‌గా ఘనత వహించింది.

సైనా, సాయిప్రణీత్ ఓటమి

న్యూఢిల్లీ: ఓర్లియాన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్స్ సైనా నెహ్వాల్, సాయిప్రణీత్ నిరాశ పరిచారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సైనా 16-21, 14-21తో తుర్కియే షట్లర్ నిస్లిహాన్ యిగిట్ చేతిలో... పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో సాయిప్రణీత్ 20-22, 17-21తో లీంగ్ జున్ హావో (మలేసియా) చేతిలో ఓడిపోయారు.

ముష్ఫికర్ సెంచరీ



ముష్ఫికర్

మిర్పూర్: ఐర్లాండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్‌పై బంగ్లాదేశ్ రెండో రోజే పట్టు బిగించింది. ఫలితాన్ని శాసించే స్థితిలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 34/2తో బుధవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ 80.3 ఓవర్లలో 369 పరుగులకు ఆలౌటై 155 పరుగుల ఆధిక్యం సంపాదించింది. ముష్ఫికర్ రహీమ్ (166 బంతుల్లో 126; 15 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించగా... షకీబ్ అల్ హసన్ (94 బంతుల్లో 87; 14 ఫోర్లు) శతకాన్ని చేజార్చుకున్నాడు. మెహదీ హసన్ మిరాజ్ (80 బంతుల్లో 55; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), లిటన్ దాస్ (41 బంతుల్లో 43; 8 ఫోర్లు) రాణించారు. ఐర్లాండ్ బౌలర్ ఆండీ మెక్‌బ్రైన్ 118 పరుగులిచ్చి 6 వికెట్లు తీసుకున్నాడు. మార్క్ అడైర్, బెన్ వైట్ రెండేసి వికెట్లు పడగొట్టారు. 155 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఐర్లాండ్ ఆట ముగిసే సమయానికి 27 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.



వరుసగా రెండో ఏడాది విశ్వ విజేతగా నిలిచిన తెలంగాణ మహిళా బాక్సర్ నిఖత్ జరీన్‌కు జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్ఎండీసీ) తరఫున సీఎండీ (అడిషనల్ చార్జ్) అమితవ ముఖర్జీ రూ. 5 లక్షల చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎండీసీ డైరెక్టర్ (ప్రొడక్షన్) దిలీప్ కుమార్ మొహంతి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ విశ్వనాథ్ పాల్గొన్నారు.

మిల్నే మెరిసె...

రెండో టి20లో శ్రీలంకపై న్యూజిలాండ్ ఘనవిజయం



డ్యూనెడిన్: పేస్ బౌలర్ ఆడమ్ మిల్నే 26 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టడంతో... శ్రీలంకతో బుధవారం జరిగిన రెండో టి20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ తొమ్మిది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకను 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మిల్నే నిప్పులు చెరిగే బంతులతో హడలెత్తించాడు. దాంతో దాసున్ షనక బృందం 19 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌటైంది. కుశాల్ పెరీరా (32 బంతుల్లో 35; 2 ఫోర్లు, 1 సిక్స్), ధనంజయ డిసిల్వా (26 బంతుల్లో 37; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. అనంతరం న్యూజిలాండ్ ఆడుతూ పాడుతూ కేవలం 14.4 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 146 పరుగులు చేసి గెలిచింది. టిమ్ సీఫెర్ట్ (43 బంతుల్లో 79 నాటౌట్; 3 ఫోర్లు, 6 సిక్స్‌లు) అజేయ అర్ధ సెంచరీ చేశాడు. ఈ గెలుపుతో న్యూజిలాండ్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. నిర్ణాయక మూడో మ్యాచ్ శనివారం క్వీన్స్‌టౌన్‌లో జరుగుతుంది.

సినిమా

సెప్టెంబరులో స్టార్ట్?



● మహేశ్‌బాబు

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ఓ భారీ బడ్జెట్ ఫిల్మ్ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఆఫ్రికన్ ఫారెస్ట్ నేపథ్యంలో యాక్షన్ అడ్వెంచరస్ డ్రామాగా రూపుదిద్దుకోనున్న ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. షూటింగ్‌ను సెప్టెంబరులో ఆరంభించాలని రాజమౌళి అనుకుంటున్నారట. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో మహేశ్‌బాబు ఓ చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ సెప్టెంబరుకల్లా దాదాపు పూర్తవుతుందట. ఆ తర్వాత రాజమౌళి సినిమా చిత్రీకరణలో పాల్గొనేలా మహేశ్‌బాబు ప్లాన్ చేసుకుంటున్నారట. ఇక త్రివిక్రమ్‌తో మహేశ్‌బాబు చేస్తున్న సినిమా వచ్చే జనవరి 13న విడుదల కానుంది.

జోరుగా.. హుషారుగా...



● రజనీకాంత్

ఏడుపదుల వయసులోనూ రజనీకాంత్ జోరుగా హుషారుగా సినిమాల మీద సినిమాలు కమిట్ అవుతూ, బిజీగా ఉంటున్నారు. ఇప్పటికే 'జైలర్' చిత్రంలో హీరోగా, 'లాల్‌సలామ్' చిత్రంలో అతిథి పాత్ర చేస్తున్నారాయన. ఇవి కాకుండా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ నిర్మించనున్న చిత్రం అంగీకరించారు. తాజాగా మరో సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడానికి రెడీ అవుతున్నారట. ప్రస్తుతం తమిళ చిత్ర పరిశ్రమలో మంచి ఫామ్‌లో ఉన్న దర్శకుడు లోకేష్ కనగరాజ్ ఇటీవల రజనీకాంత్‌ను కలిసి ఓ కథ వినిపించారని, ఈ స్క్రిప్ట్ రజనీకాంత్‌కి నచ్చిందని టాక్. ఈ కాంబినేషన్‌లో రూపొందనున్న చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వచ్చే అవకాశం ఉందంటోంది చెన్నై సినిమా సర్కిల్. ఈ చిత్రాన్ని కమల్‌హాసన్ నిర్మించనున్నారని సమాచారం.

బాలీవుడ్ వార్‌లో...



● ఎన్టీఆర్

బాలీవుడ్ బడా నిర్మాణ సంస్థల్లో ఒకటైన యశ్ రాజ్ ఫిలింస్ (వైఆర్ఎఫ్) స్పై యూనివర్స్‌లో ఎన్టీఆర్ భాగం కానున్నట్లు తెలుస్తోంది. హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిలింస్ పతాకంపై ఆదిత్యా చోప్రా నిర్మించిన స్పై యాక్షన్ ఫిల్మ్ 'వార్'. 2019 అక్టోబరు 2న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచింది. దీంతో 'వార్ 2'ను నిర్మించడానికి వైఆర్ఎఫ్ రెడీ అవుతోంది. హృతిక్ రోషన్ హీరోగా అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో ఈ చిత్రం రూపుదిద్దుకోనుందని ఆల్రెడీ బీటౌన్‌లో బలమైన ప్రచారం సాగుతోంది. తాజాగా ఈ చిత్రంలో ఎన్టీఆర్ ఓ లీడ్ రోల్ చేయనున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. హృతిక్, ఎన్టీఆర్ స్క్రీన్ షేర్ చేసుకుంటే ఇండియన్ సినీ ఫ్యాన్స్‌కు పండగే అంటూ కామెంట్స్ చేస్తున్నారు కొందరు నెటిజన్లు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాది చివర్లో ప్రారంభం కానుందట. మరి.. ఎన్టీఆర్ నటించే విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక ప్రస్తుతం కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా చేస్తున్న సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది.

మీ ప్రేమకు కూడా దూరమైతే!



● సమంత, దేవ్‌మోహన్

'లేడి కన్నులు.. నెమలి నడక.. సివంగి నడుము...' అంటూ నటుడు దేవ్ మోహన్ డైలాగ్‌తో 'శాకుంతలం' సినిమా ట్రైలర్ విడుదలైంది. సమంత టైటిల్ రోల్‌లో దేవ్ మోహన్ ప్రధాన పాత్రలో గుణశేఖర్ దర్శకత్వం వహించిన చిత్రం 'శాకుంతలం'. 'దిల్' రాజు సమర్పణలో నీలిమ గుణ నిర్మించారు. ఈ నెల 14న తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా రిలీజ్ ట్రైలర్‌ని విడుదల చేసింది చిత్రయూనిట్. 'మనసెటు పోతే అటు పోరాదని ముని వాక్కు', 'పుట్టగానే తల్లిదండ్రుల ప్రేమకు దూరమయ్యాను.. మీ ప్రేమకు కూడా దూరమైతే' (సమంత), 'నీ కష్టానికి కన్నీళ్లు పెట్టగలమే కానీ.. నీ కర్మను పంచుకోలేం' (గౌతమి) వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. మోహన్‌బాబు, ప్రకాశ్‌రాజ్, మధుబాల, గౌతమి, అదితీ బాలన్, అనన్య నాగళ్ల, జిస్సు సేన్ గుప్తా తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, అడిషనల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: టబ్బీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: హేమాంబర్ జాస్తి, కొమ్మినేని వెంకటేశ్వరరావు, లైన్ ప్రొడ్యూసర్: యశ్వంత్.

బ్లాక్ బస్టర్ గ్యారంటీ

- నిర్మాత అభిషేక్ నామా

'రావణాసుర' లాంటి సినిమాను రవితేజగారు ఇప్పటివరకూ చేయలేదు. ఈ సినిమా చూసిన తర్వాత ఆయన ఇలా కూడా చేయగలుగుతారా? అని ఆడియన్స్ థ్రిల్‌కి, షాక్‌కి గురవుతారు. మా సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది. కొత్త కాన్సెప్ట్‌తో రూపొందిన మా సినిమా వర్కవుట్ అయితే మరికొందరు హీరోలు ఇలాంటి కథలు ప్రయత్నిస్తారు'' అని నిర్మాత అభిషేక్ నామా అన్నారు. రవితేజ హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రావణాసుర'. అభిషేక్ నామా, రవితేజ నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా అభిషేక్ నామా మాట్లాడుతూ– ''థ్రిల్లర్ జానర్ సినిమా చూసినప్పుడు షాక్‌కి గురి చేసే, వావ్ అనిపించే సన్నివేశాలుంటాయి. వాటి గురించి ముందే ప్రేక్షకులకు తెలిసిపోతే ఆ కిక్కు రాదు.. అందుకే 'రావణాసుర' కథ గురించి బయటికి చెప్పడం లేదు. ఈ సినిమాలో సుశాంత్‌ని చాలా కొత్తగా చూస్తారు. గతంలో నేను–సుధీర్ వర్మ చేసిన 'కేశవ' సినిమా వాణిజ్య పరంగా నాకు వర్కవుట్ అయ్యింది. అయితే బ్లాక్ బస్టర్ మిస్ అయ్యింది. కానీ, 'రావణాసుర'తో గ్యారంటీగా వంద శాతం బ్లాక్ బస్టర్ కొడతాం. ఈ సినిమాపై ఉన్న నమ్మకంతో సొంతంగా నేనే విడుదల చేస్తున్నాను. నేను తీసిన 'సాక్ష్యం' సినిమాకి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీత దర్శకునిగా చేశాడు. రవితేజగారికి చెప్పి 'రావణాసుర'కి మరోసారి అవకాశం ఇచ్చాను. 'కాంతార' లాంటి సినిమా చూసినప్పుడు మనం వావ్ అన్నాం. అయితే అలాంటి మూవీ ఇక్కడ చేయాలంటే వర్కవుట్ అవుతుందా? లేదా అని ఆలోచిస్తాం. కానీ 'రావణాసుర'తో రవితేజగారు అవన్నీ బ్రేక్ చేసేశారు. ఈ సినిమా కథా రచయిత శ్రీకాంత్ విస్సాతో దర్శకుడిగా తన మొదటి సినిమాని నా బ్యానర్‌లోనే చేయాలని చెప్పాను.. ఓకే అన్నాడు. ప్రస్తుతం మా బేనర్‌లో నిర్మించిన 'ప్రేమ విమానం' మూవీని మేలో రిలీజ్ చేస్తాం. అలాగే 'డెవిల్' సినిమా క్లయిమాక్స్ షూటింగ్ జరుగుతోంది'' అన్నారు.





● రామ్‌చరణ్, ఉపాసన

ఇటీవల స్నేహితులు, సన్నిహితుల సమక్షంలో దుబాయ్‌లో రామ్‌చరణ్ భార్య ఉపాసన బేబీ షవర్ జరిగిన విషయం తెలిసిందే. ఈ వేడుకలో రామ్‌చరణ్-ఉపాసన దిగిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఓ కల ట్రైలర్ బాగుంది - 'దిల్' రాజు

గౌరీశ్ యేలేటి, రోషిణి, ప్రాచీ ఠక్కర్ హీరో హీరోయిన్లుగా దీపక్ కొలిపాక దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఓ కల'. లక్ష్మీ నవ్య మోటూరు, రంజిత్ కుమార్ కొడాలి, ఆదిత్యా రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13 నుంచి డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్‌ను రిలీజ్ చేసిన నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ –''ఓ కల' ట్రైలర్ చూశాను. బాగుంది'' అని అన్నారు. ''కమర్షియల్ ఎలిమెంట్స్‌తో మంచి ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను తెరకెక్కించాం'' అన్నారు దీపక్. ఈ చిత్రానికి సంగీతం: నీలేష్ మందలపు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మహేశ్ మోటూరు.



● 'దిల్' రాజు, దీపక్

మీటర్‌తో మాస్ హిట్ రావాలి

- గోపీచంద్ మలినేని



● నవీన్, బుచ్చిబాబు, గోపీచంద్, కిరణ్ అబ్బవరం, అతుల్యా రవి

''రవితేజ, నానీగార్ల తర్వాత ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీకి వచ్చాడు కిరణ్. అతని ప్రధాన బలం సహజమైన నటన, డైలాగ్ డెలివరీ. 'మీటర్'తో తనకి మాస్ హిట్ రావాలి'' అని డైరెక్టర్ గోపీచంద్ మలినేని అన్నారు. కిరణ్ అబ్బవరం, అతుల్యా రవి జంటగా రమేష్ కడూరి దర్శకత్వం వహించిన చిత్రం 'మీటర్'. నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ– ''అసలు సిసలైన కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'మీటర్'. రమేష్‌గారు ఈ సినిమాలో నన్ను వైవిధ్యంగా చూపించారు. ఏప్రిల్ 7న మీటర్లు బ్లాస్ట్ అవుతాయి.. నన్ను నమ్మండి'' అన్నారు. ''మీటర్' ప్రీమియర్ చూశాను.. చాలా బావుంది. ఈ వేసవిలో మంచి కమర్షియల్ మాస్ ఎంటర్‌టైనర్ ఇది'' అన్నారు నవీన్ యెర్నేని. ''ఈ సినిమా అందరికీ కనెక్ట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు డైరెక్టర్ బుచ్చిబాబు. ''ఈ సినిమా ఫుల్ మీల్స్‌లా ఉంటుంది'' అన్నారు రమేష్ కడూరి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	583	59,689
నిఫ్టీ ▲	159	17,557

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	11,966	▼	161
డోజోన్స్	33,436	▲	34
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,663	▲	28
డాక్స్	15,520	▼	83
షాంఘై (మంగళవారం ముగింపు)	3,313	▲	16
నికాయ్	27,813	▼	476

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	60,781
బంగారం (22 క్యారట్)	60,538
వెండి (కిలో)	73,834

భారతి సిమెంట్
అత్యుత్తమ నాణ్యతకు హామీ.
అల్ట్రాఫాస్ట్
ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్

మార్చిలో 'సేవలు' అంతంతే..!

ఫిబ్రవరితో పోల్చితే డౌన్



న్యూఢిల్లీ: భారత్ సేవల రంగం మార్చిలో పేలవ పనితీరును కనబరిచింది. ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ ఫిబ్రవరికన్నా తక్కువకు పడిపోయి 57.8కి చేరింది. సూచీ ఫిబ్రవరిలో 12 నెలల గరిష్ట స్థాయి 59.4ను చూసిన సంగతి తెలిసిందే. కొత్త బిజినెస్ ఆర్డర్లు అంతంత మాత్రంగానే పెరిగినట్లు ఎస్‌అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్‌లో ఎకనమిక్స్ అసోసియేట్ డైరెక్టర్ పోలియానా డి లిమా పేర్కొన్నారు. కాగా, సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగా, ఆ దిగువకు పడిపోతేనే క్షీణతగా పరిగణిస్తారు. ఈ ప్రాతిపదికన వరుసగా 20 నెలల నుంచి సూచీ వృద్ధి ధోరణిలో పయనిస్తోంది.

తయారీ–సేవల రంగం కలిపినా డౌన్!

కాగా, తయారీ–సేవల రంగం కలిపినా ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ ఫిబ్రవరిలో 59.0 వద్ద ఉంటే, మార్చిలో 58.4కు పడిపోయింది. మరోవైపు ఒక్క తయారీ రంగం చూస్తే మార్చిలో మంచి పురోగతి కనబరచింది. ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) మార్చిలో మూడు నెలల గరిష్ట స్థాయిలో 56.4కు వద్దకు చేరింది. డిమాండ్ ఊపందుకోవడంతో కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి పెరిగినట్లు నెలవారీ సర్వే పేర్కొంది. ద్రవ్యోల్బణం ఒత్తిడులు తగ్గినట్లూ వివరించింది. ఫిబ్రవరిలో పీఎంఐ 55.3గా నమోదయ్యింది. 400 మంది తయారీదారుల ప్యానల్‌లో కొనుగోళ్లు జరిపే మేనేజర్‌ల స్పందన ఆధారంగా ఈ సూచీ కదలికలను నమోదు చేస్తారు. భారత్ ఎకానమీలో సేవల రంగం వాటా 60%. పరిశ్రమల రంగం వాటా దాదాపు 15% అయితే, అందులో తయారీ రంగం వెయిటేజ్ 70% ఉంటుంది.

ఫ్యాంటసీ స్పోర్ట్స్ ఆదాయం 35 శాతం అప్

- ఈ ఐపీఎల్ సీజన్‌లో రూ. 3,100 కోట్లకు
- రెడ్‌సీర్ స్ట్రాటెజీ కన్సల్టెంట్స్ అంచనా



న్యూఢిల్లీ: ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ 2023 క్రికెట్ టోర్నమెంటు సీజన్‌లో ఫ్యాంటసీ స్పోర్ట్స్ విభాగం ఆదాయం రూ. 2,900–3,100 కోట్లకు చేరనుంది. గతేడాది సీజన్‌తో పోలిస్తే 30–35 శాతం పెరగనుంది. మార్కెట్ రీసెర్చ్ సంస్థ రెడ్‌సీర్ స్ట్రాటెజీ కన్సల్టెంట్స్ ఈ విషయాలు వెల్లడించింది. గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లపై 6.5–7 కోట్ల మంది యూజర్లు లావాదేవీలు జరపవచ్చని అంచనా వేసింది. గత 4–5 ఏళ్లుగా ఫ్యాంటసీ స్పోర్ట్స్ యూజర్ల సంఖ్య ఏటా 20% మేర పెరుగుతుండగా, ఈ ఏడాది 20–30% స్థాయిలో పెరగవచ్చని సంస్థ పార్ట్‌నర్ ఉజ్వల్ చౌదరి తెలిపారు. ప్రతి యూజరుపై ఆదాయం గత ఐపీఎల్ సీజన్‌లో రూ. 410గా ఉండగా ఈ సీజన్‌లో రూ. 440కి చేరవచ్చని పేర్కొన్నారు. మార్కెటింగ్‌పై గణనీయంగా ఖర్చు చేస్తుండటంతో ఫ్యాంటసీ స్పోర్ట్స్ ప్లాట్‌ఫామ్‌లపై అవగాహన పెరుగుతోందని చౌదరి చెప్పారు. 'నిబంధనలు, జీఎస్‌టీపై స్పష్టత వచ్చింది. గూగుల్ కూడా తమ ప్లేస్టోర్‌లో ప్రయోగాత్మకంగా కొన్ని ఫ్యాంటసీ ప్లాట్‌ఫామ్‌లను అనుమతిస్తుండటం మరో సానుకూలాంశం. ఇవన్నీ కూడా భారత్‌లో ఈ స్పోర్ట్స్‌కు అనుకూలమైన పరిణామాలే' అని పేర్కొన్నారు. పైలట్ ప్రోగ్రాం కింద డ్రీమ్11, మై11సర్కిల్, ఎంపీఎల్ రమ్మీ, ఫ్యాంటసీ క్రికెట్ లాంటి కొన్ని ప్లాట్‌ఫామ్‌లను గూగుల్ తమ ప్లేస్టోర్‌లో అనుమతించింది. మార్చి 31తో ప్రారంభమైన ఐపీఎల్ 2023 క్రికెట్ టోర్నీ.. మే నెలాఖరు వరకు కొనసాగనుంది. రెడ్‌సీర్ గణాంకాల ప్రకారం.. ఏడాది మొత్తం మీద ఫ్యాంటసీ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లకు వచ్చే ఆదాయంలో ఐపీఎల్ సీజన్ వాటా 35–40% ఉంటుంది.

4 ఐపీవోలకు సెబీ గ్రీన్‌సిగ్నల్

- జాబితాలో సైయంట్ డీఎల్‌ఎం, రాశి పెరిఫెరల్స్
- హెల్త్‌విస్టా ఇండియా, జాగిల్ ప్రీపెయిడ్ ఓషియన్
- వర్కింగ్ క్యాపిటల్, రుణ చెల్లింపులకు నిధుల బదిలీ



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా నాలుగు కంపెనీల నిధుల సమీకరణ ప్రణాళికలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జాబితాలో సైయంట్ డీఎల్‌ఎం, రాశి పెరిఫెరల్స్, హెల్త్‌విస్టా ఇండియా, జాగిల్ ప్రీపెయిడ్ ఓషియన్ సర్వీసెస్ ఉన్నాయి. ఇవన్నీ 2022 జూలై– 2023 జనవరి మధ్య సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేశాయి. తద్వారా పబ్లిక్ ఇష్యూలు చేపట్టేందుకు మార్చి 29–31 మధ్య అనుమతి పొందాయి. వెరసి స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్‌కు దారి ఏర్పడింది.

ఐటీ సొల్యూషన్స్

సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అందించే రాశి పెరిఫెరల్స్ ఐపీవోలో భాగంగా రూ. 750 కోట్లను సమీకరించే యోచనలో ఉంది. పూర్తిగా షేర్ల జారీ ద్వారా నిధులను సమకూర్చుకోనుంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 400 కోట్లను రుణ చెల్లింపులు, రూ. 200 కోట్లు వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

ఎలక్ట్రానిక్స్ తయారీ

పబ్లిక్ ఇష్యూలో భాగంగా ఎలక్ట్రానిక్స్ తయారీ సర్వీసుల సంస్థ సైయంట్ డీఎల్‌ఎం సైతం రూ. 740 కోట్లు సమకూర్చుకోవాలని చూస్తోంది. ఇందుకు అనుగుణంగా తాజా ఈక్విటీ జారీకి తెరతీయనుంది. ఈ నిధులను మూలధన అవసరాలు, విస్తరణ వ్యయాలు, రుణ చెల్లింపులు, ఇతర కంపెనీల కొనుగోళ్లు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

హెల్త్‌కేర్ సేవలు

పోర్టీ బ్రాండుతో ఆసుపత్రుల బయట ఆరోగ్య పరిరక్షణ సేవలందించే హెల్త్‌విస్టా ఇండియా ఐపీవో ద్వారా రూ. 1,000 కోట్ల సమీకరణపై దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా రూ. 200 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 5.62 కోట్ల షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను అనుబంధ సంస్థ మెడీబిజ్ ఫార్మా వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, రుణ చెల్లింపులు, మెడికల్ పరికరాల కొనుగోళ్లు, ఇతర కంపెనీల కొనుగోళ్లకు వినియోగించనుంది.

ఫైనాన్షియల్ సేవలు

ఐపీవోలో భాగంగా ఫైనాన్షియల్ సేవలందించే ఫిన్‌టెక్ కంపెనీ జాగిల్ ప్రీపెయిడ్ ఓషియన్ సర్వీసెస్ రూ. 490 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి అదనంగా కంపెనీ ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు 1.05 కోట్ల షేర్లను ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను వినియోగదారులను పెంచుకోవడం, టెక్నాలజీ, ప్రొడక్టుల అభివృద్ధి, రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

"సెలెస్ట్ ఎక్స్ సచిన్ టెండూల్కర్" పేరుతో ఆభరణాల శ్రేణి



ముంబై: టాటా గ్రూప్‌నకు చెందిన తనిష్క్ "సెలెస్ట్ ఎక్స్ సచిన్ టెండూల్కర్" పేరుతో ప్రత్యేక కలెక్షన్ ఆవిష్కరించింది. భిన్న సమ్మేళనం, ఖచ్చితత్వం, పరిపూర్ణతతో రూపొందించిన ఈ ఆభరణ శ్రేణిలో ఉంగరాలు, చెవి రింగులు, బ్రాస్‌లైట్లు ఉన్నాయి. అరుదైన ఈ కలెక్షన్‌ను లెజెండరీ క్రికెటర్ సచిన్ 50వ సంవత్సరంలో, వంద అంతర్జాతీయ సెంచరీల రికార్డుకు గుర్తుగా తీసుకొస్తున్నట్లు కంపెనీ తెలిపింది. తనిష్క్ రూపొందించిన ప్రత్యేక లిమిటెడ్ ఎడిషన్ కలెక్షన్ కోసం వారితో భాగస్వామ్యం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని సచిన్ టెండూల్కర్ అన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
6-4-2023	
విశాఖ	420–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	403–00
విజయవాడ	403–00
5-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	385–00
వరంగల్	387–00

నాలుగోరోజూ బుల్ జోరు

- సెన్సెక్స్ 582 పాయింట్లు ప్లస్
- 17,550 స్థాయిపై ముగిసిన నిఫ్టీ
- ఐటీ, ఫైనాన్స్, ఎఫ్‌ఎంసీజీ షేర్లకు డిమాండ్



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్‌లో నాలుగో రోజూ బుల్ జోరు కొనసాగింది. ఐటీ, ఫైనాన్స్, ఎఫ్‌ఎంసీజీ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు ఒకశాతం లాభపడ్డాయి. ప్రపంచ బ్యాంకింగ్ రంగంపై ఆందోళనలు తగ్గుముఖం పట్టడంతో పాటు దేశీయంగా నెలకొన్న సానుకూలాంశాలు సెంటిమెంట్‌ను బలోపేతం చేశాయి. ఐదోరోజూ విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కొనసాగడం, కార్పొరేట్ క్యూ4 ఆర్థిక ఫలితాలపై ఆశావహ అంచనాలు, అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం షేర్లు మూడుశాతం ర్యాలీ, ఫారెక్స్ మార్కెట్లో రూపాయి బలపడటం తదితర అంశాలు కలిసొచ్చాయి. సూచీలు ఉదయం బలహీనంగా ప్రారంభమైనప్పటికీ..., వెంటనే తేరుకొని లాభాల్లోకి మళ్లాయి. ట్రేడింగ్ ఆద్యంతం స్థిరంగా కదలాడి దాదాపు ఇంట్రాడే గరిష్టం వద్ద ముగిశాయి. ఉదయం సెన్సెక్స్ 11 పాయింట్ల స్వల్ప నష్టంతో 59,095 మొదలైంది. ఇంట్రాడేలో 59,094 వద్ద కనిష్టాన్ని, 59,747 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. ఆఖరికి 583 పాయింట్లు ఎగసి 59,689 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 24 పాయింట్లు పెరిగి 17,422 వద్ద మొదలైంది. రోజంతా 17,403 – 17,571 శ్రేణిలో ట్రేడైంది. బలపడి 159 పాయింట్ల లాభంతో 17,557 వద్ద నిలిచింది. విద్యుత్, ఆటో, ప్రభుత్వరంగ బ్యాంకుల షేర్లలో లాభాల స్వీకరణ జరిగింది. చిన్న రంగాల షేర్లకు అధిక డిమాండ్ లభించడంతో బీఎస్‌ఈ స్మాల్ క్యాప్ ఇండెక్స్ ఒకశాతం ర్యాలీ చేసింది. ఎఫ్‌పీఐలు రూ.807 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.947 కోట్ల షేర్లను అమ్మేశారు. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడ్ అవుతున్నాయి.

42 పైసలు బలపడిన రూపాయి

డాలర్ మారకంలో రూపాయి విలువ 42 పైసలు బలపడి 81.90 స్థాయి వద్ద స్థిరపడింది. అంతర్జాతీయంగా డాలర్ ఇండెక్స్ రెండు నెలల కనిష్టానికి దిగిరావడంతో పాటు మన మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల భారీగా కొనుగోళ్లతో దేశీయ కరెన్సీకి డిమాండ్ పెరిగింది. ఫలితంగా 42 పైసలు బలపడి ఇంట్రాడే గరిష్టం 81.90 వద్ద ముగిసింది.

నాలుగు రోజులు : రూ.9.45 లక్షల కోట్లు

సెన్సెక్స్ నాలుగు రోజుల్లో 2,076 పాయింట్లు ర్యాలీ చేయడంతో బీఎస్‌ఈలో 9.45 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. ఫలితంగా ఇన్వెస్టర్లు సంపదగా భావించే బీఎస్‌ఈ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.261.31 లక్షల కోట్లకు చేరింది. "దేశీయ బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల బలమైన త్రైమాసిక గణాంకాల నమోదు, విండ్‌ఫాల్ ట్యాక్స్ తగ్గింపు అంశాల ప్రభావంతో ప్రపంచ మార్కెట్లలోని బలహీనతలను విస్మరిస్తూ దేశీయ ఈక్విటీ మార్కెట్ మెరుగైన ప్రదర్శన కనబరించింది. అలాగే యూఎస్‌లో కార్మిక మార్కెట్ డేటా, ఫ్యాక్టరీ ఆర్డర్ల తగ్గుదల పరిణామాలు ఫెడ్ వడ్డీరేట్ల యథాతథ నిర్ణయానికి దారి తీయొచ్చనే అంచనాలు సెంటిమెంట్‌ను మరింత బలపరిచాయి" అని జియోజిత్ ఫైనాన్షియల్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- ఆటో షేర్లలో లాభాల స్వీకరణతో అశోక్ లేలాండ్ 4 శాతం పతనమైన రూ.135 వద్ద స్థిరపడింది.
- కంపెనీలో అగ్రస్థాయి యాజమాన్యం రాజీనామాతో సైయంట్ షేరు ఆరుశాతం నష్టపోయి రూ.1,057 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 8% క్షీణించి రూ.1,064 వద్ద ఏడాది కనిష్టాన్ని తాకింది.
- ఫైనాన్స్ షేర్ల ర్యాలీ భాగంగా అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు మూడుశాతం బలపడి రూ.1654 వద్ద ముగిసింది.

సౌందర్య సంరక్షణ విభాగంలోకి రిలయన్స్ రిటైల్

టిరా యాప్ ఆవిష్కరణ



న్యూఢిల్లీ: రిలయన్స్ రిటైల్ తాజాగా సౌందర్య, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల విభాగంలోకి ప్రవేశించింది. టిరా పేరిట రిటైల్ ప్లాట్‌ఫాంను ఆవిష్కరించింది. యాప్, వెబ్‌సైట్‌తో పాటు ముంబైలో తొలి టిరా రిటైల్ స్టోర్‌ను కూడా ప్రారంభించింది. 100 పైచిలుకు నగరాల్లో వీటిని ఏర్పాటు చేసే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ బ్రాండ్‌తో రిలయన్స్ ఇకపై హెచ్‌యూఎల్, నైకా, టాటా, ఎల్‌వీఎంహెచ్ మొదలైన దిగ్గజాలతో పోటీ పడనుందని పేర్కొన్నాయి. అన్ని వర్గాల వినియోగదారులకు మెరుగైన అంతర్జాతీయ, దేశీయ సౌందర్య సంరక్షణ బ్రాండ్‌లను అందుబాటులోకి తెచ్చేందుకు టిరా ఉపయోగపడగలదని రిలయన్స్ రిటైల్ వెంచర్స్ ఈడీ ఈషా అంబానీ తెలిపారు. ఆన్‌లైన్ మార్కెట్ డేటా రీసెర్చ్ సంస్థ స్టాటిస్టా ప్రకారం దేశీయంగా బ్యూటీ, పర్సనల్ కేర్ మార్కెట్ 2023లో 27.23 బిలియన్ డాలర్లుగా ఉండనుంది. ఇందులో 12.7 శాతం వాటా ఆన్‌లైన్ అమ్మకాల ద్వారా రానుంది.

భవిత

ఆంధ్రప్రదేశ్ పదో తరగతికి సంబంధించిన స్టడీ మెటీరియల్, సిలబస్, మోడల్‌పేపర్స్, ప్రీవియస్ పేపర్స్, టెక్స్ట్‌బుక్స్, గైడెన్స్ మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

పోటీ పరీక్షల ప్రత్యేకం తెలంగాణ చరిత్ర కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో 100 ఉద్యోగాలు

వరంగల్ కేంద్రంగా పనిచేస్తున్న ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(ఎన్పీడీసీఎల్)లో ఖాళీగా ఉన్న 100 జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

- **విద్యుత్ సర్కిళ్లు:** వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్.
- **అర్హత:** బీఏ, బీఎస్సీ, బీకాంతోపాటు కంప్యూటర్ అప్లికేషన్/ఆఫీస్ ఆటోమేషన్(ఎంఎస్ ఆఫీస్) సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 01.01.2023 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.29,255 నుంచి రూ.54,380 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష(80 మార్కులు), సంబంధిత అనుభవం(20 మార్కులు), ధ్రువ పత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు సమర్పణ, ఫీజు చెల్లింపు ప్రారంభతేది:** 10.04.2023.
- **దరఖాస్తులకు చివరితేది:** 29.04.2023
- **హాల్‌టిక్కెట్ డౌన్‌లోడ్ ప్రారంభతేది:**22.05.2023
- **రాతపరీక్ష తేది:** 28.05.2023.
- **వెబ్‌సైట్:** www.tsnpdcl.in

విజయనగరం జిల్లాలో బ్యాక్‌లాగ్ పోస్టులు

విజయనగరంలోని ఏపీ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఉమ్మడి విజయనగరం జిల్లాలో దివ్యాంగులకు స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తోంది. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 08
- **పోస్టుల వివరాలు:** జూనియర్ అసిస్టెంట్–03, ఆఫీస్ సబార్డినేట్–01, నైట్ వాచ్‌మెన్–02, ధోబీ/చెక్లర్/స్వీపర్–01, ఏఎన్‌ఎం–01.
- **అర్హత:** పోస్టును అనుసరించి 5వ తరగతి, 7వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:**18నుంచి 52 ఏళ్ల మధ్య ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, రూమ్ నెం.34, కలెక్టరేట్, విజయనగరం చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 10.04.2023.
- **వెబ్‌సైట్:**www.vizianagaram.ap.gov.in

ఈసీఐఎల్, హైదరాబాద్‌లో 29 పోస్టులు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్) వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 29
- **పోస్టులు:** టెక్నికల్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఇంజనీర్.
- **విభాగాలు:** ఈసీఈ/ఈటీసీ/ఎలక్ట్రానిక్స్/సీఎస్‌ఈ/ఐటీ తదితరాలు.
- **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో బీఈ/బీటెక్/బీఎస్సీ ఎంపీసీ/డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి. కనీసం ఒక ఏడాది పని అనుభవం ఉండాలి.

వేతనం

- **టెక్నికల్ ఆఫీసర్:** నెలకు రూ.25,000 చెల్లిస్తారు.
- **అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఇంజనీర్:** నెలకు రూ.24,500 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **ఇంటర్వ్యూ వేదిక:** సీఎల్‌డీసీ, నలంద కాంప్లెక్స్, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, టీఐఎఫ్ఆర్ రోడ్, ఈసీఐఎల్ పోస్ట్, హైదరాబాద్–500062.
- **ఇంటర్వ్యూ తేది:** 06.04.2023,07.04.2023.
- **ఇంటర్వ్యూ సమయం:** ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.
- **వెబ్‌సైట్:** www.ecil.co.in

గుంటూరు జిల్లాలో 15 బ్యాక్‌లాగ్ పోస్టులు

గుంటూరు జిల్లా సెలక్షన్ కమిటీ వివిధ విభాగాల్లో ఎస్సీ/ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 54
- **పోస్టుల వివరాలు:** జూనియర్ అసిస్టెంట్–02, జూనియర్ స్టెనో–01,టైపిస్ట్–03,మాట్రాన్ కమ్ స్టోర్ కీపర్–01, ఆఫీస్ సబార్డినేట్–08, మెసెంజర్–02, ల్యాబ్ అసిస్టెంట్–01, ల్యాబ్ అటెండర్–01, వర్క్‌షాప్ అటెండర్–01, స్కిల్డ్ వర్క్ మ్యాన్–01, ఫిషర్ మ్యాన్–01, శానిటరీ(పబ్లిక్ హెల్త్)మేస్త్రీ–01, వాచ్‌మ్యాన్–09, వాటర్‌మ్యాన్–01, స్వీపర్–03, పబ్లిక్ హెల్త్ వర్కర్–12, గ్యాంగ్ మజ్దూర్–02, డ్రెయిన్ క్లీనర్–01, కళాసి –01, హోల్ టైమ్ సర్వెంట్–01, లస్కర్–01.
- **అర్హత:** పోస్టును అనుసరించి తెలుగు/ఇంగ్లిష్ భాషలో చదవడం, రాయడం, 5వ తరగతి, 7వ తరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీఈడీ ఉత్తీర్ణులవ్వాలి. టైప్ రైటింగ్ సర్టిఫికేట్ కలిగి ఉండాలి.
- **వయసు:** 01.07.2022 నాటికి 18 నుంచి 52 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** విద్యార్హతలో సాధించిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.04.2023
- **వెబ్‌సైట్:** www.gunturap.in

అనంతపురం జిల్లాలో స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్

అనంతపురం జిల్లాలో దివ్యాంగుల కోసం కేటాయించిన బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహణకు సంబంధించి జిల్లా సెలక్షన్ కమిటీ, కలెక్టర్/జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయం దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 08
- **పోస్టుల వివరాలు:** జూనియర్ అసిస్టెంట్–05, జూనియర్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్–01, టైపిస్ట్–01, ఎల్.డి.కంప్యూటర్–01.
- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. టైప్ రైటింగ్ సర్టిఫికేట్ ఉండాలి.
- **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 52 ఏళ్ల మధ్య ఉండాలి.
- **పే స్కేల్:** నెలకు రూ.25,220 నుంచి రూ. 80,910 ఉంటుంది.
- **ఎంపిక విధానం:** అకడమిక్ పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును చైర్మన్, జిల్లా ఎంపిక కమిటీ, జిల్లా కలెక్టర్, అనంతపురం చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 15.04.2023.
- **వెబ్‌సైట్:** www.ananthapuramu.ap.gov.in

ప్రకాశం జిల్లాలో స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో 17 పోస్టులు

ప్రకాశం జిల్లాలో దివ్యాంగుల కోసం కేటాయించిన బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహణకు సంబంధించి జిల్లా సెలక్షన్ కమిటీ, కలెక్టర్/జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయం దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 17
- **పోస్టుల వివరాలు:** టైపిస్ట్–02, జూనియర్ అసిస్టెంట్/డీఈవో–01, టెక్నికల్ అసిస్టెంట్–01, ఆఫీస్ సబార్డినేట్–08, వాచ్‌మ్యాన్–02, సేవిక –01, కామాటి–01, స్వీపర్–01.
- **అర్హత:** పోస్టును అనుసరించి 5వ తరగతి, 7వ తరగతి, బ్యాచిలర్ డిగ్రీ, టైప్ రైటింగ్ సర్టిఫికేట్ ఉండాలి.
- **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 52 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కులు, వైకల్య శాతం ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ప్రకటన వెలువడిన తేదీ నుంచి 15 రోజుల్లోగా మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయం, ఒంగోలు, ప్రకాశం జిల్లా చిరునామకు పంపించాలి.
- **ప్రకటన తేది:** 30.03.2023.
- **వెబ్‌సైట్:** www.prakasam.ap.gov.in

ప్రఖ్యాత సంస్థల్లో పీజీకి దారి

» సీయూఈటీ–పీజీ 2023 ప్రకటన విడుదల



పోస్ట్‌గ్రాడ్యుయేట్(పీజీ) కోర్సులు అందించడంలో దేశంలోని సెంట్రల్ యూనివర్సిటీలకు మంచి పేరుంది. ఇందులో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు నాణ్యమైన బోధనతోపాటు అధునాతన విద్యాసౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. ఇలాంటి ఉత్తమ విద్యాసంస్థల్లో ప్రవేశానికి మార్గం.. కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ పోస్ట్‌గ్రాడ్యుయేట్(సీయూఈటీ-పీజీ). ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తోంది. ప్రస్తుతం 2023 ఏడాదికి సీయూఈటీ-పీజీ ప్రకటన విడుదలైంది. ఈ నేపథ్యంలో.. సీయూఈటీ పీజీ ప్రత్యేకత, అందించే కోర్సులు, దరఖాస్తుకు అర్హతలు, పరీక్ష విధానం తదితర వివరాలు..

గతంలో సెంట్రల్ యూనివర్సిటీలు పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం వేర్వేరుగా ఎంట్రెన్స్ టెస్టులు నిర్వహించేవి. దీనివల్ల విద్యార్థులు ప్రతి వర్సిటీ నోటిఫికేషన్‌కు అనుగుణంగా ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకొని.. సుదూర ప్రాంతాలకు వెళ్లి రాయాల్సి వచ్చేది. విద్యార్థుల వ్యయప్రయాసలను దృష్టిలో పెట్టుకొని 2022 నుంచి కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ)ను ప్రవేశపెట్టారు. ఫలితంగా ఒకే ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా విద్యార్థులు దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశాలు పొందే వీలుకలిగింది.

తెలుగు రాష్ట్రాల్లో

- హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ, ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ–హైదరాబాద్, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ–విజయనగరం, ఏపీ సెంట్రల్ యూనివర్సిటీ–అనంతపురంలలో ప్రవేశాలకు సీయూఈటీ పీజీ స్కోరే ప్రామాణికం. వీటితోపాటు జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ–న్యూఢిల్లీ, బెనారస్ హిందూ యూనివర్సిటీ–వారణాసి, పాండిచ్చేరి యూనివర్సిటీ, జామియా మిల్లియా ఇస్లామియా..ఇలా పలు పేరున్న సంస్థల్లో సీయూఈటీ స్కోర్ ద్వారానే ప్రవేశాలు కల్పిస్తారు.
- సీయూఈటీ పీజీ ద్వారా కేంద్రీయ విశ్వవిద్యాలయాలతోపాటు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న విశ్వవిద్యాలయాలు, రాష్ట్ర స్థాయి యూనివర్సిటీలు, డీమ్డ్ యూనివర్సిటీలు, ప్రైవేట్ విద్యా సంస్థల్లో సైతం అడ్మిషన్ పొందే అవకాశముంది.

అర్హత

డిగ్రీ పూర్తిచేసుకున్నవారు, ప్రస్తుతం డిగ్రీ ఫైనల్‌లో ఉన్న విద్యార్థులు సీయూఈటీ పీజీకి దరఖాస్తు చేసుకోవచ్చు. పలు కోర్సులకు ఏదైనా డిగ్రీ సరిపోతుంది. మరికొన్ని కోర్సులకు డిగ్రీలో సంబంధిత విభాగంలో చదివి ఉండాలి.

ఆన్‌లైన్ పరీక్ష

సీయూఈటీ పీజీ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో రెండు షిఫ్టుల్లో నిర్వహిస్తారు. మొత్తం 100 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం 2 గంటలు. ప్రశ్నలు ఇంగ్లిష్, హిందీ భాషల్లో(లాంగ్వేజ్, సాహిత్య పేపర్లు తప్ప) ఉంటాయి. ఇందులో పార్ట్–ఎ, పార్ట్–బి అనే రెండు విభాగాలు ఉంటాయి. పార్ట్ ఎలో –25, పార్ట్ బిలో –75 ప్రశ్నల వస్తాయి. పార్ట్–ఎలో జనరల్, పార్ట్–బిలో సంబంధిత సబ్జెక్టు ప్రశ్నలు అడుగుతారు. ప్రతి సరైన సమాధానానికి 4 మార్కులు, ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. ఎంఏ/ఎమ్మెస్సీ కోర్సులకు సంబంధించి పార్ట్–ఎలో ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్, మ్యాథమెటికల్ ఆప్టిట్యూడ్, అనలిటికల్ స్కిల్స్‌లో ప్రశ్నలు వస్తాయి. సబ్జెక్టులవారీ పార్ట్ బి సిలబస్ వివరాలు ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో ఉన్నాయి.

అందించే కోర్సులు

- **ఎంఏ:** తెలుగు, ఇంగ్లిష్, హిందీ, కన్నడ, ఉర్దూ, సంస్కృతం, బెంగాలీ, ఏన్షంట్ ఇండియన్ హిస్టరీ కల్చర్ అండ్ ఆర్కియాలజీ, జాగ్రఫీ, స్టాటిస్టిక్స్, మ్యాథ్స్, హోంసైన్స్, లింగ్విస్టిక్స్, నేపాలీ, అరబిక్, ఫ్రెంచ్, జర్మన్, మరాఠీ, పర్షియన్, రష్యన్, చైనీస్, ఫిలాసఫీ, ఆర్ట్, హిస్టరీ, పాళీ, ఎడ్యుకేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, సైకాలజీ, సోషల్ వర్క్, ఆంత్రోపాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, కాన్‌ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్, ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్, సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ, ఎనర్జీ ఎకనామిక్స్, హెరిటేజ్ మేనేజ్‌మెంట్, మాస్ కమ్యూనికేషన్, మ్యూజియాలజీ.
- **ఎమ్మెస్సీ:** ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బోటనీ, కంప్యూటర్ సైన్స్, జాగ్రఫీ, మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, సైకాలజీ, హోంసైన్స్, బయో కెమిస్ట్రీ, టెక్ జియో ఫిజిక్స్, జియాలజీ, హెల్త్ స్టాటిస్టిక్స్, అగ్రికల్చర్, డైరీ టెక్నాలజీ, మ్యాథ్స్ అండ్ కంప్యూటింగ్, కంప్యూటేషనల్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, ఫోరెన్సిక్ సైన్స్, ఆగ్రోఫారెస్ట్రీ, సాయిల్ వాటర్ కన్జర్వేషన్, ఫుడ్ టెక్నాలజీ, ప్లాంట్ బయోటెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీ.
- **ఎంఎఫ్ఏ:** పెయింటింగ్, అప్లయిడ్ ఆర్ట్స్, ప్లాస్టిక్ ఆర్ట్స్, పోటరీ అండ్ సిరామిక్స్, టెక్స్‌టైల్ డిజైన్; ఎంపీఏ: వోకల్ మ్యూజిక్, డాన్స్.
- **ఎంబీఏ:** ఫారిన్ ట్రేడ్, రిస్క్ అండ్ ఇన్సూరెన్స్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, అగ్రి బిజినెస్.
- **మాస్టర్ ఆఫ్ వొకేషన్:** రిటైల్ అండ్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్, హాస్పిటాలిటీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెసింగ్ అండ్ మేనేజ్‌మెంట్, మెడికల్ లేబొరేటరీ అండ్ టెక్నాలజీ. ఎంఎడ్, ఎంఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్, ఎంఎల్ఐఎస్సీ, మాన్యుస్క్రిప్టాలజీ అండ్ పాలియోగ్రఫీ, ఎంపీఈడీ,ఎల్ఎల్ఎం, ఎంసీఏ, ఎంకాం, టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్, కార్పొరేట్ కమ్యూనికేషన్స్ మేనేజ్‌మెంట్ తదితర పీజీలో ఉండే అన్ని కోర్సులు అందుబాటులో ఉన్నాయి.
- సీయూఈటీ పీజీలో సాధించిన స్కోరుతో ప్రవేశం పొందాలనుకుంటున్న విశ్వవిద్యాలయానికి ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి.

ప్రిపరేషన్ ఇలా

పరీక్షకు సంబంధించి సిలబస్‌ను సంబంధిత సబ్జెక్టులను పరిశీలించాలి. సిలబస్‌కు అనుగుణంగా మూడేళ్ల డిగ్రీ స్థాయి పుస్తకాలకు ప్రాధాన్యమివ్వాలి. గతంలో కేంద్రీయ విశ్వవిద్యాలయాలు పీజీ ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రశ్నపత్రాలు సీయూఈటీని ఎదుర్కోవడానికి ఉపయోగపడతాయి. ప్రిపరేషన్‌లో భాగంగా వీలైనన్ని ఎక్కువ మాక్ టెస్టులను రాయాలి. దీనిద్వారా ప్రిపరేషన్ స్థాయిని అంచనా వేసుకోవచ్చు. అలాగే తప్పులను విశ్లేషించుకుంటూ సన్నద్ధత కొనసాగిస్తే కోరుకున్న వర్సిటీలో ప్రవేశం పొందవచ్చు.

పరీక్ష కేంద్రాలు

రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ముఖ్యమైన ప్రాంతాల్లో పరీక్ష రాసుకునే వెసులుబాటు ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో–24, తెలంగాణలో–11 ప్రాంతాల్లోని ప్రధాన కేంద్రాల్లో ఈ పరీక్షలను నిర్వహిస్తారు.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు చివరి తేదీ:** ఏప్రిల్ 19,2023
- **పరీక్ష తేదీలు:** తర్వాత ప్రకటిస్తారు.
- **వెబ్‌సైట్:** https://cuet.nta.nic.in

నేడు, రేపు ఎండ ఎక్కువే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగాయి. ఉపరితలద్రోణి ప్రభావంతో నాలుగైదు రోజులుగా సాధారణ ఉష్ణోగ్రతలే నమోదు కాగా... ప్రస్తుతం సాధారణానికి మించి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురు, శుక్రవారాల్లో పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఆదిలాబాద్, కుమ్రుంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, నారాయణపేట్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని సూచించింది. బుధవారం రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... గరిష్ట ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 39.8 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్, హకీంపేట్‌లో 21.5 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.

తెలంగాణ, ఏపీల్లోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
అనంతపురం	41.9	20.2
రెంటచింతల	41.4	26.3
ఆదిలాబాద్	39.8	22.2
భద్రాచలం	39.5	26.5
ఖమ్మం	39.2	25.0
నిజామాబాద్	39.1	24.8
మహబూబ్‌నగర్	38.8	25.0
మెదక్	38.4	21.5
కడప	38.2	26.2
రామగుండం	38.0	23.8
హనుమకొండ	37.0	23.5
నల్లగొండ	37.0	22.6
హకీంపేట్	36.1	21.5
దుండిగల్	36.0	23.3
హైదరాబాద్	36.2	24.7
విజయవాడ	36.0	26.0

దొడ్డ శ్రీనివాసరెడ్డి

➤ గ్లోబల్ కరెన్సీగా అమెరికన్ డాలర్‌కు ఉన్న పట్టు క్రమంగా సడలిపోతోంది. డాలర్‌కు వ్యతిరేకంగా సొంత కరెన్సీలను బలోపేతం చేసుకోవాలనుకుంటున్న దేశాల సంఖ్య పెరిగిపోయింది. ఈ దేశాల జాబితాలో ఇప్పుడు భారత్ కూడా చేరింది. ప్రస్తుతం దాదాపు అన్ని దేశాల విదేశీ మారకద్రవ్య నిల్వల్లో అమెరికన్ డాలర్లే 60 శాతానికి పైగా ఉన్నాయి. అంతర్జాతీయ వాణిజ్యం, రుణాలు, సెక్యూరిటీల లావాదేవీల్లో సగానికి పైగా డాలర్లలోనే సాగుతున్నాయి. ఇక విదేశీ కరెన్సీల ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లలో మొత్తం అన్ని కరెన్సీలను కలుపుకొన్నా 90 శాతం ట్రేడింగ్ అమెరికన్ డాలర్ల ద్వారానే జరుగుతోంది. ఇక ముందు ఈ పరిస్థితి మారబోతోంది. డాలర్‌పై ఆధారపడటం మాని సొంత కరెన్సీలను బలోపేతం చేసుకోవాలనే కోరికతో అనేక దేశాలు ద్వైపాక్షిక ఒప్పందాలు చేసుకుంటున్నాయి. సమీప భవిష్యత్‌లోనే గ్లోబల్ కరెన్సీ స్థానాన్ని అమెరికన్ డాలర్ కోల్పోయే ప్రమాదం వచ్చింది.



డాలర్ డౌన్‌ఫాల్!

'గ్లోబల్ కరెన్సీ' ప్రాభవం కోల్పోతున్న అమెరికన్ డాలర్

ఇలా మొదలైంది..

➤ బ్రెట్టన్‌వుడ్ ఒప్పందంతో అమెరికన్ డాలర్ పెత్తనం మొదలైంది.రెండో ప్రపంచ యుద్ధ కాలంలో కుదేలైన అనేక దేశాలు ముఖ్యంగా యూరప్ దేశాలు అనేకానేక ఉత్పత్తుల కోసం అమెరికాపై ఆధారపడాల్సి వచ్చింది. వాణిజ్య ఒప్పందాల్లో డాలర్ విలువ ఎలా ఉండాలనే విషయమై ఐక్యరాజ్యసమితి ద్రవ్య, ఆర్థిక సదస్సు అమెరికా న్యూ హాంప్‌షైర్‌లోని బ్రెట్టన్‌వుడ్‌లో జరిగింది. 44 దేశాలు పాల్గొన్న ఈ సమావేశంలో అంతర్జాతీయంగా బంగారు ధరలను డాలర్ విలువకు జతచేస్తూ ఒప్పందం చేసుకున్నాయి. దాంతో ఇతర కరెన్సీల విలువను డాలర్ మారక విలువ కోసం ఈ ఒప్పందం ప్రాతిపదికైంది. ఒక డాలర్ విలువ ఒక ఔన్స్ (31.1034768 గ్రాములు) బంగారంతో సమానమైంది. 1970లో అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ డాలర్ విలువను బంగారు ధరకు జత చేయడాన్ని రద్దు చేసినప్ప



టికీ అప్పటికే డాలర్ నిల్వలు అన్ని దేశాల్లో పెరిగిపోయి గ్లోబల్ కరెన్సీగా అవతరించింది. పనామా, ఎల్ సాల్వడార్, జింబాబ్వే లాంటి 11 దేశాలు ఇప్పటికీ అమెరికన్ డాలర్‌నే తమ దేశాల్లో అధికారిక కరెన్సీగా చెలామణి చేస్తున్నాయి. డాలర్ శక్తిసామర్థ్యంతో రెచ్చిపోయిన అమెరికా అనేక సందర్భాల్లో ఆ డాలర్‌నే ఆయుధంగా వాడుకుంది. ఉక్రెయిన్‌లో భాగమైన క్రిమియాను రష్యా ఆక్రమించుకున్నప్పుడు వివిధ బ్యాంకుల్లో రష్యా నిల్వ చేసిన 64,000 కోట్ల డాలర్లను అమెరికా జప్తు చేసింది. రష్యా విదేశీ మారక నిల్వల్లో ఇది సగానికి పైగా ఉంది. ఇలాంటి ప్రయోగమే వివిధ సందర్భాల్లో అఫ్గానిస్తాన్, ఇరాన్, వెనెజులా వంటి దేశాలపై అమెరికా ప్రయోగించింది. అమెరికా ఆంక్షలను ఉల్లంఘించిన బ్యాంకులపై పెద్ద మొత్తంలో జరిమానాలు కూడా విధించింది.

➤ క్రిమియా ఆక్రమణ నేపథ్యంలో అమెరికా విధించిన ఆంక్షలను ఎదుర్కొనడానికి 2014లో రష్యా చైనాతో చేతులు కలిపి డాలర్‌కు వ్యతిరేకంగా వాణిజ్య ఒప్పందాలు చేసుకుంది. దీంతో గ్లోబల్ కరెన్సీగా చెలామణి అవుతున్న అమెరికన్ డాలర్‌కు పెద్ద సవాల్ మొదలైంది. రష్యా, చైనా మధ్య జరిగే అన్ని వ్యాపార లావాదేవీల్లో

తొలుత రష్యాలో..

మారక ద్రవ్యంగా రూబుల్‌-యువాన్‌లు వినియోగించాలని ఈ రెండు దేశాలు నిర్ణయించాయి. అంతేకాదు రష్యా తన విదేశీ మారకద్రవ్య నిల్వల్లో అధికశాతం చైనా యువాన్ కరెన్సీని సమకూర్చుకోవాలని కూడా నిర్ణయించింది. దాంతో గత ఏడాదికి రష్యా విదేశీ మారక నిల్వల్లో యువాన్ 60 శాతానికి పెరిగినట్లు రష్యా ఆర్థిక శాఖ ప్రకటించింది. అలాగే డాలర్ స్థానంలో తమ సొంత కరెన్సీల్లోనే వ్యాపారం నిర్వహించాలని ఇటీవల చైనా, బ్రెజిల్ నిర్ణయించాయి. లాటిన్ అమెరికాలో అతిపెద్ద ఆర్థికశక్తి అయిన బ్రెజిల్‌తో చైనా చేసుకున్న ఒప్పందం కారణంగా డాలర్ పెత్తనానికి మరో పెద్ద సవాల్ ఏర్పడింది. బ్రెజిల్ రీస్ చైనా యువాన్ బంధం డాలర్ ఆధిపత్యాన్ని నిలువరించింది. గత ఏడాది ఈ రెండు దేశాల మధ్య 15,000 కోట్ల డాలర్ల విలువైన వాణిజ్యం జరిగింది. డాలర్, యూరో, యెన్, పౌండ్‌లకు బదులు తమ దేశాల కరెన్సీలతోనే వ్యాపారం సాగించాలనే ఏకైక ఎజెండాతో ఆగ్నేయాసియా దేశాల ఆర్థిక మంత్రిత్వ శాఖలు, ఆయా దేశాల సెంట్రల్ బ్యాంకులు ఇటీవల అధికారిక సమావేశం నిర్వహించాయి.

➤ గత జనవరిలో దక్షిణాఫ్రికా విదేశాంగ మంత్రి నలెది పాండోర్ ఒక ఇంటర్వ్యూలో 'బ్రిక్, (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) దేశాలు డాలర్‌కు ప్రత్యామ్నాయ మారకాన్ని ఆవిష్కరించాలని కోరుకుంటున్నాయి'అని వెల్లడించారు. సౌదీ అరేబియా ఆర్థిక మంత్రి మహమ్మద్ అల్‌-జదాన్ ఇటీవల మరో బాంబు పేల్చారు. చమురు వ్యాపారంలో డాలర్‌కు ఇతర కరెన్సీల వినియోగంపై చర్చకు తాము సిద్ధమని ప్రకటించారు. అమెరికా మిత్ర దేశమైన సౌదీ అరేబియా నుంచి ఇలాంటి ప్రకటన రావడం ప్రపంచవ్యాప్తంగా సంచలనం రేపింది. అంతర్జాతీయంగా చమురు వాణిజ్యం దాదాపుగా అమెరికన్ డాలర్ల

70 శాతం నుంచి 59 శాతానికి..

లోనే జరుగుతుంది. అందుకే దాన్ని పెట్రోడాలర్‌గా పిలుస్తారు. చమురు ఎగుమతుల్లో ఒపెక్ (చమురు ఉత్పత్తి చేసే దేశాలు) దేశాల్లో అగ్రస్థానంలో నిలిచే సౌదీ అరేబియా ఇతర కరెన్సీల్లో వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తే అమెరికన్ డాలర్ ఆధిపత్యానికి చరమగీతం పాడినట్లేనని అంతర్జాతీయ నిపుణుల అభిప్రాయం. భారత్‌-రష్యా మధ్య కూడా వాణిజ్యం అమెరికన్ డాలర్‌లో కాకుండా ఇతర కరెన్సీల్లో జరుగుతోంది. భారతీయ సంస్థలు రష్యా నుంచి చేసుకున్న దిగుమతులకు అరబ్ ఎమిరేట్స్ కరెన్సీ దినార్‌ను వినియోగించేవి. ఇప్పుడు రూబుల్‌లో చెల్లింపులు చేస్తున్నాయి. ఈ ఏడాది ఆరంభానికి వివిధ దేశాల విదేశీ మారక నిల్వల్లో అమెరికన్ డాలర్ వంతు 59 శాతానికి తగ్గిపోయింది. ఇది 1999 నాటికి 70 శాతం ఉండేదని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) పేర్కొంది.

➤ భారత్ కూడా తన రూపాయిని అంతర్జాతీయ కరెన్సీగా ఆవిష్కరించే దిశలో చర్యలు మొదలుపెట్టింది. అనేక దేశాలు డాలర్‌కు ప్రత్యామ్నాయాన్ని వెతుకుతున్న తరుణంలో డాలర్, యూరో, యెన్, పౌండ్‌లతో దీటుగా రూపాయిని గ్లోబల్ కరెన్సీగా చెలామణి చేసేందుకు తొలి అడుగులు వేసింది. రూపాయిని మారక విలువగా వినియోగించేందుకు వీలుగా ఆర్‌బీఐ రష్యా, శ్రీలంకతోపాటు మొత్తం 18 దేశాల్లోని 60 బ్యాంకుల్లో వోస్ట్రో అకౌంట్లను ప్రారంభించింది. అంతర్జాతీయ

ఇక భారత్ వంతు..

వాణిజ్య లావాదేవీలను రూపాయి ద్వారా నిర్వహించడానికి వీలుగా ఆర్‌బీఐ ఈ అకౌంట్లను ప్రారంభించిందని భారత ఆర్థిక శాఖ సహాయమంత్రి భగవత్ కరాడ్ ప్రకటించారు. రూపాయితో వ్యాపారం చేయడానికి ఒప్పుకున్న దేశాల్లో బ్రిటన్, మలేషియా, రష్యా, సింగపూర్, న్యూజిలాండ్, శ్రీలంక, మయన్మార్, బోట్స్వానా, ఇజ్రాయెల్, ఫిజి, ఒమన్, జర్మనీ, కెన్యా, గయానా, మారిషస్, టాంజానియా, ఉగాండా దేశాలున్నాయి. అమెరికా వాల్‌స్ట్రీట్‌లో 'డాక్టర్ డూమ్'గా పేరుపడ్డ ఆర్థికవేత్త నౌరియల్ రుబిని 'రానున్న రోజుల్లో భారత రూపాయి అంతర్జాతీయ విపణిలో అతి ముఖ్యమైన విదేశీ మారకద్రవ్యంగా అవతరించబోతోంది' అన్నారు.

14లోగా సర్కారు స్పందిస్తుందా?

- పేస్కేల్ కోసం ఏళ్లుగా 23వేల వీఆర్‌ఏ కుటుంబాల ఎదురుచూపు
- ప్రభుత్వంతో చర్చలు జరిపి 100 రోజులు దాటినా పట్టింపు లేదు
- అంబేడ్కర్ జయంతి నాటికైనా ప్రకటిస్తుందన్న ఆశ
- లేదంటే మళ్లీ ప్రత్యక్ష కార్యాచరణకి సిద్ధమంటున్న వీఆర్‌ఏ జేఏసీ

సాక్షి, హైదరాబాద్: గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్‌ఏ)గా పనిచేస్తున్న రాష్ట్రంలోని 23వేల మంది రెవెన్యూ సిబ్బంది కష్టాలు ఎప్పటికి తీరుతాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఏళ్లు గడుస్తున్నా.. నిరవధిక సమ్మె చేపట్టినా.. నిర్వేదంతో ప్రాణాలపై ఆశలు వదులుకుంటున్నా ప్రభుత్వం మాత్రం తమపై కనికరం చూపడం లేదని వీఆర్‌ఏలు వాపోతున్నారు. సమ్మె పూర్తయి ఆరునెలలవుతున్నా నేటికీ తమ డిమాండ్లు హామీలుగానే మిగిలిపోయాయని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

మూడే ప్రధాన డిమాండ్లు

వీఆర్‌ఏలు ప్రధానంగా మూడు డిమాండ్లు నెరవేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. తమకు పేస్కేల్ వర్తింపజేయాలని, అర్హులైన వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలని, 50 ఏళ్లుపైబడిన వీఆర్‌ఏల వారసులకు కారుణ్య ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతున్నారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలు, మంత్రి కేటీఆర్, అప్పటి సీఎస్ సోమేశ్‌కుమార్ సమక్షంలో జరిగిన చర్చలు ఫలితాన్ని ఇవ్వకపోగా, గత ఏడాదిలో 80 రోజుల పాటు చేసిన నిరవధిక సమ్మె తర్వాత కూడా పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా మిగిలిపోయిందని వాపోతున్నారు. ఇన్నాళ్లూ తమ గోడు ప్రభుత్వానికి చెప్పే ఉన్నతాధికారి (సీసీఎల్‌ఏ) లేరని భావించామని ఇప్పుడు కొత్త సీసీఎల్‌ఏగా నవీన్ మిత్తల్ బాధ్యతలు చేపట్టినా పరిస్థితి అలానే ఉందంటున్నారు.

అంబేడ్కర్ జయంతి నాటికి

రాష్ట్ర ప్రభుత్వంపై మరోమారు ఒత్తిడి పెంచాలని వీఆర్‌ఏల జేఏసీ భావిస్తోంది. అంబేడ్కర్ జయంతి (ఏప్రిల్14) సందర్భంగానైనా తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించని పక్షంలో మరోసారి ప్రత్యక్ష కార్యాచరణకు దిగాలని భావిస్తున్నారు. ఏప్రిల్15న సమావేశమై భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించాలనే యోచనలో ఉన్నారు.

సీఎంపై ఇంకా నమ్మకముంది




తరతరాలుగా ఈ ఉద్యోగం చేస్తున్న తమను గుర్తించి తెలంగాణ రాగానే జీతాలు పెంచింది సీఎం కేసీఆరే. వీఆర్‌ఏలను పేస్కేల్ ఉద్యోగులుగా గుర్తిస్తామని అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చింది కూడా ఆయనే. కొన్ని అనివార్య పరిస్థితుల దృష్ట్యా ఆలస్యం జరుగుతున్నప్పటికీ మాకు కేసీఆర్‌పై నమ్మకం ఉంది. రాష్ట్రంలోని 23వేల మంది వీఆర్‌ఏలకు ఆయన న్యాయం చేస్తారనే భరోసాతో ఉన్నాం.

– కర్ణకంటి రాజేశ్, డైరెక్ట్ రిక్రూటీ వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

తెలంగాణ నుంచి 1.5 లక్షల మంది విద్యార్థులు • రాష్ట్రంలో 17 కేంద్రాల్లో పరీక్ష



సాక్షి, హైదరాబాద్: జాతీయ ఇంజనీరింగ్ విద్యా సంస్థలైన ఐఐటీ, ఎన్‌ఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ మెయిన్స్ రెండో విడత పరీక్షలు గురువారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు దేశవ్యాప్తంగా జరుగుతాయి. తెలంగాణలో ఈ పరీక్షల కోసం 17 కేంద్రాలు ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత కల్పించినట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) తెలిపింది. జేఈఈ పరీక్షలకు సంబంధించి తొలుత విడుదల చేసిన షెడ్యూల్‌లో ఈ నెల 6వ తేదీనుంచి 12వ తేదీవరకు నిర్వహించనున్నట్టు పేర్కొంది. అయితే అభ్యర్థుల సంఖ్య పెరగడంతో 13, 15 తేదీల్లో కూడా ఈ పరీక్షను నిర్వహించేలా తాజాగా అడ్మిట్‌కార్డుల్లో పొందుపరిచింది. మొత్తంగా ఈనెల 6, 8, 10, 11, 12, 13, 15 తేదీల్లో పరీక్షలు జరగనున్నాయి.

రెండో సెషన్‌కే ఎక్కువమంది హాజరు

తొలిరోజు పరీక్ష రాసే వారి అడ్మిట్‌కార్డులను ఎన్‌టీఏ ముందు విడుదల చేసింది. తదుపరి రోజులకు సంబంధించి పరీక్షలు రాసే వారి అడ్మిట్‌కార్డులను వరుసగా ముందు రోజుల్లో వెబ్‌సైట్లలో పొందుపర్చనున్నారు. అభ్యర్థులు తమ పుట్టిన తేదీ, అప్లికేషన్ నెంబర్‌ను నమోదు చేయడం ద్వారా ఈ అడ్మిట్‌కార్డులను డౌన్లోడ్ చేసుకోవచ్చునని ఎన్‌టీఏ పేర్కొంది. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఈ అడ్మిట్‌కార్డు కాపీలతో పాటు చెల్లుబాటు అయ్యే ఫొటో గుర్తింపు కార్డును కూడా తీసుకురావాలని సూచించింది. జనవరిలో నిర్వహించిన మొదటి సెషన్ పరీక్షలకన్నా రెండో సెషన్‌కు ఎక్కువమంది హాజరుకానున్నారని ఎన్‌టీఏ విడుదల చేసిన అడ్మిట్ కార్డుల నోట్‌లో పేర్కొంది. జేఈఈ మెయిన్ తొలిసెషన్ పరీక్షలకు 8.6 లక్షల మంది హాజరు కాగా ఈసారి 9.4 లక్షల మంది పరీక్ష రాయనున్నారు. తెలంగాణ వ్యాప్తంగా 1.5 లక్షల మంది పరీక్ష రాసే వీలుంది. జనవరిలో నిర్వహించిన తొలి సెషన్ సమయంలో ఇంటర్ పరీక్షల సన్నద్ధతతో పాటు ప్రాక్టికల్ పరీక్షలు కూడా ఉండడంతో పరీక్ష రాసిన విద్యార్థుల సంఖ్య తక్కువే. అప్పుడు పరీక్ష రాయని వారితోపాటు రాసిన వారు కూడా రెండో సెషన్‌లో పరీక్షలు రాయనున్నారు.

క్లుప్తంగా...

భద్రాద్రిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

వైభవంగా చక్రస్నానం



భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో మార్చి 22న ప్రారంభమైన శ్రీరామనవమి వసంతపక్ష ప్రయుక్త బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. చివరి రోజు స్వామివారి సుదర్శన చక్రానికి పవిత్ర గోదావరి నదిలో వైభవంగా చక్రస్నానం వేడుక నిర్వహించారు. అంతకు ముందు నదీ తీరాన ఉన్న పునర్వసు మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం చేశారు. సాయంత్రం ధ్వజారోహణం, దేవతోద్వాసన, పుష్పయాగం, పూర్ణాహుతితో వేడుకలకు ముగింపు పలికారు. కాగా, బ్రహ్మోత్సవాల సందర్భంగా రద్దు చేసిన నిత్యకల్యాణాలు గురువారం నుంచి తిరిగి ప్రారంభం కానున్నాయి.

నీ కాల్మొక్తా సార్.. నా కొడుకు భవిష్యత్ కాపాడండి

- హెచ్‌ఎం కాళ్లపై పడి రోదించిన విద్యార్థి తల్లి



హెచ్‌ఎం పవన్‌కుమార్ కాళ్లపైపడి రోదిస్తున్న సునీత, పక్కన తరుణ్, రమేష్

కారేపల్లి: "నీ కాల్మొక్తా సార్.. నా కొడుకు భవిష్యత్‌ను కాపాడండి.. ఎలాగైనా సరే నా కొడుకు పదో తరగతి పరీక్ష రాసేలా చేయండి సార్" అంటూ ఓ తల్లి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడి కాళ్లపై పడి రోదించింది. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం వెంకిట్యాతండాకు చెందిన గుగులోతు రమేష్ – సునీత దంపతుల కుమారుడు తరుణ్.. గతేడాది కారేపల్లి హైస్కూల్‌లో పదో తరగతి చదివాడు. అయితే గణితంలో ఫెయిల్ అయ్యాడు. దీంతో ఈ ఏడాది పరీక్ష రాసేందుకు హైస్కూల్ జూనియర్ అసిస్టెంట్ సులోచనకు పరీక్ష ఫీజు రూ.150తో పాటు ఆలస్యమైనందుకు అదనపు రుసుము రూ.వెయ్యి కూడా చెల్లించాడు. అయితే, ఆమె సెలవులో వెళ్తూ హెచ్‌ఎం పవన్‌కుమార్‌కు ఫీజు ఇచ్చినట్లుగా చెబుతోంది. బోర్డుకు మాత్రం ఫీజు అందకపోవడంతో తరుణ్‌కు హాల్‌టికెట్ రాలేదు. ఈ విషయమై విద్యార్థి తల్లిదండ్రులు స్కూల్లో అడగ్గా.. ఎవరికి వారు తమకు సంబంధం లేదని చెబుతూ చివరకు తాము బోర్డుకు ఫీజు చెల్లించలేదని ఒప్పుకున్నారు. ఏం చేయాలో తెలియని తరుణ్ తల్లిదండ్రులు బుధవారం కారేపల్లి హైస్కూల్‌కు చేరుకుని హెచ్‌ఎం పవన్‌కుమార్ కాళ్లపై పడి రోదిస్తూ ఎలాగైనా తమ కుమారుడి భవిష్యత్‌ను కాపాడాలని వేడుకున్నారు.



హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ నవీన్‌రావు, జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ శ్రీనివాస్‌రావుల సమక్షంలో బాధ్యతలు చేపట్టిన హైకోర్టు న్యాయవాదుల సంఘం నూతన కార్యవర్గ ప్రతినిధులు

దాతలు భరోసా కల్పిస్తున్నారు

- మా అనారోగ్యంపై 'సాక్షి' రాసిన కథనానికి స్పందన వస్తోంది
- 'సాక్షి'కి ధన్యవాదాలు: 'బలగం' మొగిలయ్య, కొమురమ్మ దంపతులు



మాట్లాడుతున్న మొగిలయ్య, కొమురమ్మ

ఆత్మకూరు(ఎం): అనారోగ్యంతో తాము పడుతున్న ఇబ్బందుల గురించి ప్రత్యేక కథనం రాసి, దాతలు ముందుకొచ్చేలా చేసి సాక్షి తమకు భరోసా కల్పించిందని మొగిలయ్య, కొమురమ్మ దంపతులు అన్నారు. అందుకు వారు 'సాక్షి'కి ధన్యవాదాలు తెలిపారు. బలగం సినిమా క్లైమాక్స్ సన్నివేశంలో పాట పాడిన మొగిలయ్య, కొమురమ్మ దంపతులు ప్రేక్షకులను కంటతడి పెట్టించినది తెలిసిందే. అయితే బలగం సినిమాలో పాట పాడే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నామని, ఇందుకు అవకాశం కల్పించిన డైరెక్టర్ వేణుకు రుణపడి ఉంటామని చెప్పారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి బుధవారం వచ్చిన వారు 'సాక్షి'తో మాట్లాడారు. ఆ విషయాలు వారి మాటల్లో.. 'మాది వరంగల్ జిల్లా దుగ్గొండి. మమ్ముల బేడ బుడిగె జంగాలంటరు. మా తాత ముత్తాతల కాలం నుంచి కథలు చెబుతూ బతుకుతున్నాం. వేణు సార్ మా గురించి తెలుసుకుని వచ్చి.. చనిపోయిన వాళ్ల మీద పాట పాడాలన్నారు. పాడగానే బాగుందని మెచ్చుకుని వెళ్లిపోయారు. వారం తర్వాత ఫోన్ చేసి సిరిసిల్ల షూటింగ్‌కు పిలిపించారు. 'తోడుగా మాతో ఉండి.. నీడగా మాతో నడిచి' పాట షూటింగ్ తర్వాత ఇంటికి వస్తుండగా బైక్ ప్రమాదంలో గాయపడ్డాం. ఆ సమయంలోనే వరంగల్‌లో మా అనారోగ్యంపై సాక్షిలో వార్త రాశారు. మా పాటకే కాదు.. వార్తకు మంచి స్పందనవచ్చింది. దాతలు మాకు సాయం చేస్తున్నారు. 'బలగం'లో పాట హిట్‌తో పెద్ద డైరెక్టర్ల నుంచి కూడా ఫోన్లు వస్తున్నయి. అవకాశం వస్తే పాడతాం' అని వెల్లడించారు.

'ఐడియాస్ ఫర్ ఇండియా' సదస్సుకు మంత్రి కేటీఆర్

- లండన్‌లో మే 11, 12 తేదీల్లో ద్వితీయ వార్షిక సదస్సు
- 'హౌస్ ఆఫ్ కామన్స్'లో కీలకోపన్యాసం చేయాలని ఆహ్వానం



సాక్షి, హైదరాబాద్: లండన్‌లో మే 11, 12 తేదీల్లో జరగనున్న 'ఐడియాస్ ఫర్ ఇండియా'ద్వితీయ సదస్సులో పాల్గొనాల్సిందిగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావుకు ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన ఆర్థిక, వ్యూహాల సలహాల సంస్థ ఈపీజీ నుంచి ఆహ్వానం అందింది. తెలంగాణ ప్రభుత్వం సాధిస్తున్న ఆర్థిక పురోగతిని తెలుసుకునేందుకు కేటీఆర్‌ను ఆహ్వానిస్తున్నట్లు ఆయనకు పంపిన ఆహ్వాన లేఖలో ఈపీజీ పేర్కొంది. సదస్సుతో పాటు బ్రిటన్ లేబర్ పార్టీకి చెందిన ఎంపీ సీమా మల్హోత్రా హౌస్ ఆఫ్ కామన్స్‌లో నిర్వహించే విందుకు రావాలని, అలాగే యూకే కేబినెట్ మంత్రితో పాటు కీలకోపన్యాసం చేయాలని ఆహ్వానించారు. బ్రిటన్ వ్యాప్తంగా ఇండియా వీక్ ప్రారంభ కార్యక్రమంలో భాగంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. సుమారు 800 మందికి పైగా వ్యాపార, వాణిజ్య, మీడియా, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు ఈ సదస్సులో పాల్గొంటారని అంచనా వేస్తున్నారు.

23 రోజుల పాపకు సీపీఆర్

ప్రాణం కాపాడిన 108 సిబ్బంది



చిన్నకోడూరు(సిద్దిపేట):పాపకు స్నానం చేయిస్తుండగా వేడి నీళ్లు మింగడంతో శ్వాస ఆగిపోయింది. 108 సిబ్బంది సీపీఆర్ చేసి పాప ప్రాణాలు కాపాడారు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లాలో బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో బిహార్‌కు చెందిన ప్రేమ్‌నాథ్ యాదవ్, కవిత దంపతులు పనిచేస్తున్నారు. వీరికి 23 రోజుల వయసున్న బేబీ సుబ్బలక్ష్మి ఉంది. ఆ పాపకు స్నానం చేయిస్తుండగా వేడి నీళ్లు మింగింది. దీంతో శ్వాస ఆగిపోయింది. వెంటనే గ్రామానికి చెందిన ఏఎన్‌ఎం తిరుమల, ఆశావర్కర్ సుగుణ 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది అశోక్, వెంకట్ అక్కడకు చేరుకుని పరీక్షించి.. బేబీ గుండె, నాడీ కొట్టుకోవడం లేదని గమనించారు. వెంటనే ఈఆర్‌సీపీ డాక్టర్ చక్రవర్తికి విషయం చెప్పి, ఆయన సూచనల ప్రకారం ప్రథమ చికిత్స (సీపీఆర్) చేస్తూ సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బేబీ ప్రాణాలు కాపాడిన 108 సిబ్బందిని బంధువులు, హాస్పిటల్ సిబ్బంది అభినందించారు.

పోటెత్తిన కొండగట్టు

వైభవంగా హనుమాన్ చిన్నజయంతి వేడుకలు



కొండగట్టు(చొప్పదండి):జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధిలో హనుమాన్ చిన్నజయంతి వేడుకలు బుధవారం రాత్రి అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణతోపాటు పొరుగు రాష్ట్రాలకు చెందిన దీక్షాస్వాములు, మాలలు ధరించిన భక్తులు, సాధారణ భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చారు. స్వామిని దర్శించుకున్న తర్వాత దీక్ష, మాల విరమణ చేశారు. తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నా రు. బుధవారం అర్ధరాత్రి వరకు సుమారు లక్షమంది భక్తులు తరలివచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

కోటికి చేరువలో కంటి పరీక్షలు

- 28 శాతం మందికి కళ్ల సమస్యలు
- రెండో విడత కంటి వెలుగులో గుర్తింపు
- తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కంటి సమస్యలున్న వారు గణనీయంగా ఉన్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ గుర్తించింది. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో చేపడుతున్న పరీక్షల్లో పలు సమస్యలు వెలుగుచూస్తున్నాయి. ఇప్పటివరకు నిర్వహించిన పరీక్షల్లో వివిధ రకాల కంటి సమస్యలు ఉన్నవారు 28.28 శాతం ఉన్నారని తేలింది. ఈ ఏడాది జనవరి 18న ప్రారంభమైన రెండో విడత కంటి వెలుగులో 48 పనిదినాల్లో ఇప్పటి వరకు 99.81 లక్షల మందికి పరీక్షలు చేశారు. ఇందులో 48.83 లక్షల మంది పురుషులు, 52.88 లక్షల మంది స్త్రీలు, 3279 మంది ట్రాన్స్ జెండర్స్ ఉన్నారు. వివిధ రకాల కంటి సమస్యలున్నవారిలో 16.11 లక్షల మందికి రీడింగ్ గ్లాసెస్ పంపిణీ చేశారు. చత్వారం సమస్యలున్న 12.11 లక్షల మందికి ప్రిస్కిప్షన్ గ్లాసులు ఇవ్వాలని నిర్ణయించారు.

ప్రిస్కిప్షన్ గ్లాసుల పంపిణీలో జాప్యం

కంటి డాక్టర్లు రాసిన ప్రిస్కిప్షన్ గ్లాసులను నెల రోజుల్లో ఇవ్వాల్సి ఉండగా, చాలాచోట్ల ఆలస్యం అవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. వాటిని నిర్ణీత సమయంలో తెప్పించడంలో అధికారులు విఫలం అవుతున్నారన్న విమర్శలున్నాయి. కాగా, దృష్టి లోపాలు సవరించేందుకు 2018 ఆగస్టు 15న తొలి విడత కంటి వెలుగు ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఆ కార్యక్రమం 8 నెలలపాటు కొనసాగింది. కోటిన్నర మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. 50 లక్షల కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఇదే స్ఫూర్తితో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రభుత్వం కొనసాగిస్తోంది. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని వంద పనిదినాల్లో పూర్తి చేసి గిన్నిస్ బుక్‌లోకి ఎక్కాలని వైద్య ఆరోగ్యశాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.